# Aandhra-Mahabhagwat
# Dasham-Skandh
# Telugu

# విషయసూచిక

## దశమస్కంధము - పూర్వభాగము


1. శ్రీకృష్ణ కథాప్రారంభము ........ 21
2. బ్రహ్మాది దేవతలు దేవకీ గర్భస్థుడగు శ్రీకృష్ణుని స్తుతించుట ........ 36
3. శ్రీకృష్ణావతార ఘట్టము ........ 39
4. దేవకీదేవి స్వామిని స్తుతించుట ........ 43
5. దేవకీవసుదేవుల పూర్వజన్మ వృత్తాంతము ........ 45
6. కంసుని పంపునఁబూతన యనురాక్షసి వ్రేపల్లెకుఁ జనుదెంచుట ........ 58
7. బాలకృష్ణుండు శకటముం దన పాదమునఁ గూలఁదన్నుట ........ 66
8. తృణావర్తుఁడను రాక్షసుఁడు సుడిగాలియై కృష్ణునెత్తికొనిపోవుట ........ 68
9. శ్రీకృష్ణబలరాముల బాల క్రీడాభివర్ణనము ........ 73
10. గోపికలు శ్రీకృష్ణునిదుడుకు చేష్టలను యశోదాదేవితో దెల్పుట ........ 76
11. శ్రీకృష్ణునిమృద్భక్షణము - విశ్వరూప ప్రదర్శనము ........ 81
12. యశోదానందులపూర్వజన్మ వృత్తాంతము ........ 83
13. యశోద దధిభాండ వికలనాదులు సేసిన కృష్ణునిఁ బట్టుకొనుట ........ 83
14. ఉలూఖలబంధనము గంధర్వులకు శాపవిమోచనము ........ 88
15. నందాదులు బృందావనంబునకు నరుగుదెంచుట ........ 96
16. వత్సాసుర బకాసురుల వధ ........ 98
17. శ్రీకృష్ణుఁడు గోపకులతో బంతిచల్దులు గుడువ వనమున కేఁగుట ........ 102
18. శ్రీకృష్ణుడు అఘాసురునింజంపుట ........ 103
19. గోపాలబాలురు కృష్ణునితోఁ గూడ చల్దులారగించుట ........ 109
20. బ్రహ్మ గోవత్సములను గోపబాలకులను అంతర్ధానము సేయుట ........ 111
21. బ్రహ్మ శ్రీకృష్ణుని స్తోత్రము చేయుట ........ 121

22. శ్రీకృష్ణుడు గోపాలురతోగూడి పశువులను మేపుటకై అడవికి వెళ్లుట ........ 131
23. గర్దభాకారుండైన ధేనుకాసురుని బలభద్రుడు వధించుట ........ 134
24. శ్రీకృష్ణుండు కాళియమర్దనము గావించుట ........ 138
25. కాళియునిభార్యలైన నాగాంగనలు శ్రీకృష్ణుని నుతించుట ........ 146
26. కాళీయునిపూర్వకథ ........ 153
27. గోవులను, గోపాలురను, గోపికలను కార్చిచ్చు చుట్టుముట్టుట ........ 156
28. గ్రీష్మర్తు వర్ణనము ........ 157
29. బలభద్రుండు ప్రలంబాసురుని వధించుట ........ 159
30. శ్రీకృష్ణుండు దావాగ్నిని మ్రింగి గోవులను, గోపాలకులను గాపాడుట ........ 162
31. వర్షఋతువర్ణనము ........ 164
32. శరదృతువర్ణనము ........ 169
33. హేమంతఋతువర్ణనము ........ 178
34. గోపికా వస్త్రాపహరణము ........ 180
35. విప్రుల భార్యలు అన్నములను తీసికొనివచ్చి, శ్రీకృష్ణునకు సమర్పించుట ........ 188
36. నందుడు మొదలగువారు ఇంద్రయాగమును గూర్చి శ్రీకృష్ణునితో చర్చించుట ........ 192
37. శ్రీకృష్ణుండు గోవర్ధనపర్వతమునెత్తుట ........ 201
38. ఇంద్రుండు శ్రీకృష్ణుని నుతించుట ........ 206
39. శ్రీకృష్ణుడు వరుణనగరమునుండి నందుని కొనితెచ్చుట ........ 209
40. శరద్రాత్రియందు గానమొనర్చుచున్న కృష్ణునియొక్క సన్నిధికి గోపికలువచ్చుట ........ 212
41. గోపికాగీతలు ........ 227
42. రాసక్రీడాభివర్ణనము ........ 236
43. జలక్రీడాభివర్ణనము ........ 244
44. సర్పరూపియగు సుదర్శనుం డను గంధర్వునకు శాపవిమోచనము ........ 247
45. శ్రీకృష్ణుడు కుబేరభటుడైన శంఖచూడుండను యక్షుని సంహరించుట ........ 249

46. వృషభాసురసంహారము ........ 252
47. నారదుడు బలరామకృష్ణుల జన్మవృత్తాంతమునుగూర్చి కంసునకు తెలుపుట ........ 255
48. కంసుడు బలరామకృష్ణులకడకు అక్రూరుని పంపుట ........ 256
49. శ్రీకృష్ణుండు కేశివ్యోమాసురులను సంహరించుట ........ 258
50. కంసుని ఆజ్ఞపై అక్రూరుండు బృందావనమునకుఁ జనుదెంచుట ........ 263
51. అక్రూరుండు యమునలో రామకృష్ణులను దర్శించి నుతించుట ........ 272
52. శ్రీకృష్ణుఁడు మథురానగర ప్రవేశము సేయుట ........ 278
53. శ్రీకృష్ణుండు రజకునిఁ జంపుట – వాయక సుదాములొసంగిన పూజలనంగీకరించుట ........ 280
54. శ్రీకృష్ణుడు కుబ్జను అనుగ్రహించుట ........ 283
55. సూర్యాస్తమయచంద్రోదయములవర్ణనము ........ 285
56. సూర్యోదయవర్ణనము ........ 288
57. శ్రీకృష్ణుండు కువలయాపీడమను గజంబును వధించుట ........ 290
58. శ్రీకృష్ణబలరాములు చాణూరముష్టికులను వధించుట ........ 296
59. శ్రీకృష్ణుండు కంసుని వధించుట ........ 305
60. శ్రీకృష్ణుండు దేవకీవసుదేవులచెఱ మాన్పి యుగ్రసేనునికిఁబట్టంబుగట్టుట ........ 308
61. బలరామకృష్ణులు సాందీపనికడ విద్యలను అభ్యసించుట ........ 312
62. శ్రీకృష్ణుండు గోపకాంతలచెంతకు ఉద్ధవునిఁ బంపుట ........ 316
63. భ్రమరగీతములు ........ 320
64. కృష్ణుండు ఉద్ధవునితోగూడి కుబ్జా గృహంబునకు అరుగుట ........ 328
65. శ్రీకృష్ణుండు అక్రూరుని హస్తినాపురమునకు పంపుట ........ 332
66. అక్రూరుడు ధృతరాష్ట్రునితో హితోక్తులను పలుకుట ........ 334
67. జరాసంధుడు మథురమీదికి దండెత్తివచ్చి కృష్ణునితో యుద్ధము చేయుట ........ 336
68. నారదుని ప్రేరణచే కాలయవనుడు మథురను ముట్టడించుట ........ 351
69. శ్రీకృష్ణునిఆజ్ఞపై విశ్వకర్మ సముద్రమధ్యమున ద్వారకానగరమును నిర్మించుట ........ 353

70. కాలయవనుండు వెంటాడగా శ్రీకృష్ణుండు పరుగెత్తుట ........ 359

71. ముచుకుందుని దృష్టిప్రభావమున కాలయవనుండు భస్మమగుట. ........ 362

72. ముచుకుందునిపూర్వ వృత్తాంతము ........ 363

73. ముచుకుందుండు శ్రీకృష్ణుని స్తోత్రము చేయుట ........ 366

74. జరాసంధుండు ప్రవర్షణ గిరిని దహించివేయుట ........ 370

75. రుక్మిణీ కళ్యాణ కథా ప్రారంభము ........ 372

76. రుక్మిణి అగ్నిద్యోతనుండను బ్రాహ్మణుని గృష్ణునికడకుఁ బంపుట ........ 375

77. శ్రీ కృష్ణుండు కుండిననగరంబునకు రథారూఢుండై బయలుదేఱుట ........ 380

78. శత్రురాజులు చూచుచుండగనే శ్రీకృష్ణుఁడు రుక్మిణీదేవిని గొనిపోవుట ........ 390

79. అన్నయొక్క భంగపాటునకు బాధపడుచున్న రుక్మిణిని బలరాముడు ఓదార్చుట ........ 397

80. శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని పెండ్లియాడుట ........ 398

## దశమస్కంధము - ఉత్తరభాగము

81. ప్రద్యుమ్నకుమారచరిత్ర ........ 403

82. రతీదేవి ప్రద్యుమ్నసహితయై గగనమార్గంబున ద్వారకకుఁ, బోవుట ........ 407

83. స్యమంతకోపాఖ్యానము ........ 411

84. శతధన్వుఁడు సత్రాజిత్తును చంపి మణిని అపహరించుట ........ 418

85. శ్రీ కృష్ణుడు ఇంద్రప్రస్థపురంబునకు వెళ్లుట ........ 423

86. శ్రీకృష్ణుండు కాళింది మిత్రవింద నాగ్నజితి భద్ర లక్షణ యనువారలం బరిణయమాడుట ........ 427

87. శ్రీకృష్ణుఁడు సత్యభామతోఁగూడ అరిగి నరకాసురుని వధించుట ........ 432

88. సత్యభామ నరకాసురునితో యుద్ధము చేయుట ........ 437

89. భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట ........ 443

90. శ్రీకృష్ణుడు నరకాసురుని చెఱలోనున్న పదునాఱువేలమంది కన్యలకు విముక్తి కలిగించుట దేవలోకమునకు వెళ్లి పారిజాతవృక్షమును తీసికొనివచ్చుట ........ 444

91. శ్రీకృష్ణుడు ఏకాంతమందిరమున రుక్మిణీదేవితో విరసోక్తులాడుట ........ 449

92. రుక్మిణీదేవి శ్రీకృష్ణలాలితయై యతనిని స్తుతించుట .................................... 454

93. శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని ఊఱడించుట .................................... 459

94. అనిరుద్ధుని వివాహసమయమున బలరాముడు రుక్మి మొదలగువారిని చంపుట .................... 463

95. బాణాసురుడు పరమేశ్వరుని అనుగ్రహమును పొందుట .................................... 468

96. బాణాసురుడు నాగపాశములతో అనిరుద్ధుని బంధించుట .................................... 482

97. నారదునివలన అనిరుద్ధునివృత్తాంతమును విని కృష్ణుఁడు బాణాసురునిపై దండెత్తుట ................ 484

98. బాణాసురునికి సహాయభూతుండగు శివునకుఁ గృష్ణునకు యుద్ధమగుట .................................... 487

99. బాణాసురుఁడు రెండవసారి యుద్ధమునకు వచ్చుట .................................... 496

100. బాణుని రక్షించుటకై శివుఁడు శ్రీకృష్ణుని స్తుతించుట .................................... 497

101. ఉషా – అనిరుద్ధులతోగూడి, కృష్ణుండు ద్వారకాపురంబునకు చేరుట .................................... 500

102. నృగమహారాజుచరిత్రము .................................... 502

103. బలరాముండు మిత్రులను, బంధువులను దర్శించుటకై వ్రేపల్లెకుఁ బోవుట .................................... 509

104. శ్రీకృష్ణుండు పౌండ్రక వాసుదేవునిమీఁద దండెత్తి వానిని చంపుట .................................... 514

105. బలరాముండు ద్వివిదుండను వానరుని సంహరించుట .................................... 521

106. బలరాముండు తన నాగలితో హస్తినాపురంబును గంగలోఁ ద్రోయఁబూనుట .................................... 525

107. పదునాఱువేలమంది యువతులతోగూడిన శ్రీకృష్ణునిమహిమను నారదుడు ఎఱుంగుట .................................... 533

108. జరాసంధభీతులైన రాజులపంపున ఒక విప్రుండు కృష్ణునిసన్నిధికేతెంచి వారిమనవిని వినిపించుట... 544

109. 'ధర్మరాజు ఒనర్చెడి రాజసూయయాగమును దర్శించి దానిని జయప్రదము గావింపుము' అని నారదుడు కృష్ణునకు విన్నవించుట .................................... 545

110. ఉద్ధవుని సూచన మేరకు శ్రీకృష్ణుడు ధర్మరాజుకడకు వెళ్లుట .................................... 548

111. పాండవులు స్వాగతమర్యాదలతో శ్రీకృష్ణుని తోడ్కొనిపోవుట .................................... 552

112. ధర్మరాజు శ్రీకృష్ణునియనుమతంబున దిగ్విజయార్థము భీమాదులను బంపుట .................................... 555

113. శ్రీకృష్ణభీమార్జునులు జరాసంధుని వధింపఁ బోవుట .................................... 558

114. శ్రీకృష్ణసహాయుండగు భీముండు జరాసంధునితో యుద్ధము సేయుట .................................... 561

115. జరాసంధుని చెఱనుండి విముక్తులైన రాజులు శ్రీకృష్ణుని స్తుతించుట .................................. 565

116. ధర్మరాజుయొక్క రాజసూయయాగంబునందు శ్రీకృష్ణుండు శిశుపాలుని వధించుట.................... 570

117. శివుని అనుగ్రహముతో సౌభకవిమానమును పొందిన సాల్వుడు ద్వారకాపురిపై దండెత్తుట. ......... 585

118. శ్రీకృష్ణుండు దంతవక్త్రుని సంహరించుట ................................................................. 600

119. బలరాముండు తీర్థయాత్రకుం జనుట ........................................................................ 603

120. కుచేలోపాఖ్యానము .................................................................................. 610

121. శ్రీకృష్ణుఁడు సకుటుంబముగా గ్రహణస్నానమునకుఁ బోవుట ............................................. 625

122. కృష్ణునియష్టమభార్యయగు లక్షణ ద్రౌపదీదేవికిఁ దన వివాహవృత్తాంతముఁ దెలుపుట ............... 634

123. నారదాది మహర్షులు శ్రీకృష్ణదర్శనము చేసికొని వసుదేవునిచేఁ గ్రతువు చేయించుట ................. 640

124. శ్రీకృష్ణబలరాములు మృతులయిన తమసహోదరులను సజీవులనుగా
యమపురినుండి తీసికొనివచ్చి, చూపుట ................................................................ 645

125. సుభద్రాపరిణయము ................................................................................ 650

126. శ్రీకృష్ణుఁడు ఋషులతో గూడి, మిథిలానగరమునకుఁ వెళ్లుట ............................................ 653

127. శ్రుతిగీతలు ...................................................................................... 660

128. పరీక్షిత్తునకు శుకయోగి విష్ణుసేవాప్రాశస్త్యమును చెప్పుట .............................................. 669

129. శివద్రోహంబునకు సిద్ధపడిన వృకాసురుండు విష్ణుమాయచే మడియుట ................................ 671

130. భృగుమహర్షి త్రిమూర్తుల ప్రాశస్త్యమును శోధించుటకు పోవుట ........................................ 676

131. మృతులైన విప్రసుతులను శ్రీకృష్ణుడు పునర్జీవితులను గావించి తీసికొనివచ్చుట ....................... 679

132. శ్రీకృష్ణభగవానుని లీలావిహారవర్ణనము ............................................................... 688

133. శ్రీకృష్ణునివంశానుక్రమము .......................................................................... 690

దశమస్కంధములోని కొన్ని రసగుళికలు ............................................................... 697

* * *

॥శ్రీ కృష్ణాయ నమః॥

# శ్రీమదాంధ్ర మహాభాగవతము

## కావ్యాది అందలి ప్రార్థనా పద్యములు

శా. శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర
క్షైకారంభకు భక్తపాలనకళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁ గేళిలోలవిలసద్దృగ్జాలసంభూతనా
నాకంజాతభవాండకుంభకు మహానందాంగనాడింభకున్. 1

శ్రీకృష్ణ భగవానుడు కేవలము లోకరక్షణకొఱకై అవతరించిన మహాత్ముడు; భక్తులను ఆదుకొనుటకై తహతహ పడుచుండువాడు, గర్వితమతులైన దానవులను హతమార్చెడువాడు, లీలావిలాసశోభితములైన తన చూపులలో వివిధములగు బ్రహ్మాండముల సృష్టికి ఊపిరులు ఊదినవాడు, యశోదానందులకు ముద్దులపట్టియైనవాడు, బ్రహ్మానందదాయకమైన కైవల్యప్రాప్తికై ఆ జగత్ప్రభువును ధ్యానింతును.

పన్నెండు స్కంధములతో విరాజిల్లుచున్న శ్రీమద్భాగవతమునకు ఈ ప్రార్థనాపద్యము నాంది పలుకుచున్నది. ఇందు లౌకికవ్యవహారరీతిని అనుసరించి దివ్యవైభవ ప్రాభవములకు కుదురైన శ్రీకృష్ణపరమాత్మను ధ్యానించుట జరిగినది. శ్రీకృష్ణప్రభువు లోకరక్షణకై అవతరించిన విషయము, ప్రహ్లాదాది పరమభక్తులను ఆదుకొనుట, లోకకంటకులైన దుష్టదానవులను హతమార్చుట, తన దృగ్విలాస ప్రభావమున బ్రహ్మాండాది సృష్టికి కారకుడగుట మొదలగు విషయములు ఇందు ప్రకటితమలగుచున్నందున ఈ మహాగ్రంథమునందలి వస్తువైభవము సూచితమైనది. కనుక ఈ నాందీప్రార్థనపద్యముద్వారా ఇది మహాకావ్యలక్షణముతో విలసితమగుచున్నది. ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపితన్ముఖమ్ - కావ్యము ఆశీస్సులతో, దైవనమస్కారములతో, వస్తునిర్దేశముతో ప్రారంభము కావలెననునది శాస్త్రలక్షణము. ఈ మహాకావ్యము శ్రీకృష్ణధ్యానముతో ఆరంభమైనది.

సమస్త మానవాళికిని (ప్రాణికోటికిని) కైవల్యప్రాప్తియే పరమలక్ష్యమని దీనిద్వారా చాటిన మహాకవి పోతనామాత్యుడు ఎల్లరకును చిరస్మరణీయుడు.

### ఇష్టదేవతాది ప్రార్థనము

ఉ. వాలినభక్తి మ్రొక్కెద నవారితతాండవకేలికిన్ దయా
శాలికి శూలికిన్ శిఖరిజాముఖపద్మమయూఖమాలికిన్
బాలశశాంకమౌలికిఁ గపాలికి మన్మథగర్వపర్వతో
న్మూలికి నారదాదిమునిముఖ్యమనస్సరసీరుహాలికిన్. 2

త్రిశూలధారియైన ఆ పరమశివునకు (శంకరుని పాదపద్మములకు) వినమ్రుడనై ప్రణమిల్లెదను. ఆ పరమేశ్వరుని తాండవనాట్యము అమోఘమైనది. ఆ స్వామి కరుణామయుడు. పార్వతీముఖమనెడి పద్మమును వికసింపజేయు సూర్యుడు. నెలవంకను శిరస్సుపై ధరించెడి మహాత్ముడు. కంఠమున కపాలములమాలికను తాల్చుచుండెడి మహానుభావుడు. మన్మథునియొక్క గర్వమనెడి పర్వతమును అణచివేసినవాడు. నారదుడు మున్నగు మునీంద్రుల మనస్సులనెడి పద్మములయందు విహరించునట్టి భ్రమరము. అట్టి కైలాసనాథునకు నమస్కారములు.

ఉ. ఆతతసేవఁ జేసెద సమస్త చరాచరభూతసృష్టివి
జ్ఞాతకు భారతీహృదయసౌఖ్యవిధాతకు వేదరాశిని
ర్ణేతకు దేవతానికరనేతకుఁ గల్మషజేతకున్ నత
త్రాతకు దాతకున్ నిఖిలతాపసలోక శుభప్రదాతకున్. 3

బ్రహ్మదేవుడు చరాచరాత్మకములైన సకలప్రాణులను (సకల ప్రపంచమును) సృష్టించినవాడు, సరస్వతీదేవి హృదయమునకు ఎల్లప్పుడు సంతోషమును గూర్చుచుండెడివాడు, వేదములను క్రమవిధానమున వికసింపజేసినవాడు, సమస్త దేవతలకును నాయకుడు, పాపములను రూపుమాపెడివాడు. వినమ్రతతో తనను ఆశ్రయించినవారిని ఆదుకొనుచుండెడివాడు. తపస్సంపన్నులైన సజ్జనులకు శుభములను ప్రసాదించుచుండెడివాడు. అట్టి విధాతను సర్వదా నిండు భక్తితో సేవించుచుండెదను.

వ. అని నిఖిలభువనప్రధానదేవతావందనంబుఁ జేసి. 4

ఈవిధముగా త్రిమూర్తులకు ప్రణమిల్లిన పిమ్మట పోతన మహాకవి తదితర దేవతలకు గూడ ఇట్లు మ్రొక్కెను.

ఉ. ఆదర మొప్ప మ్రొక్కిడుదు నద్రిసుతాహృదయానురాగసం
పాదికి దోషభేదికిఁ బ్రపన్న వినోదికి విఘ్నవల్లి కా
చ్ఛేదికి మంజువాదికి నశేషజగజ్జననందవేదికిన్
మోదక ఖాదికిన్ సమదమూషక సాదికి సుప్రసాదికిన్ 5

గణపతి పార్వతీదేవి హృదయమును ఆకట్టుకొనుచు ఆ తల్లిని ఆనందింపజేయుచుండెడి ముద్దులబిడ్డడు. అతడు కల్మషములను హరింపజేయుటలో దక్షుడు. ఆపన్నుల విన్నపములను ఆలకించుచు వారిని ఆనందింపజేయుచుండువాడు. ఆశ్రితులయొక్క విఘ్నములనెడి లతలను ఛేదించుటయందు మేటి. మధురమంజులములైన తన పలుకులతో ఆ స్వామి జగత్తునందలి సకలజనులకును సంతోషమును గూర్చుచుండువాడు. భక్తులు నివేదించిన కుడుములను కుతూహలముతో ఆరగించి, ఆనందించుచుండెడివాడు. సకలలోకములను తన అనుగ్రహవీక్షణములతో కాపాడుచుండెడి ఆ మూషకవాహనునకు సాదరముగా మ్రొక్కులిడుదును.

ఉ. క్షోణితలంబునన్ నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ జంచరీకచయసుందరవేణికి రక్షితామర
శ్రేణికిఁ దోయజాతభవచిత్తవశీకరణైకవాణికిన్
వాణికి నక్షదామశుకవారిజపుస్తకరమ్యపాణికిన్ 6

సరస్వతీదేవి నిరంతరము సుకుమారములైన తన నాలుగు చేతులలో క్రమముగా జపమాలను, చిలుకను, పద్మమును, పుస్తకమును దాల్చి శోభిల్లుచుండును. ఆమె కటి సౌందర్యము అపూర్వము. ఆ దేవి కురులు తుమ్మెదలవలె మనోహరములు. దేవతలను రక్షించుటలో ఆమెకు ఆమెయే సాటి. ఆ దేవి ఇంపైన మృదుమధురవచనములతో తన భర్తయగు బ్రహ్మదేవుని హృదయమును పరవశింపజేయుచుండును. అట్టి భారతీమాతకు సాష్టాంగముగా నమస్కరింతును.

శా. పుట్టం బుట్ట శరంబునన్ మొలవ నంభోయానపాత్రంబునన్
నెట్టం గల్గను గాళిఁ గొల్వను బురాణింపన్ దొరంకొంటి మీఁ

దెట్టేవెంటఁజరింతు దత్సరణి నాకీవమ్మ యోయమ్మ మేల్
పట్టున్ నాకగుమమ్మ నమ్మితిఁ జుమీ బ్రాహ్మీ దయాంభోనిధీ. 7

దయామయురాలవైన సరస్వతీమాతా! నేను పుట్టనుండి పుట్టిన ఆదికవి వాల్మీకినిగాను. శరముపై (తెల్లగడ్డిపై) అవతరించిన కుమారస్వామినిగాను. నావయందు ప్రభవించిన వేదవ్యాసుడనుగాను, వరప్రదాయినియైన జగన్మాతను సేవించిన కాళిదాసునుగాను. ఐనను నేను ఈ మహాపురాణమును తెనుగుసేయుటకు సాహసించితిని. ఈ ప్రయత్నమున ఎట్లు కృతార్థుడను అగుదునో ఏమో? అమ్మా! త్రికరణశుద్ధిగా నిన్నే నమ్మికొంటిని. నీవు నాకు పట్టుకొమ్మవై ఆ శక్తిసామర్థ్యములను నాకు ప్రసాదింపుము. తల్లీ! నీకు ఇవే నా సహస్రప్రణామములు.

ఉ. శారదనీరదేందుఘనసారపటీరమరాళమల్లికా
హారతుషారఫేనరజతాచలకాశఫణీశకుందమం
దారసుధాపయోధిసితతామరసామరవాహినీశుభా
కారత నొప్పునిన్ను మదిఁ గానఁగ నెన్నఁడు గల్గు భారతీ ! 8

శ్వేతకాంతులతో తేజరిల్లుచుండెడి శరత్కాలమేఘము, పూర్ణచంద్రుడు, కర్పూరము, మంచిగంధము, రాజహంస, మల్లెపూవులమాల, మంచు, నుఱుగు, వెండికొండ, తెల్లుగడ్డి, ఆదిశేషుడు, బొడ్డుమల్లె, కల్పవృక్షము, పాలసముద్రము, తెల్లదామర, ఆకాశగంగ మొదలగు వానివలె స్వచ్ఛమై విరాజిల్లుచున్న సరస్వతీదేవీ! మంగళకరమైన నీ దివ్యరూపమును నా మనస్సునందు ఎన్నడు దర్శింపగలనోగదా! (అమ్మా! నీ శుభాకారము నా మనస్సునందు ఎప్పుడు సాక్షాత్కరించునో గదా!)

ఉ. అంబ నవాంబుజోజ్జ్వలకరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తిప్రకటస్ఫుటభూషణరత్నదీపికా
చుంబితదిగ్విభాగ శ్రుతి సూక్తివివిక్తనిజప్రభావ భా
వాంబరవీథివిశ్రుతవిహారిణి నన్ గృపఁజూడు భారతీ ! 9

తల్లీ! భారతీదేవీ! చక్కగా వికసించియున్న పద్మములవలె నీ కరకమలములు ఉజ్జ్వలములైన కాంతులతో తేజరిల్లుచున్నవి; నీ సుందరరూపము శరత్కాలమునందలి పండువెన్నెలరీతిగా ఆహ్లాదకరమైనది. నీవు ధరించిన రత్నాభరణములకాంతులు విస్పష్టముగా దిగంతములవఱకును వ్యాపించుచున్నవి. వేదసూక్తులన్నియును నీ ప్రభావమునే వేయిరీతుల ప్రకటించుచున్నవి. మహాకవుల హృదయాకాశములయందు నీవు విస్తారముగా విహరించుచుందువు. శారదామాతా! నాపై కృపజూపుము.

ఉ. అమ్మలఁ గన్నయమ్మ ముగురమ్మలమూలపుటమ్మ చాలఁ బె
ద్దమ్మ సురారులమ్మకడు పాఱడివుచ్చినయమ్మ దన్ను లో
నమ్మినవేల్పుటమ్మలమనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వపటుత్వసంపదల్. 10

దుర్గాదేవీ! లోకములోని తల్లులందఱికిని నీవే తల్లివి. లక్ష్మీపార్వతీ సరస్వతులకు మూలకారణము నీవే. నీవు జగజ్జననివి. దుష్టరాక్షసులను సంహరించిన శక్తిస్వరూపిణివి, త్రికరణశుద్ధిగా నిన్నే నమ్మికొనిన దేవతాస్త్రీల హృదయములయందు నీవు స్థిరముగా విలసిల్లుచుందువు. అమ్మా! నీవు సంపూర్ణానుగ్రహముతో నాకు చిరస్థిరమైన కీర్తిని, కవితావైభవమును, శక్తిసామర్థ్యములను, అలౌకిక సంపదలను ప్రసాదింపుము.

మ. హరికిం బట్టపు దేవి పున్నెముల ప్రోవర్థంపు బెన్నిక్క చం
దురుతోఁ బుట్టువు భారతీగిరిసుతల్ తోనాడుపూఁబోడి దా
మరలం దుండెడిముద్దరాలు జగముల్ మన్నించునిల్లాలు భా
సురతన్ లేములు వాపుతల్లి సిరియిచ్చున్ నిత్య కల్యాణముల్. 11

లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువుయొక్క పట్టపురాణి, పుణ్యములకు నిధి. సకలసంపదలకును నిధానము. చంద్రునివలె పాలసముద్రమునుండి పుట్టిన పూబోణి, వాణీపార్వతులతో గూడి విహరించుచుండెడి మహితాత్మురాలు, కమలముయందు నివసించుచుండెడి కాంతామణి, సకలజగత్తులను కాపాడుచుండెడి శక్తిమంతురాలు. దారిద్ర్యములను తొలగించెడి మహాత్మురాలు. అట్టి లక్ష్మీదేవి నిరంతరము నాకు శుభములను అనుగ్రహించుచుండుగాక!

॥శ్రీ కృష్ణాయ నమః॥

# శ్రీమదాంధ్ర మహాభాగవతము

## దశమస్కంధము - పూర్వభాగము

క. శ్రీకంఠచాప ఖండన! పాకారి ప్రముఖ వినుతభండన! విలస
త్కాకుత్స్థవంశ మండన!, రాకేందుయశోవిశాల! రామనృపాలా! 1

రామచంద్రప్రభూ! నీవు శివధనుర్భంగమొనర్చి, సీతాదేవిని చేపట్టిన మహాత్ముడవు, నీ యుద్ధవిద్యావైభవములు ఇంద్రాదిదేవతలచే ప్రస్తుతింపబడినవి, కీర్తిప్రతిష్ఠలతో ఖ్యాతికెక్కిన కాకుత్స్థవంశమునకే వన్నెతెచ్చినవాడవు, నీ యశస్సు పున్నమినాటి చంద్రుని (చంద్రకాంతుల)వలె నిర్మలమై ఆహ్లాదకరమైనది.

వ. మహనీయ గుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు, నిఖిలపురాణవ్యాఖ్యాన వైఖరీ సమేతుండయిన సూతుం డిట్లనియె. అట్లు పరీక్షిన్నరేంద్రుండు శుకయోగీంద్రుంగనుంగొని. 2

కొనియాడదగిన, శమదమాది సద్గుణములతో శోభిల్లుచుండెడి శౌనకాది మహామునులకు సమస్తపురాణములను చక్కగా వివరించుటలో మేటియైన సూతుడు ఇట్లు పల్కెను - "ఓ మహామునులారా! పరీక్షిన్మహారాజు శుకయోగిని ఇట్లు ప్రశ్నించెను.

### శ్రీకృష్ణ కథాప్రారంభము

క. తెలిపితివి సోమసూర్యుల, కులవిస్తారంబు వారి కులము ధరిత్రీ
శుల నడవళ్ళును వింటిమి, కలరూపములెల్ల మాకుఁగడు వెలుఁగులుగన్ 3

క. శీలము గల యదుకులమున, నేలా పుట్టెను మహాత్ముఁ డీశుఁడు విష్ణుం
డేలీల మెలఁగె నే యే, వేళల నేమేమి సేసె వివరింపు తగన్ 4

"మహామునీ! సూర్యచంద్రవంశములవిశేషములను, ఆ వంశములకు చెందిన మహారాజుల పరిపాలనాదివైభవములను కన్నులకు కట్టునట్లుగా విశదపఱచితివి. పేరుగన్న యదువంశమున మహాత్ముడగు శ్రీమహావిష్ణువు ఏల అవతరించెను? ఆ ప్రభువు ఏయే సందర్భములలో ఎట్లు మెలగెను? విపులముగా దెలుపుము.

క. భవములకు మందు చిత్త, శ్రవణానందము ముముక్షుజన పదము, హరి
స్తవము పశుఘ్నుఁడు దక్కను, జెవులకుఁదనివయ్యె ననెడి చెనఁటియుఁగలఁడే. 5

శ్రీహరిని కీర్తించు స్తుతులు సాంసారిక క్లేశములను తొలగించుటలో దివ్యౌషధములు, అవి చిత్తమును ఆర్ద్రమొనర్చును, (ఆనందముతో ద్రవింపజేయును) వీనులవిందు గావించును. మోక్షమును కోరుకొనువారికి అవి పెన్నిధులు. ఆ స్తుతులను ఎంతగా విన్నను తనివితీఱదు, 'ఇక వాటిని విన్నంతవఱకు చాలును' అని అనుకొనెడివారు కిరాతకులు.

క. మా పెద్దలు మును వేల్పులు, నోపని భీష్మాది కురుకులోత్తమ సేనా
కూపారము నేకోలము, ప్రాపున లంఘించి రొక్క బాలపదముగాన్ 6

క. మాయమ్మకుక్షి గురుసుత, సాయక పీడితుఁడ నైన జడు నన్నును గొం
తేయ కురుకులము నిలుపఁగ, నా యుత్తముఁ డాత్తచక్రుఁడై రక్షించెన్. 7

ఆ. కలసి పురుషమూర్తి కాలరూపములను లోకజనుల వెలిని లోన నుండి
జన్మ మృత్యువులను సంసారముక్తుల నిచ్చు నతనిచరితమెల్లఁ జెపుమ. 8

భీష్మాది కురువీరులనెడి (కౌరవసేనయనెడి) సముద్రమును ఇంద్రాదిదేవతలును దాటజాలరు. (జయింపజాలరు) అట్టి కురుసేనాసాగరమును మా పెద్దలైన ధర్మరాజు మొదలగువారు ఏ నావ సహాయముతో ఒక చిన్నకాలువనువలె దాటగలిగిరి? (శ్రీకృష్ణుడను నావ సహాయమునే వారు ఆ సేనాసముద్రమును దాటిరి.) నేను మా తల్లిగర్భములో ఉండగనే, ద్రోణాచార్యుని కుమారుడైన అశ్వత్థామ తన బ్రహ్మాస్త్రధాటితో బాధించి, నన్ను జడునిగావించెను. అంతట పాండవవంశము, కురువంశము నిలబడుటకు మూలమునైన (వంశాంకురమునైన) నన్ను, ఉత్తముడైన ఆ శ్రీకృష్ణుడు తన చక్రప్రభావముతో రక్షించెను. ఆ విరాట్ పురుషుడు సకలప్రాణులయొక్క లోపలను, వెలుపలను విలసిల్లుచుండును. అతడు కాలస్వరూపుడై (నిముసములు, గంటలు, దినములు మున్నగురీతిలో కాలరూపమును పొంది) ఆత్మదృష్టిగల జ్ఞానులకు మోక్షమును ప్రసాదించుచుండును. బాహ్యదృష్టిగల అజ్ఞానులకు జననమరణక్లేశములతో గూడిన సంసారబంధములను కల్పించుచుండును. అట్టి కృష్ణపరమాత్మలీలా విశేషములను తెలుపుము.

సీ. ఊహించి రాముఁడు రోహిణికొడుకంచు నప్పుడు యోగీంద్ర! చెప్పితీవు
దేవకికడుపున నే వెరవున నాతఁ డుండెను దేహంబు నొందు లేక
తన తండ్రి యిలు వాసి వనజాక్షుఁడే రీతి మందకుఁ బోయె నే మందిరమున
నుండె నెయ్యది సేయుచుండెను దన మేనమామ కంసుని నేల నామమడఁచె
ఆ. నెన్ని యేండ్లు మనియె నిలమీఁద మనుజుఁడై యెందఱైరి భార్యలెట్లు మెలఁగె
మఱియు నేమి చేసె మాధవు చారిత్ర మెంత గలదు నాకు నేర్పరింపు. 9

వ. అని మఱియు నిట్లనియె. 10

ఆ. నీ ముఖాంబుజాత నిర్ముక్త హరికథామృతముఁ ద్రావఁద్రావ మేను వొదలె
వంత మానె నీరువట్టు నాఁకలియును దూరమయ్యె మనము తొంగలించె. 11

"శుకయోగీంద్రా! బలరాముడు రోహిణికుమారుడు అని లోగడ నీ తపోమహిమచే యోచించి తెలిపితివి. అయినచో అతడు దేవకీదేవిగర్భమునుండి రోహిణిగర్భమునకు ఎట్లు చేరెను? అది సరే! దేవకీవసుదేవుల పుత్రుడైన శ్రీకృష్ణుడు తనతండ్రికడనుండి వ్రేపల్లెకు (వ్రజభూమికి) ఎట్లు చేరెను? అచట ఎవరియింటిలో ఉండెను? అతడు అతడొనర్చిన ఘనకార్యములెవ్వి? తన మేనమామయగు కంసుని ఎందులకు రూపుమాపెను? ఆ మహాత్ముడు మానవాకారమున వృష్టివంశమువారితో గూడి ఆ వ్రేపల్లెలోనెంతకాలము ఉండెను? అతనికి భార్యలు ఎంతమంది? అతడు వారితో ఎట్లు మసలుకొనెను? ఇంకను అతడు చేసిన అద్భుతకృత్యములు ఎట్టివి? ఆ శ్రీకృష్ణుని వృత్తాంతమును సమగ్రముగా తెలుపుము". ఇంకను పరీక్షిత్తు ఆ యోగితో ఇట్లనెను. "నీ ముఖారవిందమునుండి జాలువాఱిన శ్రీహరికథామృతమును త్రాగగాత్రాగగా శారీరకదుఃఖములన్నియు తొలగిపోయెను. చింతలు దూరమయ్యెను. ఆకలిదప్పులు మటుమాయమయ్యెను. మనస్సు పరవశించిపోయెను".

వ. అని పలుకుచున్న రాజుమాటలు విని, వైయాసి యిట్లనియె. 12

క. విష్ణుకథా రతుఁడగు నరు, విష్ణుకథల్ చెప్పు నరుని వినుచుండు నరున్
విష్ణుకథాసంప్రశ్నము, విష్ణుపదీ జలముభంగి విమలులఁ జేయున్. 13

పరీక్షిత్తు వచనములకు ఆ వ్యాసునికుమారుడు ఇట్లు ప్రత్యుత్తరమును ఇచ్చెను. "రాజా! విష్ణుపాదము (ఆకాశము) నుండి ఉద్భవించిన గంగానది. తననుదర్శించినవారిని, తన జలములలో మునకలిడినవారిని, ఆ తీర్థములను సేవించినవారిని పవిత్రులను గావించును. విష్ణుకథలను గూర్చిన చర్చలు ఆ గాథలయందు ఆసక్తిగల పృచ్ఛకులను, ప్రవచించువారిని (వక్తలను) శ్రద్ధగావినువారిని (శ్రోతలను) గంగాజలములవలె పునీతులనుగావించును.

సీ. రాజేంద్ర! విను తొల్లి రాజలాంఛనముల, వేల సంఖ్యల దైత్యవిభులు తన్ను
నాక్రమించిన భారమాఁగఁజాలక భూమి గోరూప యై బ్రహ్మఁజేరఁ బోయి
కన్నీరు మున్నీరుగా రోదనము సేయఁ గరుణతో భావించి కమలభవుఁడు
ధరణి నూఱడఁ బల్కిధాత్రియు వేల్పులుఁ గదలిరా విష్ణునిఁగాన నేఁగి
తే. పురుషసూక్తంబుఁ జదివి యద్భుతసమాధి నుండి యొకమాట విని వారిజోద్భవుండు
వినుఁడు వేల్పులు ధరయు నే విన్న యట్టి పలుకు వివరింతునని ప్రీతిఁ బలికెఁ దెలియ. 14

"మహారాజా! ఆలకింపుము. పూర్వము వేలకొలది రాక్షసరాజులు భూమండలమును ఆక్రమించి పెక్కు దురాగతములకు పాల్పడసాగిరి. వారి ఆగడములకును, భారమునకును తట్టుకొనలేక భూదేవి గోరూపమున బ్రహ్మదేవుని కడకు చేరి కన్నీరుమున్నీరుగా విలపించెను. అంతట కమలభవుడు ఆమె గోడును విని, కనికరముతో ఆమెను ఊఱడించెను. పిమ్మట ఆ స్వామి భూదేవితో, ఇతర దేవతలతోగూడి, శ్రీమహావిష్ణువుకడకు వెళ్లెను. పిదప అతడు పురుషసూక్త మంత్రములతో ఆ దేవదేవుని స్తుతించెను. అంతట సమాధిలోనున్న ఆ బ్రహ్మదేవునకు అద్భుతమైన ఒక మాట వినబడెను. అనంతరము ఆ పద్మజుడు తాను వినిన ఆ వచనమును భూదేవికిని, వేల్పులకును సాదరముగా ఇట్లు వివరించెను.

క. యాదవకులమున నమరులు, మేదినిపైఁ బుట్టఁ జనుఁడు మీ యంశములన్
శ్రీదయితుఁడు వసుదేవున, కాదరమునఁ బుట్టి భారమంతయుఁ బాపున్. 15

క. హరిపూజార్థము పుట్టుఁడు, సురకన్యలు భూమియందు సుందరతనులై
హరి కగ్రజుఁడై శేషుఁడు, హరికళతోఁ బుట్టుఁ దత్ప్రియారంభుండై 16

ఆ. ఈ ప్రపంచమెల్ల నే మాయచే మోహితాత్మ మగుచునుండు నట్టి మాయ
కమలనాభునాజ్ఞఁ గార్యార్థమై నిజాంశంబుతోడఁ బుట్టు జగతియందు. 17

వ. అని యిట్లు వేల్పుల నియ్యకొలిపి, పుడమిముద్దియ నొడంబఱిచి, తమ్మిచూలి తన మొదలినెలవునకుం జనియె. అంత యదువిభుండయిన శూరసేనుండనువాఁడు మధురాపురంబు తనకు రాజధానిగా, మాథురంబులు, శూరసేనంబు లనియెడు దేశంబులేలం, బూర్వకాలంబున. 18

"దేవతలారా! మీరందఱునుమీమీ అంశలతో భూమండలమున యాదవులై జన్మింపుడు. శ్రీమహావిష్ణువు దేవకీవసుదేవులకు పుత్రుడై అవతరించి, వాత్సల్యముతో ఈ భూభారమును తొలగించును. శ్రీహరిని (శ్రీకృష్ణుని) సేవించుటకై దివ్యాంగనలు చక్కని అందచందములతో భూలోకమున జన్మింతురు. వెనువెంటనే ఆదిశేషుడు శ్రీహరియంశతో శ్రీకృష్ణునకు అన్నయై జన్మించును. అతడు బలరాముడుగా వాసికెక్కి ఆ ప్రభునకు (శౌరికి) ప్రియమును గూర్చెడి పనులను ఆరంభించును. విష్ణువుయొక్క యోగమాయ సమస్తలోకములను మోహములో ముంచివేయును.

అట్టి మాయాశక్తి ఆ ప్రభువుయొక్క ఆజ్ఞను అనుసరించి లోకకల్యాణార్థము ఆయావిధులను నిర్వర్తించుటకై భూలోకమున జన్మించును". బ్రహ్మదేవుడు ఈ విధముగా పలికి, దేవతలను సమాధానపఱచి భూదేవిని ఓదార్చి, తన సత్యలోకమునకు ఏగెను. ఆ కాలమున శూరసేనుడు యాదవులకు ప్రభువైయుండెను. అతడు మధురాపురమును రాజధానిగా చేసికొని, మాథురంబులు, శూరసేనంబులు అను రాజ్యములను పరిపాలించుచుండెను.

క. ఏ మధురయందు నిత్యము శ్రీమన్నారాయణుండు చెలఁగుఁ బ్రియముప్పై
నా మధుర సకలయాదవ, భూమీశులకెల్ల మొదలిపురి యయ్యె నృపా! 19

సకలయాదవప్రభువులకును రాజధానియైన ఈ మధురానగరమే శ్రీకృష్ణుడు అవతరించిన పిమ్మట ఆ స్వామిలీలావిలాసములకు కేంద్రమయ్యెను.

సీ. ఆ శూరసేనున కాత్మజుం డగు వసుదేవుఁడా పురి నొక్కదినమునందు
దేవకిఁ బెండ్లియై దేవకియును దానుఁగడు వేడ్క రథమెక్కి కదలువేళ
నుగ్రసేనునిపుత్రు డుల్లాసి కంసుఁడు చెల్లెలు మఱఁదియు నుల్లసిల్ల
హరులపగ్గములఁ జేనంది రొప్పఁదొడంగె ముందట భేరులు మురజములును
ఆ. శంఖ పటహములును జడిగొని మ్రోయంగఁ గూఁతుతోడి వేడ్క కొనలుసాఁగ
దేవకుండు సుతకు దేవకీదేవికి నరణ మీఁదలంచి యాదరించి. 20

వ. సార్థంబులయిన రథంబుల వేయునెనమన్నూటిని గనకదామసముత్తుంగంబులయిన మాతంగంబుల నన్నూటిని బదివేల తురంగంబులను, విలాసవతులయిన దాసీజనంబుల నిన్నూటిని నిచ్చి, యనిచినం గదలి, వరవధూయుగళంబు తెరువునం జను సమయంబున. 21

మధురానగరమునకు ప్రభువైన శూరసేనునికుమారుడు వసుదేవుడు. మధురాపురమునందు ఒక శుభదినమున అతడు దేవకునికూతురైన దేవకిని పెండ్లియాడెను. గృహప్రవేశమునకై దేవకితోగూడి అతడు తన యింటికి ప్రయాణ సన్నద్ధుడయ్యెను. అంతట ఉగ్రసేనునికుమారుడైన కంసుడు తన పినతండ్రి కూతురగు దేవకిని, మఱదియగు వసుదేవుని తన రథముపై ఎక్కించుకొని, పగ్గములను చేబూని ఉత్సాహముతో సారథ్యము వహించుచుండెను. ఆ రథమునకు ముందుభాగమున భేరులు, మద్దెలలు, శంఖములు, తప్పెటలు నిర్విరామముగా (ఏ మాత్రమూ ఆగక) మ్రోగుచుండెను. దేవకుడు తన కూతురగు దేవకికి అరణముగా వివిధములగు వస్తువులతో ఒప్పెడి పదునెనిమిదివందల రథములను, బంగారుగొలుసులతో అలంకృతములై, ఎత్తైన నాలుగువందల ఏనుగులను, పదివేల గుఱ్ఱములను, విలాసవతులైన రెండువందలమంది దాసీజనులను ఇచ్చెను. వాటితో గూడి ఆ నవదంపతులు రాజమార్గమున సాగిపోవుచుండిరి.

క. పగ్గములు వదలి వేగిర, మగ్గలముగ రథముఁ గడపు నా కంసుఁడులో
బెగ్గిలి యెగ్గని తలఁపఁగ, దిగ్గన నశరీరవాణి దివి నిట్లనియెన్. 22

క. తుష్ట యగు భగిని మెచ్చఁగ, నిష్టుఁడవై రథము గడపెదెఱుఁగవు మీఁదన్
శిష్ట యగు నీ తలోదరి, యష్టమగర్భంబు నిన్ను హరియించుఁ జుమీ. 23

అంతట కంసుడు పగ్గములను సడలించి రథమును వేగముగా నడపుచుండెను. ఇంతలో అతనిగుండెలు గుభిల్లుమనునట్లుగా ఆకాశమునుండి అశరీరవాణి ఇట్లు పలికెను. "కంసా! నీ సోదరియగు దేవకి మెచ్చుకొనునట్లు

సంతోషముతో రథమును నడపుచుంటివి. కాని నీవు మున్ముందు రాబోవు ఆపదను తెలిసికొనలేక యున్నావు. ఉత్తమురాలగు నీ సోదరియొక్క ఎనిమిదవ సంతానము నిన్ను సంహరించును.

వ. అని యిట్లాకాశవాణి పలికిన, నులికిపడి, భోజకులపాంసనుండైన కంసుండు సంచలదంసుండై, యడిదంబు బెడిదంబుగాఁ బెఱికి, జళిపించి, దెప్పరంబుగ ననుజకొప్పుఁబట్టి, కప్పరపాటున నొప్పఱం దిగిచి, యొడిసిపట్టి, తోఁబుట్టువని తలంపక, తెంపుసేసి తెగ(వేయ గమకించు సమయంబున, వసుదేవుండు డగ్గఱి. 24

క. ఆ పాపచిత్తు మత్తుం, గోపాగ్ని శిఖానువృత్తు గొనకొని తన స
ల్లాపామృత ధారావి, క్షేపంబునఁ గొంత శాంతుఁ జేయుచుఁ బలికెన్. 25

భోజవంశమున చెడబుట్టినవాడైన కంసుడు ఆ ఆకాశవాణి పలుకులను విని ఉలిక్కిపడెను. అప్పుడు అతని భుజములు అదరెను. వెంటనే అతడు తన యొఱలోనుండి భీకరముగా కత్తినిదూసి, ఝళిపించుచు, హఠాత్తుగా తన చెల్లెలి కొప్పును పట్టుకొనెను. పిమ్మట అతడు తత్తఱపడుచు ఆమెయొక్క వధూశోభ దెబ్బతినునట్లుగా ఒడుపుతోలాగి, ఆమె తన తోబుట్టువు అనియు తలంపక, సాహసముతో దేవకిని చంపుటకు ఉద్యుక్తుడయ్యెను. ఇంతలో వసుదేవుడు ఆయనను సమీపించెను. కంసుడు సహజముగనే పాపాత్ముడు, యుక్తాయుక్త విచక్షణను కోల్పోయి ఉన్నవాడు, తన కోపాగ్నిజ్వాలలతో తెచ్చిపోయి యున్నవాడు. అట్టి కంసుని తన మృదుమధురవచనములతో శాంతింపజేయుచు వసుదేవుడు ఇట్లు నుడివెను.

ఉ. అన్నవు నీవు చెల్లెలికి నక్కట! మాడలు చీరలిచ్చుటో
మన్ననసేయుటో మధుర మంజుల భాషల నాదరించుటో
మిన్నుల (మోఁతలే నిజము మేలని చంపకుమన్న! మాని రా
వన్న! సహింపుమన్న! దగదన్న! వధింపకుమన్న! వేఁడెదన్ 26

వ. అదియుం గాక. 27

మ. చెలియల్ కన్నియ ముద్దరాలబల నీ సేమంబె చింతించు ని
ర్మల దీనిన్ బయలాడు మాటలకునై మర్యాదఁ బోఁదట్టి స
త్కుల జాతుండవు పుణ్యమూర్తి వకటా! కోపంబు పాపంబు నె
చ్చెలి నోహోతెగ(వేయఁ బాడి యగునే చింతింపు భోజేశ్వరా! 28

“బావా! నీవు ఈ దేవకికి అన్నవు (తండ్రివంటివాడవు) కనుక నీవు ఈ సమయమున ఈమెకు వెండి బంగారములను, మేలివస్త్రములను కానుకలుగా ఇచ్చి గౌరవించుటయో, ఆత్మీయములైన చక్కని మాటలతో ఆదరించుటయో చేయదగును. అంతేగాని ఈ ఆకాశవాణినే నిజముగా భావించి ఈమెను చంపదగదు, ఈ హత్యాప్రయత్నమును విరమించుకొనుము. ఓర్పు వహింపుము. ఇట్లు చెల్లెలిని వధింపబూనుట పాడిగాదు. నా ప్రార్థనను ఆలకింపవలసినదిగా నిన్ను వేడుకొనుచున్నాను. అంతేగాదు భోజవంశమహారాజా! నీవు ఉత్తమవంశమున జన్మించినవాడవు, పవిత్ర స్వభావముగలవాడవు. నీవంటివాడు ఇట్లు కోపించుట యుక్తముగాదు. ఈ దేవకి నీకు చెల్లెలు, కూతురు వంటిది, అమాయకురాలు, ఎల్లప్పుడును ఈమె నీ క్షేమమునే కోరుకొనుచుండును, కపటము ఎఱుగనిది. ఆకాశవాణిమాటలను నమ్మి, బంధుమర్యాదను విస్మరించి, ఇట్లు ఏ అనుంగు సోదరిని నీ ఖడ్గమునకు బలిఇచ్చుట ఏపాటిధర్మము? అయ్యో! ఒక్కసారి బాగుగా ఆలోచింపుము.

సీ. మేనితోడన పుట్టు మృత్యువు జనులకు నెల్లి నేఁడైన నూఱేండ్లకైనఁ
దెల్లంబు మృత్యువు దేహంబు పంచత నందఁ గర్మానుగుఁడై శరీరి

మఱుదేహము నూఁది మఱితొంటిదేహంబుఁ బాయును దనపూర్వభాగమెత్తి
వేఱొంటిపైఁ బెట్టి వెనుకభాగంబెత్తి గమనించు తృణజలూకయును బోలె
ఆ. వెంట వచ్చు కర్మవిసరంబు మును మేలు గన్న వేళ నరుఁడు కన్న విన్న
తలఁపఁబడిన కార్యతంత్రంబు కలలోనఁ బాడితోడఁ గానఁబడినయట్లు. 29

క. తన తొంటికర్మరాశికి, ననుచరమై బహువికారమై మనసు వడిం
జను నింద్రియముల తెరువులఁ, దనువులు పెక్కయినఁజెడవు తన కర్మంబుల్ 30

రాజా! జనులకు మృత్యువు శరీరమును వెన్నంటియే ఉండును. మరణము నేడైనను, లేదా! నూఱేండ్లకైనను తప్పదు, ఇది నిశ్చయము. దేహమును మృత్యువు కబలింపగా ప్రతిప్రాణియు తన కర్మలను అనుసరించి, తృణజలూకా న్యాయమున[1] మఱియొక దేహమును పొందుటకై ఈ దేహమును త్యజించును. నరుడు మెలకువగా ఉన్నప్పుడు తాను చూచిన, వినిన, తలంచిన కార్యములు కలలోనికి వచ్చినరీతిగా, తానార్జిన సుకృత దుష్కృత ఫలములు మఱుజన్మమున అతనిని అనుసరించి వచ్చును. జీవుడు తానొనర్చిన పుణ్యాపాపకర్మలకు అనుగుణముగా మనస్సు ఆయా వికారములను పొందుచు దశేంద్రియ (జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ) మార్గములను అనుసరించుచుండును. ఎన్ని జన్మలెత్తినను జీవుడు తాను చేసికొనిన మంచి, చెడు కర్మల ఫలములను అనుభవింపక తప్పదు.

ఆ. జల ఘటాదులందుఁ జంద్ర సూర్యాదులు
కానఁబడుచు గాలిఁ గదలుభంగి
నాత్మ కర్మ నిర్మితాంగంబులను బ్రాణి
కదలుచుండు రాగకలితుఁడగుచు. 31

జలములతో నిండిన కుండలు మొదలగువానిలో (కుండలు, చెఱువులు, నదులు, సముద్రములు మున్నగువానిలో, సూర్యచంద్రాదుల బింబములు ప్రతిఫలించుచుండును. గాలి తాకిడికి వాటియందలి నీళ్లు కదలుచున్నప్పుడు ఆ బింబములుగూడ కదలుచున్నట్లు తోచుచుండును. అట్లే జీవుడు (ప్రాణి) తన కర్మల ఫలితముగా ఏర్పడిన (లభించిన) శరీరములయందు అజ్ఞానముచే హర్షశోకాదులను అనుభవించుచున్నట్లు భ్రమపడుచుండును. వాస్తవముగా జీవునకు ఎట్టి చలనమూ ఉండదు.

క. కర్మములు మేలు నిచ్చును, గర్మంబులు కీడు నిచ్చుఁ గర్తలు దనకుం
గర్మములు బ్రహ్మకైనను, గర్మగుఁడై పరులఁదడవఁగా నేమిటికిన్. 32

క. కావునఁ బరులకు హింసలు, గావింపఁగ వలదు తనకుఁ గల్యాణముగా
భావించి పరుల నొంచినఁ, బోవునె తత్ఫలము పిదపఁ బొందక యున్నే. 33

జీవునకు తన పుణ్యకర్మలవలన మేలు, పాపకర్మలవలన కీడు సంభవించుచుండును. సృష్టికర్తయైన బ్రహ్మకును శుభాశుభ ఫలములకు కర్మలే కర్తలు. కనుక కర్మానుసారముగా ప్రాప్తించెడి సుఖదుఃఖములకు ఇతరులు కారకులని భావింపరాదు. అందువలన ఇతరులను హింసించుట ఏమాత్రమూ తగదు. తనకు మేలు కలుగునని భావించి ఎవ్వరైనను ఇతరులను హింసించినచో వారు ఆ పాపకర్మలఫలములను అనుభవింపక తప్పదు.

1. గడ్డిపురుగు ప్రాకునపుడు మఱియొక్క తృణమును ఆశ్రయింపక పూర్వతృణమును విడువదు. దీనిని తృణజలూకాన్యాయము అని యందురు. 'జీవుడు మఱియొక దేహమును చూచుకొనకుండ పూర్వదేహమును వీడడు' అని సూచింపబడుచున్నది.

మత్తకోకిలము. వావిఁ జెల్లెలుగాని పుత్రికవంటిదుత్తమురాలు సం
భావనీయచరిత్ర భీరువు బాల నూత్న వివాహ సు
శ్రీవిలాసిని దీన కంపితచిత్త నీకిదె మ్రొక్కెదం
గావవే కరుణామయాత్మక! కంస! మానవవల్లభా! 34

వ. అని మఱియు, సామరూపంబులగు పలుకులు పలికిన వినియు, వాఁడు, వేఁడి చూపుల రాలు నిప్పులు కుప్పలు గొన, ననుకంపలేక, తెంపుసేసి, చంపకగంధింజంపఁజూచుట యెఱింగి, మొఱంగెడి తెఱంగు విచారించి, తనలో నిట్లనియె. 35

కంసమహారాజా! నీవు మిక్కిలి దయగల వాడవు. ఈ దేవకి బంధుత్వమునుబట్టి చెల్లెలే యైనను వాస్తవముగా నీకు కూతురువంటిది, ఈమె ఉత్తమురాలు, సచ్ఛీలవర్తనచే గౌరవార్హయైనది. భయస్వభావముగలది. ఎంతయు అమాయకురాలు, కాళ్లపారాణి ఆఱని క్రొత్త పెండ్లికూతురు, దీనురాలు, భయముచే ఈమెచిత్తము కంపించిపోవుచున్నది. నీకు మ్రొక్కుచున్నాను. ఈమెను రక్షించుము (చంపకుము)". ఇట్లు వసుదేవుడు కంసుని మనస్సు ద్రవించునట్లుగను, భీతిగొలుపునట్లుగను పలికెను. ఈ మాటలకు కంసుడు ఏమాత్రమూ మెత్తబడలేదు. పైగా అతడు కోపముతో కన్నుల నిప్పులు రాల్చుచు, కనికరములేక తెగువతో దేవకిని చంపుటకు పూనుకొనెను. అతనియొక్క ఈ వైఖరిని జూచి, వసుదేవుడు కంసుని మనస్సును మరలించుటకై తనలో ఇట్లు తలపోసెను.

క. ఎందును గాలము నిజ మని, సందతనంబునను బుద్ధిఁ బాయక ఘనులై
యొందాఁక బుద్ధి నెగ డెడి, నందాఁకఁ జరింపవలయునాత్మ బలమునన్. 36

వ. అని నిశ్చయించి. 37

ఏమైనను ఆపదలు వచ్చినప్పుడు మానవుడు 'ఎప్పుడైనను చావు తప్పదు గదా!' అని నిస్పృహ చెందరాదు. దిగులు పడక స్థిరచిత్తుడై బుద్ధిబలముకొలది అన్నివిధములుగా ఆలోచించి, ఆ అపాయమునుండి బయటపడుటకు యత్నింపవలయును' అని వసుదేవుడు ఒక నిశ్చయమునకు వచ్చెను.

సీ. ఆపన్నురాలైన యంగన రక్షించి సుతుల నిచ్చెద నంట శుభము నేఁడు
మీఁదెవ్వఁ డెఱుఁగును మెలఁత ప్రాణంబుతో నిలిచిన మఱునాఁడు నేరరాదె
సుతులు పుట్టిరయేని సుతులకు మృత్యువు వాలాయమై వెంట వచ్చెనేని
బ్రహ్మచేతను వీఁడు పాటేమియును లేక యుండునే సదుపాయమొకటి లేదె
తే. పొంత మ్రాఁకులఁ గాల్పక పోయి వహ్ని యెగసి దవ్వులవాని దహించుభంగిఁ
గర్మవశమున భవమృతికారణములు దూరగతిఁబొందు నెఁకనేల తొట్రుపడఁగ 38

క. కొడుకుల నిచ్చెద నని సతి, విడిపించుట నీతి వీఁడు విడిచిన మీఁదం
గొడుకులు పుట్టినఁ గార్యము, దడఁబడదే నాఁటికొక్కదైవము లేదే. 39

'కంసుని చేతిలో చిక్కుపడి ఆపన్నురాలైయున్న ఈ దేవకిని రక్షించుటకై, 'ఈమెకు పుట్టబోవు సుతులను ఇచ్చెదను అని (ఇతనితో) పలికెదను. ఇప్పటికి ఇట్లు అనుటయే మంచిది. భవిష్యత్తులో ఏమి జరుగునో? ఎవ్వడెఱుగును? ఈమె ప్రాణములతో బయటపడిన పిమ్మట తగిన ఉపాయమును ఆలోచింపవచ్చును. సుతులు కలిగినచో, వారికి మృత్యువు అనివార్యమే యగునుగాక. ఆ రక్షకునిచేతిలో ఈ కంసునకును మృత్యువు కలుగకుండునా? అప్పటికి ఏదైనను ఒక ఉపాయము దొరకకపోవునా? అగ్ని ఆ సమీపముననే యున్న వృక్షములను దహించివేయక, పైకి ఎగసిపోయి దూరముగానున్న

చెట్లను కాల్చివేయునట్లు, విధివశమున ఈమెకు చావు తప్పి, ఈమెను చంపజూచిన కంసుడే మృత్యువుపాలు కావచ్చునుగదా! సుకృత దుష్కృతకర్మలే జననమరణములకు కారణములు. కాలగతిచే ఆపదలు దూరమై తొలగిపోవచ్చును. ఇప్పుడు తొట్రుపడుట వృథా. 'ఈమెకు కలిగిన సుతులను నీకు అప్పగించెదను' అని పలికి, ఇప్పుడు ఈ కంసునినుండి ఈమెను రక్షించుకొనుటయే యుక్తము. ప్రస్తుతము ఇతడు ఈమెను విడిచిపెట్టిన పిమ్మట ఈ దేవకికి కొడుకులు పుట్టినచో అప్పటికి అతనిమనస్సు మాఱిపోవచ్చును. అప్పుడు దైవము (మనలను) అనుగ్రహింపకుండునా?

క. ఎనిమిదవ చూలు వీనిం, దునుమాడెడినంచు మింటఁ దోరపుఁ బలుకుల్
వినఁబడియె నేల తప్పును, వనితను విడిపించుటొప్పు వైళంబనుచున్. 40

క. తిన్నని పలుకులు పలుకుచుఁ, గ్రన్నన తగఁ బూజ చేసి కంసు నృశంసున్
మన్నించి చిత్త మెరియఁ బ్ర, సన్నాననుఁడగుచుఁ బలికె శౌరి నయమునన్. 41

'ఈమెకు కలుగబోవు ఎనిమిదవ సంతానమువలన ఈతనికి చావు మూడును' అని గదా! ఆకాశవాణి స్థూలముగా చెప్పినది? ఆ అశరీరి వచనములు అసత్యములు ఎట్లగును? ఏమాత్రము ఆలసింపక ఇప్పుడు దేవకిని ఈ ప్రమాదమునుండి తప్పించుటయే సముచితము". వసుదేవుడు ఇట్లు నిశ్చయించుకొని, క్రూరాత్ముడైన కంసుని మృదుమధుర వచనములతో గౌరవించెను. మనస్సు ఎంత దుఃఖమున్నను పైకి కనబడనీయక, ప్రసన్నమైన ముఖముతో అతడు తన బావతో ఇట్లనెను-

క. లలనకుఁ బుట్టిన కొమరుని, వలనం దెగెదనుచు గగనవాణి వలికె నం
చలిగెదవేని మృగాక్షికిఁ, గల కొడుకులఁ జంప నిత్తుఁ గ్రమమున నీకున్ 42

"కంసరాజా! ఈ దేవకీదేవికి కలిగిన ఎనిమిదవ కుమారునివలన నీకు మృత్యువు సంభవించుననిగదా! ఆకాశవాణి చెప్పినది? అందువలన మరణమునకు భయపడి నీవు కుపితుడవైనచో నేను చెప్పెడి ఈ మాటలను ఆలకింపుము'. ఈమెకు కలిగెడి కుమారులను అందఱిని వరుసగా (పుట్టినవెంటనే) నీకు అప్పగించెదను. నీవు వారిని వధింపవచ్చును".

వ. అని యిట్లు పలికిన విని, కంసుండు కంపితావతంసుండై, సంతసించి, గుణగ్రహిత్వంబు గైకొని, కొందలమందు చెలియలి ముందల విడిచి చనియె. వసుదేవుండును, బ్రదుకుమందలఁ గంటి ననుచు, సుందరియుం, దానును మందిరంబునకుం బోయి, డెందంబున నానందంబు నొందియుండె. అంతఁ గొంతకాలంబు చనిన సమయంబున 43

క. విడువక కంసుని యెగ్గులఁ బడి దేవకి నిఖిల దేవభావము తన కే
ర్పడ నేఁట నొకని లెక్కను, గొడుకుల నెనమండ్ర నొక్క కూఁతుం గనియెన్ 44

ఆ పలుకులను ఆలకించి, కంసుడు వసుదేవుని సద్గుణములకు సంతసించెను. పిదప తలయూపుచూ తన చెల్లెలి కొప్పును విడిచిపెట్టెను. అంతట వసుదేవుడు 'బ్రతికెడి ఉపాయము దొరకినది' (ప్రాణప్రమాదము తప్పినది) అనియనుకొనుచు, భార్యతోగూడి తన భవనమునకు చేరి సంతోషముతో కాలము గడపుచుండెను. పిదప దేవకి కంసుడు పెట్టెడి బాధలను సహించుచు, అనుక్షణము సర్వవ్యాపకుడైన శ్రీమహావిష్ణువును తలంచుకొనుచు ఉండెను. కొంతకాలమునకు పిమ్మట వరుసగా ఆమెకు సంవత్సరమునకు ఒక్కొక్కరు చొప్పున ఎనిమిదిమంది కుమారులును, ఒక కుమార్తెయు కలిగిరి.

వ. అందు, 45

గీ. సుదతి మున్ను గన్న సుతుఁగీర్తిమంతునిఁ బుట్టు తడవ కంసభూవరునకుఁ
దెచ్చి యిచ్చెఁ జాల ధృతి గల్గి వసుదేవుఁ డాసపడక సత్యమందు నిలిచి.. 46

క. పలికిన పలుకులు దిరుగక, సొలయక వంచనములేక సుతుల రిపునకుం
గలఁగక యిచ్చిన ధీరుం, డిల వసుదేవుండు తక్క నితరుఁడు కలఁడే 47

అంతట వసుదేవుడు తాను ఇచ్చినమాటపై నిలబడి, పుత్రవ్యామోహమునకు లోనుగాక, ధైర్యము వహించి, దేవకియందు కలిగిన మొదటి కుమారుడగు కీర్తిమంతుని పుట్టినవెంటనే కంసభూపతికి అప్పగించెను. వసుదేవుడు మాటకు కట్టుబడి యుండువాడు, మోసమునక పాల్పడనివాడు,కావున అతడు మనస్సున కలతచెందక, వెనుకడుగు వేయక, తనకు శత్రువైన కంసునకు తన సుతులను అందటిని అప్పగించెను. వాస్తవముగా వసుదేవుడు మహాధీరుడు, అట్టివాడు ఎవడుగలడు?

ఆ. మానవేంద్ర! సత్యమతికి దుష్కర మెయ్య దెఱుకగలుగు వాని కిష్ట మెయ్య
దీశభక్తిరతునికీరాని దెయ్యది యెఱుక లేనివానికేది కీడు. 48

వ. ఇట్లు సత్యంబు దప్పక కొడుకు నొప్పించిన వసుదేవునిపలుకునిలుకడకు మెచ్చి, కంసుండిట్లనియె. 49

పరీక్షిన్మహారాజా! సత్యసంధునకు అసాధ్యమనునదియే ఉండదు. యుక్తాయుక్త విచక్షణగలవానికి 'ఇది ఇష్టము - ఇది అనిష్టము' అను భేదబుద్ధియుండదు. భగవద్భక్తుడు ఈయరానిదే ఉండదు. (సర్వస్వమునూ త్యాగము చేయును) అజ్ఞానికి 'ఇది మేలు - ఇది కీడు' అను జ్ఞానమే ఉండదుగదా! ఇట్లు మాటపై నిలిచి కొడుకును అప్పగించిన వసుదేవునిస్థిరబుద్ధికి కంసుడు ఎంతయు మెచ్చుకొని ఇట్లు నుడివెను.

ఆ. కొడుకు నీవు మరలఁ గొనిపొమ్ము వసుదేవ! వెఱపులేదు నాకు వీనివలన
నల్గ వీనికి భవదష్టమపుత్రుండు మృత్యువఁట వధింతు మీఁద నతని. 50

"వసుదేవా! నీ కుమారుడైన ఈ కీర్తిమంతుని మఱల తీసికొనిపొమ్ము. వీనివలన నాకు ఎట్టిభయమూ లేదు. వీనిపై నాకు కోపములేదు. నాకు మృత్యుకారకుడు నీ ఎనిమిదవ కుమారుడు గదా! కావున ఇకమీదట అతనిని వధింతును".

వ. అనిన నానక దుందుభి నందనుం గొని చనియు, నానందంబు నొందక, దుష్టస్వభావుండగు బావపలుకులు వినియు, నులుకుచుండె. అంత. 51

కంసుని సూచనమేరకు వసుదేవుడు తన కుమారుని తీసికొనివెళ్లెను. కాని అతడు ఆనందింపలేదు. దుష్టాత్ముడగు తన బావయొక్క పలుకులను వినియు, వాటిని నమ్మలేక భయపడుచునే ఉండెను.

సీ. ఒకనాఁడు నారదుం డొయ్యన కంసునియింటికిఁ జనుదెంచి యేకతమున
మందలోపల నున్న నందాదులును వారి భార్యలుఁ బుత్రులు బాంధవులును
దేవకి మొదలగు తెఱవలు వసుదేవుఁ డాదిగాఁ గల సర్వయాదవులును
సురలు గాని నిజంబు నరులు గా రని చెప్పి కంసుండ! నీవు రక్కసుఁడ వనియు.

ఆ. దేవమయుఁడు చక్రి దేవకీదేవికిఁ బుత్రుఁడై జనించి భూతలంబు
సెఱుపఁబుట్టినట్టి చెనఁటి దైత్యుల నెల్లఁ జంపుననుచుఁ జెప్పి చనియె దివికి. 52

ఒకానొకప్పుడు నారదమహర్షి కంసునిభవనమునకు ఏతెంచి, ఏకాంతమందిరమున అతనితో ఇట్లు నుడివెను. "మహారాజా! వ్రేపల్లెలో ఉన్న నందుడు మొదలగు వారును, వారి భార్యలును, పుత్రులును, బంధువులును, అట్లే దేవకి మున్నగు వనితలును, వసుదేవాది యాదవులందఱును నిజముగా దేవతలే. (దివ్యాంశలతో పుట్టినవారే). వారు మానవమాత్రులుగారు. నీవు పూర్వజన్మలో 'కాలనేమి'యను రాక్షసుడవు. దేవాదిదేవుడు శ్రీమహావిష్ణువు ఈ లోకమున దేవకీదేవికి పుత్రుడై అవతరించును. భూతలము అతలాకుతలమొనర్చెడి దుష్టులైన (నీవంటి) దానవులను అందఱిని చంపివేయును". ఇట్లు పలికి ఆ మహర్షి దివికేగెను.

క. నారదుమాటలు విని పె, ల్లారటముఁ బొంది యదువులనిమిషులనియున్
నారాయణ కరఖడ్గ వి, దారితుఁడగు కాలనేమి దాననియు మదిన్. 53

మ. కలఁగంబాఱి మఱందిఁ జెల్లెలి నుదగ్రక్రోధుఁడై పట్టి బ
ద్ధులఁ గావించి హరిం దలంచి వెసఁ దోడ్తో వారు గన్నట్టి పు
త్రులఁ జంపెన్ గురు నుగ్రసేను యదుఁదద్భోజాంధకాధీశు ని
ర్మలుఁబట్టెన్ గడు వాలి యేలెఁ జలమారన్ శూరసేనంబులన్. 54

ఆ. తల్లిఁ దండ్రినైన దమ్ముల నన్నల సఖులనైన బంధుజనుల నైన
రాజ్యకాంక్షఁజేసి రాజులు చంపుదు రవనిఁదఱచు జీవితార్థు లగుచు. 55

యాదవులెల్లరును దేవతలే అనియు, శ్రీమన్నారాయణుని చేతిలోనిహతుడైన కాలనేమియే తాను అనియు, నారదునివలన తెలిసిన పిదప కంసుడు మిక్కిలి ఆరాటపడసాగెను. పిమ్మట అతడు మనస్సంతయు కలత చెందగా ఎంతయు క్రుద్ధుడై బంధుత్వమును మఱచి, దేవకీవసుదేవులను చెరసాలలో బంధించెను.పిదప శ్రీహరిని గుర్తునకు తెచ్చుకొనుచు ఆయనమీది కోపముతో అతడు వారికి కలిగిన పుత్రులను (ఆఱుమందిని) వధించెను. అంతేగాక ధర్మనిరతుడైన తన తండ్రియగు ఉగ్రసేనమహారాజునుగూడ చెఱలో బెట్టెను. ఆ ఉగ్రసేనుడు యదువంశమువాడు, భోజ, అంధకరాజ్యములకు ప్రభువు. ఆయన స్వభావము నిర్మలము. ఐనను క్రోధముతో కనులు మూసికొనిపోయిన కంసుడు పితృనిర్బంధమునకు ఒడిగట్టి, ఆమూర్ఖత్వముతో శూరసేనదేశములకు తానే రాజై పరిపాలించుచుండెను. ఈ లోకమున రాజ్యాధికార వ్యామోహములో పడిన రాజులు అజ్ఞానముతో 'తమ జీవితములు శాశ్వతములు' -అని తలపోయుచు మంచిచెడ్డలను మఱచి, తల్లిదండ్రులను, అన్నదమ్ములను, మిత్రులను, బంధువులను సైతము తఱచు చంపివేయుచుందురు.

వ. మఱియు, బాణ భౌమ మాగధ మహాశన కేశి ధేనుక బక ప్రలంబ తృణావర్తచాణూర ముష్టికారిష్ట ద్వివిధ పూతనాది సహాయ సమేతుండై, కంసుండు కదనంబున మదంబులణంచిన, వదనంబులు వంచికొని సదనంబులు విడిచి, యదవలై, యదువులు పదవులు వదలి, నిషధ కురు కోసల విదేహ విదర్భ కేకయ పాంచాల సాల్వదేశంబులు సొచ్చిరి. మచ్చరంబులు విడిచి, కొందఱు కంసునిం గొలిచినిలిచి రంత,56

ఆ సమయమున కంసునకు బాణుడు, నరకుడు, జరాసంధుడు, అఘాసురుడు, కేశి, ధేనుకుడు, బకుడు, ప్రలంబుడు తృణావర్తుడు చాణూరముష్టికులు, అరిష్టుడు, ద్వివిధుడు, పూతన మొదలగు రాక్షసులు సహాయకులుగా ఉండిరి. అతడు వారి తోడ్పాటుతో యుద్ధమొనర్చి యాదవులను నిర్వీర్యులను గావించెను. కంసునిచేతిలో పరాభూతులైన యాదవులు దిక్కులేనివారై చేయునదిలేక తలలు వంచుకొని, తమ ఆత్మీయులను, ఇండ్లనువీడి వలసపోయిరి. క్రమముగా వారు నిషధ, కురు, కోసల, విదేహ, విదర్భ, కేకయ, పాంచాల, సాల్వ దేశములకు చేరిరి. కొంతమంది మాత్రము కంసునియెడ పగబూనక అతనికి విధేయులై జీవింపసాగిరి.

త. తొడిఁదొడిఁ గంసుఁడు దేవకి, కొడుకుల నార్వుర వధింప గురు శేషాఖ్యం
దొడ వగు హరిరుచి యా సతి, కడుపున నేడవది యైన గర్భం బయ్యెన్. 57

కంసుడు దేవకికి కలిగిన ఆఱుగురు కొడుకులను వరుసగా చంపివేసెను. అనంతరము ఆదిశేషుడు శ్రీహరియంశతో దేవకి కడుపున ఏడవగర్భముగా నిలిచెను.

వ. అయ్యవసరంబున విశ్వరూపుం డగు హరి, తన్ను నమ్మిన యదువులకుఁ, గంసునివలన భయంబు గలుగు నని యెఱింగి యోగమాయాదేవి కిట్లనియె. 58

సీ. గోపికాజనములు గోపాలకులు నున్న పసులమందకుఁ బొమ్ము భద్ర! నీవు
వసుదేవు భార్యలు వరుసఁ గంసునిచేత నాఁకలఁ బడియుండ నందుఁ జొరక
తలఁగ రోహిణి యను తరళాక్షి నందగోకులమందు నున్నది గుణగణాఢ్య
దేవకికడుపున దీపించు శేషాఖ్యమైన నా తేజ మీ వమరఁ బుచ్చి

ఆ. నేర్పు మెఱసి రోహిణీదేవి కడుపునఁ జొనుపు దేవకికిని సుతుఁడ నగుదు
నంశభాగ యుతుఁడ నై యశోదకు నందు పాలఁతికంతమీఁదఁ బుట్టె దీవు, 59

క. నానావిధ సంపదలకుఁ, దానక మైసర్వ కామదాయినివగు నిన్
మానవులు భక్తిఁ గొలుతురు కానికలును బలులు నిచ్చి కల్యాణమయీ! 60

వ. మఱియు, నిన్ను మానవులు దుర్గ భద్రకాళి విజయ వైష్ణవి కుముద చండిక కృష్ణ మాధవి కన్యక మాయ నారాయణి యీశాన శారద యంబిక యను పదునాలుగు నామంబులం గొనియాడుదురయ్యె స్థానంబులయందని యెఱింగించి, సర్వేశ్వరుండగు హరి పొమ్మని యానతిచ్చిన మహాప్రసాదం బని, య య్యోగనిద్ర యియ్యకొని, మ్రొక్కి, చయ్యన నియ్యిలకయ్యెడ వాసి వచ్చి, 61

విరాట్స్వరూపుడగు శ్రీహరి ఆ సమయమున తనను నమ్ముకొనిన యాదవులకు కంసునివలన ప్రమాదము కలుగవచ్చునని తలంచి, తన యోగమాయతో ఇట్లనెను – "యోగమాయా! వసుదేవుని భార్యలలో ఏడుమంది కంసునిచేత చెఱసాలలో బంధింపబడి యున్నారు. నీవు వారికడకు వెళ్ళవద్దు. గోపికలు, గోపాలురు ఉన్న వ్రేపల్లెకు చేరుము. వసుదేవునియొక్క ఎనిమిదవభార్యయగు 'రోహిణి'[1] అచటనే యున్నది. ఆమె మిగుల గుణవంతురాలు. దేవకీదేవి గర్భమునందు విరాజిల్లుచున్న నా అంశయగు ఆదిశేషుని తేజస్సును రోహిణీ గర్భమునకు చేర్చుము. నేను నా అంశతో దేవకికి సుతుడనై అవతరింతును. నీవు వ్రేపల్లెలోనున్న నందుని భార్యయగు యశోదాదేవికడుపున పుట్టెదవు. శుభప్రదులారా! నీవు వివిధములగు సంపదలకు పెన్నిధివి. భక్తులయొక్క కోరికలను అన్నింటిని తీర్చెడిదానవు. మానవులు కానుకలను, నైవేద్యములను సమర్పించుచు నిన్ను సేవించుచుందురు. ఇంకను వారు ఆయా క్షేత్రములలో దుర్గ,భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మాయ, నారాయణి, ఈశాని, శారద, అంబిక – అను పదునాలుగు పేర్లతో నిన్ను కొనియాడుదురు". శ్రీహరి ఇట్లు 'వ్రేపల్లెకు వెళ్లుము' – అని ఆజ్ఞాపించిన పిమ్మట యోగమాయ ఆ స్వామి ఆనతిని తన అదృష్టముగా భావించి, దానిని తలదాల్చెను. పిదప ఆ ప్రభువునకు మ్రొక్కి, ఆ మాయాదేవి వెంటనే విష్ణులోకమునుండి భూతలమునకు ఏతెంచెను.

1 వసుదేవుని భార్యల ఎనిమిదిమందిపేర్లు – ధృతదేవ, ఉపదేవ, దేవరక్షిత, శ్రీదేవి, శాంతిదేవి, సహదేవి, దేవకీదేవి, రోహిణి. వీరిలో మొదటి ఏడుగురును చెఱసాలలో బంధింపబడిరి. ఎనిమిదవ భార్యయగు రోహిణి గోకులమునందు ఉండెను.

తే. దేవకీదేవి కడుపులోఁ దేజరిల్లు దీప్తగర్భంబు మెల్లనఁ దిగిచి యోగ
నిద్రరోహిణికడుపున నిలిపి చనియెఁ గడుపు దిగె నంచుఁ బౌరులు గలఁగఁబడఁగ. 62

అనంతరము ఆ యోగమాయ దేవకీదేవి గర్భమున తేజరిల్లుచున్న ఆదిశేషాంశయగు దివ్యశిశువును ఆకర్షించి, వ్రేపల్లెలో ఉన్న రోహిణి కడుపున నిలిపి వెళ్లిపోయెను. అంతట మధురాపుర స్త్రీలు అందఱును 'దేవకికి' గర్భస్రావము జరిగెనని కలతచెందిరి.

వ. అంత. 63

ఆ. బలము మిగులఁ గలుగ బలభద్రుఁడన లోక రమణుఁ డగుటఁజేసి రాముఁడనఁగ
సతికిఁబుట్టె గర్భసంకర్షణమున సంకర్షణుం డనంగ ఘనుఁడు సుతుఁడు 64

పిమ్మట రోహిణీదేవికి ఒక కుమారుడు కలిగెను. యోగమాయయొక్క సంకర్షణచే లభించినవాడగుట వలన ఆ మహాశిశువునకు (దివ్యబాలునకు) సంకర్షణుడు అనియు, మిగుల బలశాలియగుటచే 'బలభద్రుడు' అనియు, అందఱిని ఆనందింపజేయు సౌందర్యము గలవాడగుటవలన 'రాముడు' అనియు పేర్లు ఏర్పడెను.

వ. తదనంతరంబ. 65

క. ఆనకదుందుభి మనమున, శ్రీనాథుం డంశభాగ శిష్టతఁ జొరఁగన్
భానురుచి నతఁడు వెలిఁగినఁ, గానఁగఁ బట్టయ్యె భూతగణములకు నృపా! 66

పరీక్షిన్మహారాజా! తదనంతరము శ్రీమహావిష్ణువు విశిష్టమైన తన దివ్యాంశతో వసుదేవుని మనస్సున ప్రవేశించెను. అప్పుడు అతడు (వసుదేవుడు) సూర్యతేజస్సుతో వెలుగొందెను, సకలజీవులకు నెలవైన శ్రీమహావిష్ణువు యొక్క దివ్యాంశతో విలసిల్లుచున్నందున అప్పుడు వసుదేవుడు సకలప్రాణులకును నిలయుడై భాసిల్లెను.

ఉ. ఆ వసుదేవుఁ డంతఁ దనయం దఖిలాత్మక మాత్మభూతముం
బావనరేఖయున్ భువనభద్రమునై వెలుఁగొందుచున్న ల
క్ష్మీవిభుతేజమచ్చు పడఁ జేర్చినఁదాల్చి నవీనకాంతితో
దేవకి యొప్పెఁ బూర్వ యగు దిక్పతి చంద్రునిఁ దాల్చు కైవడిన్ 67

చిదానందరూపమైన విష్ణుతేజము శాశ్వతమైన రూపముగలది (సమస్త బ్రహ్మాండములకును ఆధారమైనది) పరమాత్మ స్వరూపమైనది, నిత్యపవిత్రమైన శోభలుగలది, సకలలోకములకును శుభములను చేకూర్చునది. అట్లు విరాజిల్లుచుండెడి శ్రీహరితేజమును వసుదేవుడు దేవకిగర్భమునందు యథాతథముగా చేర్చెను. ఆ దివ్యతేజస్సును దాల్చిన దేవకీదేవి నూతనమైన వెలుగులతో పున్నమినాటి చంద్రోదయ సమయమున తూర్పుదిక్కు అనెడి భామినివలె ప్రకాశించెను.

వ. అనిన విని, తరువాతి వృత్తాంతం బెట్లయ్యె నని రాజడిగిన, శుకుం డిట్లనియె. 68

క. గురుతరముగఁ దనకడుపున, సరసిజగర్భాండ భాండచయములు గల యా
హరి దేవకికడుపున భూ, భరణార్థము వృద్ధిఁ బొందె బాలార్కుక్రియన్. 69

అంతట పరీక్షిత్తు 'తదనంతర వృత్తాంతమును తెలుపుము' అని కోరగా శుకయోగి ఇట్లు నుడివెను. "రాజా! సమస్త బ్రహ్మాండములను తన కడుపున అవలీలగా దాల్చిన శ్రీమహావిష్ణువు భూలోకమును రక్షించుటకై బాలసూర్యునివలె దేవకీదేవి గర్భమునందు వర్ధిల్లెను.

వ. అంత. 70

సీ. విమతుల మోములు వెలవెలఁబాఱంగ విమలాస్య మోము వెల్వెలుకఁ బాతె
మలయు వైరుల కీర్తి మాసి నల్లన కాఁగ నాతి చూచుకములు నల్లనయ్యె
దుష్టాలయంబుల ధూమరేఖలు పుట్ట లేమ యారున రోమలేఖ మెఱసె
నరిమానసముల కాహారవాంఛలు దప్ప వనజాక్షి కాహారవాంఛ దప్పె
తే. శ్రమము సంధిల్లె రిపులకు శ్రమము గదుర జడత వాటిల్లె శత్రులు జడనుపడఁగ
మన్ను రుచియయ్యెఁ బగతురు మన్ను సారఁగ వెలఁదియుదరంబులో హరి వృద్ధిబొంద. 71

వ. మఱియును. 72

సీ. సలిల మా యెలనాఁగ జఠరార్భకునిఁ గానఁ జనినకైవడి ఘర్మసలిల మొప్పె
నొగిఁ దేజ మా యింతియుదరడింభకుఁ గొల్వఁ గదిసిన క్రియదేహకాంతి మెఱసెఁ
బవనుఁ డా కొమ్మ గర్భస్థుని సేవింప నొలసెనా మిక్కిలియూర్పు లమరెఁ
గుంభిని యా లేమ కుక్షిగు నర్చింపఁ జొచ్చుభంగిని మంటిచొరవ దనరె
ఆ. గగన మిందువదనకడుపులో బాలు సే,వలకు రూపు మెఱసి వచ్చినట్లు
బయలువంటినడుము బహుళమయ్యెను బంచ, భూతమయుఁడులోనఁబొదలసతికి. 73

ఇట్లు దేవకియొక్క గర్భముననున్న శ్రీహరి వృద్ధిపొందుచుండగా కంసాదిశత్రువులముఖములు వెలవెలబోవునట్లుగా, చూలాలైన ఆ దేవియొక్క మోము వెలవెలబాతెను, వైరులకీర్తి మసకబాఱినట్లుగా ఆమెయొక్క చూచుకములు (చనుమొనలు) నల్లబాఱెను, దుష్టులైన శత్రురాజాలభవనములలో (ఉత్పాత సూచకముగా) ధూమములు పెల్లుబుకునట్లుగా ఆమెయొక్క నూగారు (రోమావళి) రేఖలు మెఱయుచుండెను. శత్రువుల మనస్సులకు ఆకలిదప్పులకాంక్షలు దూరమగునట్లుగా ఆ వనితామణికి ఆహారవాంఛ తగ్గెను. రిపులెల్లరును శ్రమకు లోనై ప్రయాసపడునట్లుగా ఆ దేవకీదేవికి ఆయాసము కలుగుచుండెను. శత్రువులకు బుద్ధిమాంద్యము ఏర్పడినట్లు ఆమెలో చుఱుకుదనము తగ్గెను. పగవారు మట్టిగఱచుచున్నట్లుగా ఆమె నోటికి మన్ను రుచియగుచుండెను. ఇంకను -పంచమహాభూతములతో (పృథివ్యాపస్తేజోవాయురాకాశములతో) నిండిన (విరాట్స్వరూపుడైన) శ్రీమహావిష్ణువు దేవకీదేవి కడుపులో వృద్ధిపొందుచుండగా ఆ గర్భస్థ శిశువును దర్శించుటకై వచ్చిన జలములాయనునట్లు ఆమె శరీరముపై స్వేదబిందువులు విలసిల్లెను, ఉదరమునందున్న శిశువును సేవించుటకై వచ్చిన అగ్నితేజమా అనునట్లు ఆమెదేహకాంతి తేజరిల్లెను. కడుపులోనున్న పసివానికి సేవలు చేయుటకై ఏతెంచిన వాయువులా? అనువిధముగా ఆమెనిట్టూర్పులు ఒప్పారెను. కుక్షిలోపలనున్న కూనను అర్చించుటకై వచ్చిన భూదేవి (భూమి)యా? అనురీతి ఆమెలో మన్ను ప్రవేశించెను. (గర్భవతులు మన్ను తినుట లోకసహజము గదా!) కడుపులోనున్న బాలకునకు సేవలు చేయుటకై ఏతెంచిన గగనమాయనునట్లు ఆ దేవియొక్క సన్నని నడుము లావెక్కెను.

వ. తదనంతరంబ. 74

సీ. అతివకాంచీగుణం బల్లన బిగియంగ వైరివధూగుణవ్రజము వదలె
మెల్లన తన్వంగి మెయిదీవ మెరుఁగెక్క దుష్టాంగనాతనుద్యుతు లడంగె
నాతి కల్లన భూషణములు పల్చలుకగాఁ బరసతీభూషణపంక్తు లెడలెఁ
గలకంఠి కొయ్యన గర్భంబు దొడ్డగాఁ బరిపంథిదారగర్భములు వగిలెఁ

తే. బొలఁతికల్లన నీళ్లాడుప్రొద్దు లెదుగ, సహితవల్లభ లైదువలై తనర్చు
ప్రొద్దులన్నియుఁగ్రమమునఁబోవఁదొడఁగె, నువిదకడుపున నసురారి యుంటఁజేసి. 75

ఇది యిట్లుండగా అసురారియైన కన్నయ్య దేవకిగర్భమున ఉండుటవలన ఆ దేవియొక్క మొలనూలు బిగుతగుచుండగా శత్రువనితలయొక్క మంగళసూత్రములు జాఱిపోసాగెను, క్రమముగా ఆ దేవియొక్క శరీరకాంతులు హెచ్చగుచుండగా దుష్టులభార్యల తనుశోభలు సన్నగిల్లుచుండెను. ఆమెకు సొమ్ములపై అభిరుచి పెఱుగుచుండగా శత్రువనితలనగలు తమంతట తాము సడలిపోవుచుండెను. ఆ దేవియొక్క గర్భము పెఱుగు (పెద్దదియగు) చుండగా పరసతులకు గర్భస్రావములు అగుచుండెను. ఆ దేవకికి ప్రసవించుదినములు దగ్గఱపడుచుండగా శత్రువనితలు విధవలు అగు కాలము దగ్గఱగుచుండెను.

వ. ఇవ్విధంబున. 76

ఆ. జ్ఞానఖలునిలోనిశారదయునుబోలె, ఘటములోని దీపకళికవోలె
భ్రాతయింట నాఁకఁ బడియుండె దేవకీ, కాంత విశ్వగర్భగర్భ యగుచు. 77

ఈవిధముగా విశ్వమునే తనలోన నిలుపుకొనిన శ్రీహరిని తన కడుపున ధరించియున్నను దేవకి, జ్ఞానహీనుడైన మూర్ఖునిలోని విద్యవలెను, కుండలోనున్న దీపజ్వాల మాదిరిగను తన సోదరుడైన కంసుని యింట చెఱసాలలో మ్రగ్గుచుండెను. (ఆమె తన తేజస్సును లోకమునకు అందింపలేకుండెను).

వ. అంతనక్కాంతాతిలకంబునెమ్మొగంబుతెలివియును మేనిమెఱుంగును మెలంగెడి సొబగునుం జూచి వెఱఁగుపడి తఱచు వెఱచుచుఁగంసుండు తనలో నిట్లనియె. 78

రాజా! అంతట పుత్రలాభము కలుగనున్నందులకు సంతోషముతోనున్న దేవకియొక్క ముఖశోభను, శరీరకాంతిని, ఆమె కదలికలను గాంచి, కంసుడు ఆశ్చర్యము నొందుచు, మిగుల భయముతో తనలో ఇట్లు అనుకొనసాగెను.

క. కన్నులకుఁ జూడ బరువై, యున్నది యెలనాఁగగర్భముల్లము గలఁగన్
మున్నెన్నఁడు నిట్లుండదు, వెన్నుఁడు సొరఁబోలు గర్భవివరములోనన్. 79

ఉ. ఏమి దలంచువాఁడ నిఁక నెయ్యది కార్యము నాఁటినాఁటికిం
గామినిచూలు పెంపెసఁగె గర్భిణి జెల్లెలి నాఁడుపేద నే
నేమని చంపువాఁడఁ దగవేలని చంపితినేని శ్రీయును
ద్దామయశంబు నాయువును ధర్మమునుం జెడిపోవకుండునే. 80

క. వావి యెఱుంగనిక్రూరుని, జీవన్మృతుఁడనుచు నింద సేయుదు రతఁడుం
బోవును నరకమునకు దు,ర్భావముతో బ్రదుకు టొక్కబ్రదుకే తలఁపన్. 81

వ. అని నిశ్చయించి క్రౌర్యంబు విడిచి ధైర్యంబునొంది గాంభీర్యంబు వాటించి శౌర్యంబు ప్రకటించికొనుచు దిగ్గనం జెలియలిం జంపు నగ్గలిక యెగ్గని యుగ్గడించి మాని మౌనియుంబోలె నూరకుండియు. 82

"దేవకిని పరికించి చూడగా ఆమె కడుపు లావుగా కన్పించుచున్నది. ఇందులకు నా మనస్సు కలత చెందుచున్నది. ఇంతకుముందు ఎన్నడును ఇట్లు జరుగలేదు. బహుశా ఈమె గర్భములో శ్రీమహావిష్ణువు ప్రవేశించినట్లున్నది. ఇప్పుడు నాకు ఏమియు పాలుపోవుటలేదు. కర్తవ్యము తోచుటలేదు. నాటినాటికిని ఈ దేవియొక్క గర్భము పెద్దది యగుచున్నది.

ఆబలయైన ఈమె నాకు చెల్లెలు, పైగా గర్భవతి. నేను ఎట్లు చంపుదును? మంచిపెద్దల జోలికిపోక ఈమెను చంపినచో నా సంపదలును, ఘనకీర్తియు, ఆయుఃప్రమాణము, పుణ్యము దెబ్బతినునుగదా! బంధుభావమును (చెల్లెల అను మాటను) మఱచినట్టి క్రూరుని జీవన్మృతుడు అని లోకము నిందించును. అట్టివానికి నరకయాతనలు తప్పవు. అట్టివాని బ్రతుకుగూడ ఒక బ్రతుకేనా?" అని నిశ్చయించుకొనెను. పిదప అతడు క్రూరత్వమును మాని, ధైర్యము వహించి, గాంభీర్యమును ప్రదర్శించుచు (తన భావమును బయటపడనీయక) ఉండెను. ఇంకను అతడు శౌర్యమును ప్రకటించుకొనుచు, 'వెంటనే చెల్లెలిని చంపుట ప్రమాదకరము' అని భావించి, ఆ ప్రయత్నమును మానుకొని, మౌనము వహించియుండెను.

ఆ. పాపరాని దొడ్డ పగ పుట్టెనిఁక నెట్టు లిందుముఖికిఁ జక్రి యెపుడు పుట్టుఁ
బుట్టినపుడె పట్టి పురుటింటిలోఁ దెగఁ జూతు ననుచు నెదురు సూచుచుండె. 83

'వీరిపై ఏర్పడిన పగను నేను అణచుకొనలేకున్నాను. ఇకమీద ఏమగునో? ఆ శ్రీహరి ఈమెకడుపున ఎపుడు పుట్టునో? పుట్టిన వెంటనే ఆ పురిటింటిలోనే అతనిని నేను చంపివేయుదును' అని తలంచుచు అందులకై కంసుడు నిరీక్షింపసాగెను.

వ. మఱియు వైరానుబంధంబున నన్యానుసంధానంబు మఱచి యతండు. 84

క. తిరుగుచుఁ గుడుచుచుఁ ద్రాగుచు, నరుగుచుఁ గూర్చుండి లేచుచనవరతంబున్
హరిఁ దలఁచి తలచి జగ మా, హరిమయ మని చూచెఁ గంసుఁ డాఱనియలుకన్. 85

శ్రీహరిపైగల వైరకారణముగ అతనికి ఇతర ధ్యాసయే లేకుండెను. తిరుగుచున్నను, ఆహారమును తినుచున్నను, పానీయములను త్రాగునప్పుడును, అటునిటు కదలుచున్నను, కూర్చున్నను, లేచినను, ఇంత ఎందులకు నిరంతరము ఎంతకును చల్లారని పగతో అతడు శ్రీహరినే తలంచుచుండెను. 'ఈ జగత్తంతయు హరిమయమే' - అని అతనికి అనిపింపసాగెను.

వ. వెండియు. 86

సీ. శ్రవణరంధ్రముల నే శబ్దంబు వినఁబడు నది హరిరవ మని యాలకించు
నక్షిమార్గమున నెయ్యది చూడఁబడు నది హరిమూర్తి గానోపు నంచుఁ జూచుఁ
దిరుగుచో దేహంబుఁ దృణమైన సోఁకిన హరి కరాఘాతమో యనుచునులుకు
గంధంబులేమైన ఘ్రాణంబు సోఁకిన హరిమాలికాగంధ మనుచు నదరుఁ
ఆ. బలుకులెవ్వి యైనఁ బలుకుచో హరిపేరు వలుకఁబడియె ననుచు బ్రమసి పలుకుఁ
దలఁపులెట్టి వైనఁ దలఁచి యా తలఁపులు హరితలంపులనుచు నలుగఁ దలఁచు. 87

ఆ స్థితిలో కంసుడు తనకు ఏ శబ్దము వినిపించినను అది శ్రీహరియొక్క కంఠధ్వనియే యని చెవియొగ్గి వినుచుండెను, కనులకు ఏ రూపము కన్పించినను అది శ్రీమహావిష్ణుస్వరూపమే కాబోలునని పరికించి చూచుచుండెను, అతడు అటునిటు తిరుగుచున్నప్పుడు తనకు ఏ గడ్డిపోచ తాకినను అది శ్రీమన్నారాయణుని శరాఘాతమే కావచ్చునని ఉలిక్కిపడుచుండెను, సుగంధములు ముక్కుకు సోకినపుడు అవి శ్రీహరి కంఠమునందలి వనమాలికల పరిమళములే కాబోలునని అదఱిపడుచుండెను. ఎవరు ఏ మాటలను పలికినను అవి అన్నియును ఆ శ్రీహరి పలుకులే యనుచు భ్రమపడుచుండెను. ఆ కంసుడు తన మనస్సునకు ఏ తలంపులు వచ్చినను అవి ఆ శ్రీపతితలంపులేయని తలపోయుచు కుపితుడగుచుండెను.

వ. అయ్యవసరంబున, ననుచరసమేతులైన దేవతలును, నారదాది మునులునుంగూడి నడవ, నలువయును, ముక్కంటియు నక్కడకు వచ్చి, దేవకీ దేవి గర్భంబున నర్భకుండైయున్న పురుషోత్తము నిట్లని స్తుతియించిరి.88

ఆ సమయమున అనుచరసహితులైన దేవతలును, నారదాది మహామునులును అనుసరించుచుండగా బ్రహ్మయు, పరమశివుడును అచటికి ఏతెంచి, దేవకీదేవియొక్క గర్భమునందున్న పురుషోత్తముని ఇట్లు స్తుతించిరి.

## బ్రహ్మాది దేవతలు దేవకీ గర్భస్థుడగు శ్రీకృష్ణుని స్తుతించుట

సీ. సత్యవ్రతుని నిత్య సంప్రాప్తిసాధనుఁ గాలత్రయమునందుఁ గలుగువాని
భూతంబు లైదును పుట్టు చోటగువాని నైదుభూతంబులందమరువాని
నైదుభూతంబులు నడఁగిన పిమ్మటఁ బరఁగువానిని సత్యభాషణంబు
సమదర్శనంబును జరిపెడువానిని నిన్నాశ్రయింతుము నీ యధీన
ఆ. మాయచేత నెఱుక మాలిన వారలు పెక్కుగతులనిన్నుఁ బేరుకొందు
రెఱుఁగ నేర్చు విబుధులేక చిత్తంబున నిఖిలమూర్తులెల్ల నీవ యండ్రు. 89

"దేవాదిదేవా! నీవు సత్యసంకల్పుడవు, (నీ సంకల్పములకు తిరుగేయుండదు) సత్యాజీవనమే నిన్ను పొందుటకు మార్గము, నీవు త్రికాలములయందును (సృష్టిస్థితిలయకాలములయందును) వెలుగొందుచుందువు, నీవు పంచమహాభూతముల పుట్టుకకు కారణమైనవాడవు, ఆ పంచభూతములయందే వ్యాపించి యుందువు. పంచభూతములు అంతరించిన పిమ్మటగూడ (ప్రళయకాలమునందును) విలసిల్లుచుందువు, నీ వాక్కులు నిత్యసత్యములు, సకల ప్రాణులను సమానముగా చూచువాడవు, (సమదృష్టిగలవాడవు) అట్టి నిన్ను శరణుజొచ్చుచున్నాము. నీ మాయలోపడిన మూఢులు నిన్ను తమకు తోచినరీతిగా భావించుచుందురు. జ్ఞానులుమాత్రము నిశ్చలచిత్తులై అన్నిరూపములును నీవేయని తెలుపుచుందురు.

వ. అదియునుం గాక. 90

సీ. ప్రకృతియొక్కటి పాదు ఫలములు సుఖదుఃఖములు రెండు గుణములు మూఁడువేళ్లు
తగు రసంబులు నాల్గు ధర్మార్థ ముఖరంబు లెఱిఁగెడి విధములై దింద్రియంబు
లాఱు స్వభావంబులాశోకమోహాదు లూర్ములు ధాతువు లొక్కయేడు
పై పొర లెనిమిది ప్రంగలు భూతంబు లైదు బుద్ధియు మనోహంకృతులును
తే. రంధ్రములు తొమ్మిదియుఁ గోటరములు ప్రాణ పత్త్రదశకంబు జీవేశ పక్షి యుగము
గలుగు సంసారవృక్షంబుఁ గలుగఁజేయ గావ నడఁగింప రాజవొక్కరుఁడ వీవ. 91

క. నీదెసఁదమచిత్తములిడి, యే దెసలకుఁ బోక కడతు రెఱుక గలుగు వా
రాదూడయడుగు క్రియ నీ, పాదం బను నావకతవ భవసాగరమున్ 92

ఆ. మంచివారి కెల్ల మంగళప్రదలయ్యుఁ గల్లరులకు మేలు గానియట్టి
తనువులెన్ని యైనఁ దాల్చి లోకములకు సేమ మెల్లప్రొద్దుఁ జేయు దీవు. 93

అంతేగాక సంసారము (ప్రపంచము) అనెడి వృక్షమునకు ప్రకృతియే పాదు. (ఆలవాలము) సుఖదుఃఖములు రెండును దీనిఫలములు. సత్త్వరజస్తమోగుణములు మూడును దీనివ్రేళ్లు, ధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధ పురుషార్థములు దీనిరుచులు, త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములు అను పంచేంద్రియములు దీని జ్ఞానమును ఎఱుగు

సాధనములు, శోకము, మోహము, ముసలితనము, మృత్యువు, ఆకలి, దాహము అను ఆఱును దీని స్వభావములు. చర్మము, రక్తము, మాంసము, క్రొవ్వు, ఎముకలు, మజ్జ (ఎముకలయందుండు జిడ్డుపదార్థము) అను ఏడు ధాతువులును దీని పైపొరలు. పంచమహాభూతములు, బుద్ధి, మనస్సు, అహంకారము అను ఎనిమిదియు దీనికొమ్మలమొదళ్లు, నవరంధ్రములు దీని కోటరములు (తొఱ్ఱలు) దశప్రాణములు (ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానము లనెడి మహాప్రాణములు ఐదును, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయములు అను ఉపప్రాణములు ఐదును) దీని పత్రములు. జీవుడు, ఈశ్వరుడు (జీవేశ్వరులు) అను రెండును దీని పక్షులు. ఈ సంసారమనెడి (విశ్వమనెడి) వృక్షముయొక్క సృష్టిస్థితిలయముల నిర్వహణకు నీవే సమర్థుడవు. దేవా! ఈ సంసారము జననమరణములకు మూలము. నిత్యానిత్య వస్తువివేకముగల (పరబ్రహ్మము శాశ్వతము, తక్కిన ప్రపంచమంతయును నశ్వరము అని యెఱింగిన) జ్ఞానులు నీ యందే తమ చిత్తములను నిలిపి, ధ్యాసను మఱియొకవైపునకు పోనీయక నీ పాదములనెడి నావ సహాయమున (నీ అనుగ్రహ ప్రభావమున) ఈ సంసార సముద్రమును (గోష్పాదమునువలె అనాయాసముగా) దాటజాలుదురు. (మోక్షమును పొందుదురు). స్వామీ! లోకకల్యాణమునకై ఎల్లవేళల నీవు పెక్కు అవతారములను ఎత్తుచుందువు. అవి (ఆ అవతారములు) అన్నియును దుష్టులను శిక్షించుచు, సత్పురుషులను రక్షించుచుండును. నీవు అట్టి మహితాత్ముడవు.

క. ఎఱిఁగినవారల మనుచును, గొఱమాలిన యెఱుక లెఱిఁగి కొందఱు నీపే
రెఱిఁగియుఁ దలఁపఁగ నొల్లరు, పఱతురధోగతుల జాడఁ బద్మదళాక్షా! 94

క. నీవారై నీదెసఁదమ, భావంబులు నిలిపి ఘనులు భయవిరహితులై
యే విఘ్నంబులఁ జెందక, నీ వరలెడి మేటిచోట నెగడుదురీశా! 95

లోకములో మిడిమిడి జ్ఞానముగలవారు కొందఱు 'తాము సర్వజ్ఞులము' అని విఱ్ఱవీగుచుందురు. అట్టివారు నీ ప్రభావమును కొంత ఎఱింగియు నిన్ను ధ్యానించుటకు సిద్ధపడరు. వారు భ్రష్టులై కడకు అధోగతుల పాలగుదురు. పరమేశ్వరా! తత్త్వజ్ఞులు తమ సర్వస్వమును నీకే సమర్పించుకొనుచు నీయందే ఏకాగ్రచిత్తులై యుందురు. భయరహితులైన, అట్టి నీ అనన్యభక్తులకు ఎట్టి ఆపదలును కలుగవు. కడకు వారు నీవు విరాజిల్లుచుండెడి పరమపదమునకు చేరెదరు.

క. నిను నాలుగాశ్రమంబుల, జనములు సేవింప నఖిల జగముల సత్త్వం
బును శుద్ధంబును శ్రేయం, బును నగు గాత్రంబు నీవు వొందుదువు హరీ! 96

నీవు సమస్త లోకములకును శ్రేయస్సును చేకూర్చుటకై శుద్ధసత్త్వరూపమైన సచ్చిదానందమయమగు దివ్యమంగళ విగ్రహమును ప్రకటించుచుందువు. అట్టి నీ దివ్యమూర్తిని బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసాశ్రమములయందు ఉన్నవారు, వేదాధ్యయనము చేతను, యజ్ఞయాగాదులవలనను, అష్టాంగయోగసాధనమునను, తపస్సమాధులద్వారా నిన్ను ఆరాధించుచుందురు.

సీ. నళినాక్ష!సత్త్వ గుణంబు నీ గాత్రంబు కాదేని విజ్ఞానకలిత మగుచు
నజ్ఞాన భేదకం బగుటెట్లు గుణముల యందును వెలుఁగ నీ వనుమతింపఁ
బడుదువు సత్త్వరూపంబు సేవింపంగ సాక్షాత్కరింతువు సాక్షి వగుచు
వాఙ్మనసముల కవ్వలిదైన మార్గంబు గలుగు నీ గుణజన్మ కర్మ రహిత
తే. మైన రూపును పేరు నత్యనఘబుద్ధు లెఱుఁగుదురు నిన్నుఁగొల్వనూహించుకొనుచు
వినుచుఁదలఁచుచుఁ బొగడుచు వెలయువాఁడు భవము నొందఁడు నీ పాదభక్తుఁడగును. 97

కమలనేత్రా! నీ దివ్యమంగళ విగ్రహము సత్త్వగుణ శోభితము, అట్లుకానిచో విజ్ఞానమునకు నెలవై అజ్ఞానమును నశింపజేయుట అసంభవము. సమయానుగుణముగ నీవు రజస్తమోగుణములరూపములను కూడ అంగీకరింతువు. నీ సత్త్వరూపమును సేవించినవారికి సాక్షిభూతుడవై ప్రత్యక్షమగుచుందువు. నీ రూపము వాక్కునకును, మనస్సునకు అగోచరమైనది, త్రిగుణములకు అతీతమైనది, ఉత్పత్తి స్థితిలయములు లేనిది, నీవు నడిపెడి కర్మలన్నియును దివ్యములు, అట్టి నీ రూపమును, నామమును పవిత్రబుద్ధులు ఎఱుగుదురు. నిన్ను సేవింపదలంచుచు, నీ గాథలను ఆలకించుచు, నీ స్వరూపమును ధ్యానించుచు, నిన్ను ప్రస్తుతించుచు ఉండెడి నీ పాదసేవకుడు పునర్జన్మను పొందడు.

క. ధరణీభారము వాసెను, బురుషోత్తమ యీశ! నీదు పుట్టువున భవ
చ్చరణాంబుజముల ప్రాపున, ధరణియు నాకసముఁ గాంచెదము నీకరుణన్ 98

ఉ. పుట్టువులేని నీకభవ! పుట్టుట క్రీడయె కాక పుట్టుటే
యెట్టనుడున్ భవాది దశలెల్లను జీవులయం దవిద్య దాఁ
జుట్టుచు నుండుఁ గాని నినుఁ జుట్టినదిం బలెఁ బొంత నుండియుం
జుట్టఁగలేమిఁ దత్క్రియలఁ జొక్కని యొక్కటి వాఁడు వీశ్వరా! 99

పురుషోత్తమా! సర్వేశ్వరా! నీవు అవతరించుటవలన భూభారము తొలగిపోయినట్లే. నీ పాదములను ఆశ్రయించి, నీ అనుగ్రహమునకు పాత్రులమగుటచే భూమండలమును, ఆకాశమును (సకలలోకములను) నిష్కంటకముగా చూడగలము. (నీ అనుగ్రహముతో ముల్లోకములును నిష్కంటకములగును). అభవా! వాస్తవముగా నీవు జన్మాది వికారములు లేనివాడవు, నీ అవతారములు అన్నియును నీ క్రీడావిలాసములే. కనుక నీ పుట్టుటలు లోకసామాన్య వికారములు కలవికావు. జనులకు మాయాప్రభావమున పుట్టుటగిట్టుట మొదలగు దశలు కలుగుచుండును. నీవు మాయకు అధీనుడవుగావు, దానికి అతీతుడవు. వాస్తవముగా మాయయే నీ అధీనములో ఉండును. నీ అవతారములఆంతర్యములను ఎఱుంగలేనివారు జన్మాది వికారములను నీ యందు ఆరోపించుచుందురు. కావున ప్రభూ! యథార్థముగా నీవు అజుడవు.

మ. గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీనృకే
సరివై భిక్షుఁడవై హయాననుఁడవై క్ష్మాదేవతా భర్తవై
ధరణీనాథుఁడవై దయాగుణగణోదారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెదమిలాభారంబువారింపవే! 100

ప్రభూ! దయ మొదలైన ఉదాత్తగుణములుగలవాడవై, మహామత్స్యముగను, కూర్మముగను, దివ్యవరాహముగను, నరసింహుడుగను, వామనుడుగను, హయగ్రీవుడుగను, పరశురాముడుగను, శ్రీరాముడుగను అవతరించి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించుచు లోకములను కాపాడితివి. కావున మేము నీకు మ్రొక్కుచున్నాము. ఈ భూభారమును తొలగించి మమ్ములనందఱిని పరిరక్షింపుము.

క. ముచ్చిరి యున్నది లోకము, నిచ్చలుఁ గంసాదిఖలులు నిర్దయు లేఁచన్
మచ్చిగఁ గావఁగవలయును, విచ్చేయుము తల్లికడుపు వెడలి ముకుందా! 101

ముకుందా! క్రూరాత్ములైన కంసుడు మొదలగు దుష్టులు అనుక్షణము బాధించుచుండగా ఈ భూలోకము మిగుల కడగండ్ల పాలైయున్నది. కనుక వెంటనే ఈ భూతలమును అనుగ్రహముతో కాపాడవలయును. అందులకై దేవకీదేవి గర్భమునుండి వెలువడుము".

వ. అని మఱియు దేవకీదేవిం గనుంగొని. 102

మత్తకోకిలము. తల్లి! నీ యుదరంబులోనఁ బ్రధానపూరుషుఁడున్నవాఁ
డెల్లి పుట్టెడిఁ గంసుచే భయమింత లేదు నిజంబు మా
కెల్లవారికి భద్రమయ్యెడు నింక నీకడుపెప్పుడున్
జల్ల గావలె యాదవావళి సంతసంబును బొందఁగన్ 103

వ. అని, యివ్విధంబున హరింబొగడి, దేవకీదేవిని దీవించి దేవతలీశానబ్రహ్మల మున్నిడుకొని చని రంత.
104

అనంతరము బ్రహ్మాదిదేవతలు దేవకీదేవితో ఇట్లనిరి. "తల్లీ! నీ గర్భమునందు పురుషోత్తముడు (శ్రీమహావిష్ణువు) పెరుగుచున్నాడు. రేపు భూమికి అవతరించును. ఇక నీవు కంసునకు భయపడవలసిన పనియేలేదు. ఇది ముమ్మాటికి నిజము. మాకు అందఱికిని మేలగును. కలకాలము నీ కడుపు చల్లగానుండవలెను సకలయాదవులును సంతోషమును పొందుదురు". ఈ విధముగా శ్రీహరిని స్తుతించి, దేవకీదేవికి శుభాశీస్సులను పలికిన పిదప శంకరుడు, బ్రహ్మ మొదలగు దేవతలు తమ తమ స్థానములకు వెళ్లిరి.

# శ్రీకృష్ణావతార ఘట్టము

క. పంకజముఖి నీళ్ళాడను, సంకటపడ ఖలుల మానసంబులనెల్లన్
సంకటము దోఁచె మెల్లన సంకటములు లేమి దోఁచె సత్పురుషులకున్ 105

అనంతరము దేవకీదేవి ప్రసవవేదన పడుచుండగా కంసాదిదుష్టుల మనస్సులెల్లను మిగుల వేదనకు గుఱియగుచుండెను. దుష్టులను శిక్షించుట, శిష్టులను రక్షించుటద్వారా ధర్మపరిరక్షణగావించుటకై భగవంతుడు అవతరించుచున్న ఆ శుభసమయమున దేవతలు, ఋషులు మున్నగు పుణ్యాత్ముల మనస్సులు ఆహ్లాదపడసాగెను.

సీ. స్వచ్ఛంబులై పొంగె జలరాసు లేడును గల ఘోషణముల మేఘంబు లుఱిమె
గ్రహతారకలతోడ గగనంబు రాజిల్లె దిక్కులు మిక్కిలి తెలివిఁ దాల్చెఁ
గమ్మని చల్లని గాలి మెల్లన వీచె హోమానలంబు చెన్నొంది వెలిఁగెఁ
గొలఁకులు కమలాళి కులములై సిరి నొప్పెఁ బ్రవిమలతోయలై పాఱె నదులు
తే. వర పుర గ్రామ ఘోష యై వసుధ యొప్పె విహగరవ పుష్ప ఫలముల వెలసె వనము
లలరు సోనలు గురిసిరయ్యమరవరులు దేవదేవుని దేవకీదేవి కనఁగ. 106

క. పాడిరి గంధర్వోత్తము, లాడిరి రంభాది కాంతలానందమునం
గూడిరి సిద్ధులు, భయముల వీడిరి చారణులు, మొరసె వేల్పుల భేరుల్. 107

దేవకీదేవిపవిత్రగర్భమునుండి ఆ సర్వేశ్వరుడు అవతరింపనున్న ఆ వేళయందు సముద్రములన్నియు నిర్మలజలములతో పొంగిపొఱలసాగెను. అవ్యక్తమధురముగా మేఘములు గర్జించినవి. ఆకాశమునందు అంతటను చంద్రాదిగ్రహములు, నక్షత్రములు విరాజిల్లెను. సమస్త దిక్కులును ప్రసన్నములై విలసిల్లెను. సువాసనలను వెదజల్లుచు పిల్లగాలులు తిన్నగావీచెను. హోమాగ్నులజ్వాలలు ఆనందదాయకముగా ప్రజ్వలించుచుండెను. సరస్సులు వికసించిన కమలములతో, వాటిపై వాలుచున్న తుమ్మెదలతో కనువిందు గావించుచుండెను. సకల నదులును స్వచ్ఛములైన

మధురజలములతో ప్రవహింపసాగెను. గ్రామములయందును, నగరములయందును అంతటను ఆనందహేలలతో భూతలమంతయును దర్శనీయముగా నుండెను. వనములన్నియును పక్షుల కిలకిలారావములతో, చూడముచ్చటైన పూవులతో, పండ్లతో మనోహరముగా ఒప్పారెను. దేవతలందఱును పూలవాన కురిపించిరి. ఆ సమయమున మేటిగంధర్వులు ఎల్లరును హాయిగా గానము చేసిరి/రంభ మొదలగు అప్సరసలు మనోహరముగా నృత్యములొనర్చిరి, సిద్ధులెల్లరును ఆనందముతో ఒకచోటజేరి సంబరపడిరి, చారణులు భయరహితులైరి, దేవతల ఢంకానాదములు వెల్లివిరిసెను.

వ. అయ్యవసరంబున. 108

క. సుతుఁగనె దేవకి నడురే, యతి శుభగతిఁ దారలును గ్రహంబులు నుండన్
దితిసుత నిరాకరిష్ణున్, శ్రిత వదనాలంకరిష్ణు జిష్ణున్ విష్ణున్. 109

అట్టి శుభసమయమున అర్ధరాత్రియందు దేవకీదేవి శ్రీమన్నారాయణుని పుత్రునిగా గనెను. ఆ ప్రభువు దానవులమదములను అణచువాడు, తనను శరణుజొచ్చినవారిని ఆదుకొని వారి మనములలో ఆనందమును నింపెడివాడు, ఆ సర్వవ్యాపకుడు జయశీలుడు. ఆ స్వామి అవతరించినప్పుడు అశ్విని మొదలగు నక్షత్రములు, సూర్యచంద్రాది గ్రహములు ఉచ్చస్థానములలో శుభయోగకారకములై ఒప్పుచుండెను.

క. వెన్నునివతి ప్రసన్నునిఁ, గ్రన్నన గని మెఱుఁగుఁబోడి కడు నొప్పారెం
బున్నమనాఁడు కళానిధిఁ, గన్న మహేంద్రాశ చెలువు గలిగి నరేంద్రా! 110

పరీక్షిన్మహారాజా! ఆ దేవకీమాత తన బంగారుకడుపున అవతరించిన ఆ దివ్యశిశువుయొక్క ముద్దులొలికెడి ప్రసన్నవదనమును జూచి ఎంతయు పొంగిపోయెను. అప్పుడు ఆ దేవి పున్నమనాడు నిండుచంద్రుడు ఉదయించినప్పుడు వెలుగొందు తూర్పుదిక్కువలె విరాజిల్లెను.

వ. అప్పుడు. 111

సీ. జలధరదేహు నాజాను చతుర్బాహు సరసీరుహాక్షు విశాలవక్షుఁ
జారు గదా శంఖ చక్ర పద్మ విలాసుఁ గంఠకౌస్తుభమణి కాంతిభాసుఁ
గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు శ్రీవత్సలాంఛ నాంచితవిహారు
నురుకుండల ప్రభాయుత కుంతల లలాటు వైదూర్య మణిగణ వరకిరీటు
తే. బాలుఁ బూర్ణేందు రుచిజాలు భక్తలోకపాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్యమంది యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ డుత్సహించె 112

అప్పుడు ఆ శిశువుదేహము నీలమేఘకాంతులతో విలసిల్లుచుండెను. అతడు ఆజానుబాహువైయుండెను, కన్నులు పద్మశోభలను విరజిమ్ముచుండెను, వక్షఃస్థలము విశాలమైనది, ఆయనయొక్క నాలుగు చేతులయందును శంఖచక్రగదా పద్మములు శోభిల్లుచుండెను, కంఠమున కౌస్తుభమణి కాంతులీనుచుండెను. ఆ చిన్నారికి అలంకృతములైయున్న కటిసూత్రము, కంకణములు, భుజకీర్తులు కమనీయముగా ఉండెను. ఆ పాపనికి సహజమైన 'శ్రీవత్స' చిహ్నముయొక్క శోభలు అద్భుతములు, మేలైన కుండలములకాంతులు, అందములొలుకుచున్న ముంగురుల శోభలు మనోజ్ఞములు. కిరీటమునందలి వైడూర్యమణుల నిగనిగలు మిఱుమిట్లు గొలుపుచున్నవి, ఆ శిశువుయొక్క వెలుగులు నిండుచంద్రుని కాంతులవలె హాయిని గొలుపుచున్నవి, అతడు భక్తులపాలిటి కల్పతరువు, సద్గుణములకునిధి, కరుణామయుడు, ఆ

అద్భుతశిశువును చూచినంతనే వసుదేవుడు పులకించిపోయెను. ఆయనమనస్సు ఉబ్బితబ్బిబ్బయ్యెను, మిగుల ఆశ్చర్యపడెను. ఆయనలోని ఉత్సాహమునకు అవధులు లేకుండెను.

క. స్నానము సేయఁగ రామిని, నానంద రసాబ్ధి మగ్నుఁడై విప్రులకున్
ధేనువులం బదివేలను, మానసమున ధారవోసె మఱి యిచ్చుటకున్ 113

వసుదేవుడు చెఱసాలయందు ఉండుటచే స్నానము చేయుటకు అనుకూలమగుటవలన ఆనందరస సముద్రమునందే మ్రుంకులిడెను. బ్రాహ్మణులకు దానధర్మములను చేయుటకు అచట అనువుగాకుండుటచే అతడు తన మనస్సునందే వారికి పదివేల గోవులను ధారపోసెను.

వ. మఱియు వసుదేవుండు, 114

క. ఈపురిటి యింటి కుడ్య, ద్దీపంబును బోలెఁ జాల దీపించె నిజం
బీ పాపఁడు నలుమొగముల, యా పాపనిఁ గనినమేటి యగునని భక్తిన్. 115

ఆ. చాఁగి మ్రొక్కి లేచి సరగున నొసలిపైఁ గేలుఁదమ్మిదోయిఁ గీలుకొలిపి
పాపఁడనక వెఱక పాపని మొదలింటి పోకలెల్లఁ దలఁచి పొగడఁదొడఁగె. 116

ఇంకను వసుదేవుడు ఆ శిశువును గాంచుచు 'ఈ పాపడు ఈ పురిటింటికి అద్భుతమైన దీపమై వెలుగులను చిమ్ముచున్నాడు. ఇతడు సృష్టికర్తయైన ఆ బ్రహ్మదేవునకు జన్మను ఇచ్చిన శ్రీమహావిష్ణువే కావచ్చును' అని భావించెను. పిమ్మట అతడు భక్తితో ఆయనకు సాగిలపడి మ్రొక్కెను. లేచిన వెంటనే అతడు నొసటచేతులు జోడించి, అంజలి ఘటించెను. 'ఇతడు పసివాడు' (తనంకటె చిన్నవాడు) అని వెనుకాడక ఈ శిశువునకు మూలమైన శ్రీమహావిష్ణువుయొక్క లక్షణముల తీరుతెన్నులను అన్నింటిని గుర్తునకు తెచ్చుకొని, వసుదేవుడు ఇట్లు ప్రస్తుతి చేయసాగెను.

క. ఏ నిన్ను నఖిల దర్శను, జ్ఞానానంద స్వరూపు సంతతునపరా
ధీనుని మాయాదూరుని, సూనునిఁగాఁ గంటి నిట్టి చోద్యము గలదే! 117

క. అచ్చుగ నీ మాయను మును, వెచ్చెరఁ ద్రిగుణాత్మకముగఁ జేసిన జగముం
జొచ్చిన క్రియఁ జొరకుందువు, చొచ్చుటయును లేదు లేదు చొరకుండుటయున్. 118

"ప్రభూ! నీవు సమస్తలోకములను దర్శింపగలవాడవు, స్వచ్ఛమైన జ్ఞానమునకు ఆకృతివి, ఆనందస్వరూపుడవు, శాశ్వతుడవు, సర్వస్వతంత్రుడవు (పరబ్రహ్మవు), మాయకు అతీతుడవు, అట్టి నీవు నాకు పుత్రుడవగుట చోద్యముగా (ఆశ్చర్యకరముగా) ఉన్నది. నీ యోగమాయచేత ఈ జగత్తును త్రిగుణాత్మకములైన (సత్త్వరజస్తమోగుణమిశ్రితముగ) సకలప్రాణులను సృజించితివి. నీవు వాటియందు ప్రవేశించి యున్నట్లుగా భాసిల్లుచుందువు, కాని యథార్థముగా వాటికి అతీతుడవైయుందువు. స్పష్టముగా చెప్పవలెనన్న నీవు వాటియందు ప్రవేశించినట్లున్నను, ఆ సత్త్వరజస్తమోగుణములు నీకు ఏ మాత్రమూ అంటవు.

సీ. అదియు నెట్లన మహదాదులఁ బోలెడిదై వేఱు వేఱ యై యన్ని విధము
లగు సూక్ష్మభూతంబు లమర షోడశ వికారములతోఁ గూడి విరాట్టనంగఁ
బరమాత్మునకు నీకుఁ బఱపైన మేను సంపాదించి యందులోఁ బడియుఁ బడక
యుండు సృష్టికి మున్న యున్న కారణమున వానికి లోని భవంబు గలుగ

ఆ. దట్లు బుద్ధి నెఱుఁగ ననువైన లాగునఁ గలుగు నింద్రియముల కడలనుండి
వాని పట్టులేక వరుస జగంబులఁ గలసియుండి యైనఁ గలియ వెపుడు. 119

శ్రీహరీ! నీచే సృజింపబడిన ప్రపంచమునందు నీవు ప్రవేశించియు, ప్రవేశింపకయుండుట ఎట్లనగా అవ్యక్తమైన నీనుండియే మహత్తత్త్వము ఉత్పన్నమగుచున్నది. దానినుండి అహంకారము, అహంకారమునుండి పంచతన్మాత్రలు (శబ్దస్పర్శరూపరసగంధములు) వాటినుండి పంచమహాభూతములు కలుగుచున్నవి. ఇవి యన్నియును మహదాదులుగా పేర్కొనబడినవి.[1] ఈ మహదాదులు షోడశ వికారములతో (పంచప్రాణములు, పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, అంతఃకరణము - అను పదునాఱు వికారములతో) గూడి విరాట్స్వరూపము (విస్తృతమై ప్రపంచము) నీవలననే ఏర్పడుచుననది. ఈ విరాట్స్వరూపము నీకు మేనుగా ఒప్పుచున్నది. నీవు ఈ విరాడ్రూపమునందు ఉండియు దీనికి వెలుపల (దీనికి అతీతుడవుగా) వెలుగుచుందువు. నీవు ఈ మహదాదులకంటెను ముందు ఉన్నందున వీటికివలె నీకు జన్మంబులేదు - ఈ విషయములను ఇట్లు తెలిసికొనుటకును, ఊహించుటకును అనువగువిధముగా చతుర్దశేంద్రియములకు అతీతుడవై యుందువు. చతుర్దశభువనములలో ఉండియు, వాటికి అతీతుడవుగా ఉందువు.

క. సర్వము నీ లోనిదిగా, సర్వాత్ముఁడ వాత్మవస్తు సంపన్నుఁడ వై
సర్వమయుఁడ వగు నీకును, సర్వేశ్వర! లేవు లోను సందులు వెలియున్ 120

సర్వేశ్వరా! ఈ ప్రపంచము అంతయును నీలోనే విలసిల్లుచున్నది. అంతటను నీవే వ్యాపించియున్నావు. సర్వపరిపూర్ణుడవైన నీకు పుట్టుక, ఉనికి, మృత్యువు అనునవిలేవు.

ఆ. ఆత్మవలనఁ గలిగి యమరు దేహాదుల నాత్మకంటె వేఱులవి యటంచుఁ
దలఁచువాఁడు మూఢతముఁడు గావున నీశ! విశ్వమెల్ల నీవ వేఱు లేదు. 121

సర్వేశ్వరా! 'చరాచరాత్మకమైన ప్రాణులన్నియు పరమాత్మవైన నీవలననే సృష్టింపబడుచున్నవి. అవి యన్నియును నీ కంటె (పరమాత్మకంటెను) వేఱు! అని పలుకువాడు మూర్ఖుడు; తర్కించిచూడగా విశ్వమంతయును నీవే, (సర్వం ఖల్విదం బ్రహ్మ) నీ కంటె వేఱైనది ఏదియునులేదు.

వ. అదియునుం గాక. 122

సీ. గుణము వికారంబుఁ గోరిక యును లేని నీవలన జగములు నెఱి జనించుఁ
బ్రబ్బు లేదగు నంచుఁ బలుకుట దప్పుగా దీశుండవై బ్రహ్మమీవ యైన
నినుఁ గొల్చు గుణములు నీ యానతులు సేయ భటుల శౌర్యంబులు పతికి వచ్చు
పగిది నీ గుణముల బాగులు నీవని తోఁచును నీ మాయతోడఁ గూడి
ఆ. నీవు రక్త ధవళ నీల వర్ణంబుల జగము సేయఁ గావ సమయఁ జూడఁ
దనరుదట్లు నేఁడు దైత్యుల దండింపఁ బృథివిఁ గావ నవతరించి తీశ! 123

ప్రభూ! నీవు సత్త్వరజస్తమోగుణములుగాని, జననమరణాది వికారములుగాని, ఎట్టి కోరికలునుగాని లేనివాడవు. (నీవు నిర్గుణుడవు, నిర్వికారుడవు, నిత్యతృప్తుడవు) 'అట్టి నీ వలన ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయములు జరుగుచున్నవి' అని పల్కుట తప్పుగాదు. త్రిగుణములు పరబ్రహ్మవైన నీ ఆనతిప్రకారమే ఈ జగత్తున ప్రవర్తిల్లుచుండును. భటుల

1. బ్రహ్మణోఽవ్యక్తః, అవ్యక్తాన్మహతః (అవ్యక్తాత్ - మహతః), మహతోఽహంకారః, అహంకారాత్ పంచతన్మాత్రాణి, పంచతన్మాత్రేభ్యో పంచమహాభూతాని - పంచమహాభూతేభ్య అఖిలం జగత్ - శ్రుతిప్రమాణమ్.

శౌర్యాదిలక్షణములు అన్నియును రాజునందే ఆపాదింపబడుచుండునట్లు, 'ఈ గుణముల వైభవములు అన్నియును నీకు చెందినవే' అని తోచుచుండును. నీవు నీ మాయతోడగూడి సత్త్వరజస్తమోగుణాత్మకమైన జగత్తును సృజించి, పాలించి, లయింపజేయుచుందువు. కావున దేవా! నీవు దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపన చేయుటకై అవతరించితివి.

శా. మింటన్ మ్రోసిన మ్రోఁత దాలిమిని లో మేంౘింప మున్నీవు నా
యింటం బుట్టెద వంచుఁ గంసుఁడు దొడిన్ హింసించె నీ యన్నలం
గంటం గూరుకుఁ డేఁడు నీ యుదయమీకారాజనుల్ చెప్పఁగాఁ
బంటింపం డెదురేఁగుదెంచు వడి నీపై నేఁడు సన్నద్ధుఁడై. 124

స్వామీ! ఇంతకుముందు ఆకాశవాణి 'నీవు నా ఇంటిలో (మా దంపతులకు) కుమారుడవై అవతరించి కంసుని సంహరింతువు' అని పలికినది. ఆ పలుకులను వినినంతనే కంసుడు సహనమును కోల్పోయెను. అందువలన అతడు క్రోధముతో నీ అన్నలను చంపివేసెను. అప్పటినుండియు అతనికంటికి కునుకు లేకుండ పోయినది. నీవు అవతరించిన విషయమును ఈ చెఱసాలవారు అతనికి తెలుపుదురు. వెంటనే ఏ మాత్రము జాగుసేయక, అతడు నిన్ను చంపుటకు సంసిద్ధుడై ఇచటికి రావచ్చును'.

## దేవకీదేవి స్వామిని స్తుతించుట

వ. అనుచుండ దేవకీదేవి మహాపురుష లక్షణుండును, విచక్షణుండును, సుకుమారుండును నైన కుమారునిం గని, కంసునివలని వెఱపున శుచిస్మితయై యిట్లనియె. 125

వసుదేవుని పలుకుల అనంతరము దేవకీదేవి, సర్వజ్ఞుడు, సుకుమారుడు ఐన తన కుమారునివైపు చూచెను. అప్పుడు ఆ ప్రభువు శంఖ చక్ర గదా పద్మవనమాలా విభూషితుడైన పురుషోత్తముడుగా గోచరించెను. కంసునివలన ఆ శిశువునకు ప్రమాదము కలుగునని భయపడుచున్నను భగవంతుడు తనకు కుమారుడై పుట్టెనను సంతోషముతో ఆ దేవకి మందహాసముతో ఇట్లనెను.

సీ. అట్టిట్టి దనరానిదై మొదలై నిండుకొన్న దై వెలుఁగుచు గుణము లేని
దై యొక్క చందంబుదై కలదై నిర్విశేషమై క్రియలేక చెప్పరాని
దే రూప మని శ్రుతు లెప్పుడు వొడివెడి నా రూప మగుచు నధ్యాత్మదీప
మై బ్రహ్మ రెండవ యర్థంబు తుది జగంబులు నశింపఁగఁ బెద్ద భూత గణము.
ఆ. సూక్ష్మ భూతమందుఁ జొరఁగ నా భూతంబు ప్రకృతిలోనఁ జొరఁగఁ బ్రకృతి వోయి
వ్యక్తమందుఁ జొరఁగ వ్యక్త మడంగను శేషసంజ్ఞ నీవు చెలువమగుదు 126

"దేవా! నీ రూపమును, 'ఇట్టిది-అట్టిది' అని వర్ణించుట అసాధ్యము. అది సృష్టికి మూలమైనది, అంతటను వ్యాపించి వెలుగొందునది, సత్త్వరజస్తమోగుణముల స్పర్శలేనిది, సర్వకాలములయందును వృద్ధిక్షయాది వికారములు లేనిది, శబ్దస్పర్శాది పంచతన్మాత్రల ఊసులులేనిది, పుణ్యాపాపక్రియలు లేనిది, వాక్కునకు, మనస్సునకు అందనిది, (అవాఙ్మానసగోచరమైనది) శ్రుతులు (వేదములు) సైతము నీ రూపము వర్ణించుటకు అలవికానిదని నుడువుచున్నవి. ఈ రూపము దివ్యమైన ఒక ఆధ్యాత్మిక తేజస్సు, (అలౌకికమైన నీ రూపమును ఆత్మజ్ఞానియే దర్శింపగలడు), చతుర్ముఖ బ్రహ్మయొక్క ద్వితీయ పరార్ధమునకు అంత్యమున జగములన్నియు నశించును. పంచమహాభూతములైన పృథివ్యాపస్తేజోవాయురాకాశములు సూక్ష్మభూతము నందు (అహంకారమునందు) ప్రవేశించును, ఆ సూక్ష్మభూతము మూలప్రకృతియందు (మహత్తత్త్వమునందు) లయమును పొందును. ఆ మహత్తత్త్వము వ్యక్తమునందు లీనమగును. ఆ

వ్యక్తముగూడ అవ్యక్తములో (భగవత్తత్త్వంలో) విలీనముచెందును, అప్పుడు పరబ్రహ్మమైన నీవు 'శేషసంజ్ఞ'తో విరాజిల్లుచుందువు.

ఉ. విశ్వము లీలఁ ద్రిప్పుచు నవిద్యకుఁ జుట్టమవైన నీకుఁ దా
శాశ్వత మైన కాలమిది సర్వము వేడబమందు రట్టి వి
శ్వేశ్వర! మేలుకుప్ప నిను నెవ్వఁడు గోరి భజించువాఁడె పో
శాశ్వత లక్ష్మి మృత్యుజయ సౌఖ్యయుతుం డభయుండు మాధవా! 127

మాధవా! నీవు విశ్వేశ్వరుడవు, శుభములకు పెన్నిధివి. ప్రళయానంతరము ఈ విశ్వమును సృష్టి స్థితి లయముల రూపములో లీలగా త్రిప్పుచుందువు. సకల ప్రాణులు నీ మాయకులోనై పరిభ్రమించుచుండును. యథార్థముగా నీవు జన్మలేనివాడవు. కానీ లోకకల్యాణమునకై అవతారములను దాల్చుట నీకొక 'వేడుక' అని విజ్ఞులు పేర్కొనుచుందురు. త్రికరణశుద్ధిగా అనన్యభక్తితో నిన్ను సేవించువాడే నిర్భయుడై మృత్యువును జయించును, శాశ్వతమైన పరమపద సౌఖ్యమును అనుభవించును.

మత్తకోకిలము. ఒంటి నిల్చి పురాణయోగులు యోగమార్గ నిరూఢులై
కంటిమందురు కాని నిక్కము కానరీభవదాకృతిం
గంటి భద్రముఁ గంటి మాంసపుఁ గన్నులం గనఁబోలదీ
తొంటి రూపుఁ దొలంగఁబెట్టుము తోయజేక్షణ! మ్రొక్కెదన్. 128

కమలాక్షా! పూజ్యులైన ప్రాచీన మహాయోగులు ఏకాంతప్రదేశమున నిలిచి, తపస్సమాధులద్వారా 'నిన్ను చూచినట్లుగా' పలుకుచుందురు. కాని నిజముగా నీ అలౌకిక రూపమును చూచియుండరు. కల్యాణప్రదమైన నీ దివ్యాకృతిని నా చర్మచక్షువులతో దర్శింపగలిగితిని. వాస్తవముగా నీ చతుర్భుజరూపమును చూచుట అసాధ్యము. కనుక ఈ రూపమును ఉపసంహరించి, లౌకిక శిశువుగా మాఱుము. నీకు నేను ప్రణమిల్లుచున్నాను.//

ఆ. విలయకాలమందు విశ్వంబు నీ పెద్ద కడుపులోన దాఁచు కడిమి మేటి
నటుఁడ వీవు నేఁడు నా గర్భజుఁడ వౌట పరమపురుష! వేడబంబు గాదె. 129

పురుషోత్తమా! నీవు ప్రళయకాలమునందు ఈ సమస్త విశ్వమును అద్భుతమైన నీ పొట్టలో దాచుకొనగల సమర్థుడవైన మేటినటుడవు. అట్టి నీవు నా గర్భమునుండి అవతరించుట నీకు ఒక లీలావిలాసమేగదా!

తరలము. నలినలోచన! నీవు నిక్కము నాకుఁ బుట్టెద వంచు నీ
ఖలుఁడు కంసుఁడు పెద్దకాలము కారయింట నడంచె దు
ర్మలినచిత్తుని నాజ్ఞ సేయుము మమ్ముఁ గావుము భీతులన్
నులుసులేక ఫలించె నోఁచిననోము లెల్లను నీవయై. 130

పద్మనేత్రా! నీవు నిజముగా నీవు నాకు పుత్రుడవై జన్మించెదవని తలచి, దురాత్ముడైన ఈ కంసుడు మమ్ములను చాలకాలమునుండి ఈ చెఱసాలలో బంధించియుంచెను. దుష్టస్వభావముగల ఈ కంసుని శిక్షించుము, భయముతో వణకిపోవుచున్న మమ్ము కాపాడుము. నీవు నాకు కుమారుడవై జన్మించుటవలనను నేను నోచిన నోములన్నియు పూర్తిగా ఫలించినవి.

## దేవకీవసుదేవుల పూర్వజన్మ వృత్తాంతము

వ. అని యిట్లు దేవకీదేవి విన్నవించిన,నీశ్వరుం డిట్లనియె. అవ్వా! నీవు తొల్లి స్వాయంభువ మన్వంతరంబునఁ బృశ్ని యను పరమపతివ్రతవు. వసుదేవుండును సుతపుండను ప్రజాపతి. మీరిరువురును సృష్టికాలంబున బ్రహ్మపంపునం బెంపున నింద్రియంబుల జయించి, తెంపున వాన గాలి యెండ మంచులకు సైరించి, యేకలములయి యాకలములు దిని, యే కలంకంబును లేక, వేంద్రంబుగఁ బండ్రెండువేల దివ్యవర్షంబులు తపంబులుసేసిన నెపంబున మీ రూపంబులు మెఱయ నోజ, నా జపంబులు సేసి, డాసి, పేర్చి, యర్చింప, మీకు నాకు గలరూపుఁ జూపి, యేను దిరంబులగు వరంబులు వేఁడుం డనిన, మీరు నా మాయం బాయని మోహంబున, బిడ్డలు లేని దొడ్డ యడ్డంబున, దుర్దమం బగు నపవర్గంబుఁ గోరక, నా యీడు కొడుకు నడిగిన మెచ్చి, యట్ల వరం బిచ్చి, మీ కేను బృశ్ని గర్భుండన నర్భకుండ నయితి. మఱియును 131

దేవకీదేవి ఆ అలౌకిక శిశువునకు ఇట్లు విన్నవించుకొనిన పిదప ఆ పరమపురుషుడు ఇట్లు నుడివెను. "తల్లీ! లోగడ స్వాయంభువ మన్వంతరమునందు నీవు 'పృశ్ని' అను పరమసాధ్వివి. వసుదేవుడు 'సుతపుడు' అను ప్రజాపతి. సృష్ట్యాదియందు మీరు ఇరువురును బ్రహ్మయొక్క ఆదేశానుసారము పూర్తిగా జితేంద్రియులై పండ్రెండువేల దివ్య సంవత్సరములు ఒంటరిగా తీవ్రముగా ఎట్టి లోపమునకును తావీయక తపస్సొనర్చితిరి. తపస్సు చేయుసమయమున వానలకు, గాలులకు, ఎండలకు, మంచులకు తట్టుకొని, ఆకులలములను ఆహారముగా స్వీకరించితిరి. ఆ కారణముగా మీ రూపములు దివ్యములై ప్రకాశించెను. క్రమముగా ఏకాగ్రచిత్తులై జపించి, నన్ను అర్చించితిరి. అంతట నేను ప్రత్యక్షమై మీకు నా నిజరూపమును జూపి 'వరంబులు వేడుడు' అని పలికితిని. అప్పుడు మీరు నా మాయలోబడుటచే దుర్లభమైన మోక్షమును గోరక, సంతానములేదను తీవ్రమైన బెంగతో నాతో సమానుడను కొడుకును కోరుకొంటిరి. అందులకు నేను మెచ్చుకొని 'అట్లే' అని వరమును ఇచ్చితిని. 'పృశ్ని గర్భుడు' అను పేరుతో మీకు పుత్రుడనైతిని.

క. అదితియుఁ గశ్యపుఁడును నన, విదితులరగు మీకుఁ గుఱుచవేషంబున నే
నుదయించితి వామనుఁడనఁ, ద్రిదశేంద్రానుజుఁడనై ద్వితీయభవమునన్. 132

క. ఇప్పుడు మూఁడవ బామునఁ, దప్పక మీ కిరువురకునుఁ దనయుఁడ నైతిం
జెప్పితిఁ బూర్వము మీయం, దెప్పటికిని లేదు జన్మమిటపై నాకున్. 133

తదుపరి మీరు అదితి, కశ్యపుడు అను పేర్లతో ప్రసిద్ధికెక్కితిరి. అప్పుడు నేను మీకు పొట్టివాడనై 'వామనుడు' అను పేరుతో పుత్రుడనై, దేవేంద్రునకు తమ్ముడనై వాసిగాంచితిని. అది నా రెండవజన్మ. అప్పుడు ఇచ్చిన వరము ప్రకారము ఈ మూడవ జన్మమున మీకు తనయుడనైతిని. మీ పూర్వజన్మముల వృత్తాంతమును, నా అవతార విశేషమును తెలిపితిని. ఇకమీదట మీయందు నాకు జన్మమే యుండదు.

క. నందనుఁడనియుం బరమా, నందంబగు బ్రహ్మమనియు ననుదలఁచుచు నా
పెందెరువు నొందెదరు, నా, యందలి ప్రేమమున భవమునందరు మీరల్. 134

మీరు నన్ను పుత్రుడనియు, పరమానందదాయకమైన 'బ్రహ్మము' అనియు భావించుచు నా పరమపదమును చేరెదరు. నాపైగల అనన్యభక్తి కారణముగా మీకు ఇకమీదట పునర్జన్మ ఉండదు.

వ. అని యిట్లు పలికి, యీశ్వరుండారూపంబు విడిచి. 135

క. జెప్పలిడక తలిదండ్రులు, దప్పకఁ దనుఁజూడ మాయఁ దనరి లలితుఁడై
యప్పుడటు గన్న పాపని, యొప్పున వేడుకలు సేసె నొకకొన్ని నృపా! 136

వ. అంత వసుదేవుండు తనకుం జేయవలసిన పనులీశ్వరుండైన హరివలన నెఱింగినవాఁడుఁ గావున. 137

పరీక్షిన్మహారాజా! అట్లు పలికిన పిమ్మట ఆ ప్రభువు తన చతుర్భుజరూపమును ఉపసంహరించుకొనెను. దేవకీ వసుదేవులు కన్నులప్పగించి, తదేకదృష్టితో చూచుచుండగా ఆ స్వామి తన అధీనములోనున్న మాయను అంగీకరించి, అప్పుడే పుట్టిన పసిపాపని రూపమును దాల్చెను, ఆ విధముగా కొన్ని లీలలను ప్రదర్శించెను. వసుదేవుడు తాను చేయవలసిన కార్యములను గూర్చి సర్వేశ్వరుడైన శ్రీహరివలన తెలిసికొనియుండెను, అందువలన వాటిని నడపుటకు ఉద్యుక్తుడయ్యెను.

క. ఆ పురిటి యిల్లు వెలువడి, పాపనిఁ దరలించుకొనుచుఁ బఱచెద ననుచున్
రూపింప నందుభార్యకుఁ, బాప యగుచు యోగమాయ ప్రభవించె నృపా! 138

వ. అ య్యవసరంబున 139

క. బిడ్డనిఁ గరముల ఁొమ్ముమ్న, నడ్డంబుగఁ బట్టి పదములల్లన యిడుచున్
జడ్డనఁ గావలివారల, యొడ్డు గడచి పురిటిసాల యొయ్యన వెడలెన్ 140

రాజా! అతడు ఆ పురిటినుండి (చెఱసాలనుండి) బయటపడి శిశువును త్వరగా తీసికొనిపోవుటకు నిశ్చయించుకొనెను. అదే సమయమున యోగమాయ వ్రేపల్లెలో నున్న నందుని భార్యయగు యశోదాదేవికి పాపయై జన్మించెను. ఆ సమయమున వసుదేవుడు తమ దివ్యశిశువును (చిన్నికృష్ణుని) తన చేతులలోనికి తీసికొని, గుండెలకు హత్తుకొని, అడుగుల సవ్వడి వినబడకుండునట్లు మెల్లగా నడచుచు కావలివాళ్లు ఎఱుంగని రీతిగా ఆ చెఱసాలనుండి ప్రయాణమయ్యెను.

వ. అంత నట. 141

క. నందుని సతికి యశోదకుఁ, బొందుగ హరియోగమాయ పుట్టిన మాయా
స్పందమున నొక్క యెఱుఁగమి, క్రందుకొనియె నూరివారిఁగావలివారిన్. 142

అప్పుడు వ్రేపల్లెలో నందుని ఇల్లాలగు యశోదకు శ్రీహరియొక్క మాయాశక్తి ఆడుశిశువై జన్మించిన సమయమున ఆ ఊరివారిని, చెఱసాలకావలివారిని మైకము ఆవరించెను.

వ. అప్పుడు చప్పుడుగాకుండఁ దప్పటడుగులిడుచు, నినుపగొలుసుల మెలుసులు వీడినఁ దాలంబులు మహోత్తాలుండయిన బిడ్డనికి నడ్డంబు గాక కీలూడి వీడిపడి, యరళంబులు విరళంబులైన సరళంబులగు మొగసాలలం గడచి, పాఁపతేఁడు వాకిండ్లు మరల మూయుచుఁ, బడగ లెడగలుగ విప్పి, కప్పి, యేచి, కాచికొని వెంటనంటిరాఁగ దూఁగి నడుచునెడ. 143

క. ఆ శౌరికిఁ దెరు, వొసఁగెఁ బ్ర, కాశోద్ధత తుంగ భంగ కలిత ధరాశా
కాశ యగు యమున మును సీ, తేశునకుఁ బయోధి త్రోవ యిచ్చిన భంగిన్ 144

వ. ఇట్లు యమున దాఁటి, దూఁటి చని, నందునిమందం జేరి, యందమందనిద్రం బొంది, యొడ లెఱుంగని గొల్లలం దెలుప నొల్లక, నిత్యప్రసాద యగు యశోదశయ్య నొయ్యన చిన్ని నల్లనయ్య నునిచి, చయ్యన న య్యవ్వకూఁతు నెత్తుకొని, మరల నింటికిఁ బంటింపక వచ్చి, యచ్చెఱుతపాపను దేవకి ప్రక్కం జక్కనిడి.145

వసుదేవుడు శిశువుతోగూడి ఏమాత్రమును చప్పుడు కాకుండ తిన్నగా అడుగులు వేయుచు కదలెను. అప్పుడు ఇనుపసంకెళ్ల బంధములు తొలగిపోయెను. తలుపులతాళములు వీడిపోయెను, తలుపులు తెఱచుకొనెను. ఇట్లు ఆ దివ్యశిశువునకు అడ్డంకులు తొలగెను. వసుదేవుడు విశాలమైన వసారాలు దాటుచున్నంతలో ఆదిశేషుడు చెఱసాల తలుపులను మూసివేసి, తన పడగలను వెడల్పుగా విప్పి, శిశువునకు రక్షణగా కప్పెను. ఈ విధముగా ఆదిశేషుడు వెంటవచ్చుచుండగా వసుదేవుడు ముందునకు సాగుచుండెను. అప్పుడు యమునానది ఎగసిపడుచున్న తన తరంగముల కాంతులను సకలదిశలయందును, భూమ్యాకాశములయందును నింపుచు ఒప్పుచుండెను. ఉద్ధృతముగా నున్న ఆ యమునా తరంగిణి, పూర్వము శ్రీరాముడు లంకకు చేరుటకు అనువుగా సముద్రమువలె, తాను వసుదేవునకు దారి ఇచ్చెను. అంతట వసుదేవుడు యమునానదిని దాటి, త్వరత్వరగా వ్రేపల్లెలో ప్రవేశించెను. అప్పుడు అచటి యాదవులు ఎల్లరును గాఢనిద్రలో మునిగియుండిరి. వారికేమాత్రమును తెలియకుండ వసుదేవుడు ఎల్లప్పుడును ప్రసన్న ముఖముతో నుండెడి యశోదయొక్క పాన్పునందు తిన్నగా తన చేతులలోనున్న చిన్నారి కృష్ణుని ఉంచెను. అనంతరము ఆమె కూతురైన యోగమాయను ఎత్తుకొని, మఱల త్వరత్వరగా చెఱసాలకు చేరెను, ఆ పసిపాపను దేవకీదేవి ప్రక్కన పరుండబెట్టెను.

క. పదముల సంకెల లిడుకొని, మదిఁ దలఁకుచు శూరసుతుఁడు మందుఁడు వోలెన్
బెదరుగల రీతి దేహము, గదలించుచు నొదిఁగియుండె గఱువతనమునన్. 146

పిమ్మట శూరుని కుమారుడైన వసుదేవుడు తన కాళ్లకు సంకెళ్లను తగిలించుకొనెను, మనస్సున తత్తరపాటు ఉన్నను, ఏమియు ఎఱుగని వానివలె బెదరుగలవానిగా దేహమును కదలించుచుండెను, కాని అతడు పైకి గంభీరముగా ఒదిగియుండెను.

క. వనజాక్షునిఁ దెచ్చుటయును, దనసుతఁ గొనిపోవుటయును దా నెఱుఁగక మూఁ
గిననిద్రఁ జొక్కియుండెను, వనజాక్షి యశోద రేయి వసుధాధీశా! 147

మహారాజా! ఆ రాత్రివేళ యశోదాదేవి గాఢనిద్రలో మునిగియున్న కారణముగా వసుదేవుడు శ్రీకృష్ణుని తన శయ్యయందు చేర్చుటయు, తన కుమార్తెను తీసికొనిపోవుటయు ఎఱుగకుండెను.

సీ. అంత బాలిక యావురని యేడ్చు చిఱుచప్పు డాలించి వేగన నాకఁయింటి
కావలివారు మేల్కని చూచి తలుపులతాళముల్ తొంటివిధమున నుండఁ
దెలిసి చక్కన వచ్చి దేవకి నీళ్ళాడె రమ్ము రమ్మని భోజరాజుతోడఁ
జెప్పిన నాతఁడు సిడిముడిపాటుతోఁ దల్పంబుపై లేచి తత్తఱమున
తే. వెండ్రుకలు వీడఁబైచీర వ్రేలియాడ దాల్మి కీలూడ రోషాగ్ని దర్పమాడ
భూరి వైరంబుతోఁ గూడఁ బురిటియింటి జాడఁ జనుదెంచి యా పాపఁ జంపఁ గదియ. 148

చెఱసాలకు చేరిన ఆ పసిబాలిక ఆవురుమని ఏడ్చెను. ఆ చిన్నిరోదనధ్వనిని వినిన వెంటనే కావలివారికి మెలకువవచ్చెను. వారు నలువైపుల యందును పరికించి చూచిరి, తలుపులతాళములు ఎప్పటివలె వేసియుండుటను గమనించిరి. వెంటనేవారు కంసుని కడకు వచ్చి, దేవకీదేవి ప్రసవించినది. త్వరగా విచ్చేయుము' అని పలికిరి. మఱుక్షణమే అతడు చిరాకుతో తత్తఱపడుచు శయ్యనుండి లేచెను. అతనిజుట్టుముడి వీడెను, ఉత్తరీయము వ్రేలాడుచుండెను, సహనము సన్నగిల్లెను, రోషాగ్ని చెలరేగెను, పట్టరాని వైరభావముతో అతడు చెఱసాలకు ఏతెంచెను, పాపను చంపుటకు సమీపించెను.

వ. అంత దేవకీదేవి యడ్డంబు వచ్చి యిట్లనియె. 149

ఉ. అన్న! శమింపు మన్న! తగ దల్లుఁడు గాఁడిది మేనగోడలా
మన్నన సేయుమన్న! విను మానినిఁ జంపుట రాచపాడి గా
దన్న!సుకీర్తివై మనఁగదన్న! మహాత్ములు వోవు త్రోవఁబో
వన్న! భవత్సహోదరిఁ గదన్న! నినున్ శరణంబు వేఁడెదన్. 150

అంతట దేవకీదేవి అతనికి అడ్డముగా నిలిచి ఇట్లనెను. "అన్నా! సహనమును వహింపుము, శిశుహత్యకు పూనుకొనవలదు. ఇది ఆడుశిశువు. నీకు అల్లుడుగాడు, మేనగోడలు, కనుక ఈ శిశువుపై నెనరుంచుము, స్త్రీని చంపుట రాజులకు మర్యాదగాదు. చక్కని కీర్తిప్రతిష్ఠలతో వర్ధిల్లుము. మహాత్ములవలె ధర్మమార్గమున ప్రవర్తించుము. నిన్ను శరణుజొచ్చుచున్నాను. నేను నీకు తోబుట్టువును గదా! నా మనవిని ఆలకింపుము.

క. కట్టా! యార్గురు కొడుకులఁ, బట్టి వధించితివి యాఁడుఁబడుచిది కోడల్
నెట్టన చంపఁగవలెనే, కట్టిఁడివి గదన్న! యన్న! కరుణింపఁ గదే. 151

క. పుత్త్రుఁడు నీ బ్రతుకునకును, శత్రుండని వింటి గాన సమయింపఁ దగుం
బుత్రులకు నోచ నైతిని, బుత్రీదానంబు సేసి పుణ్యముఁ గనవే! 152

అయ్యో! నా ఆఱుగురు పుత్రులను పగబూని వధించితివి. ఇది ఆడుపడుచు, నీకు మేనగోడలు, దీనిని చంపక తప్పదా? దీనిని గూడ చంపునంతటి క్రూరుడవా? అన్నా! నాపై కనికరము చూపుము. 'నాకు పుట్టిన పుత్రుడు నిన్ను చంపును' అని గదా! ఆకాశవాణి పలికినది. కావున ఈ శిశువు మగవాడైనచో చంపదగును. నేను ఎటూ పుత్రసంతానమునకు నోచుకొననైతిని. అందువలన నీవు నాకు ఈ పుత్రదానము చేసి పుణ్యమును గట్టుకొనుము".

వ. అని పయ్యెదఁ జక్క సవరించు కొనుచుఁ, బలవరించుచు, భ్రాంతిపడి, కూఁతున్‌గ్రక్కున నక్కునం జక్క హత్తించుకొని, చెక్కు చెక్కున మోపి, చయ్యన నుత్తరీయాంచలంబున సంచలతం గప్పి, చప్పుడుగాఁగుయ్యిడ నయ్యెడం గ్రయ్యంబడి, వాఁడు పోఁడిమి సెడఁ, దోబుట్టువుం దిట్టి, చిట్టిపట్టి నావురని వాపోవఁ, గావరంబున నడుగులొడిసి, తిగిచి, వడిం బెడిసిపడం బుడమి పయిం బడ వైచిన నబ్బాలయు నేలంబడక, యవలీలనెగసి నవ్య దివ్యమాలికా గంధబంధుర మణిహారాంబరాద్యలంకార మనోహారిణియు, గదా శంఖ చక్ర చర్మ శర చాపాసి శూలధారిణియునై యెనిమిదికరంబులం గరం బొప్పుచు సిద్ధ చారణ కిన్నరగరుడ గంధర్వాది వైమానికాయంబు కానికలిచ్చి పొగడ, నెగడుచు, నచ్చరల యాటపాటలకు మెచ్చుచు, మింటనుండి, కంటఁ బడి, కంటువడఁ, గంసున కిట్లనియె. 153

ఇట్లు పలికిన పిమ్మట దేవకీదేవి త్తొట్రుపాటుచే చేజాఱిన పైటను సవరించుకొనెను, పిదప కలవరపాటుతో త్వరత్వరగా కూతురుయొక్క చెక్కిలిని, తన చెక్కిలిపై చేర్చుకొని ఆ శిశువును గుండెలకు హత్తుకొనెను. మఱియు ఆమె ఆ పాపపై తన చీరచెఱగును గప్పి, గట్టిగా ఆక్రందించెను. అంతట ఆ కంసుడు ఆ శిశువును ఆమెనుండి బలవంతముగా లాగుకొని, ఏ మాత్రము మర్యాదను పాటింపక సోదరియగు దేవకిని తిట్టిపోసెను. అప్పుడు ఆ పసికూన ఆవురుమని ఏడ్చుచుండగా ఆ కఠినాత్ముడు కండకావరముతో ఆ శిశువుయొక్క పాదములను ఒడిసిపట్టుకొని, బలముకొలది నేలమీదికి విసరివేసెను. ఇంతలో ఆ బాలికయు నేలపై పడిపోక అవలీలగా పైకెగిరెను. అప్పుడు ఆమె దివ్యమైన నూతనమాలికలను, పరిమళద్రవ్యములను, దట్టమైన మణిహారములను, వస్త్రములు మొదలగు అలంకారములను ధరించి ఆహ్లాదకరముగా

ఉండెను. ఆమె తన ఎనిమిది చేతులయందును గదను, శంఖమును, చక్రమును, డాలును, శరములను, ధనుస్సును, ఖడ్గమును, శూలమును ధరించి యుండెను. ఆ సమయమున సిద్ధులు, చారణులు, కిన్నరులు, గరుడులు, గంధర్వులు మొదలగు దివ్యజాతులవారు కానుకలను సమర్పించి, ఆమెను స్తుతించిరి, అప్సరసలు గానము చేయుచు నృత్యములొనర్చిరి. పిదప ఆమె వారిని మెచ్చుకొనుచు, కంసునకు కనబడునట్లుగా ఆకాశమున నిలిచి, క్రోధమును ప్రకటించుచు అతనితో ఇట్లు పలికెను.//

ఉ. తెంపరివై పొరింబొరిని దేవకిబిడ్డలఁ జిన్ని కుఱ్ఱలం
జంపితి, వంతనైన నుపశాంతి వహింపక ఱాలమీఁద నొ
ప్పింపఁగ నిస్సిరో యిదియు బీరమె నా సరసన్ జనించి నిన్
జంపెడి వీరుఁ డొక్కదెస సత్కృతి నొందెడువాఁడు దుర్మతీ! 154

వ. అని పలికి. 155

క. మహనీయ గుణాస్పదయై, మహిలో నా దేవి జనము మన్నింపంగా
బహు నామ నివాసంబుల, బహు నామములం జరించె భద్రాత్మికయై. 156

"ఓరీ! దుర్మార్గుడా! దేవకీదేవికడుపున పుట్టిన ఆఱుమంది పసికూనలను వరుసగా చంపివేసిన మొనగాడవు నీవు. అంతటితో తృప్తిపడక నన్ను ఱాతినేలపై విసరివేసితివి. (నేలకేసి కొట్టి నన్ను చంపుటకు ప్రయత్నించితివి.) ఛీ! ఛీ! ఇదియును (పసిశిశువులను, ఆడుబిడ్డను చంపుటయు) ఒక పౌరుషమేనా? నాతోపాటు జన్మించిన ఒక వీరుడు వేఱొకచోట అల్లారుముద్దుగా పెఱుగుచున్నాడు. అతని చేతిలో నీకు చావు మూడును" ఇట్లు పలికిన పిదప మహనీయములగు గుణములకు నెలవైన ఆ యోగమాయ భూతలమునందలి జనులకు ఆరాధ్యయై పలు దివ్యక్షేత్రములయందు పెక్కు నామములతో (పేర్లతో) వెలసెను. ఆమె తన భక్తులకు కొంగుబంగారమై విరాజిల్లెను.

వ. అంత నా బోటి పలికిన కలికి పలుకులు ములుకులై, చెవులఁ జిలికిన నులికిపడి, జళుకు గదిరిన మనంబున ఘనంబుగ వెఱఁగంది, కంది, కుందెడు దేవకీవసుదేవుల రావించి, యాదరంబున సంభావించి, చేరి, వారితో, నిట్లనియె. 157

ఈ విధముగా ఆ యోగమాయ నుడివిన దివ్యవచనములు కంసుని చెవులలో శూలములు గ్రుచ్చుకొనినంతగా (అతనిని) బాధించెను. వెంటనే అతడు ఉలిక్కిపడెను. అతని మనస్సున భయమావరించెను. మిగుల ఆశ్చర్యచకితుడయ్యెను. అంతట దైన్యముతో అలమటించుచున్న దేవకీవసుదేవులను రప్పించి ఆదరాభిమానములను జూపుచు అతడు వారితో ఇట్లు వచించెను.

ఉ. పాపుఁడ బాలఘాతకుఁడ బంధువిరక్తుఁడ దుష్టచిత్తుఁడన్
గోపనుఁడం జరన్మృతుఁడఁ గ్రూరుఁడ బ్రాహ్మణహంతభంగి మీ
పాపలఁ జంపితిం బయలిపల్కులు నమ్మితి సాధులార! నా
పాపములుగ్గడింపక కృపాపరులై కసరే శమింపరే! 158

"దేవకీ వసుదేవులారా! (అక్కా! బావా!) నేను ఎంతయు పాపాత్ముడను, శిశుహంతకుడను, బంధువులయెడ ప్రేమలేనివాడను, దుష్టబుద్ధిని, మిగుల కోపస్వభావుడను, బ్రతికియుండియు చచ్చినవానితో సమానుడను, క్రూరుడను, ఆకాశవాణిమాటలను నమ్మితిని. అందువలన బ్రహ్మహత్యకు పాల్పడినవానివలె మీ పసిబిడ్డలను చంపితిని. సజ్జనులారా! నా పాపములను పట్టించుకొనక నాపై దయజూపుడు, శాంతి వహింపుడు.

ఉ. ఒక్కెడఁ బ్రాణులందఱు నిజోచితకర్మములోలిఁ ద్రిప్పఁగా
నొక్కొక మేనితోఁ బొడమి యొక్కొకత్రోవను రాకపోకలం
జిక్కులఁ బొందుచుండుదురు చెల్మిని సంస్మృతితోడఁ బాయ రే
నెక్కడిహంత మీ శిశువు లెక్కడి హన్యులు దూఱనేటికిన్. 159

క. పగతురఁ జెఱిచితి ననియును బగతురచేఁ జెడితి ననియు బాలుఁడు దలఁచుం
బగ చెలుములు లేవాత్మకుఁ, బగచెలుములకీలు కర్మబంధము సుండీ. 160

ఒక్కొక్కప్పుడు సకలప్రాణులును తాము చేసికొనిన సుకృతదుష్కృతములనుబట్టి వేర్వేరు శరీరములతో పుట్టుచుందురు, మఱియు ఈ జన్మపరంపరలతో ఆయాగతులను పొందుచు చిక్కులపాలగుచుందురు. మమకారములతో సంసారబంధములనుండి బయటపడజాలరు. వాస్తవముగా నేను హంతకుడనూగాను, మీ శిశువులు చంపబడినవారూ గారు. నన్ను నిందించుటవలన ప్రయోజనము శూన్యము. 'నేను నా శత్రువులను చీల్చి చెండాడితిని, వైరుల కారణమున నేను కష్టనష్టములపాలైతిని' అని తలంచువాడు నిజముగా మూర్ఖుడు. యథార్థముగా ఆత్మకు శత్రుభావముగాని, మిత్రభావముగాని ఉండదు. ఇవియన్నియును కర్మబంధములేసుమా!".

వ. అని పలికి, కన్నీరు నించి, వగచి, వెఱచుచు, దేవకీవసుదేవుల పాదంబులఁ బట్టుకొని, సంకెలలు విప్పించి మిక్కిలి యక్కఱగల వాక్యంబుల నైక్యంబులు నెఱపిన, వారును, బరితప్తుండైన కంసునిం జూచి, రోషంబును బాసి రంత నా వసుదేవుండు బావ కిట్లనియె. 161

ఈ విధముగా పలికిన పిమ్మట కంసుడు కంట నీరుపెట్టుకొని, విచారమును ప్రకటించెను. తాను ఒడిగట్టిన దుర్మార్గములకు భయపడుచు అతడు దేవకీవసుదేవుల పాదములపైబడెను. అనంతరము వారి సంకెలలను విప్పించి సమయమునకు అనుగుణముగా అతడు ప్రేమను జూపుచు బంధుభావమును ప్రకటించెను. అంతట మిగుల పశ్చాత్తాపమును ప్రకటించుచున్న కంసునిజూచి, దేవకీవసుదేవులు తమకు అతనిపైగల కోపమును వీడిరి. పిదప వసుదేవుడు తనకు బావయగు కంసునితో ఇట్లు వచించెను.

శా బావా! నీ వచనంబు నిక్కము సుమీ ప్రాణుల్ గతజ్ఞానులై
నీవేనంచును లోభ మోహ మద భీనిర్మిత్రతా మోద శో
కావేశంబుల నొండొరుం బొడుతురేకాకారుఁడై సర్వ రూ
పావిష్టుండగు నీశ్వరుం దెలియలేరన్యోన్య విభ్రాంతులై. 162

"బావా! నీ మాటలు యథార్థములు సుమా! ప్రాణులు అజ్ఞానముచేత 'నీవు-నేను' అను భేదబుద్ధితో ఈ లోభము, మోహము, మదము, భయము, వైరము, సుఖదుఃఖములు మొదలగువాటికి లోనై చంచలచిత్తులై ఒకరినొకరు చంపుకొందురు, సకల జీవులయందును ఆత్మస్వరూపుడై వెలుగొందు పరమేశ్వరుని ఎఱుంగజాలరు?"

వ. అని యిట్లు బ్రసన్నులైన దేవకీవసుదేవులయనుజ్ఞ వడసి, కంసుండింటికింజని, యా రేయి గడిపి, మఱునాఁడు గ్రద్దనం బ్రొద్దునం దనకు బరతంత్రులగు మంత్రుల రావించి, యోగనిద్రవలనం దా వినిన వృత్తాంతం బంతయు మంతనంబున నెఱింగించిన, నపుడు వారలతని కి ట్లనిరి. 163

ఇట్లు పలికిన పిదప – దేవకీవసుదేవులు ప్రసన్నులు కాగా, కంసుడు వారి అనుమతిని పొంది తన భవనమునకు చేరెను. ఆ రాత్రి గడచిన పిమ్మట మఱునాడు ఉదయమునే కంసుడు త్వరత్వరగా తన అధీనములోనున్న మంత్రులను

ర్పించెను. అనంతరము అతడు యోగమాయ తనకు తెలిపిన వృత్తాంతమును వారికి రహస్యముగా తెలిపెను. అంతటవారు అతనితో ఇట్లు నుడివిరి.

వ. ఇట్టయినఁ దడయ నేటికి, పట్టణముల మందలందుఁ బల్లెల నెల్లన్ బుట్టెడి పెరిఁగెడి శిశువులఁ, బట్టి వధించెదము మమ్ముఁ బంపుమధీశా! 164

"మహారాజా! యోగమాయ పలుకులు సత్యములగుచో మనము ఏమాత్రము జాగుచేయరాదు, వెంటనే మాకు ఆజ్ఞలను ఇమ్ము. ఈ క్షణమే పట్టణములకును, గోకులములకును, పల్లెలకును వెళ్లి, అచట పుట్టి పెరుగుచున్న శిశువులను అందరిని పూనికతో వధించెదము.

మ. భవదీయోజ్జ్వల బాహు చాప విలసద్బాణావళీభగ్నులై
దివిజాధీశ్వరులెట్టియం జనిరొ యే దేశంబులం డాఁగిరో
శివునిం జొచ్చిరొ బ్రహ్మఁ జెందిరొ హరిన్ సేవించిరో మౌనివృ
త్తి వనాంతంబుల నిల్చిరో మనకు శోధింపందగున్ వల్లభా! 165

ప్రభూ! నీ బాహుబలము తిరుగులేనిది, నీవు ధనుస్సును చేబూని ప్రయోగించిన బాణపరంపరధాటికి ఇంద్రాదిదేవతలు ఎల్లరును భంగపడిరి. వారు ఎట్లు పారిపోయిరో ఏమో? వారు ఏయే దేశములలో తలదాచుకొనిరో తెలియదు. వారు శివుని ఆశ్రయించినారో? బ్రహ్మకడ చేరిరో? శ్రీహరిని శరణుజొచ్చినారో? లేక మునివృత్తితో వనములలో నివసించుచున్నారో ఎఱుంగము. కావున వెనువెంటనే వారిఉనికిని గూర్చి గాలింపవలసియున్నది.

క. నొచ్చిరి శాత్రవులనుచును, విచ్చలవిడిఁ దిరుగవలదు వివిధాకృతులన్
ముచ్చిలి వత్తురు వారలు, సచ్చినయందాఁక మఱవఁ జనదధిపునకున్ 166

క. ఒత్తికొనుచు రానీఁ జనఁ, దెత్తిన రోగములరివుల నింద్రియముల,ను
త్పత్తిసమయముల( జెఱుపక, మెత్తన గారాదు రాదు మీఁద జయింపన్. 167

మ. అమర శ్రేణికి నెల్లఁ జక్రి ముఖరుండాచక్రియే ధర్మమం
దమరున్ గోవులు భూమిదేవులుఁ దితిక్షామ్నాయ కారుణ్య స
త్యములున్ యాగ తపో దమంబులును శ్రద్ధా శాంతులున్ విష్ణుదే
హములిన్నింటిని సంహరించిన నతండంతంబునుం బొందెడిన్. 168

రాజా! 'శత్రువులు మిగుల దెబ్బతినియున్నారుగదా!' అని ఉపేక్ష వహించి నిర్భయముగా మసలుకొనరాదు. వారు వివిధములగు మాఱురూపములలో మన కన్నుగప్పి వచ్చుచుందురు. శత్రువులు పూర్తిగా మడియునఱకు వారివిషయమున రాజు ఏమరపాటునకు తావీయరాదు.[1] మహారాజు రోగములను, శత్రువులను, ఇంద్రియ వాంఛలను (దుర్వ్యసనములను) ప్రబలనీయరాదు. వాటిని ప్రారంభదశలోనే త్రుంచివేయవలెను. అట్లు చేయనియెడల (వాటిని ఉపేక్షించినచో) అవి క్రమముగా విజృంభించును. అప్పుడు వాటిని అణచివేయుట కష్టము. (అసాధ్యము). దేవతలలో శ్రీమహావిష్ణువు ప్రముఖుడు. ధర్మకార్యములు నిర్వహింపబడుచోట్లన్నియును ఆ స్వామికి ఉనికిపట్లు. గోవులు, బ్రాహ్మణులు, సహనము, వేదశాస్త్రములు

(1) అగ్నేశ్శేషమ్ ఋణాచ్ఛేషం శత్రోశ్శేషం న శేషయేత్ ।
అగ్ని శేషమును (నిప్పు కణములను కొంచెముగానైనను) ఋణశేషమును, శత్రుశేషమును మిగిలియుండనీయరాదు.
-నీతిశాస్త్రము

(సంప్రదాయములు) కృపాసత్యములు, యాగములు, తపస్సులు, ఇంద్రియ నిగ్రహములు, శ్రద్ధాభక్తులు, శాంతులు శ్రీహరి శరీరమునకు అంగభూతములు (అంగములవంటివి) వాటిని రూపుమాపినచో అతడు అంతమొందును.

వ. కావున. 169

ఉ. చంపుదుమే నిలింపులను జంకెల బంకెలఁ దాపసావలిం
బంపుదుమే కృతాంతకునిపాలికిఁ గ్రేపులతోడ గోవులం
ద్రుంపుదుమే ధరామరులఁ దోలుదుమే నిగమంబులన్ విదా
రింపుదుమే వసుంధర హరింపుదుమే జననాథ! పంపుమా. 170

కాబట్టి, రాజా! నీవు మాకు అనుమతిని ఇచ్చినచో దేవతలను చంపివేయుదుము, బెదరింపులతో, భయంకర గర్జనలతో తాపసులను మృత్యుముఖమునకు చేర్చెదము, ఆవులను, ఆవుదూడలను వధించెదము. భూసురులను తఱిమివేయుదుము, వేదశాస్త్రములను అధ్యయనము చేయువారిని తునుమాడెదము. భూమిని ఆక్రమించెదము".

వ. అని పలుకు మంత్రులమంత్రంబుల నిమంత్రితుండై, బ్రాహ్మణనిరోధంబు నిషిద్ధంబని తలంపక, కాలపాశబద్ధుండై, విప్రాది సాధుమానవులఁ జంప దానవులం బంపి, యంతిపురంబునకుఁ జనియె. అనంతరంబ యా రక్కసులు వెక్కసంబులగు మొక్కలంబుల సజ్జనులపజ్జలం బడి, తర్జన గర్జన భర్జనాది. దౌర్జన్యంబులం జేసి నిర్జించి, పాపంబులార్జించిరి. 171

ఆ. వెదకి వెదకి దైత్యవీరులు సాధుల నడఁప వారిబలము లడఁగిపోయె
యశము సిరియు ధర్మ మాయువు భద్రంబు నార్యహింస సేయ నడఁగుఁగాదె! 172

మంత్రులు ఇట్లు పలికిన పిదప కంసుడు వారి సూచనలను ఆమోదించెను. అనంతరము అతడు 'చావు దగ్గఱపడినవాడై, 'బ్రాహ్మణులను హింసించుట తగదు' అని భావింపక విప్రులు మొదలగు సాధుజనులను చంపుటకై దానవులను పంపెను. పిదప అతడు తన అంతఃపురమునకు చేరెను. తదుపరి ఆ రాక్షసులు మిగుల క్రూరముగా ప్రవర్తించుచు సజ్జనులపై దాడికి దిగిరి. వారు మిక్కిలి క్రుద్ధులై, ఆ సత్పురుషులను భయపెట్టుచు, వేధించుచు, దౌర్జన్యములకు పాల్పడసాగిరి. ఈ విధముగా ఆ రక్కసులు వారిని హింసించుచు పాపములను మూటగట్టుకొనిరి. ఆ దైత్యులు, సాధువులను గాలించి, గాలించి, అణచివేయుటవలన వారు శక్తిహీనులైరి. ఆర్యులను (పూజ్యులను) హింసించినచో కీర్తిప్రతిష్ఠలు, సంపదలు, ధర్మము, ఆయుస్సు, క్షేమము తఱిగి (నశించి) పోవునుగదా!

వ. అంత మందలో నందుండు, నందనుండు పుట్టుట యెఱింగి, మహానందంబున నెఱవాదులగు వేదవిదులం బిలిపించి, జలకంబులాడి, శుచియై,శృంగారించుకొని స్వస్తిపుణ్యాహవాచనంబులు సదివించి, జాతకర్మంబులు సేయించి, పితృదేవతలనర్చించి, క్రేపులతోడంగూడఁ గైసేసిన పాఁడి మొదవుల రెండులక్షలను, గనకకలశ మణి వసన విశాలంబులైన తిలశైలంబు లేడింటిని భూదేవతల కిచ్చిన. 173

ఇది ఇట్లుండగా వ్రేపల్లెలో ఉన్న నందుడు తనకు కుమారుడు పుట్టిన శుభవార్తను విని, ఎంతయు ఆనందించెను. పిదప అతడు వేదశాస్త్రములలో ఆఱితేఱిన పండితులను పిలిపించెను, స్నానములను ఆచరించి శుచియయ్యెను. వస్త్రాభరణములను దాల్చెను. బ్రాహ్మణులచే స్వస్తిపుణ్యాహవాచనములను జరిపించెను. అతడు శిశువునకు జాతకకర్మలు చేయించెను, పితృదేవతలను అర్చించెను. నందుడు దూడలతోగూడిన రెండు లక్షల పాడియావులను, అధికసంఖ్యలో బంగారు కలశములను, మణులను, వస్త్రములను, నువ్వులరాసులనుఏడింటిని పాత్రులైన భూసురులకు దానము చేసెను.

క. ఈ యాభీరకుమారుఁడు, శ్రీయుతుఁడై వీరవైరిజేతయునై దీ
ర్ఘాయుష్మంతుండగునని, పాయక దీవించిరపుడు బ్రాహ్మణజనముల్ 174

క. దుందుభులు మొరసె గాయక, సందోహము పాడె సూతసముదాయముతో
వందిజనులు కీర్తించిరి, క్రందుగ వీతెంచె భద్రకాహళ రవముల్. 175

"ఈ గోపబాలుడు సకలసంపదలతో వర్ధిల్లును, శత్రుయోధులను జయింపగల మహావీరుడగును, దీర్ఘాయుష్మంతుడు అగును" అని ఆ శుభసమయమున బ్రాహ్మణోత్తములు నిండుమనస్సుతో ఆ శిశువును దీవించిరి. అంతట జనులు ఢంకాలను మ్రోగించిరి. గాయకులు గానములను ఆలపించిరి. సూతులు, వందిమాగధులు ఆ శిశువుయొక్క మహత్త్వమును గూర్చి కీర్తించిరి, కాహళవాద్యముల మ్రోతలు మిన్నుముట్టెను.

క. పల్లవ తోరణ సురుచిర, వల్లీ ధ్వజరాజిధూపవాసనములతో
సల్లలితములై యొప్పెను, వల్లవవల్లభులయిండ్ల వాకిం డ్లెల్లన్. 176

క. పసుపులు నూనెలు నలఁదినఁ, బసఁదనరి సువర్ణ బర్హిబర్హ ప్రభతోఁ
బసిమి గలిగి వెలుఁగొందుచుఁ, బసులన్నియుఁ మందలందుఁ బ్రసరించె నృపా! 177

అప్పుడు గోపాలకుల గృహములు అన్నియును చిగురుటాకుల తోరణములతో విరాజిల్లెను. అందమైన తీగెలతో, ధ్వజపతాకములతో చూడముచ్చటగా నుండెను, ధూపముల పరిమళములతో గుబాళించెను. పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణునిజన్మోత్సవమును పురస్కరించుకొని, గోవులు మొదలగు పశువులకు అన్నింటికిని పసుపు, కుంకుమలను, సుగంధములను అలందిరి. నూనెలను పూసిరి. అప్పుడు ఆ పశువులు (గోవులు) చక్కని వన్నెగలిగి, నెమళ్ల పింఛముల కాంతులతో మెఱయుచు కొట్టములయందు అటునిటు తిరుగాడినవి.

క. క్రేళ్ళుఱికి మసలె లేఁగలు, మల్లడి గొని ఱంకెలిడియె మదవృషభంబుల్
పెల్లుగ మొదవుల పాదుఁగుల, జల్లించెం బాలు బాలుసంభవవేళన్. 178

క. ఆరఁగఁ జదివెడి పొగడెడి, వారికి విద్యలను బ్రదుకువారికి లేమిం
జేరినవారికి నెల్లను, గోరక మును నందుఁడిచ్చె గోధనచయముల్ 179

బాలకృష్ణుడు అవతరించినవేళ లేగదూడలు అటునిటు గంతులు వేయసాగెను. బలిష్ఠములైన కోడెలు (వృషభములు) పరస్పరము పోట్లాడుచు ఱంకెలు వేయదొడంగినవి. ఆవుల పొదుగులనుండి పాలు సంతతధారగా స్రవించెను. నందుడు బాగుగా పఠించువారికిని కొనియాడువారికిని, తమ విద్యలను ప్రదర్శించుచు జీవించెడివారికిని, పేదలు మొదలగు వారికి ఎల్లరకును వారు కోరకముందే గోవులను, సంపదలను దానము చేసెను.

వ. ఆ సమయంబున. 180

క. కంచుకములుఁ దలచుట్లును, గాంచన భూషాంబరములుఁగడు మెఱయఁగ నే
తెంచిరి గోపకులందఱు, మంచి పదార్థములు గొనుచు మాధవుఁ జూడన్. 181

క. ఏతెంచి చూచి చెలఁగుచు, నేతులఁ బెరుఁగులను బాల నీళ్ళను వెన్నం
బ్రీతి వసంతము లాడిరి, యాతురులై సరసభాష లెసఁగన్‌గొల్లల్. 182

ఆ శుభసమయమున గోపాలురు అందఱును చొక్కాలను, తలపాగలను, బంగారు ఆభరణములను, నూతన

వస్త్రములను ధరించి, పెల్లుబికిన సంతోషముతో మెఱయుచు మధురపదార్థములతో శ్రీకృష్ణుని చూచుటకై వచ్చిరి. ఆ దివ్యశిశువును గాంచిన గోపాలురలో ఆనందము వెల్లివిరిసెను. అంతటవారు సరససల్లాపములను గావించుచు నేతులతో, పెరుగులతో పాలతో, నీళ్లతో, వెన్నలతో తృప్తిగా వసంతములాడిరి.

వ. తదనంతరంబ. 183

ఆ. ఏమి నోముఫలమొ యింత ప్రొద్దొకవార్త వింటిమబలలార! వీనులలర
మన యశోద చిన్ని మగవానిఁ గనెనఁట చూచి వత్తమమ్మ! సుదతులార! 184

అనంతరము గోపికలు ఒకరినొకరు పిలుచుకొనుచు ఇట్లు ముచ్చటించుకొనిరి. 'అబలలారా! మనము అందరము నోచిన నోములకు ఫలముగా ఈ పూట వీనులవిందుగా ఒక శుభవార్తను వింటిమి. మన యశోదమ్మ చక్కని మగబిడ్డను కన్నదట. మనము అచటికి వెళ్లి, ఆ చిన్నారిని చూచివత్తము రండు.'

వ. అని యొండొరుల లేపికొని, గోపిక లోపికలు లేని చిత్తంబుల నెత్తిన తత్తఱంబులొత్తుకొన, నుదారంబులగు శృంగారంబులతో నిండ్లు వెలువడి. 185

క. జడగతులును బలు పిఱుఁదులుఁ, బిడికెడు నడుములును వలుఁద బిగిచనుఁగవలున్
వెడఁద నయనములు సిరితడఁ, బడు మోములు భ్రమరచికుర భరములు నమరన్. 186

ఉ. వేడుకతోడఁ గ్రొమ్ముడులు వీడఁ గుచోపరిహారరేఖ ల
ల్లాడఁ గపోలపాలికల హాటకపత్ర రుచుల్ వినోదనం
బాడఁ బటాంచలంబుఁ లసియాడఁగ జేరి యశోదయింటికిం
జేడియలేఁగి చూచిరొగి జిష్ణుని విష్ణునిఁజిన్ని కృష్ణునిన్. 187

వ. చూచి సంతసించి తెచ్చిన కానికలిచ్చి 188

అని గోపికలు ఆ చిన్నారిని దర్శించుటకై తహతహపడుచు ఒకరిని మఱియొకరు ప్రోత్సహించుకొనిరి. అంతటవారు చక్కగా వస్త్రాభరణములను ధరించి, వెంటనే తమ ఇండ్లనుండి బయలుదేరిరి. ఆ గోపభామినులు సన్నని నడుముల ఒప్పిదములతో, విశాలములైన నేత్రములతో, వక్షస్థలవైభవములతో, అనువగు నితంబశోభలతో, సిరులొలుకు మోములతో, తుమ్మెదల వంటి నల్లని కురులతో దర్శనీయముగా ఉండిరి. తత్తరపాటుతో ముందునకు సాగుచుండుటవలన వారి కొప్పుల ముడులు వీడిపోవుచుండెను. వారు ధరించిన హారములు అటునిటు కదలుచుండెను. వారి చెక్కిళ్లపైగల బంగారుపత్రములు మిలమిలలాడుచుండెను. వారి పైటలకొంగులు కదలుచు ఆహ్లాదకరముగా ఉండెను. అట్లు శోభిల్లుచున్న గోపికలు మందగతులతో ముందునకు సాగుచు తిన్నగా యశోదమ్మ ఇంటికి చేరిరి. పిమ్మట వారు, జయశీలుడు, సర్వవ్యాపక మహత్త్వసంపన్నుడు ఐన చిన్నారి కన్నయ్యను కాంచి, సంతోషముతో పొంగిపోవుచు ఆ స్వామికి కానుకలను సమర్పించిరి.

తే. పాపనికి నూనెఁ దలయంటి పసుపుఁ బూసి బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు
జలములొకకొన్ని చుట్టి రాఁ జల్లి తొట్ల నునిచి దీవించి పాడిరయ్యువిదలెల్ల. 189

క. జోజో కమలదళేక్షణ! జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!
జోజో పల్లవకరపద!, జోజో పూర్ణేందువదన జోజో యనుచున్ 190

పిమ్మట ఆ గోపవనితలు చిన్నికృష్ణునకు సువాసనలను వెదజల్లు నూనెలతో తలయంటిరి, పసుపులను పూసిరి, స్నానములను చేయించిరి. 'శ్రీరామరక్ష' అనుచు జలములను అతని చుట్టును త్రిప్పి చల్లిరి. ఆ చిన్నారి శిశువును బాగుగా అలంకరింపబడిన ఊయలలో ఉంచి దీవించిరి. పిమ్మట ఆ గోపవధువులు -

"జోజో! కమలదళేక్షణ! జోజో! మృగరాజమధ్య! జోజో! కృష్ణా!
జోజో! పల్లవకరపద! జోజో! పూర్ణేందువదన! జోజో!"

అనుచు జోలపాటలు పాడిరి.

వ. ఇ వ్విధంబున. 191

క. పలుతోయంబుల జగములఁ, బలు తోయములందు ముంచి భాసిల్లెడి యా
పలుతోయగాఁడు వల్లవ, లలనా కరతోయములఁ జెలంగుచుఁ దడియున్. 192

శ్రీమహావిష్ణువు పెక్కు అవతారములను ఎత్తి లోకరక్షణ గావించుచుండును. ఆ స్వామి సకలలోకములను పలుపర్యాయములు ప్రళయకాల జలములలో లయింపజేయుచు తాను వటపత్రశాయియై విరాజిల్లుచుండును. ఆ శ్రీమహావిష్ణ్వంశయైన శ్రీకృష్ణుడు ఇప్పుడు ఈ విధముగా గోపికలచేతులమీదుగా నిర్మల జలములలో స్నానములు చేయుచుండెను.

క. లోకములు నిదుర వోవఁగ, జోకొట్టుచు నిదురవోని సుభగుఁడు రమణుల్
జోకొట్టి పాడ నిదురం, గైకొనుక్రియ నూరకుండెఁ గను దెఱవకయున్. 193

దివ్యాంశతో ఒప్పునట్టి శ్రీకృష్ణుడు (శ్రీమహావిష్ణువు) తనజోలపాటలతో (తన అద్భుతలీలలతో) సకలలోకములను నిద్రింపజేయుచు తాను మాత్రము మేల్కొనియే యుండును.[1] అట్టిప్రభువు (కృష్ణుడు) ప్రస్తుతము గోపవనితల జోలపాటలకు హాయిగా నిద్రించుచున్నట్లు కనులు మూసికొని, నిద్రను నటించుచుండెను.

సీ. ఏబాము లెఱుఁగక యేపారు మేటికిఁ బసులకాపరి యింట బాము గలిగె,
నే కర్మములులేక యెనయు నెక్కటికిని జాతకర్మంబులు సంభవించె
నేతల్లి చనుఁబాలు నెఱుఁగని ప్రోడ యశోదచన్నులపాలచొరవ నెఱిఁగె
నే హానివృద్ధులు నెఱుఁగని బ్రహ్మంబు పాదిఁగిటిలో వృద్ధిఁ బొందఁ జొచ్చె
ఆ. నేతపముల నైన నెలమిఁ బండని పంట వల్లవీజనములపాడఁ బండె
నే చదువుల నైన నిట్టిట్టి దనరాని యర్థమవయవముల నందమొందె. 194

జన్మరహితుడైన శ్రీకృష్ణుడు లోకకల్యాణమునకై పసులకాపరియైన నందుని ఇంటిలో జన్మించెను. యజ్ఞాదివైదికకర్మలకును, తదితర లౌకికకర్మలకును అతీతుడైన ఆ పరమేశ్వరుడు నేడు సాంప్రదాయికమైన జాతకకర్మలను జరుపుకొనెను. జన్మయే లేనట్టి శ్రీహరి ఏ తల్లి స్తన్యమును గ్రోలినవాడుకాడు. కాని! నేడు శ్రీకృష్ణుడై యశోదమాత యొక్క చనుబాలు త్రాగుచున్నాడు. వృద్ధి క్షయములు (షడ్వికారములు) లేనట్టి ఆ పరబ్రహ్మము ఇప్పుడు యశోదతల్లి ఒడిలో పెరుగుచుండెను. ఎంతటి తపస్సులకును (తపస్సంపన్నులకు) దొరకని ఆ సర్వేశ్వరుడు నేడు వ్రేపల్లెలోనివారినోములపంటగా లభించి, వారి మధ్యన విహరించుచుండెను. ఎట్టి మహావిద్యలకును గోచరముగాని

1. విష్ణుభగవానుడు ప్రతి ప్రళయమునందును లోకములను తనలో లయింపజేసికొనుచు, తాను మాత్రము చైతన్యస్వరూపుడై మేల్కొనియుండును. అనంతరము ఆ ప్రభువు ఆ లోకములను వ్యక్తమొనర్చుచు పాలించుచుండును.

(అవాఙ్మానసగోచరుడైన) ఆ ప్రభువు ప్రస్తుతము సుందరమైన మానవరూపమును దాల్చి అందరికిని దర్శనభాగ్యమును కలిగించుచుండెను.

మ. చెయువుల్ సేయుతఱిన్ విధాతకరణిం జెన్నొందు సంతోష దృ
ష్టియుతుండై నగుచున్ జనార్దనుని మాడ్కిం బొల్చు రోషించి యు
న్న యెడన్ రుద్రునిభంగి నొప్పును సుఖానందంబునం బొంది త
న్మయుఁడై బ్రహ్మముభాతి బాలుఁడమరున్‌బాహుళ్య బాల్యంబునన్. 195

చిన్నికృష్ణుడు తన బాల్యలీలలతో తన విలాసములను ప్రకటించునప్పుడు బ్రహ్మదేవునివలె ఒప్పుచుండెను, సంతోషముతో ప్రసన్నవదనుడై యున్నప్పుడు విష్ణువువలె విరాజిల్లుచుండెను. కోపమును ప్రకటించుచున్నప్పుడు పరమశివుని (రుద్రుని)వలె అలరారుచుండెను. ఇట్లు ఆ చిన్నారి సుఖానందములను అనుభవించుచు తన్మయుడై సచ్చిదానందస్వరూపునివలె భాసిల్లుచుండెను.

వ. అ య్యవసరంబున 196

ఆ. కొడుకుఁ గన్న వేడ్క కొనసాగ రోహిణిఁ జీరఁ బంచి చిత్ర చేలములను
మండనములనిచ్చి మన్నించె నందుఁ డా యంబుజాక్షి ప్రీతయై చరింప. 197

ఆ సమయమున నందుడు పుత్రోత్సవము యొక్క వేడుకలను జరిపించుచు రోహిణీదేవిని పిలిపించెను. పిమ్మట ఆతడు ఆమెకు చిత్రవిచిత్రములైన వస్త్రములను, ఆభరణములను ఇచ్చి గౌరవించెను. అప్పుడు ఆ దేవి ఎంతయు తృప్తినందెను.

వ. అది మొదలు మొదవులకదుపులు పాడువులు గలిగియుండె నంత నందుండు గోపకులననేకుల గోకుల రక్షకు దక్షులైనవారిని నియమించి, మథురకుం జని, కంసునికి నేఁటేఁటం బెట్టెడి యరిం బెట్టి, వీడ్కొని, వసుదేవుని కడకుం జని, యథోచితంబుగ దర్శించిన. 198

రోహిణీ, యశోదలకు బలరాముడు, శ్రీకృష్ణుడు కలిగినప్పటినుండియు, ఆవుల పాడువులు అన్నియు క్షీరసమృద్ధితో ఒప్పుచుండెను. అంతట నందుడు గోవులను రక్షించుటకై సమర్థులైన పెక్కుమంది గోపాలురను నియమించెను. పిదప అతడు మథురకు చేరి, కంసునకు వార్షికమైన (ప్రతిసంవత్సరమునను చెల్లించెడి) కప్పమును గట్టెను, అనంతరము మర్యాదాపూర్వకముగా వసుదేవుని దర్శించెను.

క. నందునిఁ గనుఁగొని ప్రాణము, పొందిన బొందియును బోలెఁ బొలుపారుచు నా
నందాశ్రులు కడకన్నులఁ, గ్రందుకొనం గేలుసాఁచి కౌఁగిటఁ జేర్చెన్. 199

వ. మఱియుం గౌఁగిలించుకొని సుఖాసీనునిం జేసి, వసుదేవుండు తన కొడుకువలని మోహంబు దీపింప నందునకిట్లనియె. 200

నందుని జూచినంతనే వసుదేవునకు ప్రాణములు లేచివచ్చినట్లయ్యెను. అంతట ఆయన కన్నులనుండి ఆనందాశ్రువులు సంతతధారగా స్రవించెను. అప్పుడు అతడు చేతులుచాచి నందుని తన హృదయమునకు హత్తుకొనెను. గాఢముగా ఇట్లు కౌగిలించుకొనిన పిదప వసుదేవుడు అతనిని సుఖాసనముపై కూర్చుండజేసెను. పిదప అతడు బాలకృష్ణునిపై తనకు గల ప్రేమను ప్రకటించుచు నందునితో ఇట్లనెను.

క. సంతతి లేదని మును ఘన, చింతనముల మునిఁగి ముదిసి చిక్కిన నీకున్
సంతతి గలిగెను భాగ్యము, సంతతిహీనునికి సౌఖ్యసంతతి గలదే. 201

క. పొడగంటి నిన్ను బ్రదికితిఁ, గడచితి నాపదల నింకఁ గార్యంబులనే
యెడమడుగు లేని నెచ్చెలిఁ, బొడగాంచుట చచ్చి మరలఁ బుట్టుటకాదే. 202

క. పలుపాటులఁ బడు జనులకు, నిల నొకచో నుండఁ గలదె యేఱుల వెంటం
గలిగి చను మ్రాఁకులన్నియుఁ, బలువెంటలఁ బోవుఁగాక పాయక యున్నే. 203

"మిత్రమా! ఇంతవఱకును 'సంతానము కలుగలేదు' అని నీవు మిగుల చింతాక్రాంతుడవై ఉంటివి. ఈ ముసలితనమున నీకు పుత్రుడు లభించెను. నేటికి నీ భాగ్యము పండినది. సంతానము లేనివారికి సౌఖ్యములు ఎట్లు దక్కును? నిన్ను జూచుటతో నాకు ప్రాణములు లేచివచ్చినవి. (పోయిన ప్రాణములు తిరిగి వచ్చినట్లయ్యెను.) నేటితో నా ఆపదలు అన్నియును తొలగిపోయినవి. కార్యములయందు ఎట్టి అరమరికలు లేని ప్రాణమిత్రుడు కనబడుట (కలియుట) చచ్చినవాడు మఱల పుట్టుటవంటిదేగదా! బ్రతుకుదెఱువుకొరకై పెక్కుపాట్లు పడువారు జీవితాంతము ఒకరితో నొకరు కలిసియుండుట అసంభవము. నదులు పొరలినప్పుడు (వరదలదెబ్బకు) దరులు కోసికొనిపోగా అంతవరకు కలిసియున్న వృక్షములన్నియును పెల్లగిల్లి, దేనిదోవన అది కొట్టుకొనిపోవును. అవి మరల కలిసికొనుట అసాధ్యముగదా!

మ. పలురోగంబుల నొందకున్నవె పసుల్ పాలిచ్చునే ధేనువుల్
కొలఁకుల్ వాఁగులు వారిపూరితములే గోష్ఠ ప్రదేశంబులం
బులులున్ దుప్పులు సంచరింపవు గదా పొల్పారునే ఘోషముల్
కలవే పచ్చని పూరిజొంపములు తత్కాంతార భాగంబులన్ 204

నందా! వ్రేపల్లెలోని పశువులకు ఎట్టిరోగబాధలును లేవు గదా? ఆవులు అన్నియును సమృద్ధిగా పాలు ఇచ్చుచున్నవిగదా? సరస్సులును, వాగులును నీళ్లతోనిండియున్నవి గదా? పశువుల కొట్టముల సమీపములలో పెద్దపులులుగాని, దుప్పులుగాని తిరుగాడుట లేదుగదా? గొల్లపల్లెలన్నియును హాయిగా ఉన్నవి గదా? సమీపమునగల వనప్రదేశములలో పశువులమేతకు పచ్చికబయళ్లు సమృద్ధిగా (పచ్చపచ్చగా) వర్ధిల్లుచున్నవిగదా?

క. తన పుత్ర మిత్ర ముఖరులఁ, దనుపక చూడకయు వారు తఱిఁగి నశింపన్
మనుచు గృహమేధియాశ్రమ, మున నుండెడువాని కొక్క మోదముఁ గలదే. 205

క. నీ కాంతయొద్ద నీవును, నీ కాంతయు గారవింప నినుఁదండ్రిఁగ నా
లోకించుచు నీ మందను, నా కొడుకున్నాఁడె నంద! నందాన్వితుఁడై. 206

తనయొక్క పుత్రులను, మిత్రులు మొదలగువారిని తగినవిధముగా తృప్తిపరచక ముందే (వారికి తృప్తికరముగా మసలుకొనక ముందే) వారిని చూడకముందే (వారిని చూచెడి అదృష్టము లేకముందే) వారు క్రమముగా నశించినచో జీవచ్ఛవమై జీవించెడి గృహస్థునకు ఎట్టి సంతోషములును ఉండవుగదా! నందుడా! మీ దంపతులు ఇద్దఱును అల్లారుముద్దుగా పెంచుకొనుచుండగా నిన్ను తండ్రిగా భావించు నా కొడుకు వ్రేపల్లెలో సంతోషముతో ఉన్నాడు". మీ యొద్ద మీ తనయుడై పెరుగుచున్న బాలుడు నా కుమారుడే సుమా!

వ. అనిన నందుం డిట్లనియె. 207

శా. నీకుం దేవకికిన్ జనించిన సుతానీకంబుఁ దోడ్తోడ ము
న్నీ కంసుండు వధించె మీసుతఁ దుదిన్‌హింసింపఁ జేఁదప్పి తా
నాకాశంబున కేఁగె బాల యది దైవాధీన మాపద్దశన్
శోకంబందుటె తద్జ్ఞుఁడూఱడిలు నా సూనుండు నీ సూనుఁడే 208

వసుదేవుడు ఇట్లు పలికిన పిమ్మట అతనితో నందుడు ఈ విధముగా నుడివెను. "వసుదేవా! నీకును, దేవకికిని (మీ దంపతులకు) కలిగిన ఆరుగురు కుమారులను కంసుడు వరుసగా (పుట్టినవారిని పుట్టినట్లుగా) వధించెను. చివరకు మీకు జన్మించిన కుమార్తెనుగూడ ఆ(క్రూరుడు చంపబోగా ఆ బాల అతనిచేతులనుండి తప్పించుకొని, ఆకాశమునకు చేరెను. ఇదియంతయు విధివిలాసము. ఆపదలు వచ్చినప్పుడు జ్ఞానులు శోకింపరు. కావున ఊరడిల్లుము. ఇంత యెందులకు నా కమారుని నీకుమారునిగనే భావింపుము.

వ. అనిన వసుదేవుండు నందునికి మఱియు ని ట్లనియె 209

క. జనపతికరి యిడితివి మముఁ, గనుఁగొంటివి మేము నిన్నుఁ గంటిమి మే ల
య్యెను బొమ్మింకను గోకుల, మున నుత్పాతములు దోఁచె మునుకొనవలయున్. 210

అంతట వసుదేవుడు నందునితో మరల ఇట్లు వచించెను. "మిత్రమా! నీవు కంసునకు కప్పము చెల్లించితివి, ప్రేమతో మా కడకు వచ్చితివి, మేమును నిన్ను చూచి, ఎంతయు ఆనందించితిమి. వ్రేపల్లెలో ఉపద్రవములు కలుగనున్నట్లు తోచుచున్నది; ముందు జాగ్రత్తకై నీవు వెంటనే అచటికి చేరుట మంచిది".

వ. అని పలికి, వసుదేవుండు నందాదులయినవల్లవుల వీడ్కొలిపిన, వారలు గొబ్బున వడిగల గిబ్బలం బూనిన శకటంబులు ప్రకటంబులుగ నెక్కి, తమ తమ పల్లెలత్రోవలు వట్టి చనిరానందుండు ప్రతీతంబులైన యుత్పాతంబులు ముందటఁ బొడగని, శౌరి తనతోఁ బలికిన పలుకులు దప్పవనుచుఁ దలంచుచుంజనియె. అంత. 211

వసుదేవుడు ఇట్లు పలికి, నందుడు మొదలగు గోపాలురను వీడ్కొలిపెను. పిమ్మట వారు వడిగా పోగల ఎద్దులను పూన్చినబండ్లపై త్వరత్వరగా తమపల్లెలకు బయలుదేరిరి. అందరికిని తెలిసిన (ప్రసిద్ధములైన) ఉత్పాతసూచకములగు శకునములను నందుడు గమనించెను. అప్పుడు అతడు తనతో వసుదేవుడు తెలిపిన విషయములు నిజమే కావచ్చునని భావించుచు ముందునకు సాగెను.

## కంసుని పంపునఁబూతన యనురాక్షసి వ్రేపల్లెకుఁ జనుదెంచుట

సీ. కంసుపంపున బాలఘాతిని పూతన పల్లెల మందలఁ బట్టణముల
నిలనెల్లచోఁ బాలహింసఁ గావించుచుఁ జనుచు నెవ్వనిపేరు శ్రవణవీథిఁ
బడినయంతన సర్వ భయనివారణమగు నట్టి దైత్యాంతకుండవతరించి
యున్న నందునిపల్లెకొకనాఁడు ఖేచరియై వచ్చి యందు మాయాప్రయుక్తిఁ
తే. గామరూపిణియై చొచ్చి కానకుండవరిగి యిల్లిల్లుఁ దప్పక యరసికొనుచు
నందగృహమున బాలునినాదమొకటి విని ప్రమోదించి సుందరీవేష యగుచు 212

అంతట పసిపిల్లలను చంపివేయునట్టి పూతన అను రాక్షసి కంసునిఆజ్ఞపై బయలుదేరి, పల్లెలను, గోపాలురవాడలను, నగరములను గాలించి గాలించి శిశువులను వధింపసాగెను. క్రమముగా ఆమె ఆకాశగమనమున వ్రేపల్లెకు చేరెను.

దైత్యాంతకుడైన శ్రీకృష్ణుడు అవతరించి, పెరుగుచున్న ప్రదేశమదియే. మహిమాన్వితుడైన ఆ ప్రభువుపేరు చెవులబడినంతనే ఎల్లరభయములు తొలగిపోవును. కామరూపిణియైన పూతన తన మాయాశక్తిచే ఎవ్వరికిని కనబడకుండ వ్రేపల్లెలోని ప్రతి గృహమును గాలించుచు నందుని ఇంటికడకు వచ్చెను. అచట ఆమెకు బాలునివిలాసనాదములు (శిశువుయొక్క కేరింతలు) వినబడెను. వెంటనే ఆమె సంతోషముతో సుందరీరూపమును దాల్చెను.

మత్తకోకిలము. క్రాలు కన్నులు గుబ్బచన్నులుఁ గందువొందని చందురుం
బోలు మోమును గల్గు లేదన బుద్ధిఁ దూఱని కౌను నే
రాళ మైన పిఱుందు పల్లవరాగ పాదకరంబులుం
జాల దొడ్డగు కొప్పు నొప్పఁగ సర్వమోహన మూర్తితోన్. 213

ఆమెయొక్క చూపులు మిక్కిలి తేజస్సులు గలిగియుండెను. వక్షఃస్థలము చక్కని శోభలతో ఒప్పుచుండెను. ఆమెముఖము నిర్మలముగా నున్న చంద్రునివలె ఆహ్లాదకరముగా ఉండెను, సన్నని నడుము అందములను చిందించుచుండెను. ఆమె నితంబములతీరులు నిండుగా ఉండెను, పాదములు, చేతులు, చిగురుటాకులవలె శోభిల్లుచుండెను. కొప్పు అనువై ఒప్పుచుండెను. ఆమె రూపము మనోహరముగా ఉండెను.

మానిని. కాంచనకుండల కాంతులు గండయుగంబునఁ గ్రేళ్ళుఱుకన్ జడపై
మించిన మల్లెల మేలిమితావులు మెచ్చి మదాళులు మింటను రా
నంచిత కంకణహారరుచుల్ సెలువారఁగ బైవలువంచల నిం
చించుక జాఱఁగ నిందునిభానన యేఁగెఁ గుమారుని యింటికినై 214

సుందరిగానున్న ఆ పూతనయొక్క బంగారు కుండలములకాంతులు చెక్కిళ్లపై ప్రతిఫలించుచుండెను. ఆమె తన కొప్పునందు ధరించిన మల్లెపూలగుబాళింపులచే ఆకర్షితములై, గండు తుమ్మెదలు వాటిచుట్టును తిరుగుచుండెను. అద్భుతములైన ఆమెకంకణములు, హారములు కాంతులను విరజిమ్ముచుండెను. ఆమె పైటచెరగులు కొద్దిగా జారుచుండెను. ఆ సుందరీమణి శ్రీకృష్ణుడు ఉన్న నందునిఇంటిలో ప్రవేశించెను.

వ. ఆ సమయంబున 215

మ. సిరి మమ్మున్ బ్రదుకంగఁ జూచు కొఱకై శృంగారవేషంబుతో
నరుదేనొప్పు నటంచు గోపికలు జిహ్వాల్ రాక మోహించి త
త్పరలై చూడ లతాంగి వోయి కనియెం బర్యంకమధ్యంబునన్
బరు భస్మానలతేజు దుర్జనవధప్రారంభకున్ డింభకున్. 216

ఆ సమయమున గోపికలు ఆ సుందరిని గాంచి, 'లక్ష్మీదేవియే మనభాగ్యములను పండించుటకై అద్భుతరూపముతో మనకడకు వచ్చినదా! ఏమి?' అని భావించుచు, గొంతులు పెగలక, కన్నులప్పగించి, చూడసాగిరి. అంతట పూతన చొరవతో లోపలికి వెళ్లి, బాలకృష్ణుని చూచెను. దుర్జనులను వధించుటకై అవతరించి, శిశురూపమున ఉన్న ఆ పరాత్పరుడు నివురుగప్పిన నిప్పువలె(1) తేజరిల్లుచుండెను.

1. భస్మచ్ఛన్నాగ్నిన్యాయము - బూడిదచే కప్పబడిన అగ్నిరీతి. భస్మముచే కప్పబడిన నిప్పు బయటికి ఆరినట్లు కనబడుచున్నను అది లోన కణకణలాడుచు మెరయుచుండును. అట్లే శ్రీకృష్ణుడు బయటికి శిశువుగా కనబడుచున్నను, లోపల దివ్యతేజస్సుతో వెలుగొందుచున్నాడు.

వ. కని కదియవచ్చు సమయంబున 217

శా. ఆ లోకేశ్వరుఁడాచరాచరవిభుండాబాలగోపాలుఁడా
బాలధ్వంసిని గొంటు గంటిడి వెసన్ బాలెంతచందంబునం
బాలిండ్లన్ విష మూని వచ్చుట మదిన్ భావించి లోనవ్వుచుం
గాలుం గేలు నెఱుంగకున్న కరణిం గన్మోడ్చి గుర్వెట్టఁగన్. 218

పిమ్మట పూతన ఆ బాలకృష్ణుని సమీపమునకు చేరుసమయమున పిల్లలను హతమార్చెడి ఆ పూతన కపటబుద్ధితో స్తనములకు విషము పూసికొని, బాలెంతరాలివలె తనకడకు వేగముగా వచ్చిన విషయమును బాలగోపాలుడుగా ఉన్న లోకేశ్వరుడు గ్రహించెను. చరాచరములకు ప్రభువైన ఆ కృష్ణుడు లోలోన నవ్వుకొనుచు కాలుసేతులను కదల్పక, కన్నులుమూసికొని, గుఱ్ఱుపెట్టుచు నిద్రించుచున్నట్లు నటింపసాగెను.

క. ఆ పాపజాతి సుందరి, యా పాపనిపాన్పుఁజేర నరిగి కరములన్
లేపి చనుంగవ శిశువున్, మోపుచు ముద్దాడి శిరము మూర్కొని పలికెన్. 219

రాక్షసజాతికి చెందిన (దుష్టాత్మురాలైన) ఆ పూతన శిశువుయొక్క శయ్యా కడకు చేరి, అతనిని తన చేతులతో కదిపి, తన యొడిలోనికి తీసికొనెను. పిదప ఆ శిశువును తన గుండెలకు హత్తుకొని శిరస్సును మూర్కొని, ముద్దాడుచు ఇట్లు పలికెను.

క. చను నీకుఁ గుడుపఁజాలెడి, చనువారలు లేరు నీవు చనవలె ననుచుం
జను గుడిపి మీఁద నిలుకడఁ, జనుదాన ననంగ వేడ్కఁజనుఁ జనుగుడుపన్. 220

క. నా చనుఁబా లొకగ్రుక్కెండో, చిన్నికుమార! త్రావు మొయ్యన పిదపన్
నీ చెలువ మెఱుఁగవచ్చును, నా చెలువము సఫలమగును నళినదళాక్షా! 221

"బాలకా! నీకు పాలియ్యగలవారు లేనేలేరు, నీవు వృద్ధి పొందుటకై (చనిపోవుటకై) నేను నీకు పాలిచ్చెదను. నీకు పూర్తిగా స్తన్యమును ఇచ్చిన తరువాత నేను తిన్నగా వెళ్లెదను (అసువులను కోల్పోయెదను)" అనుచు వేడుకగా పాలిచ్చుటకు సిద్ధమయ్యెను. "చిన్నారీ! కమలాక్షా! నీవు నా చనుబాలు తిన్నగా ఒక గ్రుక్కెడు త్రాగుము. పిమ్మట నీ పరిస్థితి తెలియవచ్చును. నా ప్రయత్నము సఫలమగును.[1]

వ. అని బాలు నుద్దేశించి ముద్దాడెడిభంగి మాటలాడెడి చేడియం జూచి. 222

మ. వనితా! ముట్టకుమమ్మ చన్ను గుడుపన్ వల్దమ్మ ! నీచన్ను మా
తనయుండొల్లఁడు వాసి పొమ్మని యశోదారోహిణుల్ చీరఁ గై
కొనకీక్షించుచు మాయఁబన్ని పెలుచం గోశంబులో వాలు మె
ల్పున రాజిల్లుచు మాటమెత్తఁదనమున్ లో వాఁడియున్నేర్పడన్. 223

అని శిశువును ముద్దాడబోవుచున్నట్లు కపటవచనములను పలుకుచున్న ఆ సుందరిని జూచి, యశోదయు, రోహిణియు ఆమెతో ఇట్లు నుడివిరి. "సుందరీ! నీవు మా శిశువును తాకవద్దు, చనుగుడుపనక్కరలేదు. నీ చనుబాలు త్రాగుటకు మా

1. నా పాలు త్రాగినచో నీవు మరణించుట తథ్యము. నా ప్రయత్నము నెరవేరును. ఇది బాహ్యార్థము. నా పాలు త్రాగియు నీవు క్షేమముగా ఉందువు. నా జన్మ ధన్యమగును. ఇది అంతరార్థము.

బాలుడు ఇష్టపడడు. ఇక్కడినుండి నీవు వెళ్లిపొమ్ము" అని ఆ ఇద్దరు పలుకుచున్నను పూతన వారి మాటలను పట్టించుకొనలేదు. ఆమె కపటబుద్ధితో ఒరలోని కత్తివలె, లోపల విషమున్నను పైకి మెత్తగా మాట్లాడుచు మంచిదానివలె కనబడసాగెను.

వ. కదిసి కలికిపలుకులు పలుకుచు, నులుకు సెడి, జళుకు సొరక, యెదుర నిదురగదిరిన ఫణి యని యెఱుంగక, గుణమతిం దిగుచు జడమతి బెడంగునఁ గఱటి జలధి తెఱవవెరవునం జనుదెంచి పఱపునడుమ నొఱపు గలిగి మెఱయుచుఁ గన్ను దెఱవక, వెఱపు మఱపు నెఱుంగక, కొమరు మిగులు చిఱుతకొమరునిందిగిచి, తొడలనడుమ నిడుకొని, యొడలు నివురుచు, నెడనెడ మమతం గడలు కొలుపుచు, "ఆఁకొన్న చిన్నయన్న! చన్నుగుడువు" మని చన్నిచ్చు సమయంబున. 224

అనంతరము పూతన శిశువును మూర్ఖుని, ఏమాత్రము భీతిల్లక, తత్తరపాటులేక మృదువచనములను పలుకుచుండెను. ఎదుట నిదురించుచున్నట్లు ఉన్న, ఆ బాలుడు సర్పమువలె ప్రమాదకారి యని ఎరుగకపోయెను. సత్పురుషుని లాగుచున్న మూర్ఖునివలె, మోసగత్తెయైన ఆ దుర్మార్గురాలు తిన్నగాచేరి, శయ్యపై మనోహరముగా భాసిల్లుచున్న ఆ చిన్నిబాలుని ఎత్తుకొని తన యొడిలో చేర్చుకొనెను. అప్పుడు ఆ చిన్నారి కనులు మూసికొని, భయముగాని, విస్మృతిగాని లేక ఒప్పుచుండెను. అంతట ఆమె చిన్నికృష్ణుని నిమురుచు మధ్యమధ్య కపట ప్రేమను ప్రకటించుచు 'నా ముద్దులకూనా! ఆకలిగొనియుంటివేమో? నా చనుబాలు త్రాగుము' అని యనుచు చనుగుడుపసాగెను.

సీ. మేల్కొన్న తెఱఁగున మెల్లన కనువిచ్చి క్రేఁగంటఁ జూచుచుఁ గిదికి నీల్గి
యావులించుచుఁ జేతు లాదరంబునఁ జాఁచి యొదిఁగిలి యాఁకొన్న యోజ నూఁది
బిగి చన్నుఁగవఁ గేలఁ బీడించి కబళించి గ్రుక్క గ్రుక్కకు గుటుగుటుకు మనుచు
నొకరెండు గ్రుక్కల నువిదప్రాణంబులు సైతము మేనిలో సత్త్వమెల్లఁ
తే. ద్రావె నదియును గుండెలు దల్లడిల్లఁ జిమ్మఁ దిరుగుచు నిలువక శిరము వ్రాల
నితర బాలురక్రియవాఁడ వీవు గావు చన్ను విడువుము విడువుము చాలుననుచు 225

క. నిబ్బరపు దప్పి మంటలు, ప్రబ్బిన ధృతిలేక నేత్ర పద హస్తంబుల్
గొబ్బున వివృతములుగ నా, గుబ్బగుచున్నట్టి కూఁతఁ గూలెన్ నేలన్ 226

అంతట బాలకృష్ణుడు నిద్రనుండి మేల్కొనుచున్న రీతిగా తిన్నగా కనులు తెరచి, ఆమెను క్రీగంటితో చూచెను. పిదప అతడు ఒడలు విరుచుచు, నిక్కి ఆవులించుచు ఆదరమును ప్రదర్శించుచు చేతులు చాచెను, నెమ్మదిగా ఒదిగికొని, ఆకలిగొన్నరీతిగా అతడు ఆమెస్తనములను తన చేతులతో పట్టుకొని పీడించుచు, చూచుకములను తన నోటిలోనికి చేర్చుకొనెను. మరియు ఆతడు గ్రుక్కగ్రుక్కకు గుటుకు గుటుకు మనుచు ఒక రెండు గ్రుక్కలలో ఆ పూతన యొక్క శరీరబలమును, ప్రాణములను పీల్చివేసెను. అప్పుడు ఆ రాక్షసి గుండెలు తల్లడిల్లగా గిలగిలలాడుచు నిలువలేకపోయెను. అంతేగాక ఆమె తన తల వ్రేలాడుచుండగా 'నీవు ఇతర బాలురవంటివాడవు కావు, ఇంక పాలను త్రాగుట చాలించి, చన్నులను విడిచి పెట్టుము' అని బాధతో మొత్తుకొనెను. ఇంకను తీవ్రమైన దాహము, మంటలు ఏర్పడగా ఆమె తన శక్తిని కోల్పోయెను. క్రమముగా ఆ పూతన తన పాదములు, చేతులు చచ్చుబడిపోగా కన్నులను తేలవేయుచు ఆయాసముతో వగర్చుచు నేలగూలెను.

మ. అదరెం గొండలతోడ భూమి గ్రహతారానీకముల్ మింటిపై
బెదరెన్ దిక్కుల మాఱుమ్రోఁత లెసఁగెన్ భీతిల్లి లోకంబులుం

గదలంబాతెను వజ్రభిన్నగిరిరేఖం బూర్వదేహంబుతోఁ
త్రిదశధ్వంసిని కూలి కుయ్యిడినఁ దద్ఘోరఘోషంబునన్. 227

వజ్రాయుధముదెబ్బకు ముక్కలైన పర్వతమువలె దేవతలను ధ్వంసమొనర్చునట్టి ఆ పూతన తన రాక్షసరూపముతో నేలమీదబడి, మిగుల బిగ్గరగా పెద్దపెద్ద అరపులతో గగ్గోలుపెట్టుచుండగా, భూమియు, కొండలును అదరిపోయెను, ఆకాశమున గల గ్రహములు, నక్షత్రములు భీతిల్లెను (చెదరెను), దిక్కులన్నియు ప్రతిధ్వనించెను. సకల లోకములును భయముతో వణకిపోయెను.

క. అప్పుడు దెప్పర మగు నా, చప్పుడు హృదయములఁ జొచ్చి సందడివెట్టన్
ముప్పిరిగొని పడిరెఱుకలు, దప్పి ధరన్ గొల్లలెల్ల దల్లడపడుచున్. 228

భయంకరమైన ఆ పూతన గర్జనకు తమ గుండెలు అవియగా యాదవులు ఎల్లరును కంగారుతో పరస్పరము పైన వైచుకొనుచు స్పృహలు దప్పి నేలపై పడిపోయిరి.

క. ఆ జఱభిరండ రక్కసి, నైజశరీరంబు నేల నలియంబడినన్
యోజనమున్నర మేర ధ, రాజంబులు నుగ్గులయ్యె రాజవరేణ్యా! 229

మహారాజా! మోసగత్తెయైన ఆ రాక్షసి, తన పూర్వ (రాక్షస) శరీరముతో పడిపోగా అచట భూమి క్రుంగిపోయెను, ఒకటిన్నర యోజనముమేరకు చెట్లన్నియు నుగ్గునుగ్గయ్యెను.

సీ. దారుణలాంగల దండదంతంబులు నగగహ్వరముఁబోలు నాసికయును
గండశైలాకృతిగల కుచయుగమును విరిసి తూలెడి పల్లవెంద్రుకలును
జీఁకటి నూతులఁ జెనయు నేత్రంబులుఁ బెనుదిబ్బఁ బోలెడి పెద్దపిఱుఁదుఁ
జాఁగుకట్టలఁ బోలు చరణోరుహస్తంబులింకిన మడువుతో నెనయు కడుపుఁ
క. గలిగి షట్క్రోశదీర్ఘమై కదిసి చూడ భయదమగు దాని ఘనకళేబరముఁ జూచి
గోప గోపీజనంబులు గుంపు గూడి బెగడుచుండిరి మనముల బెదరు గదిరి. 230

ఆ రాక్షసియొక్క దంతములు నాగలికఱ్ఱలవలె భీకరముగా ఉండెను, ముక్కురంధ్రములు కొండగుహలవలె ఒప్పుచుండెను. కుచద్వయము పర్వతశిలలవలె కన్పట్టుచుండెను. కావి (ఎఱ్ఱని) చింపిరిజుట్టు వ్రేలాడుచుండెను, నేత్రములు చీకటితో నిండిన లోతైన నూతులవలె గోచరించుచుండెను. పెద్దపెద్ద పిరుదులు పెద్ద మట్టి దిబ్బలను బోలియుండెను, పాదములు, తొడలు, చేతులు పొడవైన చేలగట్టులవలె కనబడుచుండెను, కడుపు నీళ్లు ఇంకిపోయిన మడుగును బోలియుండెను. ఆ పూతన కళేబరము ఆరుక్రోసుల (12మైళ్ల) పొడవు గలిగియుండెను. గుంపులుగా వచ్చిచేరిన గోపికలు, గోపాలురు ఆ శవమును జూచి మిగులభీతిల్లిరి. వారి మనస్సులు 'ఇకపై ఏమి కీడు మూడునో' అను దిగులుతో నిండియుండెను.

వ. ఇ వ్విధంబున 231

క. ఆ తతిఁగుడవఁగ నడిచెన్, నూతన ఫుల్లాబ్జలోచనుఁడు హరి మృత్యు
ద్యోతనఁగృతమునిసముదయ, యాతనఁ బూతన నెఱింగి యాతనిలీలన్ 232

క. విషధరరిపు గమనునికిని, విషగళ సఖునికిని విమల విష శయనునికిన్
విషభవభవ జనకునికిని, విషకుచచనువిషముఁ గొనుట విషమే తలఁపన్. 233

మునులను తీవ్రముగా వేధించినదియు, మృత్యుదేవతవలె భయంకరమైనదియు అగు పూతనను, ఆమె దుష్టసంకల్పమును కమలాక్షుడగు శ్రీకృష్ణుడు గ్రహించెను. వెంటనే ఆ స్వామి పాలు త్రాగు నెపముతో ఈ విధముగా ఆమె ప్రాణములను హరించెను. అంతట ఆ చిన్నిబాలుడు ఆమె వక్షఃస్థలమునజేరి, తన బాల్యలీలతో నడయాడసాగెను. విషసర్పములకు శత్రువైన గరుడుడు ఆ శ్రీహరికి వాహనము, హాలాహలవిషమును కంఠమున ధరించిన పరమశివుడు మిత్రుడు. ఆ స్వామి కల్పాంతమున నిర్మలములైన జలములపై శయనించువాడు (వటపత్రశాయి)[1], కమలభవుడైన బ్రహ్మకు తండ్రి. అట్టి మహాత్మునకు విషకుచయైన[2] పూతనయొక్క చనువిషమును త్రాగుట ఒక కష్టమా?[3]

వ. అంత నా గోప గోపీజనంబులు తెలిసి, రోహిణీ యశోదలం గూడుకొని బెగ్గడిలక డగ్గఱి. 234

శా. నేలం గూలిన దాని పెన్నురముపై నిర్భీతిఁ గ్రీడింప నో
బాలా! రమ్మని మూఁపుఁ జేర్చుకొని సంస్పర్శించి యూరార్చుచున్
గోలాంగూలముఁ ద్రిప్పి గోవురజమున్ గోమూత్రమున్ జల్లి త
ద్బాలాంగంబుల గోమయం బలఁదిరాపంద్రెండు నామంబులన్. 235

అంతట వ్రేపల్లెలోని గోపికలు, గోపాలురు జరిగిన విషయములను ఎఱింగి, రోహిణీయశోదలతోగూడి ఏమాత్రమూ భీతిల్లక ఆ కళేబరసమీపమునకు వచ్చిరి. పిమ్మట వారు పూతన రాక్షసియొక్క విశాలమైన వక్షస్థలముపై నిర్భయముగా విహరించుచున్న ఆ బాలకృష్ణునితో 'రా! నాయనా! రా!' అనుచు ఎత్తుకొనిరి. మూపున నిమురుచు ఆ బుడుతని ఊఱడింపసాగిరి. పిదప అతని చుట్టును ఆవుతోకతో త్రిప్పిరి. గోధూళిని, ఆవుపంచితమును చల్లిరి. తదుపరి కేశవాది ద్వాదశనామములను పఠించుచు ఆ బాలుని అవయవములన్నింటి మీదను గోమయమును అద్దిరి.

వ. మఱియు, నంతటం దనియక, గోపికలాచమనంబు సేసి, దక్షలయి, మునుపుగాఁదమకు రక్షాకరంబగు బీజన్యాసంబు సేసికొని, చిన్ని యన్న! నీ యడుగులజుండును, జానువు లనిలుండును, దొడలు యజ్ఞుండును. గటితలం బచ్యుతుండును, గడుపు హయాస్యుండును, హృదయంబు కేశవుండును, నురమీశుండును, గంఠం బినుండును, భుజంబులు చతుర్భుజుండును, ముఖంబు త్రివిక్రముండును, శిరంబీశ్వరుండును రక్షింతురు. ముందు చక్రియు, వెనుక గదాధరుం డైన హరియుఁ, బార్శ్వంబుల ధనుర్ధరుండైన మధువైరియు నసిధరుండగు జనార్దనుండును గోగణంబుల శంఖ చక్రగధాధరుండైన యురగశయనుండును, మీఁదు నుపేంద్రుండును, గ్రిందు తార్క్ష్యుండును, నంతటను హలధరుండగు పురుషుండును గాతురు. నీ యింద్రియంబుల హృషీకేశుండును, బ్రాణంబుల నారాయణుండును, జిత్తంబును శ్వేతద్వీపపతియును, మనంబును యోగీశ్వరుండైన కపిలుండును, బుద్ధిని బృశ్నిగర్భుండును, నహంకారంబును భగవంతుండైన పరుండును బాలనంబు సేయుదురు. నీవు క్రీడించునెడ గోవిందుండును, శయనించుతఱి మాధవుండును, నడచువేళ వైకుంఠుండును, గూర్చున్న సమయంబున శ్రీపతియును, గుడుచు కాలంబున సర్వభక్షకుండైన యజ్ఞభుజుండును నేమఱ కుండుదురు. నిన్నుఁబేర్కొనిన దుస్స్వప్న వృద్ధ బాల గ్రహంబులును, గూశ్మాండ డాకినీ యాతుధానులును, భూత ప్రేత యక్షరాక్షస పిశాచ వినాయకులును గోటరారేవతులును జ్యేష్ఠాపూతనలును, మాతృకాది గణంబులు నశియింతురు. నీ యందుఁ బ్రాణేంద్రియ శరీరనిరోధంబు లయిన

1. శ్లో॥ కరారవిందేన పదారవిందం, ముఖారవిందే వినివేశయంతమ్ ।
వటస్య పత్రస్య పుటే శయానం, బాలం ముకుందం మనసా స్మరామి ॥ (కృష్ణకర్ణామృతము)

2. విషకుచ = స్తనములయందు విషమును నింపుకొన్నది.

3. విషము = గరళము, నీరు, కష్టము.

యున్మాదంబులును, నపస్మారంబులును, మహోత్పాతంబులును బొందకుండుం గావుత మని రక్షసేసి, దీవించి రంత. 236

అంతటితో తృప్తిపడక గోపికలు అచమనములను ఆచరించి, గట్టి పూనికగలవారై ముందుగా తమకు రక్షాకరమైన 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అను ద్వాదశాక్షరీ మంత్రబీజ వ్యాసంబులను గావించిరి. అనంతరము వారు రక్షలు గట్టి ఇట్లు శ్రీకృష్ణుని దీవించిరి. 'చిన్నారీ! నీ పాదములను బ్రహ్మదేవుడు, మోకాళ్లను వాయుదేవుడు, తొడలను యజ్ఞుడు, కటిప్రదేశమును అచ్యుతుడు, కడుపును హయగ్రీవుడు, హృదయమును కేశవుడు, వక్షఃస్థలమును ఈశుడు, కంఠమును సూర్యుడు, భుజములను చతుర్భుజుడు, ముఖమును త్రివిక్రముడు, శిరస్సును ఈశ్వరుడు రక్షింతురుగాక. ముందు భాగమును చక్రియు, వెనుకభాగమును గదాధరుడైన హరియు, ఇరుపార్శ్వభాగములను ధనుర్ధారియైన మధువైరియు, ఖడ్గధారియగు జనార్దనుండును, మూలభాగములను శంఖ చక్ర గదాధరుండైన శేషశాయియు, ఊర్ధ్వభాగమును ఉపేంద్రుడును, అధోభాగమును గరుత్మంతుడును, చుట్టును (సర్వాంగములను) హలధరుడగు పురుషోత్తముడును కాపాడుదురుగాక. నీ ఇంద్రియములను హృషీకేశుడు, ప్రాణములను నారాయణుడు, చిత్తమును శ్వేతద్వీపపతియగు శ్రీహరియు, మనస్సును యోగీశ్వరుడైన కపిలుడును, బుద్ధిని పృశ్ని గర్భుడును, అహంకారమును భగవంతుడైన పరమేశ్వరుడును పాలించుచుందురుగాక. నీవు క్రీడించు సమయమున గోవిందుడు, పరుండునప్పుడు మాధవుడు, నడచువేళ వైకుంఠుడు, కూర్చున్న సమయమున శ్రీపతి, భుజించునప్పుడు సర్వభక్షకుడైన యజ్ఞభుజుడు ఏమఱుపాటులేక రక్షించుచుందురుగాక. నీ పేరు వినబడినంతనే చెడుకలలు, వృద్ధగ్రహములు, బాలగ్రహములు, కూష్మాండ పిశాచములు, డాకినులు, రాక్షసులు, భూతములు, ప్రేతలు, యక్షులు, రాక్షసులు, పిశాచములు, క్షుద్రదేవతలు, కోటరాది భూతములు, జ్యేష్ఠాది భూతనాథులు, మాతృకాది గణదేవతలు నశింతురు. ప్రాణములకును, ఇంద్రియములకును, శరీరమునకును బాధాకరములైన ఉన్మాదములు, అపస్మారములు, మహోత్పాతంబులు నిన్ను పొందకుండుగాక.

క. ఆ పెద్ద వేడబంబుల, పాపనికిని జన్నుఁగుడిపి పానుపుపై సం
స్థాపించికప్పి కూరుకు, మో పాపఁడ! యని యశోద యొయ్యన పాడెన్. 237

అంతట యశోదాదేవి అద్భుతమైన మాయలు (లీలలు)గల ఆ చిన్నికృష్ణునకు స్తన్యమిచ్చి, పాన్పుపై పరుండబెట్టి, దుప్పటిగప్పి 'కన్నయ్యా! ఇంక నిద్రపొమ్మ' అనుచు మధురముగా జోలపాటలు పాడెను.

వ. అంత నందుండు మొదలయిన గోపకులు మధురనుండి వచ్చి, రక్కసి మేనుగని వెఱఁగుపడి, మున్ను వసుదేవుం డుత్పాతంబు లెఱింగి చెప్పె. అతండు మహా యోగి యని పొగడి, కఠోరం బగు పూతన యొడలు కుఠారంబుల నఱికి, తమకుటీరంబులకుం దవ్వగు ప్రదేశంబునఁ బటీరంబుల దహనంబు సంగ్రహించి దహించిరంత.

238

ఇంతలో నందుడు మొదలగు గోపాలురు మధురనుండి వ్రేపల్లెకు వచ్చి, పూతన రాక్షసియొక్క కళేబరమును జూచి, మిగుల ఆశ్చర్యపడిరి. పిదప వారు 'ఇంతకు ముందే వసుదేవుడు ఈ ఉపద్రవములను గూర్చి సూచనగా చెప్పెను. యథార్థముగా అతడు ఒక మహాయోగి, అనుచు ఆయనను మిగుల ప్రశంసించిరి. రాతివలె కఠినమైన పూతనశరీరమును గొడ్డళ్లతో నరికియు, ముక్కలు గావించి, వాటిని తమ గృహములకు దూరముగా ఉన్న ప్రదేశమునకు చేర్పించిరి. అనంతరము గంధపు చెక్కల చితిపై వాటిని దహింపజేసిరి.

ఆ. పొగిలి పొగిలి కాలు మగువదేహంబున నగరుపరిమళముల పొగలు వెడలె
దేహకల్మషములు శ్రీహరిముఖమునఁ ద్రావఁబడుటఁజేసి భూవరేణ్య! 239

పరీక్షిన్మహారాజా! క్రమక్రమముగా ఆ దేహమునందు అంతటను అగ్ని రగుల్కొనెను. శ్రీహరి పాలు త్రాగు మిషతో ఆమె దేహములోని కల్మషములను అన్నింటిని పీల్చివేయుటవలన అందుండి సుగంధములతో గూడిన పొగలు బయల్వెడలెను.

క. హరి తనమీఁదం బదములుఁ, గరములు నిడి చన్ను గుడిచి కదిసినమాత్రన్
హరిజననిపగిదిఁ బరగతి, కరిగెను దురితముఁ బాసి యసురాంగనయున్. 240

శ్రీకృష్ణుడు ఆమె యొడియందుండి చేతులతో, కాళ్లతో తాకుచు, స్తన్యమును గ్రహించినంత మాత్రముననే ఆ రాక్షసస్త్రీ పాపములు తొలగి, కన్నతల్లివలె పరంధామమునకు చేరెను.

క. వెన్నుని కొకమఱి విషమగు, చన్నిచ్చిన బాలహంత్రి చనె నఁట దివికిన్
వెన్నునిఁగని పెంచుచుఁదన, చన్నిచ్చిన సతికి మఱియు జన్మము గలదే. 241

శిశుహంతకురాలైన పూతన ఒక్క పర్యాయము శ్రీకృష్ణునకు విషపూరితమైన చనుగుడిపినంతమాత్రమున ఆమె స్వర్గమునకు చేరెను. ఇంక ఆ ప్రభువును కని, పెంచి, పాలు గుడిపిన యశోదమ్మకు ఇక పునర్జన్మ ఎక్కడిది?

క. హరిఁగని చన్నులు గుడిపెడి, తరుణులు ప్రాప్తించు పదము దలఁపఁగ వశమే
హరియారగించుటకుఁ బా, ల్గురిసిన ధేనువులు ముక్తికొనలఁ జరించున్. 242

శ్రీకృష్ణుని తమ యొడిలో జేర్చుకొని, చనుబాలిచ్చెడి వనితలు (యశోదాది వనితలు) పొందెడి మహాఫలమును (మోక్షపదమును) గూర్చి తెల్పుట అసాధ్యము. ఆ బాలకృష్ణుడు త్రాగుటకై తమ పొదుగులనుండి పాలను వర్షించిన గోవులు సరాసరి ఆ ముక్తిధామునకే (పరంధామమునకే) చేరుట తథ్యము.

క. ఆ పూతన మెయిగంధము, గోపాలు రెఱింగి యిట్టి కువనిత యొడలం
దీపాటి స్వాదుగంధము, ప్రాపించునె యనుచుఁ జనిరి పల్లెలకధిపా! 243

రాజా! గోపాలురు ఆ పూతనశరీరమునుండి సువాసనలు వచ్చుట గ్రహించిరి. 'ఈ దుష్టాత్మురాలి తనువునుండి ఇట్టి పరిమళములు వెలువడుట మిగుల ఆశ్చర్యముగదా!' అని అనుకొనుచు వారు తమ పల్లెలకు చేరిరి.

వ. అంత నందుండు, పరమానందంబున నింటికిం జని, వ్రేతలచేత రక్కసిచేఁతలన్నియు నెఱింగి, వెఱఁగుపడి, పాపని లేపి, శిరంబు మూర్కొని, ముద్దాడి, ముదంబున నుండె. అని చెప్పిన, విని పరీక్షిన్నరేంద్రుండిట్లనియె.244

పిమ్మట నందుడు పరమానందంబుతో ఇంటికి చేరెను. అతడు యశోదాది గోపికలవలన పూతనరాక్షసి యొనర్చిన చేష్టలను అన్నింటిని ఎరింగి మిగుల ఆశ్చర్యపడెను. పిదప చిన్నికృష్ణుని లేపి శిరమును మూర్కొని, ముద్దాడి ఆనందించుచు హాయిగా ఉండెను. శుకమహర్షి చెప్పిన ఈ విషయములను విని, పరీక్షిన్మహారాజు ఇట్లు నుడివెను.

క. ఏయే యవతారంబుల, నేయే కర్మములు సేసె నీశుఁడు హరి భ
ద్రాయతనము లన్నియు వినఁ, బాయదు చిత్తంబు సెవులపండువులయ్యెన్. 245

క. ఉరు సంసారపయోనిధి, తరణంబులు బాపపుంజ తరణంబులు శ్రీ
కరణంబులు ముక్తిసమా,చరణంబులు బాలకృష్ణు సంస్మరణంబుల్ 246

"శుకయోగీంద్రా! సర్వేశ్వరుడైన శ్రీమహావిష్ణువు ఆయా అవతారములలో ఒనర్చిన కర్మలన్నియును లోకకల్యాణదాయకములే. వీనులవిందుగావించెడి ఆ స్వామి లీలలను ఎంతగా విన్నను తనివితీరుటలేదు.

బాలకృష్ణునిదివ్యగాథలన్నియును అంతులేని ఈ సంసారసముద్రమునుండి తరింపజేయును. పాప పంకిలములనుండి ఉద్ధరించును, సమస్తసంపదలను (శుభములను) ప్రసాదించును. ముక్తిధామమును అనుగ్రహించును. నిరంతరము ఆ ప్రభువును స్మరించినవారు ఎంతయు ధన్యులు.

వ. అని తరువాత బాలకృష్ణుం డేమి సేసె. నాయందుం గృప గలదేనిం జెప్పవే యని యడిగిన, రాజునకు శుకుం డిట్లనియె. 247

ఇంకను బాలకృష్ణుడు ఏయే లీలలను ప్రదర్శించెను? నా యందు కృపజూపి వాటినన్నింటిని గూర్చి తెలుపుము" అని అడిగిన మహారాజుతో ఆ శుకయోగి ఇట్లు వచించెను.

సీ. బాలకుం డొదిఁగిలంఁ బడనేర్చె నని జన్మ నక్షత్రమందొకనాఁడు నందు
పాలఁతి వేడుక బోర్కుఁబోయ వ్రేతలఁ జీరి వాదిత్ర గీతారవంబు సెలఁగ
విప్రులతోఁగూడ వేదమంత్రంబుల నభిషేచనాదిక మాచరించి
వారి దీవెనలొంది వారికి మొదవుల నన్నంబుఁ జీరల నడిగినట్టు
ఆ. లిచ్చి బాలుఁ దియ్య మెసఁగఁ బానుపు సేర్చి నిదుర పుచ్చి గోపనివహమునకు
గోపికలకుఁ బూజఁ గొమరారఁ జేయుచు జనని కొడుకు మఱచె సంభ్రమమున. 248

ఆ చిన్నారి క్రమముగా ప్రక్కకు పొర్లనేర్చెను. అంతట యశోదాదేవి శ్రీకృష్ణునిజన్మనక్షత్రమైన రోహిణినాడు ఉత్సాహము వెల్లివిరియగా గోపికలను అందరిని తమ ఇంటికి ఆహ్వానించెను. వీణావేణుమృదంగ వాద్యములు మధురముగా మ్రోగినవి. బ్రాహ్మణోత్తములు వేదమంత్రములను పఠించుచు, ఆ చిన్నికృష్ణుని అభిషేకించి, దీవించిరి. వారికి యశోదాదేవి తృప్తికరముగా గోదానములను, అన్నదానములను గావించి, వస్త్రాభరణములను బహూకరించెను, హాయినిగొల్పు మెత్తని శయ్యపై బాలుని పరుండబెట్టి నిద్రపుచ్చెను. అనంతరము గోపికలకును, గోపాలురకును తగిన విధముగా గౌరవమర్యాదలు సలిపెను. ఆ సందడిలో ఆ తల్లి తన కొడుకు విషయమును మరచెను.

### బాలకృష్ణుండు శకటముం దన పాదమునఁ గూలఁదన్నుట

వ. ఆ సమయంబున. 249

క. నిదురించిన శిశువాఁకొని, కిదుకుచుఁ జనుఁగోరి కెరలి కిసలయ విలస
న్మృదు చక్ర చాప రేఖా, స్పదపదమునఁ దన్నె నొక్క బండిన్ దండిన్. 250

ఆ సమయమున నిద్రించుచున్న ఆ శిశువు మేల్కొని ఆకలిగొని, ఒడలు విఱుచుచు, చనుబాలు త్రాగుటకై ప్రక్కకు తిరిగెను. పిదప అతడు చక్రము, ధనుస్సు మొదలగు రేఖలు (ఇహ్నములు) గలిగి, చిగురుటాకువలె సుతిమెత్తని తన పాదముతో అచటనున్న ఒక బండిని బలముగా తన్నెను.

క. శకటము హరి దన్నిన దివిఁ, బ్రకటంబై యెగసి యిరుసు భరమునఁ గండ్లున్
వికటంబుగ నేలంబడ, నకటా! యని గోపబృంద మాశ్చర్యపడన్. 251

శ్రీకృష్ణుడు తన్నిన దెబ్బకు ఆ బండి అందఱికిని కనబడునట్లుగా ఆకాశమునకు ఎగిరెను అంతట బరువుగానున్న దాని ఇరుసు, చక్రములు తలక్రిందులై నేలగూలెను. అప్పుడు గోపాలురు అందరును 'అకటా' అనుచు ఆశ్చర్యపడిరి.

వ. అప్పుడందున్న సరసపదార్థంబులు వ్యర్థంబులై నేలం గూలుటం జూచి, యశోదానందముఖ్యులైన గోప గోపికా జనంబులు పనులు మఱచి, పబ్బంబులు మాని యుబ్బు సెడి, వెఱపులు ఘనంబులుగ మనంబులందు.252

క. మిన్నునకూరక యెగయదు, తన్న సమర్థుండు గాఁడు తల్పగతుం డీ
చిన్ని కుమారుఁడు తేరే, విన్నను వున నెగసె దీనివిధ మెట్టిదియో. 253

వ. అని వితర్కించు సమయంబున. 254

క. బాలకుఁడాఁకొని యేడ్చుచుఁ, గాలెత్తినఁ దాకిఁ యెగసెఁ గాని శకటమే
మూలమున నెగయదని యబ్బాలునికడ నాడుచుండి, పలికిరి శిశువుల్. 255

ఆ బండిలోనున్న మధురపదార్థములు అన్నియును నేలపాలై పనికిరాకుండ పోయెను. అప్పుడు యశోదానందులు, ఇతర గోపికలు, గోపాలురు ఆదృశ్యమును జూచి, తమ పనులను, వేడుకలను మానివైచి, ఉత్సాహమును కోల్పోయిరి. వారి మనసులు ఎంతయు భయముతో నిండిపోయెను. అప్పుడువారు 'బండి అకారణముగా ఆకాశమునకు ఎగురుట జరుగదు గదా! శయ్యపై పండుకొనియున్న ఈ చిన్ని శిశువు దీనిని తన్నుటకు సమర్థుడు కాడుగదా! బండి ఆకాశమునకు ఎట్లు ఎగిరెను? ఇంతకును దీనికిటుకు ఏమి?' అని తర్కించుకొనుచుండిరి. ఆ సమయమున అచట శ్రీకృష్ణునిసమీపమున ఆడుకొనుచున్న బాలకులు 'ఈ చిన్నారి ఆకలిగొని ఏడ్చుచు కాలెత్తెను. ఆ కాలి తాకిడికి ఈ బండిపైకి ఎగిరెను. కానిచో బండి ఆకాశమునకు ఎగురుట ఏవిధముగను సాధ్యముకాదు'' అని పలికిరి.

వ. ఇట్లు శిశువులు పలికిన పలుకులు విని, 256

శా. బాలుం డెక్కడ బండి యెక్కడ నభోభాగంబుపైఁ జేడ్పడన్
గాలం దన్నుట యెక్కడేల పడుచుల్ కల్లాడిరీ జడ్డుఁబ
ల్కేలోకంబున నైనఁ జెప్పఁబడునే యే చందమో కాక యం
చాలాపించుచు వ్రేలు వ్రేతలుఁ బ్రభూతాశ్చర్యులైరందరున్. 257

ఆ చిన్న పిల్లల పలుకులను వినిన అనంతరము గోపాలురు, గోపికలు మిగుల ఆశ్చర్యపడుచు ఇట్లు అనుకొనిరి. 'ఈ శిశువేమో మిక్కిలి పసివాడు, బండిమాత్రము చాలపెద్దది, బరువైనది. అట్టి బండి ఆకాశమును తాకునట్లుగా ఈ పసివాడు తన్నుట ఎట్లు సాధ్యము? ఆడుకొనుచున్న ఈ బాలురు అసత్యములు పలుకుచున్నారు. ఇట్టి తెలివి తక్కువమాటలు లోకమున ఎక్కడను ఉండవు. ఇట్లు జరుగుట యథార్థముగా ఒక అద్భుత విషయము'

వ. అప్పుడాబాలునిరోదనంబు విని, యశోద పఱతెంచి. 258

ఆ. అలసితివి గదన్న! యాఁకొంటివి గదన్న! మంచి యన్న! యేడ్పు మానుమన్న!
చన్ను గుడువుమన్న! సంతసపడుమన్న! యనుచుఁజన్ను గుడిపె నర్భకునకు. 259

అంతట తనశిశువురోదనమును విని, యశోదాదేవి పరుగుపరుగున అచటికి వచ్చి, ఆమె తన కన్నయ్యతో 'నాయనా! నీవు మిగుల అలసిపోయితివి, చాల ఆకలిగొంటివి, నా బంగారు బాబువుగదా! ఏడుపు మానుము, నా చనుబాలు త్రాగి హాయిగా నుండుము' అని పలికి, ఆమె తన సుతునకు పాలిచ్చెను.

వ. అంత నబ్బాలుని మేన బాలగ్రహంబు సోఁకునుగదా యని శంకించి, గోపకులనేకులనేకబలివిధానంబులు చేసిరి. బ్రాహ్మణులు దధికుశాక్షతంబుల హోమంబులాచరించిరి. ఋగ్యజుస్సామమంత్రంబుల నభిషేచనంబులు సేయించి, స్వస్తి పుణ్యాహవాచనంబులు సదివించి, కొడుకున కభ్యుదయార్థంబు నందుం డలంకరించిన పాఁడి మొదవుల విద్వజ్జనంబులకిచ్చి, వారల యాశీర్వాదంబులు గైకొని, ప్రమోదించె, నని చెప్పి, శుకుం డిట్లనియె. 260

పిమ్మట చిన్నికృష్ణునకు బాలగ్రహంబులు సోకియుండునేమోయను సందేహముతో గోపాలురు అనేక బలివిధానములను ఆచరించిరి. బ్రాహ్మణులు పెరుగుతో, దర్భలతో, అక్షతలతో హోమములను గావించిరి, పిదప నందుడు తనసుతునిక్షేమమునకై (అభ్యుదయమునకై) ఋగ్యజుస్సామ వేదమంత్రములతో అభిషేకములు చేయించెను, స్వస్తి పుణ్యాహవాచనములను జరిపించెను. విద్వాంసులకు చక్కగా అలంకరించిన పాడియావులను దానముచేసి, వారి ఆశీర్వాదములను గైకొని ఎంతయు సంతోషించెను. ఇట్లు చెప్పిన పిమ్మట ఇంకను శుకుడు ఇట్లనెను.

క. కొడుకు నొకనాఁడు తొడపై, నిడుకొని ముద్దాడి తల్లి యెలమి నివురుచోఁ
గడు దొడ్డ కొండశిఖరము, వడుపున వ్రేఁగయ్యె నతఁడు వసుధాధీశా! 261

క. బరువైన కొడుకు మోవను, వెరవిఁడి యిలమీఁద బెట్టి వెఱచి జనని కా
ధరఁగావఁ బుట్టిన మహా, పురుషుఁడు గాఁబోలు ననుచు బుద్ధిఁ దలంచెన్. 262

మహారాజా! యశోదాదేవి ఒకనాడు తన కన్నయ్యను తొడపై కూర్చుండబెట్టుకొని, ముద్దాడి, ప్రేమతో అతని తనువుపై నిమురుచుండెను. క్రమముగా అతడు పెద్దకొండ శిఖరమువలె బరువెక్కెను. అట్లు బరువెక్కిన కొడుకును తొడపై ఓపజాలక భయపడి నేలపై ఉంచెను. పిమ్మట ఆ తల్లి 'ఈ శిశువు ఈ భూమండలమును రక్షించుటకై అవతరించిన మహాత్ముడు గాబోలు?' అని తలపోసెను.

## తృణావర్తుఁడను రాక్షసుఁడు సుడిగాలియై కృష్ణునెత్తికొనిపోవుట

వ. అప్పుడు, 263

క. ఖరుఁడగు కంసుని పంపున, నరిగి తృణావర్తుఁడవనికవచాటముగా
సురకరువలియై బిసబిస, నరుదరుదన ముసరి విసరి హరిఁ గొనిపోయెన్. 264

క. సుడి యెఱుఁగని హరి సుడివడ, సుడిగాలి తెఱంగు రక్కసుఁడు విసరెడి యా
సుడిగాలి ధూళి కన్నుల, సుడిసిన గోపకులు బెగడి సుడివడిరధిపా! 265

ఆ సమయమున – దుష్టుడైన కంసునిఆదేశముతో తృణావర్తుడు అను రాక్షసుడు సుడిగాలిగా మాఱి, హఠాత్తుగా, వేగముగా భూమిమీదికి దిగి, అందరును ఆశ్చర్యపడునట్లుగా అంతటను ఆవరించి, చిన్నికృష్ణుని తీసికొనిపోయెను. రాజా! దేనికిని చలింపని ఆ కృష్ణుడు క్షోభిల్లునట్లుగా (క్షోభిల్లుటకై), సుడులు తిరుగుచు పెనుగాలిరూపములో వచ్చిన ఆ రాక్షసునివేగమునకు దుమ్ములు చెలరేగెను. ఆ ధూళులు కన్నులలో నిండగా గోపాలకులు భయపడి మిగుల చలించిపోయిరి. (మిక్కిలి వ్యథ చెందిరి).

వ. మఱియు, నవ్వలయపవనదనుజుండు విలయపవనుని తెఱంగునఁ గసిమసంగి, ముసరి మసరు గవిసి విసరెడి సురకరువలిం బొడమిన పుడమిరజంబు వడి నెగసి గగనమున మెఱసి తరణికిరణములకు మఱుఁగుపడిన,నిబిడ మగు బెడిదంపుఁ దిమిరమున దశదిశ లెఱుంగఁబడక, గోకులం బాకులత నొంద, నొండొరుల నెఱుంగక, బెండుపడుచున్న జనంబుల మనంబుల ఘనంబగు భయంబు రయంబునం జెంద, నదభ్ర పరిభ్రమణ శబ్దంబున దిగంతంబులు సెవుడుపడి, పరిభ్రాంతంబులుగ నొక్క ముహూర్తమాత్రంబున భువన భయంకరత్వంబు దోఁచె. ఆ సమయంబున. 266

మఱియు, సుడిగాలి రూపములో వచ్చిన ఆ తృణావర్తుడు ప్రళయకాలవాయువువలె క్రోధముతో విజృంభించి, చుట్టును క్రమ్ముకొని చెలరేగెను. ఆ సుడిగాలి దెబ్బకు ఏర్పడిన దుమ్ములు పైకెగసి ఆకాశమునందంతటను వ్యాపించెను.

ఆ ధూళుల ప్రభావమునకు సూర్యకిరణములు మరుగునబడెను. అంతటను చిమ్మచీకట్లు క్రమ్ముకొనగా దిక్కులు తెలియక గోపికలు, గోపాలురు అందరును వ్యాకులపాటునకు లోనైరి. అప్పుడు వారు ఒకరినొకరు గుర్తింపలేక అధైర్యమునకుగురియైరి. వారిమనస్సులు క్షణములో అంతులేని భయముతో నిండిపోయెను. విపరీతమైన (విస్తారమైన) ఆ సుడిగాలులశబ్దములకు దిగంతములవరకుగల ప్రాణులు అన్నియు ఏమియు వినబడని స్థితిలో భ్రాంతికి గురియయ్యెను. ఒక క్షణకాలములో లోకమునందంతటను భయావహస్థితి ఏర్పడెను.

ఉ. పాపనిఁజూడఁగానక విపద్దశనొంది కలంగి తల్లి యో
పాపఁడ! బాలసూర్యనిభ! బాలశిరోమణి! నేఁడు గాలికిం
జేపడి పోయితే యనుచుఁ జీరుచుఁ దైవముఁజాల దూఱుచుం
దాపమునొంది నెవ్వగల దయ్యుచుఁ గ్రుయ్యుచు బిట్టు గూయుచున్ 267

ఆ సమయమునందు తల్లి యశోద తనబిడ్డడు కనబడకపోవుటచే తనకు ఎదురైన విపత్తునకు మిగుల దిగాలుపడెను. పిదప ఆ తల్లి 'నా చిన్నినాయనా! నీవు బాలసూర్యునివలె తేజోమూర్తివి, బాలురందరిలో నీవు మేటివి, నీవు ఈనాడు ఈ సుడిగాలికిలోనైతివా?' అని యనుచు తన చిన్నికృష్ణుని పిలువసాగెను. దైవమును నిందించుచుండెను. ఆమెమిగుల పరితపించుచు తీరని దుఃఖమునకు గురియయ్యెను. ఆ తల్లి ఎంతయు డస్సిపోయి, శోకముతో వాపోవుచుండెను.

క. సుడిగాలి వచ్చి నిన్నున్, సుడిగొని కొనిపోవ మింట సుడిసుడి గొనుచున్
బెడఁగడరెడి నా ముద్దుల, కొడుకా! యే మంటి వనుచు ఘోరంబనుచున్ 268

ఉ. ఇక్కడఁ బెట్టితిం దనయుఁ డిక్కడ నాడుచునుండె గాలి దా
నెక్కడినుండి వచ్చె శిశువెక్కడి మార్గము వట్టి పోయె నే
నెక్కడఁ జొత్తు నంచుఁ గమలేక్షణ క్రేపుఁ దొఱంగి ఖిన్నయై
పొక్కుచు వ్రాలు గోవుక్రియ భూస్థలి వ్రాలె దురంతచింత యై. 269

'కన్నయ్యా! ఆ పాడు సుడిగాలివచ్చి, వలయాకారమున గిరగిర తిరుగుచు నిన్ను ఆకాశమునకు ఎత్తుకొనిపోయెను. అక్కడ సుడిగాలి వేగమునకు నీవు ఎంతగా అలసిపోయితివో? నా ముద్దులపట్టీ! అప్పుడు నీవు ఏమంటివి?' అని రోదించుచు 'అయ్యో! ఎంత ఘోరము జరిగిపోయినది' అని ఆమె బాధపడసాగెను. ఇంకను 'నా చిన్నారిని ఇక్కడనే ఉంచితిని. ఆ బాలుడు ఇక్కడ ఆడుకొనుచుండెను. ఆ పెనుగాలి ఎక్కడనుండి వచ్చెనో? ఏమో? శిశువు ఏమై పోయెనో ఏమో? నేను ఎక్కడని వెదకుదును?' అని బావురుమనుచు ఆ తల్లి, దూడకు దూరమై, మిగుల దుఃఖించుచు సొలిపోవుచున్న ఆవువలె మిగుల చింతాక్రాంతురాలై నేలపై పడిపోయెను.

క. పాపనికై యిటు వాగిలెడి, యా పాపనితల్లిఁ జూచి యారట పడుచున్
గోపాలసతులు బాష్పజలాపూరిత నయనలైరి యార్తిం బడుచున్. 270

కన్నబిడ్డడు కనబడకపోవుటచే కుమిలిపోవుచున్న ఆ తల్లిని జూచి, గోపికలు చేయునదిలేక ఆరాటపడుచు ఆర్తితో కన్నీరుమున్నీరుగా విలపింపసాగిరి.

శా. ఆలోఁ జక్ర సమీర దైత్యుఁడు మహాహంకారుఁడై మింటికిన్
బాలుం దాఁకొని పోయి పోయి తుదిఁ దద్భారంబు మోవన్ బల
శ్రీ లేమిం బరిశాంత వేగుఁడగుచుం జేష్టింపఁగా లేక ము
న్నీ లాగర్భకుఁ జూడ నంచు నిటమీఁ దెట్లంచుఁ జింతించుచున్. 271

ఇది ఇట్లుండగా, తృణావర్తుడు (రాక్షసుడు) అంతులేని అహంకారముతో ఆ బాలుని ఆకాశమునందు మిక్కిలి దూరముగా తీసికొనిపోయెను. కడకు బరువైన ఆ చిట్టి శిశువును మోయుటకు శక్తి చాలకపోవుటచే అతనియొక్క వేగము తగ్గిపోయెను. పిమ్మట చేష్టలుడిగి, అతడు 'ఇంతవరకు నేను ఇంత బరువైన శిశువును చూచి యెరుగను, ఇది చిత్రముగా నున్నది, ఇకమీద నేను ఏమి చేయవలెను?' అని విచారపడసాగెను.

వ. అట్లు దనుజుండు చింతించుచున్న సమయంబున. 272

క. బాలద్విరదకరంబులఁ, బోలెడి కరములను దనుజు బొండుగ బిగియం
గీలించి వ్రేలఁబడియెను, బాలకుఁడొక కొండభంగి బరువై యధిపా! 273

అట్లు తృణావర్తుడు చింతిల్లుచుండగా మహారాజా! అంతట ఒక కొండవలె బరువైయున్న చిన్నికృష్ణుడు ఏనుగుగున్న తొండములవలె ఒప్పుచున్న తన కరములతో ఆ రాక్షసుని కంఠమును గట్టిగా పట్టుకొని, వ్రేలాడసాగెను.

క. మెడ బిగియఁ బట్టుకొని డిగఁ, బడియెడి బాలకునిచేతఁ బర్వతనిభుచే
విడివడఁ జాలక వాఁడురిఁ, బడి బెగడెడు ఖగముభంగి భయముం బొందెన్ 274

క. హరికరతలపీడనమునఁ, బరవశుఁడై ఱాలమీఁద భగ్నాంగకుఁడై
సురవైరిభటుఁడు కూలెను, బురభంజనుకోలఁ గూలు పురముం బోలెన్. 275

పర్వతమంత బరువుగా ఉన్న ఆ చిన్నిబాలుడు తృణావర్తుని మెడను గట్టిగా పట్టుకొని వ్రేలాడుచుండగా, విడిపించుకొనలేక ఆ రాక్షసుడు ఉచ్చులో చిక్కుపడి, భీతిల్లుచున్న పక్షివలె తొట్రుపాటునకు లోనయ్యెను. పిమ్మట కంసుని భటుడైన తృణావర్తుడు చిన్నికృష్ణునిఅరచేతులఒత్తిడికి తట్టుకొనలేక సొమ్మసిల్లి, రాళ్లపై పడుటచే అవయవములన్నియును చిన్నాభిన్నముకాగా ఆ రాక్షసుడు, పరమశివునిత్రిశూలముదెబ్బకు పడిపోవుచున్న త్రిపురాసురపురమువలె నేలగూలెను.

వ. అంత గోపకాంతలంతయుం గని, రోదనంబులు మాని, సమ్మోదంబున విక్కవిరిసి, రక్కసునియురంబున మురువుగలిగి, బరువులేక వ్రేలు బాలుం గొని వచ్చి ముచ్చిరుచున్న తల్లికిచ్చిరప్పుడు, గోపగోపికాజనంబు లందఱుఁ దమలో నిట్లనిరి. 276

తృణావర్తుడు నేలగూలుటంజూచి, గోపకాంతలు రోదనములను మాని మిగుల సంతోషముతో ఉండిరి. దివ్యకాంతులతో తేజరిల్లుచున్న చిన్నికృష్ణుడు తృణావర్తునివక్షఃస్థలముపై విలాసముగా తిరుగాడుచుండెను. బరువు తగ్గి విలసిల్లుచున్న శ్రీకృష్ణుని తీసికొనివచ్చి, గోపికలు పరితపించుచున్న యశోదాదేవికి అప్పగించిరి. అనంతరము వారు (గోపాలురు, గోపికలు) అందరును తమలో తాము ఇట్లనుకొనిరి.

క. రక్షణములేక సాధుఁడు, రక్షితుఁడగు సమతఁజేసి రాయిడులందున్
రక్షణములు వెయి గలిగిన, శిక్షితుఁడగు ఖలుఁడు పాపచిత్తుం డగుటన్. 277

మ. గతజన్మంబుల నేమి నోఁచితిమొ యాగశ్రేణులేమేమి సే
సితిమో యెవ్వరికేమి వెట్టితిమొ యే చింతారతిం బ్రొద్దుపు
చ్చితిమో సత్యములేమి వల్కితిమొ యే సిద్ధప్రదేశంబుఁ ద్రొ
క్కితిమో యిప్పుడు సూడఁగంటిమిచటం గృష్ణార్భకున్ నిర్భయున్. 278

వ. అని పలికి రంత, నందుండు మున్ను తనకు వసుదేవుండు సెప్పిన మాటలకు వెఱఁగుపడుచుండె. మఱియును, 279

"సత్పురుషుడు రాగద్వేషములకు అతీతుడై సకలప్రాణులయెడ సమభావనను చూపుచుండును. అందువలన అతడు లోకసహజమైన రక్షణ లేకున్నను ఆపదలు వచ్చినప్పుడు భగవదనుగ్రహముతో సురక్షితుడుగా ఉండును. కాని రక్షణ ఏర్పాట్లు ఎంతగా ఉన్నను దుష్టుడు పాపాత్ముడగుటచే ఆపదల పాలగుచుండును. పూర్వజన్మలలో మనము ఎట్టి సుకృతములను చేసితిమో! ఎన్నెన్ని యాగములను ఆచరించితిమో!, ఎవ్వరికి ఏయే దానములను ఒనర్చితిమో!, ఎంతగా భగవచ్చింతనతో కాలము గడిపితిమో!, ఎంతగా సత్యమునకు కట్టువడి జీవించితిమో!, ఏ పుణ్యక్షేత్రములను సేవించితిమో? వాటి ప్రభావముననే కాబోలు ఈ జన్మలో మనకు ఎల్లప్పుడును నిర్భయుడై యుండెడి ఈ చిన్నికృష్ణుని దర్శించెడి భాగ్యము అబ్బినది". గోపికలు, గోపాలురు ఇట్లు అనుకొనిన పిమ్మట, నందుడు ఇంతకుముందు తనకు వసుదేవుడు చెప్పిన మాటలను గుర్తునకు తెచ్చుకొని ఆశ్చర్యమునకు లోనయ్యెను.

సీ. జననాథ! యొకనాఁడు చన్ను సేఁపినఁ దల్లి చిన్ని ముద్దులకృష్ణుఁజేరఁదిగిచి
యెత్తి పెందొడలపై నిడుకొని ముద్దాడి చన్నిచ్చి నెమ్మోము సక్క నివిరి
యల్లని నగవుతో నావులించిన బాలు వదనగహ్వరమున వారి నిధులు
దిశలు భూమియు వనద్వీప శైలంబులు నేఱులు గాలియు నినుఁడు శశియు
ఆ. దహనుఁడాకసంబుఁ దారలు గ్రహములు నఖిలలోకములుఁ జరాచరంబు
లైన భూతగణము లన్నియు నుండుటఁ జూచి కన్ను మోడ్చి చోద్యపడియె. 280

పరీక్షిన్మహారాజా! ఒకానొకనాడు స్తనములలో పాలు నిండారగా, యశోదాదేవి తన చిన్నారి కన్నయ్యను చేరదీసి, ఒడిలో పరుండబెట్టుకొని, ముద్దాడి స్తన్యమిచ్చెను. పిదప ఆమె తన కుమారునిముఖమును చేతితో నిమురుచుండెను. అప్పుడు ఆ శిశువు చిరునవ్వొనర్చుచు ఆవులించెను. అంతట ఆమె ఆ చిన్నిబుడతని నోటియందు సముద్రములను, సకలదిక్కులను, భూమండలమును, వనములను, ద్వీపములను, పర్వతములను, నదులను, వాయుమండలమును, సూర్యచంద్రులను, అగ్నిని, ఆకాశమును, నక్షత్రములను, గ్రహములను, అఖిలలోకములను, చరాచర ప్రాణికోటిని చూచి, ఆశ్చర్యముతో కనులు మూసికొనెను.

వ. అంత నొక్కనాఁడు వసుదేవుపంపున యాదవపురోహితుండైన గర్గుండు, మందకుం జనుదెంచిన, నందుం డతనిఁ గనుంగొని, లేచి నిలిచి, కృతాంజలియై 281

క. కోరి భజించెను నందుఁడు సార గుణాచారమార్గు సత్సంసర్గు
న్నారాధిత భర్గున్ మతి, దూరిత షడ్వర్గుఁ గుజనదుర్గున్ గర్గున్. 282

వ. మఱియుఁ దగిన సత్కారంబులు సేసి, యిట్లనియె. 283

పిమ్మట యాదవులపురోహితుడైన గర్గుడు వసుదేవునిప్రేరణపై ఒకనాడు వ్రేపల్లెకు వచ్చెను. అంతట నందుడు ఆ మునిని జూచినంతనే లేచి నిలబడి అంజలిఘటించి, స్వాగతసత్కారములను నెరపెను. ఆ గర్గుడు ఉత్తమగుణములు గలవాడు, సత్సంప్రదాయములను పాటించెడివాడు, సత్పురుషులతో చేరియుండువాడు, పరమశివుని ఆరాధించుచుండెడివాడు, కామక్రోధాది అరిషడ్వర్గమును జయించిన మహాత్ముడు, దుర్జనులకు అందనివాడు, అట్టి గర్గునకు నందుడు ఇంకను పెక్కు సత్కారములను గావించి ఇట్లనెను.

క. ఊరకరారు మహాత్ములు వారధములయిండ్ల కడకు వచ్చుట లెల్లం
గారణము మంగళములకు, నీ రాక శుభంబు మాకు నిజము మహాత్మా! 284

శా. జ్యోతిశ్శాస్త్రములకెల్ల మేటరివి తేజోమూర్తి వాశాంత వి
ఖ్యాతస్ఫూర్తివి బ్రహ్మబోధనుఁడ వాకర్ణింపు నా పల్కుని
ర్ణీతుం డైన గురుండు మానవులకున్ విప్రోత్త ముండండ్రు నీ
చాతుర్యంబుననీకుమారులకు సంస్కారంబు గావింపవే 285

"స్వామీ! మహాత్ములు ఎక్కడికైనను అకారణముగా విచ్చేయరు. మీ వంటి ఉత్తములు మా వంటి సామాన్యుల ఇండ్లకు వచ్చుట మాకు శుభసూచకము. మహాత్మా! మీ రాక మా అందరికిని శుభములను కలుగజేయును. ఇది ముమ్మాటికిని నిజము. నీవు జ్యోతిషపండితులలో మేటివి. తేజోమూర్తివి, మీ ప్రశస్తి దిగంతముల వరకును వ్యాపించినది. నీవు బ్రహ్మజ్ఞానివి, నా మనవిని ఆలకింపుము. 'వేదశాస్త్రములయందు ఆరితేరిన విప్రోత్తముడు మానవులకు నిజమైన గురువు' అని లోకులు పేర్కొనుచుందురు. మహాత్మా! ఈ చిన్నారులకు చాతుర్యముతో నామకరణాదిసంస్కారములను గావింపుడు" అని పలికెను.

వ. అని రామకృష్ణులం జూపిన, గర్గుండు మున్ను కంసునిచేత వ్రేటువడి, దివి కెగసిపోయిన తెఱవ సెప్పిన తెఱంగు దేటపఱిచి, దేవకీదేవికొడుకని కృష్ణునిఁ గంసుండు దలంచుం గావున రహస్యంబున సంస్కారంబు సేయుట కార్యంబని నందానుమతంబున రోహిణీసుకుమారు నుద్దేశించి. 286

క. జనులు రమియింపఁ దిరిగెడి, యనువు కలిమి రాముఁడనియు యదుసంకర్షం
బున సంకర్షణుఁ డనియును, ఘనబలమున బలుఁడు ననియు గణుతించె నృపా! 287

పిదప అతడు ఆ మహర్షికి అచటనున్న రామకృష్ణులను చూపెను. అంతట గర్గుడు ఇదివరలో కంసుడు చంపబోగా, తప్పించుకొని ఆకాశమునకు ఎగిరిన యోగమాయ తెలిపిన విషయములను ప్రస్తావించెను. "ఈ నామకరణాది కార్యక్రమములను రహస్యముగా జరుపవలెను. లేనిచో ఈ విషయములు కంసునకు తెలియగలవు. అప్పుడు అతడు 'శ్రీకృష్ణుడు దేవకీదేవి కుమారుడే' అని దృఢముగా తలంచును" అని పలుకగా నందుడు అందులకు ఆమోదించెను. రాజా! పిదప ఆ మహర్షి రోహిణీ కుమారుని ఉద్దేశించి, 'జనులను సంతోషింపజేయుచు మసలుచుండునుగావున రాముడనియు, యాదవులలో ఐకమత్యమును పెంపొందించువాడు గావున సంకర్షణుడు అనియు, మిగుల బలముగలవాడు గావున 'బలుడు' అనియు ఇతడు ఖ్యాతికెక్కును!

వ. మఱియుం, గృష్ణునుద్దేశించి, తొల్లి యీ శిశువు, ధవళారుణ పీతవర్ణుండై, యిప్పుడు నల్లనైన కతంబున గృష్ణుండయ్యె. వసుదేవునకు నొక్కెడ జన్మించిన కారణంబున వాసుదేవుం డయ్యె నీపాపనికి గుణ రూపకర్మంబు లనేకంబులు గలుగుటం జేసి, నామంబులనేకంబులుగలవీశాబకునివలన మీరు దుఃఖంబులఁ దరియింతు. రీ యర్భకునిచే దుర్జనశిక్షణంబును సజ్జన రక్షణంబునునగు. ఈ కుమారుండు నారాయణసమానుండని చెప్పి, తన గృహమ్మునకమ్మునీశ్వరుండు సనియె. నందుండును పరమానందంబున నుండె. అంత. 288

పిమ్మట కృష్ణునిగూర్చి గర్గుడు ఇట్లు వచించెను. "ఈ శిశువు మొదట తెలుపు, ఎరుపు, పసుపు వన్నెలు గలవాడై యుండి ఇప్పుడు నల్లగా ఉన్నందున ఇతనిపేరు కృష్ణుడు, వసుదేవునకు జన్మించిన కారణమున ఇతడు వాసుదేవుడు అనియు పిలువబడును. ఇతని గుణములు, రూపములు, కర్మలు అనేకములు. కనుక ఇతడు పెక్కుపేర్లతో వ్యవహరింపబడును. ఈతనివలన మీ దుఃఖములు (కంసునివలన బాధలు) దూరమగును. ఇతడు దుర్జనులను శిక్షించును

(రూపునూపును). సజ్జనులను రక్షించును. నీ కుమారుడు శ్రీమన్నారాయణునితో సమానుడు' అని తెలిపి గర్గమహాముని తన ఇంటకి వెళ్లిపోయెను. నందుడు పరమానందముతో మసలుకొనసాగెను.

## శ్రీకృష్ణబలరాముల బాల క్రీడాభివర్ణనము

సీ. జానుభాగముల హస్తమ్ములు వీడ్వడ నిడుచు దిగ్గనఁ బోదురింత నంత
నవ్వల పయ్యెదలంది జవ్వాడుదు రాలక్రేపుల తోఁక లలమి పట్టి
విడువనేరక వాని వెనువెంట జరగుదు రప్పంకముల దుడుకడరఁ జొత్తు
రెత్తి చన్నిచ్చుచో నిరుదెసఁ బాలిండ్లు చేతులఁ బుణుకుచుఁ జేఁపుగలుగ
తే. దూఁటుదురు గ్రుక్క గ్రుక్కకుఁ దోర మగుచు నాడుదురు ముద్దుపలుకు లవ్యక్తములుగఁ
గరములంఘ్రులు నల్లార్చి కదలుపుదురు రామకృష్ణులు శైశవరతులఁ దగిలి. 289

పసివయస్సులోనున్న బలరామకృష్ణులు లేచి నిలబడి, మోకాళ్లవఱకు చేతులు చాచి, త్వరత్వరగా అటునిటు అడుగులు వేయుచుండిరి. తల్లులపైటలను పట్టుకొని ఊగులాడుచుండిరి; ఆవుదూడలతోకలను గట్టిగా పట్టుకొని, వాటిని వదలిపెట్టలేక వాటివెంటనే కదలుచుండిరి. తమతల్లులు ఎత్తుకొని పాలిచ్చుచుండగా, వారి రెండు స్తనములను చేతులతో తడుముచుండిరి. తల్లుల చనుబాలు సమృద్ధిగా ఉండుటతో గుటకలు వేయుచు త్రాగుచుండిరి - వచ్చియురాని మాటలను ముద్దుముద్దుగా పలుకుచుండిరి. చేతులను, కాళ్లను అటునిటు కదుపుచుండిరి. వారి శైశవలీలలు ఇట్లు చూడ వేడుకగా సాగుచుండెను.

క. తడవాడిరి బలకృష్ణులు, తడవాడిరి వారిఁ జూచి తగ రంభాదుల్
తడవాడిరరులు భయమునఁ, దడ వాడిరి మంతనములఁ దపసులు వేడ్కన్ 290

బలరామకృష్ణులు ఎంతోసేపు ఇట్లు ఆడుకొనుచుండగా జూచి, రంభ మొదలగు అప్సరసలు పరమసంతోషముతో నృత్యములు చేయసాగిరి. కంసాది శత్రువులు అందఱును భయముతో దిక్కుతోచనివారైరి. తాపసులు హర్షముతో పరస్పరము సంభాషించుకొనదొడంగిరి.

సీ. తలలెత్తి మెల్లన తడవి యాడెడువేళఁ బన్న గాధీశుల పగిదిఁ దాల్తు
రంగసమ్మృష్ట పంకాంగరాగంబుల నేనుఁగుగున్నల యెత్తు వత్తు
రసమంబులైన జవాతిరేకమ్ములఁ సింగపుఁ గొదమల సిరి వహింతు
రాననంబులఁగాంతు లంతకంతకు నెక్కు బాలార్క చంద్రుల పగిదిఁ దోఁతు
తే. రెలమిఁ దల్లులచన్నుఁబా లెల్లఁ ద్రావి పరమ యోగోద్భవామృత పానలీల
సోలి యొఱఁగని యోగుల సొంపు గందు రా కుమారులు జనమనోహరు లగుచు. 291

ఆ శిశువులు ఇద్దఱును తలలెత్తి దోగాడుచున్నప్పుడు వారు, పడగలెత్తి ఆడుచున్న మహాసర్పములవలె భాసిల్లుచుండిరి. నేలపై ఆడుకొనుచున్నప్పుడు శరీరములు బురదతో, దుమ్ములతో నిండగా వారు ఏనుగుగున్నలవలె విలసిల్లుచుండిరి. అద్భుతమైన రీతిగా త్వరత్వరగా గంతులు వేయుచున్నప్పుడు వారు కొదమసింగములవలె తేజరిల్లుచుండిరి. క్రమముగా కోమలములైన ముఖములకాంతులతో విరాజిల్లుచుండగా వారు ఉదయించుచున్న సూర్యచంద్రులవలె మనోహరముగా ఒప్పుచుండిరి. తమ తల్లులచనుబాలు త్రాగి, మైమఱచి హాయిగా నున్నప్పుడు వారు, యోగాభ్యాసము చేయుటచే, అమృతపానము చేసినరీతిగా ఆత్మానందమున ఓలలాడుచున్న మహాయోగులవలె ఒప్పాఱుచుండిరి. ఈరీతిగా ఆ అన్నదమ్ములు జనులకు కనువిందుగావించుచు వారిమనస్సులను దోచుకొనుచుండిరి.

క. చూడనివారల నెప్పుడుఁ, జూడక లోకములు మూఁడు చూపులఁ దిరుగం
జూడఁగనేర్చిన బాలక, చూడామణి జనుల నెఱిఁగి చూడఁగ నేర్చెన్. 292

తోడిబాలురకు శిరోభూషణమైన ఆ కృష్ణస్వామి (విష్ణువు) తనను సేవింపనివారిపై తన దయాదృష్టిని ప్రసరింపజేయడు. అతడు తన చూపులచే ముల్లోకములను చూడగలిగిన మహాత్ముడు, చిన్ని శిశువుగా నున్న ఆ ప్రభువు ఇప్పుడు జనులను గుర్తుపట్టి వారివైపు చూచుచుండెను.

క. నగవులనవిద్య పోఁడిమి నగుబాటుగఁ జేయనేర్చు నగవరి యంతన్
నగు మొగముతోడ మెల్లన, నగు మొగములసతులఁ జూచి నగనేర్చె నృపా! 293

రాజా! ఆ చిన్నకన్నయ్య తన చిఱునవ్వుల వైభవములతో తీవ్రమైన (జన్మజన్మల) అజ్ఞానమును నవ్వులపాలు చేయును. (పటాపంచలు గావించును). ఆ చిన్నారి నగుమొగమును జూచి గోపాంగనలు మిగుల సంతోషముతో నవ్వుకొనుచు ఆనందించుచుండగా వారినిజూచి, అతడును నవ్వుచుండెను.

క. అవ్వల నెఱుఁగక మువ్వురి, కవ్వల వెలుఁగొందు పరముఁ డర్భకుఁడై యా
యవ్వలకు సంతసంబుగ, నవ్వా! యవ్వా! యనంగ నల్లన నేర్చెన్. 294

యథార్థముగా శ్రీకృష్ణుడు (శ్రీమహావిష్ణువు) జన్మరహితుడు. ఆ ప్రభువు త్రిమూర్తులకు (బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు) అతీతుడై (దేవాదిదేవుడై = సర్వాధిష్ఠానమై) వెలుగొందెడివాడు. ప్రస్తుతము బాలకుడై (బాల్యలీలలతో) విలసిల్లుచున్న ఆ స్వామి రోహిణీయశోదలకు సంతోషము కలుగునట్లుగా 'అమ్మా! అమ్మా!' అని పిలుచుచుండెను.

క. అడుగులు వేగలిగియు రెం, డడుగులనే మన్ను మిన్ను నలమిన బాలుం
డడుగిడఁ దొడఁగెను శాత్రవు, లడుగులు సడుగులు,ను వదలి యడుగవనిఁబడన్ 295

శ్రీహరి వేలకొలది పాదములుగలవాడు (సహస్రపాదుడు, సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు). ఆ ప్రభువు వామనావతారమున రెండడుగులతో భూమ్యాకాశములను ఆక్రమించెను. (మూడవ పాదముతో బలిచక్రవర్తిని పాతాళలోకమునకు చేర్చెను). ఇప్పుడు శ్రీకృష్ణుడై తప్పటడుగులు వేయుచుండెను (వచ్చియురాని నడకలు సాగించుచుండెను) ఆయన అట్లు అడుగులు వేయుటను జూచి, ఆ స్వామియెడ వైరభావమును గలిగియున్న దుష్టులు అందఱును తమ నడుములు దెబ్బతిన్నట్లుగా నేలపై పడిపోవుచుండిరి.

వ. మఱియును. 296

సీ. తనువున నంటిన ధరణీపరాగంబు పూసిన నెఱి భూతిపూఁత గాఁగ
ముందఱ వెలుఁగొందు ముక్తాలలామంబు తొగలసంగడికాని తునుక గాఁగ
ఫాలభాగంబుపైఁ బరఁగు కావిరిబొట్టు కాముని గెల్చిన కన్ను గాఁగ
గంఠమాలికలోని ఘననీలరత్నంబు కమనీయమగు మెడకప్పు గాఁగ
ఆ. హారవల్లులురగహారవల్లులు గాఁగ బాలలీలఁ బ్రౌఢబాలకుండు
శివునిపగిది నొప్పె శివునికిఁ దనకును వేఱులేమిఁ దెల్ప వెలయునట్లు. 297

క. ఆ పాపల విహరణములు, తీపులు పుట్టింప మరగి తేఁకువ లే కా
గోపాలసతులు మక్కువ, నే పనులును మఱచియుండి రీక్షణపరలై. 298

మఱియు, మహితాత్ముడైన బాలకృష్ణుడు 'తనకును, పరమశివునకును భేదములేదు' అని తెలుపుచున్నట్లుగా శివునివలె భాసిల్లుచుండెను. శ్రీకృష్ణుని తనువునకు అంటిన ధూళులే శివుడు దాల్చిన భస్మరేఖలు, సిగముడిపై వెలుగొందుచున్న ముత్యాలఆభరణమే శంకరునిజాటముపై భాసిల్లెడి చంద్రరేఖ - నొసటిపై తీర్చిదిద్దబడిన ఎఱ్ఱని తిలకమే ఈశ్వరుని ముఖమునందలి మూడవనేత్రము (శివుని మూడవ కంటిమంటలచే మన్మథుడు మసియై పోయెను.) కంఠహారము నందలి నీలమణియే శివునికంఠమున ఒప్పెడి గరళరేఖ. మెడయందు తేజరిల్లుచున్న హారములే శివునికంఠమున అలరారెడి సర్పహారములు, మధురములైన బలరామకృష్ణుల బాల్యలీలా విహారములు గోపభామినులను పరవశింపజేయుచుండెను. ఆ ఆనందములో మునిగి గోపికలు తమ పనులను అన్నింటిని మఱచిపోవుచుండిరి. ఎట్టి వెఱపును లేక వారు తదేకదృష్టితో ఆ చిన్నారులలీలలను గాంచుచుండిరి.

వ. ఆ సమయంబున బాలకులతల్లులు గోరుగోఱ గొమ్ములుగల జంతువులవలన నేమఱక, జలదహన కంటకాదుల యెడ మోసపోక, బాలసంరక్షణంబు సేయుచు నుల్లంబుల మొల్లంబులైన ప్రేమంబు లభిరామంబులుగా విహరించుచుండిరంత 299

బలరామకృష్ణులతల్లులైన రోహిణీయశోదలు, గోళ్లతో, కోఱలతో, కొమ్ములతో బాధించెడి జంతువులనుండియు, నీళ్లు, నిప్పు, ముళ్లు మొదలగు వాటినుండియు ఎట్టి ప్రమాదములును కలుగకుండునట్లుగా తమ శిశువులను రక్షించుకొనుచుండిరి. వారిబాల్యలీలలకు తమ హృదయములనుండి పొంగిపొఱలుచున్న ప్రేమలతో సంతోషముగా మసలుకొనుచుండిరి.

క. తనయీడు గోపబాలురు, తనుఁ గొలువఁగ రాముఁగూడి తనువు గలుగుచుం
దనుగమనంబులఁ గృష్ణుఁడు, తనుమధ్యలు మెచ్చ నీలతనురుచి మెఱసెన్ 300

తన యీడు గోపబాలురు అందరును తనను నాయకునిగా గౌరవించుచు ఆడుకొనుచుండగా, చిట్టికృష్ణుడు తన అన్నయగు బలరామునితోగూడి, హాయిగా బాలక్రీడలను నెఱపుచుండెను. నీలమేఘచ్ఛాయలతో ముద్దులొలుకుచున్న శ్రీకృష్ణుని తను శోభలకు ముచ్చటపడుచు గోపికలు ఆ చిన్నారిని కొనియాడుచుండిరి.

వ. మఱియు నా కుమారుండు దినదినంబునకు సంచార సంభాషణ దక్షుండై. 301

ఉ. చప్పుడు సేయకుండుమని జంకె యొనర్చిన నల్గి పోవఁగా
నప్పుడు బార సాఁచితన యమ్మలి విందులు వచ్చిరంచు న
వ్వొప్పఁగఁ జీరు తల్లిదెసకొత్తిలి కృష్ణుఁడు రంతుసేయుచు
న్నెప్పటి వచ్చి చన్గుడుచు నింపొలయన్ మొలగంట మ్రోయఁగన్ 302

మఱియు శ్రీకృష్ణుడు క్రమముగా స్వయముగా అటునిటు తిరుగుచు, మాట్లాడనేర్చెను. 'అల్లరి చేయకుము' అని తల్లి కోపపడునప్పుడు ఆ చిట్టి బుడతడు అలిగి దూరముగా పోవుచుండెను. అంతట యశోదమ్మ నవ్వుచు చేతులుచాచి 'నా కన్నతండ్రి ఇదిగో వచ్చుచున్నాడు' అని పిలువసాగెను. అప్పుడు ఆ చిన్నారి ఎప్పటివలె మొలత్రాడు నగల చిఱుగజ్జెలు ఇంపుగొలుపునట్లు మ్రోగుచుండగా తల్లియొడికి చేరి చనుబాలు త్రాగుచుండెను.

క. వల్లవగృహనవనీతము, లెల్లను భక్షించి వచ్చి యెఱుఁగని భంగిన్
దల్లి గదిసి చిట్టాడుచు, నల్లన చను బువ్వఁబెట్టు మవ్వా! యనుచున్. 303

ఆ కన్నయ్య గోపికల ఇండ్లకు వెళ్లి, అచటగల వెన్నలను తిని, ఏమియు ఎఱుగనట్లు బుడిబుడి నడకలతో తల్లిని జేరెడివాడు. పిదప తనకు ఆకలియగుచున్నట్లు నటించుచు 'అమ్మా! పాలిమ్ము' అని అడుగుచుండెను.

వ. మఱియు గోపకుమారులం గూడికొని కృష్ణుండు. 304

సీ. గోవల్లభుఁడ నేను గోవులు మీరని వడి ఱంకె వైచుచు వంగి యాడు
రాజ నే భటులు మీరలు రండు రండని ప్రాభవంబునఁ బెక్కు పనులు వనుచు
నేఁదస్కరుండ మీరింటివా రని నిద్ర పుచ్చి సొమ్ములు గొనిపోయి డాఁగు
నే సూత్రధారి మీరిందఱు బహురూపులని చెలంగుచు నాటలాడఁ బెట్టు

తే. మూలలుఱుకును డాఁగిలిమూఁతలాడు నుయ్యేలల నూఁగుఁ జేబంతులొనర వైచు
జారచోరులజాడలఁ జాల నిగుడు శౌరి బాలురతో నాడు సమయమందు. 305

ఆ చిన్నికృష్ణుడు గోపబాలురతో గూడి ఆడెడి ఆటలు విచిత్రములు. వారితో ఆడుకొను సమయమున అతడు 'నేను ఆబోతును, మీరందఱును ఆవులు' అనుచు అతడు వంగి ఱంకె వేయుచుండెను. 'నేను రాజును, మీరు భటులు' అనుచు, అధికారమును చూపుచు వారిని పెక్కు పనులకు ఆజ్ఞాపించుచుండెను. 'నేను చోరుడను మీరు ఇండ్ల యజమానులు' అనుచు వారిచే నిద్రను నటింపజేయుచు, వారి సొమ్ములను కొన్నింటిని అపహరించి, తీసికొనిపోయి దాగుకొనుచుండెను. 'నేను సూత్రధారిని (నాటకమును నడిపెడివాడను). మీరు వివిధ పాత్రధారులు' అని నవ్వుచు వారిచే నాటకములాడించుచుండెను. అతడు మూలమూలలకు ఉఱుకుచు, వారితో దాగుడుమూతలు ఆడుచుండెను. ఉయ్యాలలూగుచుండెను. చేబంతులాడుచుండెను. జారుడుగా, చోరుడుగా నటించుచు వారిపై మీదిమీదికి వచ్చుచుండెను.

వ. మఱియు, నాకుమారశేఖరుండు, గపట శైశవంబున దొంగజాడలం గ్రీడింప గోపికలోపికలులేక, యశోదకడకు వచ్చి యిట్లనిరి. 306

ఆ కృష్ణుడు పైకి అల్లరివాడుగా కనిపించుచున్నను బాలురందరిలో మంచివాడే. చోరుడు చేయుచున్న పనులన్నియును ఆయనకు లీలలే. ఆ చిన్నారి అల్లరి చేష్టలకు తట్టుకొనలేక గోపికలు యశోదమ్మతో ఇట్లు మొఱపెట్టుకొనిరి.

## గోపికలు శ్రీకృష్ణునిదుడుకు చేష్టలను యశోదాదేవితోఁ దెల్పుట

క. బాలురకుఁ బాలు లేవని, బాలెంతలు మొఱలు వెట్టఁ బకపక నగి యీ
బాలుండాలము సేయుచు, నాలకుఁ గ్రేపులను విడిచె నంభోజాక్షీ! 307

"అమ్మా! యశోదమ్మా! 'మా పసిపిల్లలకు చాలినన్ని పాలు లేవు' అని బాలెంతలు ఎంతగా గోలపెట్టుచున్నను వారిమాటలను పట్టించుకొనక, పకపక నవ్వుచు, మీ కొంటె బాలుడు దూడలను ఆవులకడకు విడిచిపెట్టుచున్నాడు.

క. పడఁతీ! నీబిడ్డఁడు మా, కడవలలో నున్న మంచి కాఁగిన పాలా
పడుచులకుఁ బోసి చిక్కిన, కడవలఁ బోనడిచె నాజ్ఞ గలదో లేదో. 308

సుదతీ! నీ కొడుకు మా కడవలలో మంచిగా కాగియున్న చిక్కనిపాలను తోడిపిల్లలకు పోయుచున్నాడు. అంతేగాకుండ కడవలను అన్నింటిని పగులగొట్టుచున్నాడు. చూడగా అతనిపై నీ అదుపు ఉన్నట్లు కనబడుటలేదు.

క. మీ పాపఁడు మా గృహమున, నాపోవఁగఁ బాలు ద్రావ నగపడకున్నం
గోపించి పిన్నపడుచుల, వాపోవఁగఁ జిమ్ముకొనుచు వచ్చెం దల్లీ! 309

అమ్మా! మీ బిడ్డడు తృప్తిగా పాలుత్రాగుటకై మా ఇండ్లకు వచ్చినప్పుడు అచట పాలు కనబడకపోవుటచే అతడు ఆగడములకు పాల్పడుచున్నాడు. ఆ కోపములో అతడు మా పిల్లలను నెట్టివేయుచుండగా వారు గుక్కపట్టి ఏడ్చుచున్నారు. ఇట్లు అల్లరి పనులను చేయుచు మీ ఇంటికి చేరుచున్నాడు.

మత్తకోకిలము. పుట్టి పుట్టఁడు నేఁడు దొంగిలబోయి మా యిలు సొచ్చి తా
నుట్టి యందక ఱోళ్లుఁ బీఁటలు నొక్క ప్రోవిడి యెక్కి చే
వెట్టఁజాలక కుండక్రిందొక పెద్దతూఁటొనరించి మీ
పట్టి మీఁగడ పాలుఁ జేరలఁ బట్టి త్రావెఁదలోదరీ! 310

సుందరీ! నీ కొడుకువంటి దుడుకువాడు ఈ లోకమునందు ఇక పుట్టబోడు. పాలు త్రాగుటకై దొంగగా మా ఇండ్లకు వచ్చి ఉట్లు అందకపోవుటచే వాటిక్రింద ఱోళ్లను, పీటలను ఒకదానిపై మఱియొకటి చేర్చి వాటిపై ఎక్కుచున్నాడు, అప్పటికిని ఉట్టి అందక పోవుటతో ఆ ఉట్టిలోనున్న కుండకు ఒక పెద్దతూటు పొడిచి, పాలను, మీగడలను దోసిలిపట్టి త్రాగుచున్నాడు.

క. ఆడం జని వీరల పెరుఁ గోడక నీ సుతుఁడు ద్రావి యొుక యించుక తాఁ
గోడలి మూఁతిం జరిమినఁ, గోడలు ద్రుచ్చనుచునత్త కొట్టె లతాంగీ! 311

పొలతీ! ఆటలపేరుతో ఇంటినుండి బయటపడి, నీ కొడుకు వీరి ఇంటిలో చొరబడి, తనివిదీర పెరుగును త్రాగినాడు. అంతేగాక అటనుండి వెళ్లునప్పుడు తాను ఊరక పోక కొంత పెరుగును ఆ ఇంటికోడలిమూతికి పూసి వెళ్లినాడు. ఆ పెరుగంతయును చాటుగా కోడలే త్రాగినదని భావించి, అత్త ఆమెను కొట్టినది.

క. వా రిల్లు సొచ్చి కడవలఁ, దోరంబగు నెయ్యి ద్రావి తుదినాకడవల్
వీరింట నీ సుతుండిడ, వారికి వీరికిని దొడ్డ వాదయ్యె సతీ! 312

సుదతీ! నీ ముద్దులకొడుకు ఒక ఇంటిలో ప్రవేశించి, అచటనున్న ఘుమఘుమలాడుచున్న నేతిని త్రాగివేసి, ఆ కుండలను పొరిగింటిలో పడవేసి పోవుచున్నాడు. పిమ్మట వారికిని, వీరికిని పెద్దపోట్లాటలే జరిగినవి.

క. వేలుఁపులటె నాకంటెను, వేలుపు మఱి యెవ్వఁడనుచు వికవిక నగి మా
వేలుపుల గోడపైనో, హేలావతి! నీ తనూజుఁ డెంగిలిఁ జేసెన్. 313

లీలావతీ! నీ కొడుకు మా ఇంటికివచ్చి మా గోడలపైగల దేవతల బొమ్మలను చూచినాడు. వెంటనే అతడు 'వీరందఱునుదేవతలా! నా కంటెను వేఱగు దేవతలు లేనేలేరు' అని నవ్వుచు మీ కొంటె కోనంగి తన ఎంగిలిని వాటికి పూసి వెళ్లినాడు.

క. వెన్నఁ దినఁగఁ బొడగని మా, పిన్నది యడ్డంబు వచ్చి పిఱిఁదికిఁ దివియం
జన్నొడిసిపట్టిచీరెను, జిన్ని కుమారుండె యితఁడు శీతాంశుముఖీ! 314

చంద్రముఖీ! నీ సుపుత్రుడు మా ఇంటిలో జొరబడి వెన్న తినుచుండగా చూచి మా చిన్నది ఆయనను అడ్డగించి వెనుకకు లాగెను. అప్పుడు మీవాడు మా అమ్మాయిని పట్టుకొని దాని ఱొమ్ముపై గీరెను. ఇవి పసిపిల్లవాని చేష్టలేనా?

క. ఇమ్మగువ తన్ను వాకిటఁ, గ్రుమ్మరుచోఁ జీరి నిలుపుకొని పేరడుగం
గెమ్మోవిఁ గఱచి వడిఁజనె, నమ్మా! యీ ముద్దుఁగుఱ్ఱఁ డల్పుఁడె చెపుమా! 315

నీ గారాలకుమారుడు తమ వాకిట తిరుగుచుండగా జూచి, ఈమె చేరబిలిచి 'నీ పేరేమి?' అని అడిగెను. అప్పుడు మీ వాడు ఈమె పెదవిని తన పంటితో నొక్కి, చిక్కకుండ వెంటనే పారిపోయినాడు. ఇతడు పసివాడా?

క. చేబంతి తప్పిపడెనని, ప్రాబల్యముతోడ వచ్చి భవనమువెనుకన్
మా బిడ్డ జలకమాడఁగ, నీ బిడ్డఁడు వలువదెచ్చె నెలఁతుక! తగునే. 316

తన ఆటబంతి మా ఇంగటిలో పడినదనుచు నిర్భయముగా మా పెరటిలోనికి వచ్చినాడు. అప్పుడు మా అమ్మాయి స్నానము చేయుచుండగా ఆమె చీరెను తీసికొని వచ్చినాడు. ఇది తగిన పనియేనా?

క. ఇచ్చెలువఁజూచి ముచ్చిలి, యచ్చుగ నుతికించుకొనుచు నరిగెద, నాతో
వచ్చెదవా యని యన్నా, డిచ్చిఱుతఁడు సుదతి! చిత్ర మిట్టిది గలదే. 317

సుదతీ! మీ బుడుతడు ఈ చిన్నదానితో 'పెద్దవాళ్లకు (ఎవ్వరికిని) తెలియకుండ నిన్ను తీసికొనిపోయెదను. నాతో వచ్చెదవా?' అని పలికినాడట. ఇది చాల చోద్యముగా ఉన్నది.

క. కొడుకులు లేరని యొకసతి, కడు వగవఁ దన్ను మగనిఁగాఁ గైకొనినం
గొడుకులు గలిగెదరని పైఁబడినాఁ డిది వినుము శిశువుపనులే తల్లీ! 318

తల్లీ! తనకు కొడుకులు కలుగలేదని ఒక యువతి పరితపించుచుండగా చూచి, నీ ముద్దులబాలుడు 'నాతో కూడినచో నీకు పుత్రులు తప్పక కలుగుదురు' అని పలికి ఆమెమీద పడినాడట! ఇవి శిశువుచేష్టలేనా?

క. తలఁగినదానం దలమనఁ, దలఁగక యా చెలికి నాన తలయెత్తఁగనీ
తలఁగినచో టెయ్యది యని, తల యూఁచెన్ నీ సుతుండు దగవె మృగాక్షీ! 319

'నేను బయటచేరి యున్నాను. నన్ను తాకకుము' అని పలికి ఒక తరుణి మిగుల సిగ్గుపడుచుండగా, అంతట నీ తనయుడు 'నీవు బయట చేరిన చోటు ఏది? అని నుడివి తల ఆడించెను. నీ సుతుడు ఇట్లు చేయుట తగునా?

క. వ్రాలఁగ వచ్చిన నీ పతి, చూలాలం దలఁగు మనుడుఁ, జూలగుటకు నే
మూలంబు సెప్పు మనె నీ, బాలుఁడు సెప్పుదురె సతులు పర్వేందుముఖీ! 320

ఇందువదనా! మీ కొంటెవాడు ఈ సతిమీద పడబోగా 'నేను గర్భవతిని. దూరముగా ఉండుము, తొలగిపొమ్ము' అని పలికెను. వెంటనే మీ దుడుకడు 'నీవు గర్భవతివి ఎట్లైతివి?' అని నుడివెనట. ఈ విషయమును ఏ స్త్రీలైనను చెప్పెదరా?

క. మగువా! నీ కొమరుఁడు మా, మగవారటు వోవఁజూచి మంతనమునకుం
దగఁజీరి పొంద నడిగెను, జగముల మున్నిట్టి శిశువు సదువంబడెనే! 321

మగువా! మా పతులు బయటికి వెళ్లగా జూచి, నీ సుపుత్రుడు 'నీకు ఒక రహస్యమును చెప్పవలెను' అని పిలిచి పొందుగోరెను. ప్రపంచములో ఇట్టి శిశువును గూర్చి ఎక్కడనైనను విన్నామా?'

ఆ. నమ్మి నిదురవోవ నా పట్టిచుంచుమాలేఁగతోఁకతోడలిలఁ గట్టి
వీథులందుఁ ద్రోలె వెలఁది! నీ కొమరుండు రాచబిడ్డఁడైన నవ్వ మేలె? 322

వనితా! నా కుమారుడు నిర్భయముగా నిద్రపోవుచున్నప్పుడు, నీ కొడుకు వచ్చి, మా పిల్లవాని జుట్టునకును లేగదూడ తోకకును ముడివేసి, ఆ దూడను వీధిలోనికి తోలెను. ఎంతటి రాచబిడ్డడైనా ఇట్లు అల్లరి చేయుట తగునా?

క. నా పట్టి పొట్టనిండఁగఁ, బైఁబడి నీ పట్టి వెన్న బానెండిడినాఁ
డూపిరి వెడలదు వానిం, జూపెద నేమైన నీవ చుమ్ము లతాంగీ! 323

లతాంగీ! నీ కుమారుడు నా కొడుకు మీదబడి బలవంతముగా బానెడు వెన్నను మా అబ్బాయినోటిలో కూరినాడు. అతడు ఊపిరాడక గిలగిలలాడుచున్నాడు. ఇదుగో చూడుము. వీడికి ఏమైనా అయినచో నీదే బాధ్యత సుమా!

క. తెఱవ యొకతె నిద్రింపఁగ, నెఱిఁ గట్టినవలువ వీడ్చి నేటగు తేలుం
గఱపించి నీ కుమారుఁడు, వెఱచుచు నది పఱవ నగియె విహితమె సాధ్వీ! 324

సాధ్వీ! ఒక వనిత గాఢనిద్రలో ఉండగా జూచి, నీ సుతడు ఒక తేలును తెచ్చి ఆమెకు కఱపించినాడు. అప్పుడు ఆమె బాధతో పెడబొబ్బలు పెట్టుచు పరుగుదీయుచుండగా జూచి అతడు పకపక నవ్వినాడు. ఇది న్యాయమేనా?'

క. నా కొడుకును నా కోడలు, నేకతమునఁ బెనఁగఁ బాము నీతఁడు వైవం
గోక లెఱుంగక పాఱినఁ, గూఁక లిడెన్ నీసుతుండు గుణమె గుణాఢ్యా! 325

గుణవంతురాలా! నా కొడుకూ, నా కోడలూ ఏకాంతమున శయనించి యున్నప్పుడు నీ కుమారుడు వారిపై ఒక పామును పడవేసెను. భయముతో వారు జాఱిపోవుచున్న తమ బట్టలను సైతము సర్దుకొనకుండగనే పాఱిపోవుచుండగా, వారిని జూచి నీ సుతుడు హేళనగా కేకలు పెట్టినాడట. ఇదేమి పని?

ఆ. తరుణి యొకతె పెరుఁగుఁ ద్రచ్చుచోఁ దుది వంగి వెన్నఁదియ్య నాదిఁగి వెనుకఁ గదిసి
మగువ!నీ సుతుండు మగపోఁడుములు సేయ సాఁగినాఁడు తగదె చక్కఁజేయ. 326

యశోదమ్మా! ఒక యువతి పెఱుగు చిలుకుచు (మజ్జిగ చేయుచు) వెన్నదీయుటకై వంగియుండెను. అప్పుడు నీ ముద్దుల కొడుకు వెనుకనుండి వచ్చి చిలిపిపనులు చేయసాగెనట - అతనిని కొంచెము మందలించలేవా?

సీ. కలకంఠి! మావాడ గరితల మెల్ల నీ పట్టి రాఁగలఁడని పాలు పెరుఁగు
లిండ్లలోపల నిడి యేమెల్లఁదన త్రోవఁ జూచుచో నెప్పుడు సొచ్చినాఁడొ
తలుపుల ముద్రలుఁ దాళంబులును బెట్టి యున్న చందంబున నున్న వరయ
నొక యింటిలోనాడు నొక యింటిలోఁబాడు నొక యింటిలో నవ్వు నొకటఁదిట్టు
తే. నొకట వెక్కిరించు నొక్కొకచో మృగ పక్షి ఘోషణములు పరఁగఁజేయు
నిట్లు సేసివెనుక నెక్కడఁ బోవునో కానరాఁడు రిత్తకడవలుండు. 327

సుందరీ! మా వీధిలోని వనితలము అందఱుము 'నీ కుమారుడు ఎప్పుడు వచ్చునో ఏమో? అని తికమకపడుచు, పాలపెఱుగు కుండలను మా ఇండ్లలో ఉంచి, భద్రముగా ఇండ్ల తలుపులకు తాళములు వేసికొని, 'అతడు వచ్చు దారిని కాచుకొనియుంటిమి - ఆ అల్లరి పిడుగు మా ఇండ్లలో ఎప్పుడు ఎట్లు ప్రవేశించినాడో ఏమో? మా తలుపుల తాళములు వేసినవి వేసినట్లే యున్నవి. అతడు ఒక ఇంటిలో ఆడినాడు, వేఱొక ఇంటిలో పాడినాడు, మఱియొక ఇంటిలో నవ్వినాడు. ఇంకొకచోట తిట్లపురాణము సాగించినాడు. వేఱొక ఇంట వెక్కిరించినాడు, మఱొక్కచోట మృగములవలె అఱచినాడు, పక్షులవలె కూసినాడు. పిమ్మట ఎట్లు పోయినాడో ఏమో! అంతలోనే మాయమైనాడు. ఇండ్ల తలుపులు తీసిచూడగా కాళీకుండలు మాత్రము మిగిలియున్నవి.

క. కడు లచ్చి గలిగెనేనిం, గుడుతురు కట్టుదురు గాక కొడుకుల నగుచున్
బడుగులవాడలపైఁ బడ, విడుతురె రాకాంతలెందు విమలేందుముఖీ! 328

ఇందువదనా! మీకు సంపదలు ఉన్నచో ఉండవచ్చును. ఇష్టము వచ్చినరీతిగా విందు భోజనములను చేసికొనవచ్చును. పట్టుపీతాంబరములను కట్టుకొనవచ్చును. అంతేగాని మేము కలవారము గదా! అని విఱ్ఱవీగుచు మా వంటి బీదల ఇండ్ల మీదికి కొడుకులను వదలుట ఏమిపద్ధతి?

క. ఓ యమ్మ! నీ కుమారుఁడు, మా యిండ్లను బాలుఁ బెరుఁగు మననీఁడమ్మా!
పోయెదమెక్కడి కైనను, మా యన్నల సురభు లాన మంజులవాణీ! 329

చూడు యశోదమ్మా! నీ కుమారుడు మా ఇండ్లలోని పాలను, పెఱుగును బ్రతుకనిచ్చుటలేదు. మా అన్నలమీద, గోవులమీద ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాము. మేము నిమ్మళముగా బ్రతుకుటకై ఎక్కడికైనా వెళ్లెదము"

వ. అని మఱియు ననేకవిధంబుల బాలకృష్ణుండు సేయు వినోదంబులు దమ యందుఁ జేయు మహాప్రసాదంబు లని యెఱుంగక, దూఱుచున్న గోపికలకు యశోద యిట్లనియె. 330

వాస్తవముగా బాలకృష్ణుడు నెఱపుచున్న లీలలు అన్నియును ఆ గోపికలపైగల అనుగ్రహమువలననే కాని ఆ రహస్యమును తెలిసికొనలేక వారు ఆ ప్రభువును దూసిపోయుచున్నారు. అట్టి గోపికలతో యశోద ఇట్లు నుడివెను.

క. చన్ను విడిచి చనఁ డిట్టటు, నెన్నఁడుఁ బొరుగిండ్ల త్రోవ లెఱుఁగడు నేఁడుం
గన్నులు దెఱవని మా యీ, చిన్ని కుమారకుని అవ్వ సేయం దగునే 331

"సుదతులారా! మా చిట్టికృష్ణుడు ఎప్పుడును నా ఒడిలో చేరి పాలుత్రాగుచునే యుండును. నన్ను విడచి ఎక్కడికిని పోడు. పొరుగిండ్లకే పోలేడు. ఇప్పటికిని కన్నులు దెఱవని (అమాయకుడైన) మా పసికూనను బట్టుకొని ఇట్లు మాట్లాడుట మీకు తగునా?

తే. అన్యమెఱుఁగడు తనయంత వాడుచుండు మంచివాఁ డీతఁడెగ్గులు మానరమ్మ!
రామలార! త్రిలోకాభిరామలార! తల్లులార! గుణవతీమతల్లులార! 332

వ. అని యశోద వారల నొడంబఱిచి పంపి, కొడుకుం గోపింపంజాలక యుండె నిట్లు. 333

అమ్మలారా! మీరు ముల్లోకములవారును మెచ్చుకొనదగిన ఉత్తమురాండ్రు, సద్గుణములుగల వనితలలో మేలుబంతులు. మా పసివానికి ఇతరవిషయములే పట్టవు, వాడి ఆటలేమో! వాడేమో! మా వాడు ఎంతయు బుద్ధిమంతుడు. ఇప్పటికైనను మా వానిమీద చాడీలు చెప్పుట మానుకొనుడు. తిన్నగా మీ ఇండ్లకు వెళ్లుడు" ఇట్లు పలికి ఆమె వారికి సర్దిచెప్పి పంపివేసెను. కాని తన కొడుకును మందలించుటకు ఆమెకు నోరు రాకుండెను.

ఉ. కాంతలు తల్లితోఁదన వికారము లెల్ల గణింప భీతుఁడై
శాంతుని సొంపునం బరమసాధుని పెంపున గోల మాడ్కి వి
భ్రాంతుని కైవడిన్ జడుని భంగిఁ గుమారకుఁ డూరకుండె నే
వింతయు లేక తల్లి కుచవేదికపైఁదల మోపి యాడుచున్ 334

తన తల్లితో గోపికలు తనపై నేరములు చెప్పగా, చిన్నికృష్ణుడు భయపడెను. పిమ్మట ఆ స్వామి శాంతమూర్తివలెను, మిక్కిలి సాధువువలెను, ఏమియు ఎఱుగనివానివలెను భ్రమకు గుఱియైనవాని రీతిగను, అల్లరి చేయుటయే తెలియనివాని వలెను మౌనము వహించియుండెను. పిదప ఆ బుడుతడు తల్లి వక్షఃస్థలముపై తలమోపి, ఆడుకొనసాగెను. శ్రీకృష్ణుని చేష్టలన్నియు ఎంత చోద్యములు?

## శ్రీకృష్ణునిమృద్భక్షణము - విశ్వరూప ప్రదర్శనము

వ. అంత నొకనాఁడు బలభద్రప్రముఖులైన గోపకుమారులు వెన్నుండు మన్ను దినె నని చెప్పిన, యశోద బాలుని కేలు పట్టుకొని, యిట్లనియె. 335

పిమ్మట ఒకనాడు బలరాముడు మొదలగు గోపబాలురు యశోదమ్మకడకు వచ్చి, 'అమ్మా! శ్రీకృష్ణుడు మన్ను తిన్నాడు' అని చెప్పిరి. అంతట ఆ తల్లి, ఆ చిన్నారి చేయిపట్టుకొని ఇట్లనెను.

క. మన్నేటికి భక్షించెదు, మన్నియమములేల నీవు మన్నింపవు మీ
యన్నయు సఖులును జెప్పెద, రన్నా మన్నేల మఱి పదార్థము లేదే. 336

వ. అని పలికిన ముగుద తల్లికి నెఱదంట యైన కొడుకిట్లనియె. 337

"నాయనా! కృష్ణా! బలరాముడు, నీ మిత్రులు 'నీవు మన్నుదిన్నావు' అని చెప్పుచున్నారు - నీవు మన్నెందుకు తింటివి? నీవు నా మాటలను బొత్తిగా వినుటలేదేమి? తినుటకు మన ఇంటిలో మధుర పదార్థములు సమృద్ధిగా ఉన్నవిగదా! ఇక మన్నుతో పని ఏమి?" అని అడిగిన అమాయకురాలైన తన తల్లితో ఆ గడుసువాడు ఇట్లు నుడివెను.

శా. అమ్మా! మన్ను దినంగ నే శిశువునో యాఁకొంటినో వెఱ్ఱినో
నమ్మంజూడకు వీరిమాటలు మదిన్ నన్నీవు గొట్టంగ వీ
రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు కాదేనిన్ మదీయాస్య గం
ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే 338

వ. అని పలికి, నెయ్యంబున నయ్యవ్వ నియ్యకొలిపి, క్రీడామనుజబాలకుండైన యీశ్వరుండు తననోరు దెఱచి, ముఖంబుఁ జూపిన. 339

"అమ్మా! నేను మన్నుతినుటకు పసివానిని కానుగదా! 'ఆకలిగొనియున్నాను' అని తలంచుటకు ఇప్పుడేగదా! నేను నీ దగ్గర పాలుత్రాగివెళ్లినది? వెఱ్ఱివాడనా! వీరి మాటలను నీవు నమ్మవద్దు. నన్ను నీవు దండించుటకై వీరు ఇట్లుకల్పించి చెప్పుచున్నారు. నా మాటలపై నీకు అంతగా నమ్మకము కుదరనిచో నా నోటివాసనను చూడుము. అప్పుడు నేను పలికిన మాటలు అసత్యములైనచో నన్ను నీ యిష్టమువచ్చినట్లు దండింపుము". ఇట్లు పలికి లీలావతారమూర్తియైన ఆ శ్రీకృష్ణుడు తన తల్లిని సమాధానపఱచెను. పిమ్మట ఆ స్వామి ఆమెకు తన నోరు తెరచిచూపెను.

క. ఆ లలితాంగి కనుంగొనె, బాలుని ముఖమందు జలధి పర్వత వన భూ
గోళ శిఖి తరణి శశి ది, క్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్. 340

తెఱచియున్న ఆ పసివానినోటిని చూడగా అందు ఆ తల్లికి, సముద్రములు, పర్వతములు, వనములు మున్నగువాటితో గూడిన భూమండలము, అగ్ని, సూర్యచంద్రులు, అష్టదిక్పాలురు మొదలగు మహాత్ములకు నెలవైన బ్రహ్మాండము దర్శనమిచ్చెను.

వ. కనుంగొని. 341

మ. కలయో వైష్ణవమాయయో యితర సంకల్పార్థమో సత్యమో
తలఁపన్ నేరక యున్నదాననొ యశోదాదేవిఁ గానో పర
స్థలమో బాలకుఁడెంత యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వల మై యుండుట కేమి హేతువొ మహాశ్చర్యంబు చింతింపఁగన్. 342

ఆ అద్భుత దృశ్యములను జూచి, ఆశ్చర్యచకితయై ఆ యశోదమ్మ ఇట్లు తలపోసెను. 'ఇదియంతయును ఒక స్వప్నమా? విష్ణుమాయయా? లేక ఇందులో ఏదైనను పరమార్థము కలదా? ఇవియన్నియు సత్యము లేనా? ఇప్పుడు నాకు ఏమియు తోచుటలేదు. ఇంతకును నేను యశోదాదేవినేనా? ఇది మా ఇల్లేనా? ఈ చిట్టికృష్ణుని (పసిబాలుని) నోటిలో ఈ బ్రహ్మాండము అంతయును ఇట్లు దివ్యప్రకాశముతో కనబడుటకు కారణము ఏమైయుండును? ఆలోచించిచూడగా ఇది ఎంతయు ఆశ్చర్యకరముగా ఉన్నది.

ఆ. బాలమాత్రుఁడగు సలీలుని ముఖమందు విశ్వమెల్ల నెట్లు వెలసి యుండు
బాలుభంగి నితఁడు భాసిల్లుఁగాని సర్వాత్ముఁడాదివిష్ణుఁ డగుట నిజము 343

వ. అని నిశ్చయించి. 344

చిన్నపిల్లలతోగూడి ఆడుకొనుచుండెడి ఈ పసివాని ముఖమునందు ఈ విశ్వమంతయును ఎట్లు కుదురుకొనియుండును? బాలునివలె కనబడుచున్నాడేగాని యథార్థముగా ఇతడు సర్వాత్ముడైన ఆ శ్రీమన్నారాయణుడే - అని ఆ తల్లి తనమనస్సులో నిశ్చయించుకొని, ఇట్లు తలపోయసాగెను.

ఆ. ఏ మహాత్మువలన నీ విశ్వరూపంబు గానఁబడిన బుద్ధికంపమయ్యె
నామహాత్ము విష్ణునఖిల లోకాధారు నార్తు లెల్లఁ బాయ నాశ్రయింతు. 345

క. నా మగఁడు నేను గోవులు, నీ మందయు గోపజనులు నిబ్బాలుని నె
మ్మోమున మున్న విధముఁగని, యేమతితిమి గాక యీశుఁడీతఁడు మాకున్. 346

వ. అని తన్నుఁ బరమేశ్వరుండని తలంచుచున్న యశోదయందు నాకృష్ణుండు వైష్ణవమాయం బొందించిన. 347

"ఈ మహాత్మునివలన నాకు విశ్వరూపదర్శనము ఐనది. దీనిప్రభావమువలన నా బుద్ధి కంపించి పోయినది. అఖిల లోకములకును ఆధారమైనవాడు, పరమాత్ముడు ఐన శ్రీమహావిష్ణువును నా బాధలు అన్నియు దూరమగుటకై త్రికరణశుద్ధిగా ఆశ్రయించెదను. పసిశిశువుగా ఉన్న ఈతనిముఖమును జూచి (ఈతని ముఖ లక్షణములనుబట్టి) నేను, నా భర్తయు, వ్రేపల్లెలోని గోపికలును, గోపాలురు, కడకు గోవులును 'ఇతడు బాలుడు' అనియే భ్రమపడితిమి. కాని ఇతడు మా పాలిట సర్వేశ్వరుడే" ఇట్లు యశోదాదేవి తనను పరమేశ్వరునిగా తలంచుచుండగా, ఆ కృష్ణుడు ఆ తల్లిపై వైష్ణవమాయను ప్రసరింపజేసెను. (మోహమున ముంచివేసెను.)

క. జడను పడి యెఱుకసెడి యా పడఁతుక సర్వాత్ముఁ డనుచుఁ బలుకక యతనిం
గొడుకని తొడపై నిడుకొని, కడు వేడుకతోడ మమత గావించె నృపా! 348

రాజా! ఆ మాయా ప్రభావమున యశోదాదేవి మోహపరవశురాలయ్యెను. అంతట ఆమె ఆ శిశువు 'సర్వాత్ముడు' అనుమాటను మరచిపోయెను. పిమ్మట అతడు 'తన కొడుకే' అని భావించి ఎప్పటివలె అతనిని తన ఒడిలో చేర్చుకొని, వేడుకతో లాలించుచు, తనమమకారము క్రుమ్మరించెను.

వ. అవిన విని, రాజిట్లనియె. 349

ఆ. జగదధీశ్వరునకుఁ జన్నిచ్చు తల్లిగా నేమినోము నోఁచె నీ యశోద
పుత్రుఁడనుచు నవనిఁ బోషించు తండ్రిగా నందుఁడేమి సేసె నందితాత్మ! 350

పిదప పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రునితో ఇట్లనెను. జగన్నాథుడైన శ్రీమహావిష్ణువునకు (శ్రీకృష్ణునకు) స్తన్యమునిచ్చిన ధన్యాత్మురాలు ఆ యశోద - ఆ తల్లి పూర్వజన్మమునందు ఎట్టి నోములు నోచినదో? ఏమో? ఈ దివ్యశిశువును పుత్రునిగా భావించుచు పెంచి పెద్దచేసి కృతార్థుడైన నందుడు ఎట్టి సుకృతములను ఆచరించినాడో?

క. ప్రబ్బిన భక్తిని హరిపైఁ గబ్బంబులు సెప్పి కవులు కైవల్య శ్రీ
కబ్బుదురఁట హరిపోషణ, మబ్బిన తలిదండ్రు లెచటి కబ్బుదురొ తుదిన్. 351

శ్రీహరిని ప్రగాఢమైన భక్తితో సేవించి, ఆయన మహిమలతో నిండిన కావ్యములను వ్రాసిన మహాకవులు మోక్షమునకు, అర్హులు అయ్యెదరట - ఇక ఆ శ్రీహరిని తమ కుమారునిగా లాలించి, పాలించిన తలిదండ్రులకు ఎంతటి పరమగతి అబ్బునోగదా!

## యశోదానందులపూర్వజన్మ వృత్తాంతము

వ. అనిన విని, రాజయోగికి శుకయోగి యిట్లనియె. 352

సీ. అవనీశ! విను ద్రోణుఁ డనువాఁడు వసువుల యందు ముఖ్యుఁడు ధర యతనిభార్య
వారినిద్దఱ బ్రహ్మ వసుధపై జన్మింపుఁ డంచుఁ బంచిన వార లతనిఁ జూచి
విశ్వేశ్వరుండైన విష్ణుసేవారతి మాకిచ్చితేనిని మహి జనింతు
మనవుడు నట్లకాకనియె వేల్పులపెద్ద యా ద్రోణుఁడీ నందుఁడై జనించె
ఆ. ధర యశోద యయ్యె దనుజేంద్రవైరియుఁ గమలగర్భుమాట గారవించి
తల్లిదండ్రు లనుచుఁదగ వారి మన్నించె నధిక భక్తితోడ నలరిరిట్లు 353

అంతట పరీక్షిన్మహారాజుతో శుకయోగి ఇట్లు వచించెను. మహారాజా! 'ద్రోణుడు' అనువాడు వసువులలో ముఖ్యుడు. ఆతనిభార్య 'ధర'. బ్రహ్మ వీరిని ఇద్దరిని 'భూతలమున జన్మింపుడు' అని ఆజ్ఞాపించెను. అంతట వారు 'జగన్నాథుడైన శ్రీమహావిష్ణువును నిరంతరము సేవించెడి భాగ్యమును మాకు అనుగ్రహింపుడు. నీ ఆజ్ఞను తలదాల్చి మేము మానవులమై జన్మించెదము' అని అర్థించిరి. అందులకు బ్రహ్మ ఆమోదించెను. ఆ ద్రోణుడు ఈ 'నందుడు'గాను, 'ధర' యశోదగాను జన్మించిరి. అంతట శ్రీమన్నారాయణుడును బ్రహ్మదేవునియొక్క అభ్యర్థనను మన్నించి, శ్రీకృష్ణుడై అవతరించి, మిక్కిలి ప్రేమానురాగములతో ఆ యిద్దరిని తల్లిదండ్రులనుగా గౌరవింపసాగెను.

వ. అంత నొక్కనాఁడు, తన యింటికడ పాపలందఱు నయ్యై పనులవెంట బంపువడి పోయిన, నందసుందరి, సంరంభంబునం దరికంబంబుకడఁ గుదురున నొక్కదధికుంభంబు వెట్టి, మిసిమిగల మీఁగడఁ బెరుఁగు కూడంబోసి, వీఁక నాఁక త్రాడు కవ్వంబున నలవరించి. 354

ఇది ఇట్లుండగా ఒకానొకనాడు యశోదాదేవిఆజ్ఞపై ఆ యింటిలో పనులను నిర్వహించు యువతులు అందఱును ఆయా పనులపై వెళ్లిరి. అంతట ఆ నందునిపత్ని త్వరత్వరగా పెఱుగు చిల్కెడి స్తంభము కడ 'కుదురును' ఉంచి, పెఱుగు చిల్కెడి పాత్రను ఉంచెను. పిమ్మట ఆమె మిసిమిగల మీగడతో గూడిన గడ్డ పెఱుగును ఆ కుండలో పోసెను. అనంతరము ఆ యశోదమ్మ అందు కవ్వమును ఉంచి, దానికి త్రాడును చుట్టి పెఱుగు చిలుకసాగెను.

## యశోద దధిభాండ వికలనాదులు సేసిన కృష్ణునిఁ బట్టుకొనుట

సీ. కరకమలారుణకాంతిఁ గవ్వపుఁద్రాడు పవడంపు నునుఁదీఁవపగిది మెఱయఁ
గ్రమముతో రజ్జువాకర్షింపఁ బాలిండ్లు వీడ్వడి యొండొంటి వీఁక నొత్తఁ

గుచకుంభముల మీఁది కొంగు జాఱఁగ జిక్కువడుచు హారావళుల్ బయలు పడఁగఁ
బొడమిన చెమటతోఁ బొల్పారు నెమ్మోము మంచు పైపడిన పద్మంబుఁ దెగడఁ

తే. గౌను నులియంగఁ గంకణక్వణన మెసఁగఁ దుఱుము బిగివీడఁ గర్ణికాద్యుతులు మెఱయ
బాలు నంకించి పాడెడి పాటవలనఁ దరువు లిగురొత్తఁ బెరుఁ గింతి దరువఁ జొచ్చె. 355

అప్పుడు యశోదాదేవియొక్క అరచేతులఎఱ్ఱని కాంతులు కవ్వపుత్రాడుపై ప్రసరించుచుండగా అది పవడపు తీగవలె విరాజిల్లుచుండెను. రెండు చేతులతో త్రాడు కొనలను పట్టుకొని అటునిటు లాగుచుండగా ఆమెయొక్క వక్షఃస్థల శోభలు వింతగొలుపుచుండెను. ఆ తొందరలో ఆమెపయ్యెద జారిపోవుచుండగా మెడలోని హారము చిక్కుపడి కన్పించుచుండెను. శ్రమపడి పెఱుగు చిలుకుచుండగా అలసిపోయిన ఆమెయొక్క ముఖము చెమట బిందువులతో గూడి, మంచు బిందువులతో ఒప్పెడి కమలమును మించి శోభిల్లుచుండెను. నడుము అటునిటు కదలుచుండెను. చేతులకంకణములు మనోజ్ఞముగా ధ్వనించుచుండెను. కొప్పుముడి సడలిపోవుచుండెను. శ్రవణాభరణములకాంతులు తళుకులీనుచుండెను. ఆమె బాలకృష్ణుని కొనియాడుచు పాడెడి పాటలకు చెట్లు చిగిరించుచుండెను. ఆ తల్లి ఈ విధముగా పెఱుగు చిలుకుచుండెను.

వ. ఆ సమయంబున. 356

క. సుడియుచు వ్రాలుచుఁగిదుకుచు, సడి గొట్టుచు 'నమ్మ! రమ్మ' చన్నిమ్మనుచున్
వెడవెడ గంతులు వైచుచుఁ, గడవఁ గదిసి బాలకుండు కవ్వముఁ బట్టెన్. 357

ఇంతలో చిట్టికృష్ణుడు తల్లిచుట్టును తిరుగుచు, ఆమెమీద పడుచు, మారాము చేయుచు, అల్లరి చేయసాగెను. 'అమ్మా! రమ్మ, నాకు పాలిమ్మ', అనుచు, చిరుగంతులు వేయుచు, పెఱుగు కడవదగ్గరకు చేరి, కవ్వమును గట్టిగా పట్టుకొనెను.

క. కవ్వముఁ బట్టిన ప్రియసుతు, నవ్వనరుహనేత్ర దిగిచి యంకతలమునన్
నవ్వుచు నిడుకొని కూఁకటి, దువ్వుచుఁ జన్నిచ్చె నతఁడు దూఁటుచుఁ గుడిచెన్. 358

అంతట యశోదాదేవి కవ్వము పట్టుకొనియున్న తనచిన్నారిచిలిపిచేష్టలకు మురిసిపోవుచు, అతనిని తనయొడిలోనికి దీసికొని, అతని పిల్లజుట్టును దువ్వుచు పాలియ్యసాగెను. అప్పుడు అతడు గుటకలు వేయుచు పాలు త్రాగుచుండెను.

మ. కడుపారం జనుఁబాలు ద్రావని సుతుం గంజాక్షి పీఠంబుపై
నిడి పొంగారెడు పాలు డించుటకునై యేఁగంగఁ దద్బాలుఁడె
క్కుడు కోపంబున వాఁడిఱాత దధిమత్కుంభంబు వోఁగొట్టి తెం
పడరం గుంభములోని వెన్న దినె మిథ్యా సంకులద్బాష్పుఁడై. 359

అప్పుడు యశోదమ్మ పొయ్యిమీద పొంగిపోవుచున్న పాల (పాత్ర)ను దించుటకై, తన బుడుతడు చనుబాలు పూర్తిగా త్రాగకముందే అతనిని ఒక పీటమీద కూర్చుండబెట్టి, వంట ఇంటిలోనికి వెళ్లెను. అందులకు శ్రీకృష్ణుడు అలిగి, ఆ కోపములో పదునైన రాతితో పెఱుగు కుండను పగులగొట్టెను. అంతేగాక సాహసముతో (నిర్భయముగా) పగిలిన కుండలోని వెన్న చేతులనిండా తీసికొని తినుటయేగాక దొంగకన్నీళ్లతో ఏడువసాగెను.

వ. అంత నా లోలలోచన, పాలు డించివచ్చి, వికలంబులయిన దధికుంభ శకలంబులఁ బొడగని, తుంటకొడుకు వెన్న దింట యెఱింగి, నగుచు, నా కలభగామిని యతనిం గానక, చని చని. 360

ఇంతలో ఆ యశోద పొయ్యిమీది పాలను దించివచ్చెను. పగిలియున్న పెఱుగుకుండ ముక్కలను జూచి, తన తుంటరికొడుకు వెన్నదిన్న విషయమునుగూడ గ్రహించెను. పిదప ఆమె మురిపెముతో నవ్వుచు అతని కొఱకు ఇటునటు వెదకెను. ఎంతకును ఆ అల్లరిపిడుగు కనబడకుండెను.

ఆ. వికచకమలనయన వేఱొక యింటిలో వెలయ ఱోలు దిరుగవేసి యెక్కి
యుట్టిమీఁది వెన్న నులుకుచు నొకకోఁతి పాలు సేయుచున్న బాలుఁగనియె. 361

తమ ఇంటినుండి పారిపోయిన కృష్ణుడు మఱియొక ఇంటిలో ఉండగా ఆమె చూచెను. అప్పుడు అతడు తాను ఎక్కుటకు వీలుగా ఒక రోలును తిరుగవేసి, ఉట్టిపైనున్న వెన్నను భయపడుచునే ఒక కోతికి పెట్టుచుండెను. అతనిదుడుకుతనమును ఆ తల్లి గమనించెను.

మ. కని చేతన్ సెలగోల పట్టికొనుచున్ గానిమ్ము కానిమ్ము రా
తనయా! యెవ్వరియందుఁ జిక్కువడ నే దండంబునుం గాన నే
వినివారంబును బొంద నే వెఱపు నే విభ్రాంతియుం జెంద ము
న్ననియో నీ విటు నన్నుఁ గైకొనమి నేఁడారీతి సిద్ధించునే. 362

అల్లరి చేయుచున్న ఆ దుడుకువానిని దండించుటకై ఆమె ఒక బెత్తమును దీసికొని ఇట్లు పలికెను. "ఓరీ తుంటరీ! నీ చిలిపిపనులను చేయుచునే యుండుము. 'నేను ఇంతవరకును ఎవ్వరి చేతులకును చిక్కలేదు, ఎవ్వరును నన్ను దండింపలేదు, ఎవ్వరును నన్ను అడ్డగింపగలవారే లేరు. నాకు భయమేలేదు, భ్రమపడి ఎఱుగను' అని నీవు భావించుచున్నట్లున్నది. అందులకే కాబోలు నా మాటలను లక్ష్యపెట్టుటలేదు. ఇంక నీ ఆటలు సాగవు. ఈనాడు నేను నిన్ను దండించితీరెదను".

వ. అని యదలించుచుఁ, గొడుకు నడవడిం దలంచి తనుమధ్య తనమనంబున. 363

సీ. బాలుఁడీతండని భావింతు నందునా యే పెద్దలును నేరరీక్రమంబు
వెఱపెఱుంగుటకునై వెఱపింతునందునా కలిగి లే కొక్కఁడు గాని లేఁడు
వెఱపుతో నాబుద్ధి వినిపింతు నందునా తను దానయై బుద్ధిఁదప్పకుండు
నొండెఱుంగక యింట నుండెడి నందునా చొచ్చి చూడని దొకచోటు లేదు.

ఆ. తన్ను నెవ్వరైనఁ దలపోయఁ బాఱెడి యోజ లేదు భీతి యొకటియెఱుఁగఁ
డెలమి నూరకుండఁ డెక్కసక్కెము లాడుఁ బట్టి శాస్తి సేయు భంగి యెట్లు ? 364

ఇట్లు మందలించుచు తన కొడుకుయొక్క అల్లరి ప్రవర్తనను తలంచుకొని ఆమె తన మనస్సులో ఇట్ల చింతించెను. ఇతడు పెద్దపిల్లలు (పడుచువారు) సైతము చేయని దుడుకుపనులను చేయుచున్నాడు. కనుక ఇతనిని పసివానినిగా భావించుట ఎట్లు? నాకు ఉన్నది ఒక్కగానొక్క కొడుకు. ఇతనిని దారికి తెచ్చుటకై భయపెట్టుటకు నాకు ఏమాత్రమూ మనస్కొప్పుటలేదు. ఒక్కొక్కప్పుడు ఇతడు తనకు తానే బుద్ధిమంతుడుగా కనబడుచుండును. కనుక మంచిమాటలతోనైనను ఇతనిని భయపెట్టుట ఎట్లు? ఇతడు ఇతరులజోలిపట్టక ఇంటిలోనే ఉండునని అనుకొనినచో ఇతడు జొరబడని ఇల్లే లేదు. ఇతనిని ఎవ్వరైనను దండింపజూచినచో ఇతడు ఎక్కడికిని పారిపోవుటకు యత్నింపడు సరిగదా, వారినిజూచి ఏ మాత్రమూ భయపడడు. ఎప్పుడునూ ఏమాత్రమూ ఒక్కచోట నిల్కడగా ఉండనే ఉండడు, మీదుమిక్కిలి వికటముగా మాట్లాడుచుండును. ఇంక ఇతనిని దండించుట ఎట్లు?

వ. అని వితర్కించి, 365

క. లాలనమున బహుదోషము, లోలిం బ్రాపించుఁ దాడనోపాయములం
జాల గుణంబులు గలుగును, బాలురకును దాడనంబ పథ్యం బరయన్. 366

వ. అని నిశ్చయించి, కేలనున్న కోల జళిపించి, బాలా! నిలునిలుమని బగ్గు బగ్గున నదల్చుచు దల్లి డగ్గఱిన, బెగ్గడిలిన చందంబున నగ్గలిక సెడి, ఱోలు డిగ్గనుఱికి. 367

క. గజ్జెలు గల్లని మ్రోయఁగ ,నజ్జలు ద్రొక్కుటలు మాని యతిజవమున యో
షిజ్జనములు నగఁ దల్లియుఁ, బజ్జం జనుదేర నతఁడు పరువిడె నధిపా! 368

అని తర్కించుకొని ఆ తల్లి ఇట్లు నిశ్చయించుకొనెను. పిల్లలను మితిమీఱి గారాబము చేసినచో చెడిపోవుదురు. తగినవిధముగా దండించుచు పెంచినచో వారికి మంచిగుణములు అలవడును. అందువలన మొండితనముతో దారికి రాని పిల్లలను దండించుట యుక్తమే.[1] అనంతరము యశోదాదేవి తన చేతిలోని బెత్తమును ఊపుచు 'ఓరీ అల్లరివాడా! ఆగు, ఆగు' అని కోపముతో మందలించుచు దగ్గఱకు వచ్చెను. అంతట ఆ చిలిపికృష్ణుడు భయపడుచున్నట్లు నటించుచు అల్లరిమాని రోటిమీదినుండి గబాలున దూకెను. రాజా! పిమ్మట అతడు కాళ్లగజ్జెలు ఘల్లుఘల్లున మ్రోగుచుండగా, చిందులు వేయుటమాని మిక్కిలి వేగముగా పరుగిడెను. అప్పుడు అక్కడనున్న గోపికలందఱును నవ్వసాగిరి, తల్లి అతని వెంబడించెను. అతడు ఆమెకు చిక్కకుండ పరుగెత్తుచునే యుండెను.

వ. అప్పుడు. 369

మ. స్తనభారంబున డస్సిక్రుస్సి యసదై జవ్వాడు మధ్యంబుతో
జనితస్వేదముతోఁ జలత్కబరితో స్రస్తోత్తరీయంబుతో
వనజాతేక్షణ గూడఁబాఱి తిరిగెన్ వారించుచున్ వాకిటన్
ఘన యోగీంద్రమనంబులున్ వెనుకొనంగా లేని లీలారతున్. 370

అట్లు చిట్టికృష్ణుని వెంబడించుచుండగా ఆ యశోదమ్మ శరీరభారముతో మిగుల అలసిపోయి ఆయాసమునకు లోనయ్యెను, ఆమెయొక్క సన్నని నడుము వంగిపోయెను. ఒడలంతయు చెమటపట్టెను. కొప్పు సడలిపోవుచుండెను, పైట జారిపోవుచుండెను. మహాయోగీంద్రులుసైతము తమ మనస్సులతోడను వెంబడించలేని (వారి మనస్సులకును అందని)[2] లీలామూర్తి గదా! అతడు. అట్టి ఆ స్వామిని వారించుచు వెంబడించి, ఆ తల్లివాకిట నిలిచెను.

వ. ఇట్లు కూడఁజని. 371

సీ. స్తంభాదికంబులు తనకు నడ్డంబైన నిట్టట్టు సని పట్టనీనివాని
నీ తప్పు సైరింపు మింక దొంగిలఁబోవ నేనని మునుముట్ట నేడ్చువానిఁ
గాటుక నెఱయంగఁ గన్నులు నులుముచు వెడలు కన్నీటితో వెగచువాని
నేదెస వచ్చునో యిది యని పలుమాఱు సురుఁగుచుఁ గ్రేఁగంటఁ జూచువాని

1. లాలనాత్ బహవోదోషాః తాడనాత్ బహవోగుణాః ।
తస్మాత్ పుత్రంచ, శిష్యంచ, తాడయేన్నతు లాలయేత్ ॥ (నీతిశాస్త్రము)
2. యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ - అని శ్రుతిప్రమాణము.
అవాఙ్మానసగోచరుడు గదా! ఆ ప్రభువు.

ఆ. గూడఁబాఱి పట్టుకొని వెఱపించుచుఁ జిన్ని వెన్న దొంగ సిక్కె ననుచు
నలిగి కొట్టఁ జేతులాడక పూఁబోఁడి కరుణతోడ బాలుఁగట్టఁ దలఁచి. 372

వ. ఇట్లనియె. 373

ఆమె అట్లు వెన్నంటి వచ్చుచుండగా, శ్రీకృష్ణుడు స్తంభములు అడ్డువచ్చినప్పుడు వాటిచాటున ఇటునటు తిరుగుచు ఆమెచేతికి అందకుండెను. 'ఈ ఒక్కసారి నన్ను క్షమింపుము' అని పలుకుచు ఆమె కొట్టకముందే అతడు ముందుముందుగా ఏడ్చుచుండెను. కాటుక చెదరిపోవునట్లుగా కన్నులను నులుముకొనుచు వెక్కివెక్కి ఏడ్చుచు కన్నీరుగార్చుచుండెను. తల్లి ఎటునుండి వచ్చునో? అని తలంచుచు పదేపదే దాగికొనుచు క్రీగంట చూచుచుండెను. అంతట యశోదమ్మ వెంబడించి, ఎట్టకేలకు అతనిని పట్టుకొని, భయపెట్టుచు' చిన్ని వెన్నదొంగ చిక్కినాడు సుమా!' అని పలికెను. ఆ తల్లి మిగుల కోపముతో ఉన్నను అతనిని కొట్టుటకై ఆమెకు చేతులు రాకపోయెను. అప్పుడు సుతిమెత్తని మనస్సుగల ఆమె జాలిపడి, త్రాడుతో అతనిని బంధింపదలచి ఇట్లనెను.

క. వీరెవ్వరు శ్రీకృష్ణులు, గారా! యెన్నఁడును వెన్న గానరఁట కదా
చోరత్వంబించుక యును, నేరరఁట, ధరిత్రి నిట్టి నియతులు గలరే 374

క. పట్టినఁ బట్టువడని నినుఁ, బట్టెద నని చలము గొనినఁ బట్టుట బెట్టే
పట్టువడవంద్రు పట్టీ , పట్టుకొనన్ నాకుఁగాక పరులకు వశమే. 375

'ఎవరు వీరు? ఓహో శ్రీకృష్ణులవారా? వీరు ఎన్నడును వెన్నమొగము ఎఱుగరటగదా! పాపము వీరికి దొంగతనము అనగా ఏమిటో తెలియదట. ఈ భూతలమున ఇట్టి బుద్ధిమంతులు ఎక్కడైనను ఉన్నారా? బుజ్జినాయనా! ఎంతటి మహాత్ములైనను నిన్నుపట్టుకొనజాలరు. నేను గట్టిగా పూనుకొనినచో నిన్ను పట్టుకొనుట కష్టమేమియు గాదు. మహితాత్ములకు సైతము నీవు అందవు - అని పెద్దలు చెప్పెదరు. కాని నిన్ను పట్టుకొనుటకు నాకు దప్ప ఇతరులకు సాధ్యముకాదు.(1)

క. ఎక్కడ నైనను దిరిగెద, వొక్కయెడన్ గుణము కలిగి యుండవు నియమం
బెక్కడిది నీకు మఱచినఁ, జక్కఁగ బోయెదవు పెక్కు జాడలఁ బుత్రా! 376

కుమారా! నీవు తిరుగనిచోటేలేదు. ఒక్కచోటనైనను బుద్ధిగలిగి నిలుకడగా ఉండవు. అసలు నీకు ఒక నియమమే ఉన్నట్లు కనబడదు. ఒక్కక్షణము పాటు ఏమఱుపాటున ఉన్నచో నీవు ఎక్కడెక్కడికో పోయెదవు.(2)

1. భగవత్తత్త్వమును తన గుండెనిండ నింపుకొనిన మహితాత్మురాలు ఆ యశోదమ్మ. లీలావతారుడైన శ్రీకృష్ణుని తన తనయునిగా పొందుట ఆ తల్లి జన్మజన్మలలో చేసికొనిన పుణ్యములఫలము. ఎప్పటినుండియో ఆ శ్రీమన్నారాయణుని తన హృదయములో భద్రపరచుకొనిన (బంధించియుంచిన) ధన్యాత్మురాలు ఆ తల్లి. బాహ్యముగా ఆమెకు దొరకనట్లు నటించుట ఆ స్వామి లీలామధురిమలు మాత్రమే.

2. భగవంతుడు సర్వాంతర్యామి. ఆయనలేనిచోటే ఉండదు. అతడు గుణాతీతుడు. సర్వనియంత. అతనిని నియంత్రించువారు ఎవ్వరును లేరు. ఆయనను విస్మరించినవారికి ఆయన అనుగ్రహము దక్కదు. ఆపన్నులైన భక్తులను ఆదుకొనుటకై అతడు ఎక్కడికైనను వెంటనే పోవును.

సీ. తోయంబులివి యని తొలఁగక చొచ్చెదు తలఁచెదు గట్టైనఁదరల నెత్త
మంటితో నాటలు మానవు కోరాడె దున్నత స్తంభంబు లూఁపఁబోయె
దన్యుల నల్పంబు లడుగంగఁ బాఱెదు రాచవేఁటలఁ జాల అవ్వ దెచ్చె
దలయవు నీళ్ళకు నడ్డంబు గట్టెదు ముసలివై హలివృత్తి మొనయఁ జూచె
ఆ. దంబరంబు మొలకు నడుగవు తిరిగెద వింకఁ గల్కిచేఁతలేల పుత్ర!
నిన్ను వంప వ్రాల్ప నే నేర ననియొ నీ విట్టు క్రిందు మీఁదు నెఱుఁగ కునికి 377

కన్నయ్యా! 'ప్రమాదము' అని భావింపక నీళ్లలో ఇష్టమువచ్చినట్లు ప్రవేశించుచుందువు. (మత్స్యావతారమున సముద్రమునజొచ్చి, సోమకుని చంపి వేదములను ఉద్ధరించితివి) ఎంతటి కొండనైనను ఎత్తుటకు ప్రయత్నించుచుందువు. (కూర్మావతారమున మందరపర్వతమునెత్తి అమృతమును ప్రసాదించితివి). మట్టిలో ఆడుకొనుట మానవైతివి, పైగా ఒంటినిండా దుమ్ము కొట్టుకొనుచుంటివి. (వరాహావతారమున నీ కోఱలతో భూమండలమును ఉద్ధరించితివి) ఎత్తైన స్తంభములను పట్టుకొని వాటిని ఊపుటకు పూనుకొనుచుంటివి. (నృసింహావతారమున స్తంభమును ఛేదించుకొనివచ్చి హిరణ్యకశిపుని మట్టుపెట్టితివి.) ఇతరులకడ అల్పమైన వస్తువు కొఱకు గూడ చేయిచాచుచుందువు. (వామనావతారమున మూడడుగుల మేరకై బలిచక్రవర్తిని అర్థించి, భూమ్యాకాశములను ఆక్రమించితివి.) రాజసప్రవృత్తిలో జగడములను కొనితెచ్చుకొంటివి. (పరశురామావతారమున క్షత్రియులను సంహరించి, అపకీర్తిని మూటగట్టుకొంటివి.) అవలీలగా నీళ్లకు అడ్డుకట్టలు వేయుచుంటివి. (రామావతారమున అపారమైన జలనిధిపై అద్భుతమైన సేతువును నిర్మించితివి) నీవే ఒక మేటివై (మొనగాడవై) కోతివలె అల్లరిచేష్టలు చేయుచుందువు. (హలి-హరి-రలయోరభేదః) (బలరామావతారమున ముసలమును, హలమును చేతబట్టి ప్రలంబాసురుని హతమార్చితివి.) దిసమొలతో తిరుగుచుందువు. (బుద్ధావతారమున దిగంబరముగా తిరిగెదవు.) ఇంకను ఈ అల్లరి పనులను ఎందుకు చేయుచుంటివో? ఎఱుగను (నీ కలికి అవతార లక్ష్యమేమో? తెలియదు). నేను నిన్ను అదుపులో పెట్టజాలననిగదా! నీవు ఇట్లు చేయుచున్నది నీవు క్రిందుమీదుగానక ప్రవర్తించుచుంటివి. (నీవు సర్వవ్యాపకుడవై తేజరిల్లుచున్నావు.) (ఇచట యశోదాదేవి పలుకులలో దశావతారములు మెఱిసిన తీరు అద్భుతము.)

## ఉలూఖలబంధనము - గంధర్వులకు శాపవిమోచనము

వ. అని మర్మంబు లెత్తి పలికి. 378

క. ఆ లలన గట్టె ఱోలన్, లీలన్ నవనీత చౌర్యలీలుం బ్రియవా
గ్జాలుం బరివిస్మిత గో, పాలున్ ముక్తాలలామఫాలున్ బాలున్. 379

క. ఱోలను గట్టువడియు న, బ్బాలుఁడు విలసిల్లె భక్తపరతంత్రుండై
యాలాన సన్నిబద్ధ వి, శాల మదేభేంద్రకలభ సమరుచి నధిపా! 380

ఇట్లు నర్మగర్భితంబుగా మాట్లాడిన పిమ్మట ఆ యశోదమ్మ ముసిముసి నవ్వులను చిందించుచున్న బాలగోపాలుని (శ్రీకృష్ణుని) విలాసముగా ఱోటికి కట్టివేసెను. ఆ బుడుతడు వెన్నను దొంగిలించుటలో అందెవేసిన చేయి, ముద్దుముద్దు మాటలతో ఎదుటివారిని ఆకట్టుకొనుటలో మేటి. ఆ చిన్నారి ముఖమున విరాజిల్లుచున్న మేలి ముత్యాలబొట్టు సుమనోహరము. మహారాజా! భక్తపరాధీనుడగుటవలన ఆ స్వామి (చిట్టి కృష్ణుడు) రోటికి కట్టుబడియెను. అప్పుడతడు కట్టుకొయ్యకు కట్టివేయబడిన మదపుటేనుగు గున్నవలె విలసిల్లుచుండెను.

క. వెలి లోను మొదలు దుది నడు, ములులేక జగంబు తుదియు మొదలున్ నడుమున్
వెలియును లోనగు నీశ్వరు, నలవడునే కట్టఁ బ్రణుతురాల్ గాకున్నన్. 381

సర్వేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు ఆదిమధ్యాంతరహితుడు. అనగా మొదలు, మధ్య, చివరలుగాని, లోపల, వెలుపల అనునవిగాని లేనివాడు. కాని జగత్తునకు ఆదియు, మధ్యయు, అంతము ఐనవాడు. అనగా సృష్టికి పూర్వము, ప్రలయమునకు పిమ్మటను ఉండువాడు అంతేగాక అతడు జగత్తులోపల నిండియుండువాడు, జగత్తునకు వెలుపలగూడ వ్యాపించియుండువాడు. ఆ స్వామి సర్వాంతర్యామి. (1) + (2) శ్రీహరికి ప్రపన్నురాలుగావున ఆమెకు అది సాధ్యమయ్యెను.

ఆ. పట్టి యల్లబోఁటి పట్టి యీతండని గట్టితలఁపుతోడఁ గట్టెఁ గాక
పట్టి కడుపు పెక్కు బ్రహ్మాండములు వట్టు టెఱిఁగెనేనిఁ దల్లి యేలకట్టు. 382

తన చిన్నికృష్ణుడు సాధారణ బాలురవంటివాడే యని భావించి ఆ తల్లి కట్టివేసెను. ఆ చిన్నారి కడుపులో పెక్కుబ్రహ్మాండములు కలవని తెలిసియున్నచో యశోదమ్మ అట్లు కట్టివేసెడిదికాదు.

క. చిక్కఁడు సిరికౌఁగిటిలోఁ, జిక్కఁడు సనకాది యోగి చిత్తాబ్జములం
జిక్కఁడు శ్రుతిలతికావళిఁ, జిక్కె నతఁడు లీలఁ దల్లిచేతన్ ఱోలన్. 383

ఆ కృష్ణస్వామి (శ్రీహరి) లక్ష్మీదేవి కౌగిటిలో చిక్కడు. (ఆమెయే ఆ ప్రభువుయొక్క వక్షస్థలమును ఆశ్రయించి యుండును). సనకసనందనాది మహాయోగులయొక్క హృదయకమలములయందును చిక్కుకొనడు, వేదములకును అందడు (వేదములుగూడ భగవత్తత్త్వమును పూర్తిగా తెలుపజాలవు). అట్టి బాలకృష్ణుడు తల్లికి చిక్కుటగాని, ఱోటికి కట్టివేయబడుటగాని ఆయన లీలయే.

వ. ఇట్లు గ్రద్దన నా ముద్దియ ముద్దులపట్టియుదరంబు గట్ట నడరుచుఁ జతురంబుగఁ జక్క నొక్క త్రాడు సుట్టిన, నది రెండంగుళంబులు కడమ పడియె, మఱియు నొక్క బంధనంబు సంధించి వలగొనిన, నంతియ కొఱంత యయ్యె వెండియు నొక్క పాశంబు గూర్చి పరివేష్టించిన, వెల్తిసూపె. నిట్లు, 384

క. తజ్జనని లోఁగిటం గల, రజ్జుపరంపరలఁ గ్రమ్మఱన్ సుతుఁ గట్టన్
బొజ్జ దిరిగి రాదయ్యె జ, గజ్జాలములున్న బొజ్జ గట్టన్ వశమే. 385

ఈవిధముగా కృష్ణుని చిక్కించుకొని ఆ యశోదమ్మ వెంటనే తన ముద్దులకుమారునిఉదరమును కట్టివేయుటకు యత్నించుచు నేర్పుతో ఒక త్రాడును చుట్టెను. అది రెండు అంగుళములు తక్కువ అయ్యెను, మఱియొక త్రాడు తెచ్చి దానికి ముడివేసి చుట్టగా మఱల అంతే తక్కువయ్యెను. ఇంకను వేఱొక త్రాడు జతచేసి చుట్టినను అదియును చాలకుండెను. ఇట్లు ఆ తల్లి (యశోదమ్మ) ఇంటిలోగల త్రాళ్లను అన్నింటిని తెచ్చి కట్టివేయుటకు పూనుకొనినను ఆ తాడు బొజ్జకు చుట్టును తిరిగి రాదయ్యెను. ముజ్జగములను తనలో నిలుపుకొనిన ఆ బొజ్జను కట్టివేయుట ఎవరికి తరము.

---

1. అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణస్థితః । అని గదా! వేదప్రమాణము.
2. శ్లో॥ న చాంతర్న బహిర్యస్య న పూర్వం నాఽపిచాఽపరమ్ ।
పూర్వాపరం బహిశ్చాఽంతర్జగతో యో జగచ్చయః ॥
శ్లో॥ తం మత్వాఽఽత్మజమవ్యక్తం మర్త్యలింగమ్ అధోక్షజమ్ ।
గోపికోలూఖలే దామ్నా బబంధప్రాకృతం యథా ॥ (సంస్కృత భాగవతమ్ 10-9-13, 14)

వ. అప్పు డా యవ్వయు, గోపికలును వెఱుంగుపడిరి. తదనంతరంబ. 386

ఆ. ఒడలఁ జెమట లెగయ నుత్తరీయము జాఱ వీడియున్న తుఱుమువిరులు రాలఁ,
గట్టరాని తన్నుఁ గట్టెద నని చింతఁ గట్టుకొనిన తల్లి గరుణఁ జూచి. 387

అంతట యశోదమ్మయు, గోపికలును ఆ అద్భుతస్థితికి ఆశ్చర్యపడిరి. అట్లు బంధించుటకు పలుమాఱులు ప్రయత్నించిన ఆ తల్లి శరీరమునకు చెమటలుపట్టెను. చీర చెఱగు జారిపోయెను, కొప్పుముడి సడలగా, ధరించిన పూవులన్నియును రాలిపోయెను. ఎవ్వరిబంధములకును అందని తనను కట్టివేయుటకు యత్నించుచు అలవిగాక చింతిల్లుచున్న తన తల్లిపై ఆ కన్నయ్యకు జాలికలిగెను.

క. బంధవిమోచనుఁ డీశుఁడు, బంధింపఁ బెనంగు జనని పాటోర్చి సుహృ
ద్బంధుఁడు గావున జననీ, బంధంబునఁ గట్టువడియెఁ బాటించి నృపా! 388

పరీక్షిన్మహారాజా! భక్తులయొక్క భవబంధములను త్రెంచివేసి, వారికి మోక్షమును ప్రసాదించునట్టి పరమేశ్వరుడైన ఆ స్వామి తనను బంధించుటకు శ్రమపడుచున్న తల్లిఅవస్థను జూచెను. ఆశ్రయించినవారికి ఆత్మబంధువు గావున, ఆ చిన్నికృష్ణుడు తల్లి బంధమునకు కట్టువడెను.

క. సంగడిఁ దిరిగెడు శంభుఁడు, నంగాశ్రయ యైన సిరియు నాత్మజుఁడై యు
ప్పొంగెడి పద్మజుఁడును, గోపాంగన క్రియఁ గరుణవడయరఖిలేశ్వరుచేన్. 389

కైలాసనాథుడైన పరమశివుడు శ్రీహరికి పరమమిత్రుడు, నిత్యానపాయినియైన (ఎల్లప్పుడును ఆ స్వామి వక్షఃస్థలమును ఆశ్రయించికొనియుండెడి) లక్ష్మీదేవి అర్ధాంగి, సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు ఆయన తనయుడు. వారెవ్వరును నోచుకొనని రీతిగా గోపాంగనయైన యశోదమ్మ ఆ సర్వేశ్వరుని అనుగ్రహమునకు పాత్రురాలయ్యెను. ఆ తల్లి ఎంతటి ధన్యురాలో గదా!

క. జ్ఞానులచే మౌనులచే, దానులచే యోగసంవిధానులచేతం
బూని నిబద్ధుండగునే, శ్రీనాథుఁడు భక్తి యుతులచేతం బోలెన్ 390

అనన్యభక్తులకు పట్టువడిన రీతిగా ఆ శ్రీనాథుడు (శ్రీహరి) తత్త్వజ్ఞానులకుగాని, పరమమౌనులకుగాని, మహాదాతలకుగాని, ఉత్తమోత్తములైన యోగీశ్వరులకుగాని లభ్యుడు కాడు.

వ. అంత నయ్యశోద యింటికడం బనులవెంటం దిరుగఁ, గృష్ణుండు, తొల్లి నారదుశాపంబున నిరుమద్దులై యున్న నలకూబర మణిగ్రీవులను గుహ్యకుల నిద్దఱం గని, ఱోలీడ్చుకొని చనియె నని చెప్పిన శుకయోగివరునకు భూవరుండిట్లనియె. 391

కన్నయ్యను అట్లు ఱోటికి బంధించిన పిదప యశోదాదేవి ఇంటి పనులలో మునిగిపోయెను. పూర్వము నలకూబరమణిగ్రీవులు అను యక్షులు నారదుని శాపముచే అచట మద్దిచెట్లైయుండిరి. శ్రీకృష్ణుడు వాటినిజూచి, వాటిమధ్యగా ఱోటిని ఈడ్చుకొని పోయెను. ఈ విధముగా చెప్పిన శుకయోగిని పరీక్షిన్మహారాజు ఇట్లడిగెను.

క. నారదుఁడేల శపించెను, వా రా వృక్షత్వమునకు వచ్చిన పనికిం
గారణ మెయ్యది యోగికులారాధ్య! యెఱుంగఁ జెప్పుమయ్య! వినియెదన్. 392

"యోగీశ్వరా! నారదుడు ఆ యక్షులను ఇద్దరిని ఎందులకు శపించెను? వారు వృక్షములుగా మాఱుటకు కారణమేమి? దయతో వివరింపుము. వినుటకు కుతూహలపడుచున్నాను."

వ. అనిన శుకుండిట్లనియె. మున్ను కుబేరునికొడుకులిరువురు శంకరకింకరులై, యహంకరించి, వెండికొండ మీఁద విరులతోఁటలం బాడెడి చేడియలం గూడికొని, కరేణుసంగతంబులైన యేనుంగులభంగి సురంగంబులైన మందాకినీతరంగంబులం గ్రీడింప, నారదుండు వచ్చిన, నచ్చెలువలు పెచ్చెర వలువలు ధరియించిరి. మదిరాపాన పరవశులు గావున వారలిరువురు వివస్త్రులై మెలంగుచున్న, నా మునీశ్వరుండు సూచి, శపియించువాఁ డై, ప్రతీతంబగు గీతంబు పాడె వినుము. 393

అంతట శుకయోగి ఇట్లు వివరింపసాగెను. మహారాజా! నలకూబరమణిగ్రీవులు అను యక్షులు కుబేరుని కుమారులు. ఆ ఇరువురును శంకరునకు భక్తులు. వారు అహంకారపూరితులై ఒకప్పుడు కైలాసగిరిపైగల పూలతోటలలో గానాలాపన చేయుచుండెడి గంధర్వస్త్రీలతోగూడి, నిర్మల తరంగములతో ఒప్పుచున్న గంగానదిలో జలక్రీడలు ఆడుచుండిరి. వారు, ఆడు ఏనుగులతో గూడిన మదపుటేనుగులవలె ఆ నదీజలములను కల్లోలపఱచుచుండిరి. అప్పుడు నారదమహర్షి ఆ మార్గమున పోవుచుండెను. ఆ మహామునిని చూచి ఆ స్త్రీలు వెంటనే వస్త్రములను ధరించిరి. మద్యపానముచే కైపెక్కియున్న మదాంధులగు ఆ గంధర్వకుమారులు నారదునిరాకను పట్టించుకొనక దిగంబరులుగనే యుండిరి. అంతట ఆ మహర్షి వారినిజూచి శపించుచు ఒక గీతమును పాడెను. దానిని వివరించెదను వినుము.

శా. సంపన్నుం డొరుఁ గానలేఁడు తనువున్ సంసారమున్ నమ్మి హిం
సింపం జూచు దరిద్రుఁ డెత్తుబడి శుష్కీభూతుఁడై చిక్కి హిం
సింపండన్యుల నాత్మకున్ సములుగాఁ జింతించు నట్లౌటఁ ద
త్సంపన్నాంధున కంజనంబు వినుమీ దారిద్ర్య మూహింపఁగన్ 394

సంపన్నుడు ధనమదాంధుడై ఎవ్వరినీ లెక్కసేయడు. (గౌరవింపడు) అతడు తన తనువు శాశ్వతమనియు, సంసారసుఖములు స్థిరములనియు భావించి, ఇతరులకు హానిగూర్చుచుండును. కాని దరిద్రుడు కష్టాలలో చిక్కుకొని, శుష్కించినవాడై ఉండియు ఇతరులను హింసింపడు. ఇతరులెల్లరును తనవంటివారే యని అతడు భావించును. అందువలన ధనమదాంధులకు కనువిప్పు కలుగుటకు దారిద్ర్యమే దివ్యౌషధము.

వ. అని గీతంబు పాడి తన మనంబున. 395

క. కలవానిసుతులమనుచును, గలకంతులతోడఁ గూడి కానరు పరులన్
గలలో నైనను వీరికిఁ, గల క్రొవ్వడఁ గించి బుధులఁ గలుపుట యొప్పున్. 396

అని గీతమును పాడినపిమ్మట నారదమహర్షి తనలో ఇట్లనుకొనెను. 'సంపన్నులకుమారులు కొందఱు తరుణీమణులతోగూడి ధనగర్వముచే కన్నుమిన్ను గానక ప్రవర్తింతురు. అట్టివారు కలలోనైనను ఇతరులను (ఉత్తములను) లక్ష్యపెట్టరు.(1) ఈ గంధర్వకుమారుల మదమణగించి, యోగ్యులను జేయుట యుక్తము.

1. యౌవనం, ధనసంపత్తిః, ప్రభుత్వమ్, అవివేకతా ।
ఏకైకమప్యనర్థాయ, కిము? యత్ర చతుష్టయమ్ ॥ నీతిశాస్త్రము
యౌవనము, సంపదలు, అధికారము, అజ్ఞానము - అనువానిలో ఏయొక్కటి ఉన్నను అది అనర్థములను తెచ్చిపెట్టును. ఇక ఈ నాల్గును ఉన్నచో చెప్పవలసినది ఏమున్నది?

వ. అని చింతించి, విజ్ఞానవిశారదుం డగు నారదుండు, నలకూబర మణిగ్రీవులం జూచి మీరలు శ్రీమదాంధులరు గావున భూలోకంబున నర్జునతరువులై, నూఱు దివ్యవర్షంబులుండుండఁటమీఁద గోవిందచరణారవింద పరిస్పందంబున, 397

క. ముక్తులరై నారాయణ, భక్తులరై పరమ సాధు భావ శ్రీసం
సక్తులరై సురలోక, వ్యక్తుల రయ్యెదరు నాదువాక్యముకతనన్. 398

విజ్ఞానఖనియైన నారదుడు ఇట్లు ఆలోచించిన పిమ్మట నలకూబరమణిగ్రీవులతో ఇట్లు నుడివెను. "మదాంధులారా! మీరు ఐశ్వర్యగర్వితులై యుక్తాయుక్తవిచక్షణను కోల్పోయియున్నారు. కనుక మీరు మద్దిచెట్లై నూఱు దివ్యవర్షములకాలము భూలోకమున పడియుండుడు. అనంతరము శ్రీకృష్ణునియొక్క పవిత్ర పాదములస్పర్శచే ఈ శాపమునుండి మీకు విముక్తి లభించును. పిమ్మట శ్రీమన్నారాయణునిభక్తులై, సత్త్వగుణసంపన్నులగుదురు. మఱల ఈ కైలాసమున ప్రవేశించెదరు. ఈ నా శాపము తిరుగులేనిది".

వ. అని యిట్లు వలికి, నారదుండు నారాయణాశ్రమంబునకుం జనియె. వారిరువురును సంగడిమద్దులైరి. పరమభాగవతుండైన నారదుమాటలు వీటిం బుచ్చక, పాటించి, 399

క. ముద్దులతక్కరిబిడ్డఁడు, మద్దులఁ గూల్పంగఁ దలఁచి మసలక తా నా
మద్దికవయున్న చోటికి, గ్రద్దన ఱోలీడ్చుకొనుచుఁగడఁకన్ జనియెన్. 400

అనంతరము నారదుడు నారాయణాశ్రమమునకు వెళ్లెను. శాపప్రభావముచే ఆ గంధర్వకుమారులు ఇద్దరును భూతలమున మద్దిచెట్లైరి. భాగవతోత్తముడైన నారదునిమాటలను ఆదరించుచు, యశోదమ్మ ముద్దులపట్టి ఆ మద్దిచెట్లను కూల్చుటకు సంకల్పించెను. వెంటనే అతడు ఆ మద్దిచెట్ల జంట మధ్యగా ఱోటిని ఈడ్చుకొనుచుపోయెను.

వ. చని యా యూర్జిత మహాబలుండు, నిజోదరదామ సమాకృష్యమాణ తిర్యగ్భవదులూఖలుండై, యా రెండు మ్రాఁకుల నడుమం జొచ్చి ముందటికి నిగుడుచు, 401

క. బాలుఁడు ఱోలడ్డము దివ, మూలంబులు పెకలి విటపములు విఱిగి మహా
భీలధ్వనిఁ గూలెను శా, పాలస్య వివర్జనములు యమళార్జునముల్. 402

మహాబలశాలియైన శ్రీకృష్ణుడు తన నడుమునకు కట్టబడిన త్రాడుతోగూడియున్న ఆ ఱోలును లాగుచుండగా అది అడ్డముగా పడిపోయెను. ఆ రెండు చెట్లమధ్యనుండి చిట్టికృష్ణుడు వేగముగా సాగిపోవుచుండగా ఆ ఱోటితాకిడికి ఆ మద్దిచెట్లు (రెండును) వేళ్లతో సహా కూలిపోయెను. అప్పుడు మిగుల భయంకరమైన శబ్దము ఏర్పడెను. ఈ విధముగా వాటికి (ఆ మద్దిచెట్లజంటకు) శాపవిముక్తి లభించెను.

వ. ఇట్లు నిర్మూలంబులయి పడిన సాలంబులలోనుండి, కీలికీలలు వెల్వడు పోలిక, నెక్కుడు తేజంబున దిక్కులు పిక్కటిల్లం, బ్రసిద్ధులైన సిద్ధు లిద్దరు వెడలివచ్చి ప్రబుద్ధులై, భక్తలోకపాలకుండైన బాలకునకు మ్రొక్కి, లేచి కరకమలంబులు మొగిచి, యిట్లనిరి. 403

ఇట్లు వేళ్లతో సహాకూలిపోయిన ఆ మద్దిచెట్లనుండి సిద్ధులు (గంధర్వులు) ఇద్దరు బహిర్గతులైరి. వెల్లుబుకుచున్న అగ్నిజ్వాలలవలె ఒప్పుచున్న వారితేజస్సులు అన్నిదిక్కులకును వ్యాపించెను. జ్ఞానోదయమైన ఆ గంధర్వకుమారులు (నలకూబరమణిగ్రీవులు) పరమభక్తులకు రక్షకుడైన బాలకృష్ణునకు ప్రణమిల్లిలేచి, అంజలిఘటించి ఇట్లు స్తుతించిరి.

క. బాలుఁడవె నీవు పరుఁడ వ, నాలంబుఁడ వధికయోగివాద్యుఁడవు తను
స్థూలాకృతి యగు విశ్వము, నీ లీలారూపమండ్రు నిపుణులు కృష్ణా! 404

"శ్రీకృష్ణా! నీవుసామాన్యబాలుడవుకావు. పరాత్పరుడవు, సమస్తజగత్తునకు ఆధారమైనవాడవు, యోగీశ్వరుడవు, ఆదినారాయణుడవు, సూక్ష్మమునుండి స్థూలమువఱకు (అణుస్వరూపమునుండి మహద్రూపమువఱకు) వ్యాపించియున్న ఈ విశ్వమంతయును నీ లీలారూపమే (నీవు విరాడ్రూపుడవు) అని జ్ఞానులు పేర్కొందురు.

సీ. ఎల్ల భూతంబుల కింద్రియాహంకృతి ప్రాణంబులకు నధిపతివి నీవ
ప్రకృతియుఁ బ్రకృతి సంభవ మహత్తును నీవ వీని కన్నిటికిని విభుఁడ వీవ
ప్రాకృత గుణవికారములఁ బొందక పూర్వ సిద్ధుండ వగు నిన్నుఁ జింత సేయ
గుణవృతుం డోపునే గుణహీన!నీయంద కల గుణంబుల నీవ కప్పఁబడుదు
తే. మొదల నెవ్వని యవతారములు శరీరులందు సరి దొడ్డు లేని వీర్యములఁ దనువు
లడర జన్మించి వారలయందుఁజిక్కవట్టి పరమేశ! మ్రొక్కెదమయ్య! నీకు. 405

ఓ పరమేశ్వరా! నీకు నమస్కారములు. పృథివ్యాది పంచమహాభూతములకును, చరాచరాత్మకములైన సకలప్రాణులకును, జ్ఞానేంద్రియములకును, కర్మేంద్రియములకును, (బాహ్యేంద్రియములకును) అహంకారాది అంతరింద్రియములకును, పంచప్రాణములకును నీవే అధిపతివి. అవ్యక్త (మూల) ప్రకృతియు, దానినుండి ఏర్పడు మహత్తునూ నీవే. వీటికన్నింటికిని ప్రభుడవు నీవే. నీవు ప్రకృతి సంబంధమైన సత్త్వరజస్తమోగుణములకు అతీతుడవు. జననమరణాది వికారములు లేనివాడవు, ఈ జగత్సృష్టికి పూర్వమే ఉన్నవాడవు, కామక్రోధాది దుర్గుణములుగల మానవమాత్రుడు నిన్ను ఎఱుగజాలడు. నీ నుండి పుట్టిన గుణవికారాదులచే (మాయచే) కప్పబడి, మత్స్యకూర్మాది అవతారములను ధరించి, దేహధారులవలె వర్తింతువు. నీవు ప్రభావశాలివగుటవలన, నీవు వారివలె చిక్కులపాలుగావు. (నీవు వారికి బోధపడవు). జగన్నాథా! అట్టి నీకు మా ప్రణామములు.

క. భువనములు సేయఁ గావఁగ, నవతీర్ణుఁడ వైతి కాదె యఖిలేశ్వర! యో
గివరేణ్య! విశ్వమంగళ! కవిసన్నుత! వాసుదేవ! కళ్యాణనిధీ! 406

వాసుదేవా! నీవు సర్వేశ్వరుడవు, మహాయోగివి, జగత్కల్యాణకారకుడవు, వ్యాసవాల్మీకులు మొదలగు దివ్యజ్ఞానులచే నుతింపబడువాడవు, సమస్తకల్యాణగుణములకు నిధివి. నీవు లోకములను సృష్టించి, వాటిని కాపాడుటకు అవతారములను ఎత్తుచుందువు.

ఉపేంద్రవజ్రము. తపస్వివాక్యంబులు దప్పవయ్యెన్ నెపంబునం గంటిమి నిన్నుఁ జూడం
దపంబులొప్పెన్ మముఁ దావకీయప్రపన్నులం జేయుము భక్తమిత్రా! 407

భక్తపాలకా! నారదమహర్షియొక్క శాపవచనములు ఉల్లంఘించుటకు వీలులేనివి, ఆ నెపముతో నిన్ను దర్శించెడి భాగ్యము మాకు అబ్బినది. మా తపస్సులు ఫలించెను. నిన్ను మేము శరణుగోరుచున్నాము. నీ భక్తరేణువులమైన మమ్ములను ఆదరింపుము.

శా. నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్
నీ పేరం బని సేయు హస్తయుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్
నీ పాదంబులపొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్
నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా! 408

కమలపత్రాక్షా! మా చెవులు నీ యశోవైభవములను ఆలకించుగాక. మేము ఎల్లప్పుడును నిన్నే స్తుతించుచుందుముగాక, మా చేతులు నిరంతరము నీ సేవలనే చేయుచుండుగాక. మేము ఎల్లప్పుడు నీ దివ్యమంగళస్వరూపమునే దర్శించుచుందుముగాక. మా శిరస్సులు సర్వదా నీ పాదములచెంత మోకరిల్లుచుండునుగాక. మా మనస్సులు సంతతము నీ యందే లగ్నమైయుండుగాక. మా బుద్ధులు లౌకిక విషయములజోలికి పోక నిన్నే సర్వస్వముగా భావించుచుండును గాక. కృపానిధీ! నీవు మమ్ము ఈ విధముగా అనుగ్రహింపుము".

వ. అని యిట్లు కీర్తించిన, గుహ్యకులం జూచి, నగుచు నులూఖలబద్ధుండైన హరి యిట్లనియె. 409

ఇట్లు తనను ప్రస్తుతించిన నలకూబర మణిగ్రీవులను జూచి ఱోటికి కట్టివేయబడియున్న బాలకృష్ణుడు నవ్వుచు ఇట్లు వచించెను.

క. తమతమ ధర్మము దప్పక, సములై నను నమ్మి తిరుగు సభ్యులకును బం
ధము నన్నుఁ జూడ విరియును, గమలాప్తుఁడు వొడమ విరియు ఘనతమము క్రియన్. 410

క. కారుణ్యమానసుం డగు, నారదు వచనమునఁ జేసి ననుఁ బొడగనుటన్
మీరు ప్రబుద్ధుల రైతిరి, చేరెన్ నామీఁద తలఁపు సిద్ధము మీకున్. 411

"తమ తమ ధర్మములను ఆచరించుచు, సమస్తప్రాణములను సమానముగా భావించుచు, నన్నే నమ్ముకొని ప్రవర్తించు సజ్జనులయొక్క బంధములన్నియును, సూర్యకిరణముల స్పర్శచే చిమ్మచీకట్లవలె, పటాపంచలగును. కరుణాళువు ఐన నారదునియొక్క శాపవచనములకారణముగా మీరు నన్ను దర్శింపగలిగితిరి. మీకు జ్ఞానోదయమయ్యెను. నాపై మీకు అనన్యభక్తి ఏర్పడెను".

వ. అని యీశ్వరుండు మీరు మీ నెలవులకుం బొండని యానతిచ్చిన మహాప్రసాదం బని, వలగొని, పెక్కు మ్రొక్కులిడి, వీడుకొనినలకూబరమణిగ్రీవులుత్తర భాగంబునకరిగిరంత నందాదులయిన గోపాలకులు, నిర్మూలంబులయి పడినసాలంబులచప్పుడు పిడుగుచప్పుడని శంకించి, వచ్చి చూచి 412

క. ఈ పాదపములు కూలఁగ, నీ పాపఁ డులూఖలమున నిటు బద్ధుండై
యే పగిది బ్రదికెఁ గంటిరె, వాపోవఁడు వెఱవఁ డెట్టివాఁడో యితఁడున్. 413

ఇట్లు పలికి, 'ఇక మీరు మీ ఇండ్లకు వెళ్లవచ్చును' అని శ్రీకృష్ణుడు ఆదేశించెను. పిమ్మట వారు 'మహాప్రసాదము' అని పలుకుచు, ప్రదక్షిణపూర్వకముగా ఆ స్వామికి పదేపదే మ్రొక్కిరి. పిదప నలకూబరమణిగ్రీవులు ఆ ప్రభువును వీడ్కొని అటనుండి ఉత్తరదిశకు పయనమైపోయిరి. అంతట నందుడు మొదలగు గోపాలురు, గుభిల్లుమనుచు వ్రేళ్లతోసహా నేలపడిపోయిన ఆ మద్దిచెట్ల మహాధ్వనిని వినిరి. వారు దానిని పిడుగుపాటుగా భావించి భయపడి, పరుగుపరుగున అచటికి వచ్చి చూచిరి. తదుపరి వారు తమలోతాము ఇట్లనుకొనిరి. "ఈ చెట్లు ఇట్లు నేలగూలినను, ఱోటికి కట్టివేయబడియున్నఈ బుడుతడు మాత్రము ఎట్టిప్రమాదమునకును గుఱిగాక ఎట్లు క్షేమముగా నుండెను? చూచితిరా! ఇతడు ఏడ్చుటలేదు, కనీసము భయపడుటయును లేదు. దీనిని బట్టి చూడగా ఇతడు సామాన్యుడుగా తోచుటలేదు.

ఆ. పిడుగు వడదుగాక పెనుగాలి విసరదు ఖండితంబులగుట గానరాదు
బాలుఁడితఁడు పట్టి పడఁద్రోయఁ జాలఁడు తరువులేల కూలె ధరణిమీఁద 414

ఈ చెట్లు ఇట్లుపడిపోవుటకు కారణము ఏమైయుండును? పిడుగుపడినట్లు కనబడదు, పెనుగాలి వీచినట్లునులేదు, వీటిని ఎవ్వరైనను నఱికినట్లును కనబడుటలేదు. ఈ చిట్టిబాలుడు వీటిని పడద్రోయుట అసంభవము. ఇంతకును ఇవి ఎట్లు కూలిపోయినట్లు?"

వ. అని పెక్కండ్రు పెక్కువిధంబుల నుత్పాతంబులు గావలయునని శంకింప, నక్కడ నున్న బాలకులిట్లనిరి. 415

క. నందుని కొమరుఁడు వినుఁడీ సందున మును దూఱి ఱోలు సరి యడ్డముగా
ముందటి కీడ్చిన మద్దులు, గ్రందుకొనం గూలె జనులఁ గంటిమిరువురన్. 416

వ. అని యిట్లు పలికిన బాలకాలాపంబులు విని కొందరు మిథ్యారూపంబులనిరి . కొందఱు నానావిధంబుల సందేహించిరంత నందుండు వికసితవదనారవిందుండగుచుఁ, బట్టి కట్టు విడిచె. నట్టియెడఁదన తెఱం గెవ్వరు నెఱుంగకుండవలెనని కపటకుమారుండు. 417

ఇట్లు ఎవరికితోచిన విధముగా వారు అనుకొని, "ఇది ఎట్టి ఉత్పాతమో? ఏమో? బోధపడుటలేదు" అని శంకింపసాగిరి. అప్పుడు అచటగల గోపబాలకులు ఇట్లనుడివిరి. 'అయ్యా! వినుడు. శ్రీకృష్ణుడు ఈ రెండుచెట్ల మధ్యగా దూరి, ముందుకు సాగుచుండగా ఱోలు చెట్లకు తట్టుకొనెను. అంతట ఆ ఱోటి తాకిడికి ఈమద్దిచెట్లు కూలిపోగా వాటినుండి ఇద్దరు వ్యక్తులు బయటికి వచ్చిరి. వారిని మేము చూచితిమి" అంతట కొందఱు 'ఈ బాలకులమాటలు అసత్యములు' అని కొట్టివేసిరి. మఱికొందఱు పలువిధములగు సందేహములను వెలిబుచ్చిరి. అప్పుడు నందుడు జరిగిన సంఘటనకు అబ్బురపడుచు, సంతోషముతో తన కుమారుని బంధములను విప్పివేసెను. పిమ్మట చిట్టికృష్ణుడు తన దివ్యశక్తిని ఎవ్వరును పసిగట్టకుండుటకై ఆ కపటబాలుడు లీలావినోదములను ప్రదర్శించెను.

శా. పాడున్ మందునిభంగి గోపవనితల్ పాణిధ్వనుల్ సేయఁగా
నాడున్ జంత్రము కైవడిం బరవశుండై హస్తముల్ ద్రిప్పుచుం
జూడన్నేరని వానిభంగి జనులం జూచున్ నగున్ బాలురం
గూడుం బెద్దలపంపు సేయఁ జను డాఁగున్ మట్టి జిట్టాడుచున్. 418

గోపికలు చప్పట్లు కొట్టుచుండగా ఆ చిన్నికృష్ణుడు అమాయకునివలె పాడుచుండెను. పారవశ్యముతో చేతులు త్రిప్పుచు ఒక యంత్రము రీతిగా ఆడుచుండెను. అచటనున్న వారిని గుర్తుపట్టలేని వానివలె విచిత్రముగా చూచుచు నవ్వుచు బాలురతోగూడుచుండెను. పెద్దలు చెప్పినట్లు చేయుటకు యత్నించుచుండెను. మట్టిలో తిరుగాడుచుండెను.

క. చుంచెదుగుఁ బాలు ద్రావు ము, దంచితముగ ననుడుఁ బాలు ద్రావి జననితోఁ
జుంచెదుగ దనుచు లీలా, చుంచుండై యతఁడు చుంచుఁ జూపె నరేంద్రా! 419

పరీక్షిన్మహారాజా! ఒకనాడు 'నాయనా! పాలుత్రాగినచో జుట్టు పెఱుగును. కావున పాలు త్రాగుము' అని యశోదమ్మ చెప్పెను. 'అమ్మా! నీ మాట ప్రకారము పాలు త్రాగితిని, కాని ఇంకను నా జుట్టు పెఱుగలేదేమి? అని అనుచు విలాసముగా అతడు తన ముంగురులను జూపెను.

క. సెలగోల పట్టుకొని జల, కలశములో నీడఁ జూచి కలశయుతుండై
సెలగోలఁ బాపఁ డొకఁడిదె, తలఁచెన్ ననుఁ గొట్ట ననుచుఁ దల్లికిఁ జెప్పెన్. 420

ఆ చిలిపికృష్ణుడు ఒకనాడు చేతిలో చెన్నకోలను పట్టుకొని ఒక జలపాత్రలో చూడగా తన ప్రతిబింబము కనబడెను. అప్పుడు అతడు ఆ పాత్రను దీసికొనివచ్చి, తల్లితో 'అమ్మా! ఒకపాపడు చెన్నకోలతో నన్ను కొట్టుటకై వచ్చుచున్నాడు, చూడుము' అని పలికెను.

క. భిక్షులు వచ్చెదరేడ్చిన, భిక్షాపాత్రమున వైచి బెగడించి నినున్
శిక్షించెదరని చెప్పిన, భిక్షులఁగని తల్లి ఁగనియు భీతిల్లె నృపా! 421

ఒకనాడు చిట్టికృష్ణుడు పోరుపెట్టి ఏడ్చుచుండెను. అప్పుడు తల్లి 'నీవు ఏడ్చినచో బిచ్చగాండ్రువచ్చి నిన్ను తమ భిక్షాపాత్రలలో తీసికొని పోయి నిన్ను దండించెదరు' అని నుడివెను. అప్పుడు ఆ చిలిపిబాలుడు ఇంటిముందర నిలబడియున్న భిక్షువులను జూచి, తల్లివైపు చూచుచు భయపడుచున్నట్లు నటించెను.

## నందాదులు బృందావనంబునకు నరుగుదెంచుట

వ. ఇట్లు కృష్ణుండు బహువిధంబులఁ గపటబాలలీలల వినోదింప, బృహద్వనంబున నందాదులైన గోపవృద్ధులు మహోత్పాతంబు లగుటయు, వానివలన బాలుం డుత్తరించుటయుం జూచి, యేకాంతంబున నొక్కనాఁడు విచారింప, నుపనందుండను వృద్ధగోపకుండు దన యెఱుక మెఱసి యిట్లనియె. 422

ఈ విధముగా బాలకృష్ణుడు తన లీలలతో పెక్కురీతుల వినోదింపసాగెను. వ్రేపల్లెలోని బృహద్వనమునందు పలు ఉత్పాతములు ఏర్పడగా, ఆ ప్రమాదములనుండి శ్రీకృష్ణుడు తప్పించుకొనుటను పెద్దవారైన నందుడు మొదలగు గోపాలురు గమనించిరి. పిమ్మట వారు ఏకాంతముగా సమావేశమై ఈ విషయమున తమ కర్తవ్యమును గూర్చి చర్చించుకొనసాగిరి. అప్పుడు 'ఉపనందుడు' అను వృద్ధగోపాలుడు తనకు తట్టిన ఒక ఉపాయమును ఇట్లు వెల్లడించెను.

ఉ. ఇక్కడ నుందురే మనుజు లీ మనకృష్ణునకెగ్గు సేయఁగా
రక్కసురాలు చన్నొసఁగె నాలపయిన్ సుడిగాలి వీచెఁబైఁ
గ్రిక్కిఱియం దరుల్ వడియెఁ గేశవు సత్కృపఁదప్పెఁ జాలు నేఁ
డెక్కడ కైనఁ బోవలయు నింకిట గోపకులార! వింటిరే. 423

"గోపకులారా! ఇక మనము ఇక్కడ ఉండుట ప్రమాదకరము. తన చనుబాలు ఇచ్చుటద్వారా ఒక రాక్షసి మన చిన్నారి కృష్ణునకు హానితలపెట్టెను. పెద్ద సుడిగాలి (తృణావర్తుడు) మనవానిని ఆకాశమునకు తీసికొనివెళ్లి ఱాళ్లపై (క్రింద) పడవేయుటకు ప్రయత్నించెను. దట్టముగా చెట్లు మన బుడుతని మీదపడెను. దైవానుగ్రహముతో ఈ ఆపదలన్నియును తొలగెను. ఇక్కడ ఇంతవఱకును ఉన్నది చాలును. మనము హాయిగా ఉండవలెనన్నచో ఎక్కడికైనను వెళ్లుటయే మంచిది. నా మాటలను శ్రద్ధగా ఆలకింపుడు.

క. కసవు గల దిరవు పసులకు, లస దద్రి నదీమహీజ లతికావళిపెం
పెసఁగును గాఁపురమునకును, బొసఁగును బృందావనంబు పోదఁడచ్చటికిన్ 424

'బృందావనము' అను ప్రదేశమున మనపశువుల మేతకు (పచ్చిక గడ్డికి) కొదువయుండదు, అచట పర్వతములు, నదులు, వృక్షములు, లతలు సమృద్ధిగా గలవు, మనము నివసించుటకు ఆ చోటు ఎంతయు తగినది. ఇక అచటికి వెళ్లుటకు సిద్ధపడుడు.

వ. అని పలుకు నుపనందునిపలుకుల కార్యులైన గోపకులిదియ కార్యంబు మందల యని కొందల మందక, యాలమందల నమందగమనంబున ముందర నడవం బనిచి, పెఱుందం గ్రందుకొనకుండ బాల వృద్ధ నారు లెక్కిన తేరులు సాగించి,తారు తనుత్రాణ తూణీర బాణధరులై, విండ్ల బట్టుకొని నడవ, బండ్ల వెనుకం గొమ్ములిమ్ములం బూరించుచు, నవార్యంబులగు తూర్యరవంబులుసెలంగ నార్య పురోహిత సమేతులై, వేడుకలు కొనలు నిగుడ మొనలేర్పఱుచుకొని పావనంబగు బృందావనంబునకుం జని రప్పుడు. 425

ఉపనందుని పలుకులను విని, పెద్దలైన గోపాలురు అందఱును 'ఈ ఆలోచన యుక్తముగానే ఉన్నది' అనుచు అందులకు తమ ఆమోదమును తెలిపిరి. వెంటనే నిర్భయముగా ఆలమందలు మిగులవేగముగా ముందు నడచుటకు ఏర్పాట్లు చేసిరి. వాటివెనుక బాలురు, వృద్ధులు, స్త్రీలు ఎక్కినబండ్లను ప్రశాంతముగా నడపిరి. వారు (గోపాలురు) కవచములను, అమ్ములపొదులను, బాణములను, ధనుస్సులను తీసికొని కదలిరి. బండ్లవెనుక భాగమున నిరంతరము తూర్యనాదములను గావించుచు కొందఱు అనుసరించిరి. వారివెంట పూజ్యులైన పురోహితులు పయనించుచుండిరి. ఇట్లు వారందఱును మిక్కిలి సంతోషముతో బారులుదీఱి పవిత్రమైన బృందావనమునకు బయలుదేఱిరి.

తరలము. పసుపులాడి యురోజ కుంకుమ పంక శోభితలై లస
ద్వసనలై కచభార చంపకదాములై సులలాములై
పసిఁడిమాడలకాంతులల్లులఁ బర్వఁ దేరులమీఁదఁ బెం
పెసఁగఁ బాడిరి వ్రేతలాహరిహేలలింపగు నేలలన్. 426

గోపికలు పసుపులను పూసికొని స్నానముల నొనర్చిరి, వక్షఃస్థలములయందు పరిమళ ద్రవ్యములతోగూడిన కుంకుమలేపనములను అలంకరించుకొనిరి, నూతన వస్త్రములను ధరించిరి, కొప్పులపై సంపెంగపూల మాలలను దాల్చిరి, లలాటములయందు చక్కగా తిలకములను దిద్దుకొనిరి, వారు కంఠములయందు ధరించిన మేలిమిబంగారుహారములు తళుకులీనుచుండెను. అట్లు సుశోభితలైన గోపభామినులు బండ్లపై పయనించుచు, వీనులవిందుగా శ్రీకృష్ణునిలీలలను వర్ణించుచు ఏలపాటలను పాడిరి.

వ. అప్పుడు రోహిణీయశోదలేకరథంబునఁ బరిపూర్ణ మనోరథలై రామకృష్ణుల ముందఱ నిడుకొని, వారల వినోదంబులకు బ్రమోదంబు నొందుచుండ నిట్లు గోపకులు బృందావనంబు సొచ్చి, యందర్ధచంద్రాకారంబుగ శకటసందోహంబు నిలిపి, మందల విడియించి, వసియించిరి. 427

అప్పుడు రోహిణీయశోదలు ఒక్కబండిలో కూర్చొనియుండిరి. వారు తమ మనోరథములు ఈడేరిన సంతోషముతో బలరామకృష్ణులను తమ యొడులలో చేర్చుకొనిరి. ఆ అన్నదమ్ముల బాల్యలీలలకు మురిసిపోవుచుండిరి. గోపాలురు ఈ విధముగా పయనించి, బృందావనమునకు చేరి, తమ బండ్లను అర్ధచంద్రాకారములో నిలిపిరి. పిదప ఆవులమందలను ఆ బండ్లకు ముందుభాగమును వదలి, అనువుగా తమ నివాసములను ఏర్పఱచుకొనిరి.

క. చెందిరి బలమాధవు, లభి, నందించుచుఁ బరమపావనము నంచిత కా
ళిందీ సంజీవనమున్, బృందావనమున్ మునీంద్రబృందావనమున్. 428

బలరామకృష్ణులు బృందావనమును మెచ్చుకొనుచు అందు ప్రవేశించిరి. ఆ వనము పరమపవిత్రమైనది, నిర్మలములైన యమునానదీ జలములతో విలసిల్లుచున్నట్టిది. మునీంద్రుల తపశ్చర్యలకు ఎంతయు అనువైనది.

వ. ఇట్లు బృందావనంబుఁ జెంది యందుఁ గొంతకాలంబునకు రామకృష్ణులు సమానవయస్కులైన గోపబాలకులం గూడికొని, వేడుక లూఁడుకొన దూడలఁ గాచుచు, 429

సీ. వేణువు లూఁదుచు వివిధ రూపములతో గంతులు వైతురు కౌతుకమున
గురు కంబళాదుల గో వృషంబులఁ బన్ని పరవృషభములని ప్రతిభటింతు
రల్లులు దట్టించి యంఘ్రుల గజ్జెలు మొరయఁ దన్నుదు రోలి ముమ్మరముగఁ
బన్ని దంబులు వైచి ఫలమంజరులు గూల్చి వ్రేటులాడుదురు ప్రావీణ్య మొప్ప

తే. వన్య జంతుచయంబుల వాని వాని పదురు పదురుచు వంచించి పట్టఁబోదు
రంబుజాకరములఁ జల్లులాడఁజనుదురాకుమారులు బాల్య విహారులగుచు. 430

బృందావనమునకు చేరిన కొంతకాలమునకు పిమ్మట బలరామకృష్ణులు తమ ఈడు గోపబాలకులతో గూడి, ఉత్సాహముతో కేరింతలు గొట్టుచు దూడలను మేపసాగిరి. దూడలను కాయుసమయమున బలరామకృష్ణులు తోడిబాలురతోగూడి, పిల్లనగోవులను ఊదుచు వేడుకతో వివిధరూపములలో గంతులు వేయుచుండిరి. పెద్దపెద్ద కంబళ్లతో ఆబోతులను రూపొందించి, అవి ఇతరములైన వృషభములనుచు ప్రతిభతో వాటిని ఎదిరించుచుండిరి. గుడ్డలతో బొమ్మలను సిద్ధపఱచి, కాళ్లగజ్జెలు మ్రోగుచుండగా వాటిని తనివితీర తన్నుచుండిరి. పందెములను పైచుకొని, పండ్లను, పూలగుత్తులను రాల్చుచు వాటిని నేర్పుగా ఒకరిపై నొకరు వేసికొనుచు ఆడుకొనుచుండిరి. అడవిజంతువులఅఱపులను అనుకరించుచు, అవి తమ సమీపమునకు వచ్చిన వెంటనే మెలకువతో వాటిని పట్టుకొనబోవుచుండిరి. వారు నీటిమడుగులలో దిగి ఒకరిపైనొకరు నీళ్లు చల్లుకొనుచు వినోదించుచుండిరి. వారి బాల్యలీలలు మనోహరముగా సాగుచుండెడివి.

క. పోరుదురు గికురు వొడుచుచుఁ దూఱుదురు భయంబులేక తోరపుటిరువుల్
జాఱుదురు ఘన శిలాతటి, మీఱుదురెన్నంగరాని మెలఁకువల నృపా! 431

పరీక్షిన్మహారాజా! వారు ఒకరికొకరు చిక్కకుండా (వంచించుకొనుచు) పోరు సలుపుచుండిరి. చెట్లతో దట్టముగా నున్న ప్రదేశములో ఏమాత్రము భయపడక ప్రవేశించుచుండిరి. పెద్దపెద్ద బండలపైకెక్కి క్రిందికి జాఱుచుండిరి. చెప్పనలవిగాని నేర్పుతో ఒకరినిమించి మఱియొకరు ఆటలాడుచుండిరి.

## వత్సాసుర బకాసురుల వధ

వ. అంత నొక్కనాఁడు యమునా తీరంబున నా కుమారులు, గోపకుమారులుం దారును గ్రేపుల మేప, నొక్క రక్కసుండు క్రేపురూపున వచ్చి, వారల హింసింపందలంచి. 432

క. క్రేపుల యఱ్ఱులు నాకుచుఁ గ్రేపులలో నిదియె మంచి క్రే పనఁగఁ గడుం
జూపట్టి భక్త సంగతిఁ గ్రేపై చనువాని మ్రోలఁ గ్రేపై తిరిగెన్ 433

ఇట్లుండగా ఒకనాడు బలరామకృష్ణులు గోపబాలురతో గూడి ఆవుదూడలను మేపుచుండిరి. అంతట ఒకరాక్షసుడు వారిని చంపదలచి, ఒకదూడరూపమును దాల్చి, అచటి దూడలలోదూఱెను. పిమ్మట ఆ దుష్టుడు దూడల మెడలను నాకుచు, 'దూడలలో ఇదియే మేలైనది' అనునట్లు కనబడుచు, భక్తులపాలిట కామధేనువైన ఆ శ్రీకృష్ణుని ఎదుట తానొకదూడయై తిరుగుచుండెను.

వ. వాని నెఱిఁగి, కృష్ణుండు రామునకుం జెప్పి 434

చ. ఇది యొక మంచిలేఁగ వినుఁ డెంతయు నొప్పెడి నంచు డాసి త
త్పదములుఁ దోఁకయున్ బిగియఁ బట్టి చెలంగి వెలంగ మ్రానితోఁ
జదియఁగ నొక్క పెట్టు గొని చంపెఁ గుమారుఁడు లేఁగరక్కసుం
గుదులుకొనంగ బాలకులు కో యని యార్వనఖర్వలీలతోన్. 435

దూడరూపమున ఉన్న ఆ రాక్షసుని గుర్తించి, శ్రీకృష్ణుడు బలరామునకు ఆ విషయమును తెలిపెను. గోపబాలులారా! ఈ దూడ ఎంతగా ముచ్చటగొలుపుచున్నదో చూడుడు, దూడలలో ఇది చాల మేలైనది' అని పలుకుచు ఆ బాలకృష్ణుడు,

ఆ దూడను సమీపించి, దాని కాళ్లను, తోకను గట్టిగా పట్టుకొనెను. వెంటనే దూడరూపములో ఉన్న రాక్షసుడు చలించిపోవునట్లుగా ఆ ప్రభువు అవలీలగా దానిని పైకెత్తి వెలగచెట్టుకేసి బలముగా కొట్టిచంపెను. అంతట గోపబాలురు ఆ స్వామికి జేజేలు పల్కుచు పెద్దగా అఱచిరి.

వ. ఇట్లు రక్కసుండు వ్రేటువడి, విశాలంబగు సాలంబుతో నేలం గూలె. అప్పుడు, 436

క. గొంగడులెగురఁగ వైచుచుఁ, జంగున దాఁటుచును జెలఁగి చప్పటులిడుచుం
బొంగుచుఁ గృష్ణునిఁ బొగడుచుఁ, ద్రుంగిన రక్కసునిఁ జూచి త్రుళ్ళిరి కొమరుల్. 437

వ. ఆ సమయంబున వేలుపులు విరులవానలు గురియించిరప్పుడు, 438

ఈ విధముగా శ్రీకృష్ణునిధాటికి ఆ రాక్షసుడు ఆ చెట్టుతో సహా నేలగూలెను. అంతట గోపకుమారులు చచ్చిపడియున్న ఆ రాక్షసుని జూచి సంతోషముతో పొంగిపోవుచు, గొంగళ్లను ఎగురవేయసాగిరి. ఇంకను వారు గంతులు వేయుచు, చప్పట్లు కొట్టుచు శ్రీకృష్ణుని కొనియాడసాగిరి. అప్పుడు దేవతలు పూలవానలను కురిపించిరి.

క. వత్సములపగిది జగముల, వత్సలతన్ మనుపఁ జూచువాఁడై యుంటన్
వత్సముల మేపుచుండియు, వత్సాసురుఁ జంపె భక్తవత్సలుఁడధిపా! 439

పరీక్షిన్మహారాజా! లోకములను దూడలనువలె వాత్సల్యముతో రక్షించుచుండు వాడగుటవలన, ఆ భక్తవత్సలుడు ఆవుదూడలను మేపుచుండియు, వత్సాసురుని ఆ విధముగా మట్టుపెట్టెను.

వ. మఱియు నొక్కనాఁడు, రేపకడ గోపకుమారులు క్రేపులం గొంచు, నడవికిం జని, యెండం బడి, మెండుకొనిన దప్పిని బెండువడిన, తమ తమ లేఁగకదుపుల నేర్పరించి, నిలువరించుకొని, కలకంబు లేని యొక్క కొలంకున నీరుద్రావించి తారును జలపానంబుచేసి, వచ్చునెడ నందు, 440

క. అకలంకులు బాలురు కని, రకుటిల దంభోళిహత సితాద్రిశిఖర రూ
పకమున్ హరి హింసారంభకమున్ బకమున్ విశాల భయదాంబకమున్. 441

వ. కని దాని యొడలి పొడువునకు వెఱఁగుపడి చూచుచుండ. 442

మఱియొకనాడు గోపబాలురు ప్రాతఃకాలమునందే దూడలను తోలుకొని అడవికి వెళ్లిరి. పిమ్మట తీవ్రమైన ఎండతాకిడికి దూడలు అన్నియును మిగులదప్పికొని అలసిపోయెను. వెంటనే ఆ బాలురు తమ తమ దూడల గుంపులను నిలువరించుకొని, ప్రశాంతముగా ఉన్న (నిర్మలమైన జలములుగల) ఒక మడుగు కడకు తీసికొని వెళ్లిరి. దూడలను నీరు త్రాగించి, తామును దప్పిక తీర్చుకొని వచ్చుచుండిరి. ఆ సమయమున అమాయకులైన ఆ బాలురు ఒక కొంగను చూచిరి. అది అప్పుడు ఉవ్వెత్తుగా పెఱిగి, వజ్రాయుధముచే కొట్టబడిన వెండికొండ శిఖరమువలె ఒప్పుచుండెను. విశాలములైన దానికన్నులు భయంకరముగా ఉండెను. అది శ్రీకృష్ణుని చంపదలచియుండెను. మిగుల ఎత్తైన దానియొక్క శరీరమును చూచి, ఆ బాలకులు మిగుల ఆశ్చర్యచకితులైరి.

ఆ. ఎల్లపనులు మాని యేకాగ్రచిత్తుఁడై మౌనివృత్తి నితర మమత విడిచి
వనములోన నిలిచి వనజాక్షుపై దృష్టిఁ జేర్చి బకుఁడు తపసిచెలువుఁ దాల్చె. 443

పిమ్మట బకమురూపములో నున్న ఆ అసురుడు తన పనులను అన్నింటిని మానుకొని, శ్రీకృష్ణుని హింసించుటయందే ఏకాగ్రచిత్తుడై యుండెను. నీటిలో నిలిచి ఆ ప్రభువుమీదనే తన దృష్టిని నిలిపియుండెను. అప్పుడు అతడు మునివలె ఇతరమమకారములను (ఆలోచనలను) విడిచిపెట్టి తపస్సు చేయుచున్న వానివలె ఒప్పుచుండెను.

వ. ఇవ్విధంబుననొదుఁగు వెట్టుకొని యుండి, 444

ఉ. చంచువు దీటి పక్షములు జల్లున విచ్చిపదంబులెత్తి కు
ప్పించి నభంబుపై కెగసి భీషణ ఘోషణవక్త్రుఁడై విజృం
భించి గరుత్పమీరమున భిన్నములై తరులోలిఁగూలఁగా
మించి బకాసురుం డొడిసి మ్రింగె సహిష్ణునిఁ జిన్ని కృష్ణునిన్. 445

ఈ విధముగా ఆ బకము (బకాసురుడు) కృష్ణునికొఱకు (దెబ్బతీయుటకై) పొంచియుండెను. బకము రూపములోనున్న ఆ రాక్షసుడు తనముక్కును అటునిటు కదల్చెను. ఱెక్కలను ఒక్కసారిగా చాచెను, కాళ్లను పైకెత్తి కుప్పించి, ఆకాశమునకు ఎగిఱెను. పిమ్మట భయంకరముగా ధ్వనిచేయుచు విజృంభించెను. ఆ కొంగయొక్క బలమైన ఱెక్కలగాలితాకిడికి చెట్లన్నియు ఛిన్నాభిన్నములై నేలగూలెను. అట్లు బకాసురుడు ఎట్టి ప్రమాదస్థితికైనను తట్టుకొనగల చిన్నికృష్ణుని ఒడిసిపట్టుకొని మ్రింగెను.

క. సంగడిలోకములన్నియు, మ్రింగుచుఁ గ్రక్కుచును బయల మెలఁగించుచు ను
ప్పొంగెడి వేడుక కాఁపిటు, మ్రింగుడువడె బకునిచేత మీఁ దెఱిఁగి నృపా! 446

మహారాజా! శ్రీహరి (కృష్ణుడు) బ్రహ్మాండాది సమస్త లోకములను ఒక్కుమ్మడిగా తనలో లీనమొనర్చుకొనుచు, తన సంకల్పానుసారముగా వాటిని బహిర్గతమొనర్చుచు, ప్రవర్తిల్లజేయును, అట్లొనర్చి సంతసించుచుండుట ఆయనకు ఒకలీల. ఆ స్వామి భవిష్య సంఘటనలను ఎఱిగినవాడు. అందువలన ఆ లీలాబాలుడు తనను బకాసురుడు మ్రింగుచున్నను కిమ్మనలేదు.

క. దనుజుఁడు మ్రింగినఁ గృష్ణునిఁ, గనలేక బలాది బాలక ప్రముఖులచే
తనులై వెఱఁగందిరి చ, య్యనఁ బ్రాణములేని యింద్రియంబుల భంగిన్. 447

ఆ రాక్షసుడు కృష్ణుని మ్రింగివేయగా, అతడు (కన్నయ్య) కనబడకపోవుటచే బలరాముడు మొదలగు గోపబాలురు దిగ్భ్రాంతిపడి, ప్రాణములులేని ఇంద్రియములవలె అచేతనులైరి.

వ. ఇట్లు మ్రింగుడువడి లోనికిం జనక, 448

శా. కంఠోపాంతము దొడలున్ మెఱముచుం గాలాగ్ని చందంబునం
గుంఠీభూతుఁడు గాక వేంద్రమగు నా గోపాలబాలున్ జయో
త్కంఠున్ బ్రహ్మగురున్ మహామహిముఁ జక్కన్ మ్రింగరాదంచు సో
ల్లుంఠం బాడుచు వాఁడు గ్రక్కె వెడలన్ లోకంబశోకంబుగన్. 449

రక్కసుడు అట్లు తనను మ్రింగినను లోనికి పోక, కృష్ణుడు వాని కంఠమునందే నిలిచియుండెను. పిమ్మట ఆ ప్రభువు శక్తిహీనుడుగాక విజృంభించి చకచక అటునిటు కదలుచు ప్రళయకాలాగ్నివలె తీవ్రమైన తాపమును పుట్టించెను. ఆ గోపబాలుడు (శ్రీహరి) సృష్టికర్తయైన బ్రహ్మకు తండ్రి, మహామహితాత్ముడు, పైగా ఆ రక్కసుని జయించుటకు (చంపివేయుటకు) ఉబలాటముతో నున్నవాడు. అందువలన రాక్షసుడు ఆ ప్రభువును మ్రింగలేక ఆయనను లోలోన తిట్టుకొనుచు బయటికి వెళ్లగ్రక్కెను. అప్పుడు లోకమంతయును మిగుల సంతసించెను.

క. గ్రక్కి మహాఘోషముతోఁ, జక్కఁగఁ దనుఁ బొడువరాఁగఁ జంచులు రెండున్
ద్రుక్కఁగబట్టి తృణముక్రియ, గ్రక్కున హరి సీరె బకునిఁ గలహోత్సుకునిన్ 450

ఆవిధముగా క్రక్కిన పిమ్మట ఆ బకాసురుడు భీకరముగా అఱచుచు ఆ కృష్ణుని తన ముక్కుతో పొడుచుటకు ప్రయత్నించెను. ఇంతలో ఆ శ్రీహరి, పనిగట్టుకొని తనను చంపుటకై వచ్చిన ఆ బకాసురుని (బకము) యొక్క ముక్కుపుటములను తన రెండు చేతులతో భీకరముగా పట్టుకొని గడ్డిపఱకనువలె (అవలీలగా) చీల్చివేసెను.

వ. అప్పుడానందనందనుని మీఁద వేలుపులు పొలుపులుగా నందన మల్లికాది కుసుమ వర్షంబులు హర్షంబునం గురియించిరి. దేవవాద్యంబులు మొరసె. రామాది గోపకుమారులు, ప్రాణంబులతోఁ గూడిన యింద్రియంబులునుం బోలెఁ గ్రమ్మఱఁ గృష్ణునిం గని, రమ్మని, కౌఁగిలించుకొని, కృష్ణసహితులయి, లేఁగదూఁటుల మరల దాఁటించుకొని, మందగమనంబున మందకరిగిన, వారలచేత నా వృత్తాంతం బంతయు విని, వెఱంగుపడి, గోప గోపికాజనంబులు. 451

అంతట దేవతలు సంబరపడుచు వరుసలు దీఱి, ఆ బాలకృష్ణునిపై నందనవనమునందలి మల్లికాది పుష్పములను వర్షించిరి. దివ్యవాద్యములు మ్రోగెను. బలరామాది గోపబాలురు ప్రాణములతోగూడిన ఇంద్రియములవలె చైతన్యమూర్తులైరి. వెంటనేవారు శ్రీకృష్ణుని చేరదీసి తనివిదీఱ కౌగిలించుకొనిరి. అనంతరము వారు ఆ చిన్నారితోగూడి, మఱల లేగదూడలను తోలుకొనుచు తిన్నతిన్నగా బృందావనమునకు చేరిరి. వారిద్వారా గోపికలు, గోపాలురు వత్సాసుర, బకాసురులను శ్రీకృష్ణుడు వధించిన వృత్తాంతమును విని మిగుల ఆశ్చర్యపడిరి.

క. ఆపదలమీఁద నాపద, లీపాపనిఁ జెంది తొలఁగె నీ యర్భకుపై
వేపడిన ఖలులు దహనుని, వైపున శలభముల పగిదిఁ బడిరి ధరిత్రిన్. 452

పిమ్మట వారు 'ఈ బుడుతనిపై ఆపదలమీద ఆపదలు వచ్చిపడుచు తొలగిపోవుచున్నవి. ఈ అర్భకునిమీద విఱుచుకొని పడుచున్న ఆ దుర్మార్గులు అగ్నిజ్వాలలపైకి ఉఱికిన మిడుతలవలె అసువులను కోల్పోయి, నేలపాలైరి' అని పలికిరి.

వ. అని పలికిరి, మఱియు, నా రామకృష్ణులు క్రేపులం గాచుతఱి. 453

సీ. కపులమై జలరాశిఁ గట్టుదమా యని కట్టుదు రడ్డంబు కాలువలకు
మునులమై తపములు మొనఁయుదమా యని మౌనులై యుందురు మాటలేక
గంధర్వవరులమై గానవిద్యలు మీఱఁ బాడుదమా యని పాడఁజొత్తు
రప్సరోజనులమై యాడుదమా యని యాఁడురూపులఁ దాల్చి యాడఁజనుదు
ఆ. రమర దైత్యవరులమై యబ్ధిఁ ద్రత్తమా యని సరోవరములయందు హస్త
దండచయముఁ ద్రిప్పి తరుతురు తమ యాడు కొమరులనుచరింపఁ గొమరు మిగుల. 454

పిదప బలరామకృష్ణులు గోపబాలురతో గూడి సంతోషముతో ఒనర్చిన బాల్యక్రీడలు వింతయైనవి. 'మనము కోతులమై సముద్రమును బంధింతము' అనుచు వారు కాలువలకు అడ్డుకట్టలు వేయుచుండిరి. 'మునులమై తపస్సులు చేయుదము' అనుచు మౌనము వహించుచుండిరి. 'మేటి గంధర్వులమై గానములను ఆలపించుదము' అనుచు పాటలు పాడుచుండిరి. 'అప్సరసలమై నృత్యములు చేయుదము' అనుచు స్త్రీ వేషధారులై ఆడుచుండిరి. దేవతలమై, రాక్షసులమై సాగరమును మథింతము' అనుచు సరోవరములలో కట్టెలవంటి తమ చేతులను ఉంచి, తఱచుచుండిరి.

## శ్రీకృష్ణుఁడు గోపకులతో బంతిచల్దులు గుడువ వనమున కేఁగుట

వ. అంత నొక్కనాఁడు రామ కృష్ణులు కాంతారంబున బంతిచలుదులు గుడువ నుద్యోగించి, ప్రొద్దున లేచి, గ్రద్దనం దమయింటి లేఁగకదుపులం గదలించి, సురంగంబులగు శృంగంబులు పూరించిన, విని, మేలుకని, సంరంభంబున గోపడింభకులు చలిదికావడులు మూపుల వహించి, సజ్జంబులగు కజ్జంబులు గట్టికొని, పదత్రాణ వేత్ర దండధరులై లెక్కలకు వెక్కసం బైన తమ తమ క్రేపుకదుపులం జప్పుడించి రొప్పుకొనుచుఁ గాననంబు సొచ్చి, కాంచనమణిపుంజగుంజాది భూషణ భూషితులయ్యును, ఫలకుసుమ కోరక పల్లవ వల్లరులు తొడవులుగా నిడికొని, కొమ్ము లిమ్ముగఁ బూరించుచు, వేణువులూఁదుచుఁ, దుమ్మెదలం గూడి పాడుచు, మయూరంబులతోడంగూడి యాడుచుఁ, బికంబులం గలసి కూయుచు, శుకంబులం జేరి రొదలు సేయుచుఁ, బులుఁగులనీడలం బాఱుచుఁ, బొదరిండ్లం దూఱుచు, సరాళంబులగు వాఁగులు గడచుచు, మరాళంబులచెంత నడచుచు, బకమ్ములం గని నిలుచుచు, సారసంబులం జోపి యలంచుచు, నదీజలంబులం దోఁగుచుఁ దీవయుయ్యేలలనూఁగుచుఁ, బల్లంబులన్ డాఁగుచు దూరంబులకేఁగుచుఁ గపులసంగడిఁదరువు లెక్కుచు, ఫలంబుల మెక్కుచు, రసంబులకుం జొక్కుచు. నింగికి నిక్కుచు, నీడలుసూచి నవ్వుచుఁ, గయ్యంబులకుం గాలు ద్రవ్వుచుఁ, జెలంగుచు మెలంగుచు, వ్రాలుచు, సోలుచు, బహుప్రకారంబుల శరీర వికారంబులు సేయుచు, మఱియును. 455

పిమ్మట ఒకనాడు బలరామకృష్ణులు తోడిబాలురతో గూడి వనమునందు వరుసలుదీఱి చలుదులను ఆరగించుటకు సిద్ధపడిరి. ప్రాతఃకాలముననే లేచి, త్వరత్వరగా తమ యింటి లేగదూడలను అదలించి, కొమ్మువాద్యములను పూరించిరి. ఆ వాద్యధ్వనులను విని గోపబాలురు అందఱును మేలుకొని, గబగబ చలిదికావడులను తమ బుజములపై చేర్చుకొనిరి, సిద్ధముగా నున్న కమ్మని పిండివంటలను మూటగట్టుకొనిరి. వారు పాదరక్షలను ధరించి, చేతికఱ్ఱలను దీసికొని, అసంఖ్యాకమైన ఆవుదూడలను 'ఛోఛో' అని తోలుచు అడవిలో ప్రవేశించిరి. వారు బంగారు హారములను మణులహారములను, గురువింద దండలను ధరించియున్నను, పండ్లు, పూవులు, మొగ్గలు, చిగురుటాకులు, తీగెలు మున్నగువానిని సొమ్ములుగా ధరించిరి. కొమ్మువాద్యములను పూరించుచు, వేణువులను ఊదుచు తుమ్మెదల ఝుంకారములతో తమ కంఠములను కలుపుచుండిరి. నెమళ్లతోగూడి నృత్యములొనర్చుచుండిరి. కోకిలలతో చేరి పంచమస్వరములను ఆలపించుచుండిరి. చిలుకలతోగూడి మధురధ్వనులను గావించుచుండిరి. పైన పక్షులు పోవుచుండగ వాటి నీడలలో పఱుగులు దీయుచుండిరి. పొదరిండ్లలో దూఱుచుండిరి. చక్కగా ప్రవహించుచున్న వాగులను దాటుచుండిరి. హంసలప్రక్కన ఒయ్యారముగా నడచుచుండిరి. కొంగలను జూచి వాటివలె నిలబడుచుండిరి. బెగ్గురు పక్షులను తోలుచు వాటిని అలసిపోవునట్లు చేయుచుండిరి. నదీజలములలో ఈదులాడుచుండిరి. తీగెల ఉయ్యాలలలో ఊగుచుండిరి. గోతులలో దాగికొనుచుండిరి. దూరతీరంబులకు పరుగులు దీయుచుండిరి. కోతులతో గూడి చెట్లమీదికి ఎక్కుచుండిరి. పండ్లను తనివిదీర మెక్కుచుండిరి. పండ్లరసములను గ్రోలి పరవశించిపోవుచుండిరి. ఆకాశమువైపు నిక్కుచుండిరి. తమతమ నీడలను చూచుచు విచిత్రముగా నవ్వుకొనుచుండిరి. పోట్లాటలకు ఒకరిని మఱియొకరు ఱెచ్చగొట్టుకొనుచుండిరి. సంతోషముతో కేరింతలు గొట్టుచు, సంచరించుచుండిరి. ఒకరిమీద మఱియొకరు పడిపోవుచు దొర్లుచుండిరి. ఈ విధముగా శరీరవికారములను ఒనర్చుచు క్రీడించుచుండిరి.

క. ఒక నొకని చల్దికావడి, నొకఁ డొక ఁడడకించి దాఁచు నొకఁ డొకఁ డది వే
ఱొకఁ డొకని మొఱఁగి కొని చన, నొకఁ డొకఁ డది దెచ్చి యిచ్చు నుర్వీనాథా! 456

క. ఒక్కఁడు మున్నేమఱి చన, నొక్కఁడు బలు బొబ్బవెట్టి మలికిపడన్ వే
యొక్కఁడు మిట్టి తటాలున, నొక్కని కనుదోయి మూయు నొక్కఁడు నగఁగన్. 457

రాజా! ఒకని చల్దికావడిని అతనికి తెలియకుండ ఇంకొకడు దాచివేయుచుండెను. దాచిన ఆ కావడిని మఱియొకడు వంచించి తీసికొని పోవుచుండెను. వేఱొకడు దానిని తెచ్చి యిచ్చుచుండెను. ఒకడు ముందు భాగమున ఏమఱుపాటుతో నడచుచుండగా వాడు భయపడునట్లుగా మఱియొకడు వెనుకనుండి వచ్చి పొలికేక పెట్టుచుండెను. ఇంకొకడు హఠాత్తుగా ఎగిరి వానియొక్క కన్నులు మూయగా దానిని చూచి మఱియొకడు నవ్వుచుండెను.

క. తీపుగల కజ్జమన్యుఁడు, కోపింపఁగ నొడిసి పుచ్చుకొని త్రో పాడం
బైపడి యదిగొని యొక్కఁడు, క్రేపులలో నిట్టునట్టుఁగికురించు నృపా! 458

క. వనజాక్షుఁడు మున్నరిగిన, మునుపడఁగా నతని నేనె ముట్టెద ననుచుం
జని ముని ముట్టనివానిన్, మును ముట్టినవాఁడు నవ్వు మొనసి నరేంద్రా! 459

వ. ఇ వ్విధంబున. 460

మహారాజా! ఒకడు కోపించుచున్నను వాని చేతిలోని కమ్మని మిఠాయిని మఱియొకడు లాగుకొని పోవుచుండెను. మఱియొకడు వానిమీదబడి దానిని తీసికొనిపోయి, దూడలమధ్య దాగికొనుచుండెను. శ్రీకృష్ణుడు ముందుబోవుచుండగా 'అతనిని ముందుగా నేనే తాకెదను' అనుచు ఒకబాలుడు ఆ స్వామి వెనుక పరుగెత్తుచుండెను. వేఱొకడు అతనికంటెను ముందుగా ఆ కన్నయ్యను తాకి, ముందుగా తాకలేక పోయిన వానిని జూచి పరిహాసముగా నవ్వుచుండెను. ఈవిధముగా వారొనర్చిన ఆటపాటలు మనోహరములు.

ఉ. ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయుం
గన్నులఁ గాన రట్టి హరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టఁ బట్టుచుం
దన్నుచుఁ గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైఁబడి కూడి యాడుచున్
మన్నన సేయు వల్లవకుమారుల భాగ్యములింత యొప్పునే. 461

మహాయోగీశ్వరులు సైతము ఎవ్వని (ఏ శ్రీకృష్ణుని) పాదధూళిని ఎన్నడునూ ఏమాత్రమూ కన్నులార చూచి యెఱుగరో? ఆ శ్రీహరిని గోపబాలురు కౌగిలించుకొని ఆనందించుచుండిరి. వారు ఆ ప్రభువుతో చెట్టాపట్టాలాడుచుండిరి. వారు ఆ కృష్ణునితో తన్నులాటలు, గ్రుద్దులాటలు సాగించుచు, నవ్వుచుండిరి. ఆయన మీదబడి ఆడుచు చనవుతో మెలగుచుండిరి. నిజముగా ఆ గోపబాలుర భాగ్యమే భాగ్యము.

క. విందులకును బ్రహ్మసుఖా, నందంబై భక్తగణమునకు దైవతమై
మందులకు బాలుఁడగు హరి, పొందుఁ గనిరి గొల్లలిట్టి పుణ్యులు గలరే. 462

శ్రీహరి (శ్రీకృష్ణుడు) జ్ఞానులకు బ్రహ్మానందదాయకుడు, భక్తులకు పరమదైవము, సామాన్యులకు బాలుడు. అట్టి మహాత్ముని మైత్రికి గోపాలురు నోచుకొనిరి. వారు ఎంతటి పుణ్యాత్ములోగదా!

## శ్రీకృష్ణుడు అఘాసురునిఁ జంపుట

వ. అని పలికి, శుకయోగీంద్రుడు మఱియు నిట్లనియె. 463

క. అమరులమృతపానంబున, నమరినవారయ్యు నే నిశాటుని పంచ
త్వమునకు నెదుళ్ళు సూతురు, తము నమ్మక యట్టి యఘుఁడు దర్పోద్ధతుఁడై 464

క. బకునికిఁ దమ్ముఁడు కావున, బకమరణము దెలిసి కంసుపంపున గోపా
లక బాలురతోఁ గూడను, బక వైరిని ద్రుంతు ననుచుఁ బటురోషమునన్. 465

అనంతరము శుకయోగి పరీక్షిన్మహారాజుతో ఇంకను ఇట్లనెను. బలగర్వితుడైన అఘాసురుడు దేవతలపై విఱుచుకొని పడుచుండెను. వారు అమృతపానము చేయుటవలన చావులేని వారైనప్పటికిని ఆ రాక్షసుని ఎదుర్కొనుటకు శక్తిలేక అతని మరణమునకు ఎదురుచూచుచుండిరి. ఆ అఘాసురుడు బకాసురుని తమ్ముడు. అతడు తన అన్న కృష్ణునిచే వధింపబడిన విషయము తెలియగనే కంసుని ఆదేశముమేరకు రోషావేశపరుడై' కృష్ణుని, గోపబాలురను హతమార్చుటకు' నిశ్చయించుకొనెను.

క. బాలుర ప్రాణంబులు గో, పాలురకు మదగ్రజాతు ప్రాణము మాఱీ
బాలురఁ జంపిన నంతియు, చాలును గోపాలురెల్ల సమసినవారల్. 466

'గోపాలురకు వారిపిల్లలే పంచప్రాణములు. (ప్రాణతుల్యులు). కనుక మా అన్నయొక్క ప్రాణములను హరించినందులకు మాఱుగా ఈ బాలురను (బలరామకృష్ణాది గోపబాలురను) చంపినచో గోపాలురను అందఱిని చంపివేసినట్లే' అని ఆ రాక్షసుడు తలపోసెను.

వ. అని నిశ్చయించి, యోజనంబు నిడుపును. మహాపర్వతంబు పొడవును, గొండతుదల మీఱిన కోఱలును, మిన్ను దన్ని పన్నిన నల్ల మొగిళ్ళ పెల్లుగల పెదవులును, బిలంబులకు నగ్గలంబులైన యిగుళ్ళ సందులును, నంధకారబంధురంబైన వదనాంతరాళంబును, దావానలజ్వాలాభీలంబైన దృష్టిజాలంబును, వేఁడిమికి నివాసంబులైన యుచ్ఛ్వాస నిశ్వాసంబులును మెఱయ, నేల నాలుకలు పఱచు కొని, ఘోరం బగు నజగరాకారంబున. 467

క. ఆపిరములేక యిప్పుడు, క్రేపుల గోపాలసుతులఁ గృష్ణునితోడన్
గీపెట్టఁగ మ్రింగెద నని, పాపపురక్కసుఁడు త్రోవఁ బడి యుండె నృపా! 468

ఇట్లు నిశ్చయించుకొనిన పిమ్మట అతడు భయంకరమైన ఒక కొండచిలువ ఆకారమును ధరించెను. అది యోజనము పొడవుగలిగి, పర్వతాకారములో నుండెను. దానికోఱలు పర్వతశిఖరములవలె ఒప్పుచుండెను. దాని పెదవులు ఆకాశమునంటియున్న నల్లని మేఘములవలె భీతిగొలుపుచుండెను. దాని ఇగుళ్లసందులు (కోఱలమధ్యగల సందులు) పెద్దపెద్ద గుహలవలె విలసిల్లుచుండెను. తెఱచియున్న దానినోటిలోపలిభాగము చీకట్లతో నిండియుండెను. దానిచూపులు దావాగ్నిజ్వాలలవలె భయంకరముగా ఉండెను. దాని ఉచ్ఛ్వాసనిశ్వాసములు పొగలు సెగలను గ్రక్కుచుండెను. అది ఘోరమైన నాలుకలను చాచి ఉండెను. రాజా! అప్పుడు ఆ అఘాసురుడు 'ఏమాత్రము ఆలసింపక ఇప్పుడే నందుడు మొదలగు గోపాలురు అందఱును లబోదిబోమనుచు మొత్తుకొనునట్లుగా, ఆవుదూడలను, గోపబాలురను, శ్రీకృష్ణుని మ్రింగివేసెదను' అని తలంచుచు ఆ త్రోవలో పడియుండెను.

వ. ఆ సమయంబున. 469

మ. ఒక వన్యాజగరేంద్ర మల్లదె గిరీంద్రోత్సేధమై దావపా
వక కీలా పరుషప్రచండతర నిశ్వాసంబుతో ఘోర వ
హ్నికరాళాతత జిహ్వతోడ మనలన్ హింసింప నీక్షించుచున్
వికటంబై పడి సాఁగియున్నది పురోవీధిం గనుంగొంటిరే. 470

వ. అని యొండొరులకుం జూపుచు. 471

మ. బకునిం జంపిన కృష్ణుఁడుండ మనకుం బామంచుఁ జింతింప నే
టికి రా పోదము దాఁటి కాక యది కౌటిల్యంబుతో మ్రింగుడున్
బకువెంటం జనుఁ గృష్ణుచేత ననుచున్ బద్మాక్షు నీక్షించి యు
త్సుకులై చేతులు వేసికొంచు నగుచున్ దుర్వారులై పోవఁగన్. 472

అప్పుడు గోపబాలురు ఆ కొండచిలువను ఒకరికి మఱియొకరు చూపుచు ఇట్లు అనుకొనిరి. 'అడవిలో తిరుగుచుండెడి ఒక పెద్ద కొండచిలువ మనముందుభాగమున వికృతాకారముతో పడియున్నది; చూచితిరా? అది ఒక మహాపర్వతప్రమాణములో నున్నది. దాని నిశ్వాసములు ప్రచండమైన దావాగ్ని జ్వాలలవలె మిగుల తీవ్రముగా ఉన్నవి. అది భయావహమైన అగ్నిజ్వాలలవలె పొడవైన నాలుకలతో మనలను చంపజూచుచున్నది. బకాసురుని చంపిన కృష్ణుడు మనకు అండగా ఉండగా ఈ పామును చూచి భయపడనేల? రండు, దానిని దాటిపోవుదము. అట్లుగాక అది మనలను మోసగించి మ్రింగినచో, బకాసురునివలెనే కృష్ణునిచేతిలో మృత్యువు పాలగును' అని అనుకొనుచు వారు కృష్ణునివైపు చూచి, ఉత్సాహముతో బుజాలపై చేతులు వేసికొనుచు, నవ్వుచు నిరాటంకముగా పోసాగిరి.

వ. వారలం జూచి, హరి తనమనంబున 473

ఉ. అర్భకులెల్లఁ బాము దివిజాంతకుఁడౌట యెఱుంగరక్కటా!
నిర్భయులై యెదుర్కొనిరి నే గల నంచు విమూఢు లంచు నా
విర్భవదాగ్రహిత్వమున వెన్దగులం దమ లేఁగపిండుతో
దుర్భర ఘోరసర్పఘనతుండ బిలాంతముఁ జొచ్చిరందఱున్. 474

ఆవిధముగా వెళ్ళుచున్న తోడి గోపబాలురను జూచి కృష్ణుడు తనలో "అయ్యో! ఈ గోపబాలురు అందఱును అమాయకులు' ప్రాణాంతకుడైన రాక్షసుడు ఈ పామురూపమున పడియున్నాడు' అని తెలిసికొనలేకున్నారు. 'నేనున్నానని' నిర్భయముగా దానికి ఎదురుగా పోవుచున్నారు' అని అనుకొనెను. ఇంతలో వారు దూడలతోగూడి, ప్రమాదకరమైన ఆ సర్పము నోటిలోనికి ప్రవేశించిరి. అంతట శ్రీకృష్ణుడు ఆ రాక్షసుని వంచనకు ఆగ్రహించినవాడై, వారివెంట తానును వెళ్లెను.

వ. అ య్యవసరంబున 475

శా. వేల్పుల్ చూచి భయంబు నొంద గ్రసనావేశంబుతో నుజ్జ్వల
త్కల్పాంతోజ్జ్వలమాన జిహ్వ దహనాకారంబుతో మ్రింగె న
స్వల్పాహీంద్రము మాధవార్పిత మనోవ్యాపార సంచారులన్
స్వల్పాకారుల శిక్యభారులఁ గుమారాభీరులన్ ధీరులన్. 476

వ. ఇట్లు పెనుఁబాముచేత మ్రింగుడుపడు సంగడికాఁడ్రగమింజూచి, కృష్ణుండు. 477

అప్పుడు ఆ అఘాసురుడు (ఆ క్రూరసర్పము) వారినందఱిని తినివేయుటకు త్వరపడుచు తీవ్రమైన ప్రళయాగ్ని జ్వాలలవలె తేజరిల్లుచున్న నాలుకలతో మ్రింగివేసెను. ఆ దృశ్యమును జూచి దేవతలు ఎల్లరును మిగుల భయపడుచుండిరి. చద్దిచిక్కములను మోయలేనంత స్వల్పాకారులయ్యును ఆ గోపబాలురు శ్రీకృష్ణునియందే తమ మనస్సులను నిల్పియున్నందున ధైర్యముతో ఉండిరి. అంతట శ్రీకృష్ణుడు ఆ క్రూరసర్పము (కొండచిలువ)చే మ్రింగబడుచున్న తన మిత్రులగు గోపబాలురను అందఱిని చూచి ఇట్లు తలంచెను.

చ. "పడుచులు లేఁగలుం గలసి పైకొని వత్తురు తొల్లి కృష్ణ! మా
కొడుకులదేల రా" రనుచు గోపిక లెల్లను బల్క నే క్రియన్
నొడివెద నేఁడు పన్నగమునోరికి వీరికి నొక్కలంకెగా
నొడఁబడ నేల చేసె విధి యోడక సేయుఁగదయ్య! క్రౌర్యముల్. 478

"నేను బృందావనమునకు వెళ్లినంతనే గోపికలు అందఱును 'కృష్ణా! ప్రతిదినము మా పిల్లలు, దూడలు ఉత్సాహపడుచు నీతో కలిసి వచ్చుచుందురుగదా! నేడు రాకుండుటకు కారణము ఏమి?' అని యడిగినచో వారికి నేను ఏమని సమాధానమును చెప్పగలను. విధి ఈ పిల్లలందఱిని పామునోటిలో చిక్కుపడునట్లుగా చేసి, ఎంతటి క్రూరకార్యమునకు పాల్పడెనోగదా!".

వ. అని తలపోసి, యఖిలలోచనుండును, నిజాశ్రిత నిగ్రహ మోచనుండును నైన తమ్మికంటి, మింటి తెరువరులు మొఱలిడ, రక్కసు లుక్కుమిగుల, వెక్కసంబగు నజగరంబయియున్న యన్నర భోజనుకుత్తుకకుఁ బొత్తుగొని మొత్తంబు వెంటనంటం జని, తమ్మునందఱఁ జిందఱవందఱ సేసి మ్రింగ నగ్గలించు నజగరంబు కంఠద్వారంబున సమీరంబు వెడలకుండఁ దన శరీరంబు వెంచి, గ్రద్దన మిద్దె సఱచినట్లుండ. 479

శ్రీకృష్ణుడు ఎల్లప్పుడును సకలలోకములను చూడగలవాడు. తననే నమ్ముకొనినవారియొక్క ఆపదలను రూపుమాపువాడు. నరహంతకుడైన అఘాసురుడు ఇట్టి క్రూరకృత్యమునకు ఒడిగట్టుట చూచి గర్వితులై రాక్షసులు మిడిసిపడుచుండిరి, దేవతలు హాహాకారములను చేయుచుండిరి. అప్పుడు, రాక్షసుల ఆటకట్టించువాడైన శ్రీహరి (కృష్ణుడు) ఆ సర్పముయొక్క కుత్తుకను ఒత్తుచు ఆ బాలుర వెనుకనే తానును దానినోటిలో ప్రవేశించెను. తమను అందఱిని చిందరవందరజేసి మ్రింగుటకు పూనుకొనుచున్న ఆ రాక్షసునకు ఊపిరాడకుండ దాని కంఠమునకు అడ్డుగా తన శరీరమును పెంచెను.

క. ఊపిరి వెడలక కడుపున, వాపొదవినఁ బాము ప్రాణవాతంబులు సం
తాపించి శిరము ప్రక్కలు, వాపికొనుచు వెడలి చనియెఁబటు ఘోషముతోన్. 480

అప్పుడు ఊపిరి సల్పకపోవుటచే, లోపలి వాయువుల ఒత్తిడికి దాని పొట్ట ఉబ్బిపోయెను. ఆ స్థితిలో ప్రాణవాయువులు ఎటు పోవుటకును వీలులేక, దాని శిరస్సుయొక్క ప్రక్కభాగముల చీల్చుకొనుచు మహాధ్వనితో బయటికి వెడలిపోయెను.

శా. క్రూరవ్యాళ విశాల కుక్షిగతులన్ గోవత్స సంగంబుతోఁ
గారుణ్యామృత వృష్టిచేత బ్రదుకంగాఁ జూచి వత్సంబులున్
వారుం దాను దదాస్యవీథి మగుడన్ వచ్చెన్ ఘనోన్ముక్తుఁడై
తారానీకముతోడ నొప్పెసఁగు నా తారేశు చందంబునన్. 481

క్రూరమైన ఆ సర్పముయొక్క విశాలమగు కడుపులో చిక్కుకొనిన గోపాలురపై, గోవులపై శ్రీకృష్ణుడు తన కారుణ్యామృతమును వర్షించి (తన కనికరమనెడి అమృతమును చల్లి) వారిని బ్రతికించెను. పిదప వారందఱును దూడలతోగూడి, దానినోటిద్వారా బయటికి వచ్చిరి. అప్పుడు వారి మధ్యనున్న దివ్యకృష్ణుడు, మేఘములు తొలగిపోగా నక్షత్రములతోగూడిన చంద్రునివలె వెలుగొందెను.

ఆ. అమరవరులకొఱకుఁ గమలజాండం బెల్ల బలిఁదిరస్కరించి బలియు వడుగు
గోపసుతులకొఱకుఁ బాపపుఁ బెనుఁబాము గళము దూఁటు గట్ట బలియకున్నె 482

దేవతలబాధలను నివారించుటకొఱకై శ్రీహరి వామనుడుగా (త్రివిక్రముడై) బ్రహ్మాండమంతయు వ్యాపించి, బలిచక్రవర్తిని అణగద్రొక్కెను. అట్టి ఆ ప్రభువు శ్రీకృష్ణుడై గోపబాలురకొఱకు క్రూరమైన కొండచిలువ (అఘాసురుని) యొక్క గొంతు బ్రద్దలగునట్లు తన శరీరమును పెంచుటలో ఆశ్చర్యమేమున్నది?

ఉ. ఆ పెనుఁబాము మేన నొక యద్భుతమైన వెలుంగు దిక్తటో
ద్దీపకమై వడిన్ వెడలి దేవపథంబునఁ దేజరిల్లుచుం
గ్రేపులు బాలురున్ బెదరఁ గృష్ణుని దేహము వచ్చి చొచ్చె నా
పాపఁడు సొచ్చి ప్రాణములఁ బాపిన యంతన శుద్ధసత్త్వమై. 483

క. తనరూపొకమాత్రైనను, మనమున నిడికొనినఁ బాపమయు నైనను లోఁ
గొని చను హరి తను మ్రింగిన, దనుజునిఁ గొనిపోవకున్నె తనలోపలికిన్. 484

శ్రీకృష్ణుడు ఆ కొండచిలువశరీరములో ప్రవేశించి, దానిప్రాణములను తీసినంతనే అది శుద్ధసాత్త్వికస్థితిని పొందినది. ఆ స్వామియొక్క కరస్పర్శాప్రభావము అట్టిది. పిమ్మట ఆ మహాసర్పముయొక్క శరీరమునుండి అద్భుతమైన ఒక తేజస్సు వెలువడి, ఆకాశమున వెలుగొందుచు కృష్ణప్రభువులో లీనమయ్యెను. అప్పుడు ఆవుదూడలు, గోపబాలురు మిగుల భీతిల్లిరి. తన రూపమును ఒక్కమాత్రైనను మనస్సులో నిలుపుకొన్నచో, ఎంతటి పాపాత్ముని ఐనను ఆ శ్రీహరి తనలో చేర్చుకొనును. ఇక ఆ స్వామి తనను మ్రింగిన రాక్షసుని తనలో లీనమొనర్చుకొనకుండునా?

వ. తదవసరంబున, సురలు గుసుమవర్షంబులు గురియించిరి. రంభాదులాడిరి. గంధర్వాదులు పాడిరి. మేఘంబులు మృదంగంబులభంగి ఘోషించె. సిద్ధగణంబులు "జయ, జయ" భాషణంబులు భాషించిరంత, 485

ఆ సమయమున దేవతలు పూలను వర్షింపజేసిరి, రంభాది అప్సరసలు నృత్యములొనర్చిరి. గంధర్వులు మొదలగు దివ్యజాతులవారు గానములను ఆలపించిరి. మేఘములు మృదంగములవలె ఘోషించెను. సిద్ధగణములు జేజేలు పలికిరి.

శా. ఆ వాద్యంబులు నా మహాజయరవంబాపాటలా యాటలుం
దేవజ్యేష్ఠుఁడు పద్మజుండు విని ప్రీతిన్ భూమికేతెంచి నేఁ
డీ వత్సార్భకులన్ భుజంగపతి హింసింపంగ నీ బాలకుం
డే వెంటన్ బ్రతికించె మేలనుచు నూహించెం గడున్ విస్మయాన్. 486

అంతట దేవతలలో జ్యేష్ఠుడైన బ్రహ్మ ఆ వాద్యధ్వనులను, ఆ జయజయ ధ్వానములను, ఆ పాటలను, ఆటలను విని, సంతోషముతో భూతలమునకు ఏతెంచెను. 'ఈ మహాసర్పము తన నోటిలో చేరిన బాలురను, ఆవుదూడలను మ్రింగివేయుటద్వారా చంపుటకు పూనుకొనగా, ఈ చిన్నికృష్ణుడు వారిని ఎట్లు రక్షింపగల్గెను?' అని అతడు మిగుల ఆశ్చర్యపడెను.

వ. అంత నయ్యజగరచర్మంబు కొన్ని దివసంబులకెండి, పెద్దకాలంబు గోపాలబాలురకుం గేళీబిలంబై యుండె. ఇట్లు కౌమారవిహారంబుననైదవయేఁటఁ గృష్ణుం డఘాసురునిం దెగఁజూచుటయుఁ, దమ్ముం గాచుటయు, నాఱవయేఁటిదైన పౌగండ వృత్తాంతం బని చిత్తంబుల గోపకుమారులు దలంచుచుందురని చెప్పిన నప్పుడమితేఁ డప్పరమయోగీంద్రునకిట్లనియె. 487

కొన్ని దినములకు ఆ కొండ చిలువచర్మము ఎండిపోయెను. పిమ్మట గుహాకారమున నున్న దాని శరీరమునందు గోపబాలురు చాలాకాలము ఆడుకొనసాగిరి. వాస్తవముగా శ్రీకృష్ణుడు తన కౌమారవయస్సునందు అనగా ఐదవయేట

అఘాసురుని చంపెను. కాని గోపబాలురు మాత్రము కృష్ణయ్య తన పౌగండవయస్సులో అనగా ఆఱవేట ఆ సర్పరాక్షసుని సంహరించి, తమను కాపాడినాడు' అని తలంచిరి. ఇట్లు నుడివిన శుకయోగితో పరీక్షిన్మహారాజు ఈ విధముగా వచించెను.

సీ. అయిదేండ్లు కౌమారమటమీఁద నైదేండ్లు పౌగండ మనియెడు ప్రాయమందు
నయిదేండ్లవాఁడైన యబ్జాక్షుచరితంబు పౌగండ మని గోపబాలు రెల్లఁ
దలఁతురంటివె యెట్లు తలఁతురు వారలు నిరుడు సేసిన పని నేఁటి దనఁగ
వచ్చునే యిది నాకు వరుసతో నెఱిఁగింపు మనవుడు యతిచంద్రుఁడైన శుకుఁడు
ఆ. యోగదృష్టిఁ జూచి యొక్కింత భావించి వినుము రాజవర్య! వినయధుర్య!
పరమగుహ్యమనుచుఁ బలుకుదురార్యులు శిష్యజనులకీవు సేయు తలఁపు. 488

"శుకయోగీ! ఐదేండ్ల వఱకును కౌమారము' అనియు, తరువాత ఐదేండ్ల వఱకును పౌగండవయస్సు' అనియును పెద్దలు నుడువుదురు. ఐదేండ్లవాడైన శ్రీకృష్ణుడొనర్చిన ఈ సాహసకార్యము అయనయొక్క ఆఱవేట, అనగా పౌగండ వయస్సున జరిగినట్లు గోపబాలురు ఎట్లు తలంచిరి? నిరుడు చేసిన పనిని నేడు చేసినట్లు వారనవచ్చునా? దీనిని గూర్చి నాకు వివరింపుము" అని ఆ మహారాజు ప్రశ్నించెను. అంతట ఆ శుకమహర్షి యోగదృష్టితో దర్శించి, కొంతసేపు ఆలోచించి ఇట్లనెను. "మహారాజా! వినుము. నీవు ఎంతయు వినయముగలవాడవు. నీవు అడిగిన ఈ విషయమును పెద్దలు 'పరమ రహస్యము' అని తమ అనుయాయులకు తెలుపుచుందురు.

క. ప్రియురాలివలని వార్తలు, ప్రియజనులకు నెల్లప్రొద్దుఁ బ్రియమగు భంగిన్
బ్రియుఁడగు హరిచరితంబులు, ప్రియభక్తులకెల్ల యెడలఁ బ్రియములు గావే. 489

ప్రియురాలిని గుఱించిన వార్తలు ప్రియులకు అందఱికిని ప్రియమగును. అట్లే ప్రియునికథలు ప్రియురాండ్రకుగూడ ఆసక్తిని కలిగించును. ఆ విధముగనే ప్రియుడగు శ్రీకృష్ణునిచరితములు అవి ఎప్పుడు జరిగినను అతని ప్రియభక్తులైన గోపబాలురకు ఎల్లప్పుడును ప్రియముగానే యుండునుగదా!".

వ. అని పలికి, యోగీంద్రుండు రాజేంద్రునకిట్లనియె. అట్లఘాసురుముగంబువలనంగడచనిన లేఁగల గోపకుమారులన్ బ్రదికించి, వారునుం దానునుం జని చని 490

మ. కనియెం గృష్ణుఁడు సాధునీరము మహాగంభీరముం బద్మకో
కనదాస్వాద వినోద మోద మద భృంగ ద్వంద్వ ఝుంకారమున్
ఘన కల్లోల లతావితాన విహరత్కాదంబ కోలాహల
స్వన విస్ఫారము మందవాయుజ కణాసారంబుఁ గాసారమున్ 491

శుకయోగి ఆ మహారాజుతో ఇంకను ఇట్లు నుడివెను. ఆ ప్రకారము అఘాసురుని నోటిలో చిక్కుకొనిన ఆవుదూడలను, గోపబాలురను బ్రదికించిన పిమ్మట శ్రీకృష్ణుడు వారితోగూడి చాలాదూరము వెళ్లెను. పిదప శ్రీకృష్ణుడు ఒక సరస్సును గాంచెను. అందలి జలమంతయు, స్వచ్ఛముగా నుండెను. అది మిక్కిలి లోతైనది, విశాలమైనది. అందలి పద్మములు, చెంగల్వలు కమ్మని మకరందములతో విరాజిల్లుచుండెను. ఆ పూదేనెను గ్రోలి మత్తిల్లియున్న తుమ్మెదలజంటలు హాయిగా ఝుంకారములు సలుపుచుండెను. అందలి పెద్దపెద్ద అలలనెడి తీగలె సమూహములయందు కలహంసలు విహరించుచుండెను. ఆ హంసలయొక్క కోలాహలధ్వనులు ఆ సరస్సునందంతటను వ్యాపించుచుండెను. పిల్లగాలుల తాకిడిచే అందలి జలకణములు ఎగిరిపడుచు కనువిందు గావించుచుండెను.

వ. కని తమ్మికంటి తమ్ములయింటిసొబగునకు నిచ్చ మెచ్చుచుఁ జెచ్చెర గాలినోలిం గదలెడు కరళ్లతుంపురుల జల్లుపెల్లున నొడళ్ళుగగురుపొడవఁ, గొలంకుఁ గెలంకులఁ గాయపండుల గొలలవ్రేఁగున వీఁగి, పట్టుగల చెట్టుఁ దుటుమునీడల నొప్పు చున్న యిసుకతిప్పల విప్పు సూచి, వేడుక పిచ్చలింప, నెచ్చెలుల కిట్లనియె.492

పద్మాక్షుడైన శ్రీకృష్ణుడు ఆ సరస్సుసోయగములకు ఎంతయు ముగ్ధుడగుచుండెను. నిరంతరముగా ప్రసరించుచున్న గాలుల తాకిడికి కదలుచున్న అలలయొక్క తుంపరల జల్లులకు వారిశరీరములు గగుర్పాటు చెందుచుండెను. ఆ సరస్తీరమునందలి వృక్షములు కాయలబరువుతో, పండ్లభారముతో వంగిపోవుచుండెను. దట్టముగానున్న ఆ చెట్లనీడలలోగల ఇసుక తిన్నెలను జూచి, వారు ఎంతయు ముచ్చటపడుచుండిరి. అప్పుడు శ్రీకృష్ణుడు తన తోడి బాలురతో (మిత్రులతో) ఇట్లు నుడివెను.

శా. ఎండన్ మ్రగ్గితిరాఁకటం బడితి రింకేలా విలంబింపఁగా
రండో బాలకులార! చల్దిగుడువన్ రమ్యస్థలంబిక్క డీ
దండన్ లేఁగలు నీరు ద్రావి యిరవందం బచ్చికల్ మేయుచుం
దండంబై విహరించుచుండఁగ నమందప్రీతి భక్షింతమే. 493

"మిత్రులారా! మీరు అందఱును ఎండదెబ్బకు బాగుగా అలసిపోయితిరి. మిగుల ఆకలిగొనియుంటిరి. ఇక ఆలస్యము ఎందులకు? ఈ రమణీయస్థలము చల్దులారగించుటకు అనువుగా ఉన్నది. మన ఆవులదూడలు ఈ సరస్సులోని నీళ్లుత్రాగి (దప్పికలు తీర్చుకొని) సేదదీఱి, ఈ సమీపమునగల పచ్చికబయళ్లలో హాయిగా మేయుచుండగలవు. కావున ఇక మనము తనివిదీర చల్దులను భక్షింతము. ఇచటికి రండు".

## గోపాలబాలురు కృష్ణునితోఁ గూడ చల్దులారగించుట

వ. అనిన నగుఁగాక యని, వత్సంబుల నుత్సాహంబున నిర్మలంబులగు జలంబులు ద్రావించి, పచ్చికల మొల్లంబులుగల పల్లంబుల నిలిపి, చొక్కంబులగు చల్దుల చిక్కంబులు సక్కడించి, 494

అంతట ఆ గోపబాలురు 'అట్లే' అని ఉత్సాహముతో ఆ ఆవుదూడలచే నిర్మలజలములను త్రాగించిరి. ఒత్తుగానున్న మెత్తని పచ్చికలుగల పల్లపు ప్రదేశములలో వాటిని నిలిపిరి. పిమ్మట వారు చల్దుల చిక్కములను విప్పిరి.

మ. జలజాంతస్స్థిత కర్ణికం దిరిగి రా సంఘంబులైయున్న తే
కులచందంబునఁ గృష్ణునిం దిరిగిరాఁ గూర్చుండి వీక్షించుచున్
శిలలుం బల్లవముల్ దృణంబులులతల్ చిక్కంబులుం బువ్వు లా
కులు కంచంబులుగా భుజించిరచటన్ గోపార్భకుల్ భూవరా! 495

మహారాజా! కమలముదుద్దు (కర్ణిక) చుట్టును దట్టముగానున్న రేకులవలె గోపబాలురు శ్రీకృష్ణుని చుట్టును జేరి కూర్చుండి, అందఱును కన్నయ్యను చూచుచుండిరి. వారు చదునుగానున్న బండలను, చిగురుటాకులను, (మెత్తని ఆకులను) పఱచుకొనియున్న గడ్డిపఱకలను, దట్టముగానున్న (అల్లుకొనియున్న) తీగెలను, చిక్కములను, పూలరేకులను, ఆకులను కంచములుగా చేసికొని చల్దులను ఆరగించిరి.

సీ. మాటిమాటికి వ్రేలు మడిచి యూరించుచు నూరుఁగాయలు దినుచుండు నొక్కఁ
డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి చూడు లేదని నోరు సూపు నొక్కఁ
డేగు రార్గుర చల్దు లెలమిఁ బన్నిద మాడి కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ
డిన్నియుండఁగఁ బంచి యిడుట నెచ్చెలితన మనుచు బంతెనగుండులాడు నొకఁడు